
రామాయణం

శ్రీమద్వాల్మీకి రామాయణోపన్యాసములు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org

సదాశివ సమారంభాం


గురు దక్షిణామూర్తి


గురు వేదవ్యాస మహర్షి



గురు శుక మహర్షి


గురు నారద మహర్షి


గురు వాల్మీకి మహర్షి


గురు శ్రీకృష్ణ

శంకరాచార్య మధ్యమాం


గురు దత్తాత్రేయ


గురు బాబాజి


గురు గౌతమ బుద్ధ


గురు ఆదిశంకరాచార్య


గురు రామానుజాచార్యులు


గురు జ్ఞానేశ్వర్


గురు రవిదాస్


గురు కబీర్ దాస్


గురు చైతన్య మహా ప్రభువు



గురు నానక్


గురు రాఘవేంద్ర స్వామి


గురు వీరబ్రహ్మేంద్ర స్వామి


యోగి వేమన

అస్మదాచార్య పర్యంతాం


గురు త్రైలింగ స్వామి


గురు లాహిరి మహాశయ


గురు రామకృష్ణ పరమహంస


అమ్మ శారదా దేవి


గురు వివేకానంద


గురు సాయిబాబా


గురు అరబిందో


గురు రమణ మహర్షి


గురు యోగానంద


గురు భక్తివేదాంత ప్రభుపాద


గురు మళయాళ స్వామి


గురు విద్యాప్రకాశానందగిరి


గురు చంద్రశేఖర పరమాచార్య

వందే గురుపరంపరాం..





Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని జళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజూ పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ మద్వాల్మీకి రామాయణోపన్యాసములు

(అయోధ్య, అరణ్య, కిష్కింధ కాండములు

గ్రంథకర్త :

'ఆర్ష ధర్మ ప్రబోధక'

నండూరు సుబ్రహ్మణ్యశర్మ

ప్రకాశకులు :

ఆర్షవిజ్ఞాన గ్రంథమాల

శివాలయంవీధి * సత్యనారాయణపురం

విజయవాడ-11.

విషయసూచిక

అయోధ్యకాండ

		పేజీ
1.	భారతీయరాజ్యాంగమున రాజునకుండదగు అర్హతలు	7
2.	మారిన కైక	44
3.	రాముని కైకేయీ మందిర ప్రవేశము	57
4.	రాముని స్థితప్రజ్ఞత్వము	63
5.	భారతీయతలో అర్ధాంగి పాత్ర	74
6.	జీవుని మరణకాలము	116
7.	రాజులేని రాజ్యము	121
8.	భరద్వాజుని ఆతిథ్యము	138

అరణ్య కాండము

1.	దండకారణ్యమున చరిత్ర	164
2.	రాముని మున్యాశ్రమ ప్రవేశము	166
3.	ఋషుల శరణాగతి	168
4.	పంచవటీ క్షేత్రము	175
5.	యుద్ధము	181
6.	మాయలేడి	196
7.	సీతాపహరణము	199
8.	జటాయువు మోక్షము	211

కిష్కింధ కాండము

1.	రామ సుగ్రీవమైత్రి	216
2.	వాలివధ అందలి సంశయ నివారణము	225

ఓమ్

శ్రీ మహా గణాధి పతయే నమః

అయోధ్యాకాండ ప్రథమ దివసోపన్యాసము

అయోధ్యా కాండము

శ్లో॥ బ్రహ్మాద్యామరసిద్ధజన్మభువనం యన్నాభివంకేరుహం
శ్రీ నిర్వాణనికేతనం యదుధరం లో కైకశయ్యాగృహం
యద్వక్షః కమలావిలాసభవనం యన్నామ మంత్రం సతాం
వాసాగార మఖండమండలనిధిః పాయాత్సనోరాఘవః॥

ఆర్య మహాశయులారా !

నేటికి మన రామాయణమున బాలకాండ ముగిసినది. మనమిప్పుడు ప్రారంభించబోవునది అయోధ్యాకాండము.

ఇది రామాయణ మహార్ణవమున విస్తృతమగు ఒక అలవంటి కాండము. ఈ కాండను వాల్మీకి మహర్షి నూటవందొమ్మిది సర్గలతో విస్తరించి వర్ణించినారు.

భరతశత్రుఘ్నులు మేనమామల యింటికి వయసమగుటతో ప్రారంభమై రాఘవేశ్వరులు తన పాదుకలను భరతున కందించి చిత్రకూటాద్రి నుంచి సీతాలక్ష్మణులతో అత్రిమహర్షివారి ఆశ్రమమున ప్రవేశించుటతో ముగిసినది.

బాలకాండవలె ఈ కాండమున ఇతర ఉపాఖ్యానములు విస్తరించలేదు. స్వీయ ఇతివృత్తముతోడనే నడచినదీ కాండము

ఇందనేక పాత్రల సన్నివేశములు కథాంతర్భాగములై ఒక్కొక్క సన్నివేశము ఒక్కొక్క ప్రత్యేకతను చాటినది. రాబోవు కాండలకి కాండలోని కథాభాగము మకుటమై నడచినదనక తప్పదు.

త్రికాల సత్యమై స్వప్రకాశమున బాసిల్లు సచ్చిదానంద బ్రహ్మము అనంత కళ్యాణ గుణవిశిష్టమై లౌకిక ధర్మమునెట్లు దాటివచ్చునో మహర్షి విస్తరించినాడు కథాంతర్భాగముల.

కొందరు విమర్శకులు రాముడు దేవుడని వాల్మీకి తన కావ్యమున స్పష్టముగా చెప్పలేదు. వాచ్యముగ వర్ణించలేదందురు. కావ్యము ధ్వని ప్రధానమగుటచే తన కావ్య శిల్పమున రామునికి పురుషోత్తమత్వమును చేకూర్చెనందురు. రాముని మానవ మాత్రునిగనే వాల్మీకి చిత్రించెనందురు. పాత్రల ముఖముగ రాముడు భగవంతుడని చెప్పించెనందురు. అట్టి సందేహమునకు తావులేకుండ రాముడెవ్వడను కొనుచుం టిరో రాముడు సాక్షాన్నారాయణుడే సుమా ! అని ఈ కాండమున స్పష్టముగా తాను చెప్పియే కథాభాగమును నడిపించినారు. కథాంతర్భాగము నందక్కడక్కడ తనలోని అద్వితీయ బ్రహ్మతత్వమును రాముడెట్లు ప్రదర్శించెనో గూడ మహర్షి ఈ కాండ మున చక్కగ స్పష్టపరచినారు.

అవతారమూర్తియగు రాముడు పితృపాదులయెడ చూపిన భక్తియు సోదరుల యెడచూపిన ప్రేమానురాగ అనురక్తియు, ప్రజాబాహుళ్యముపై ప్రసరింపచేసిన రాముని ప్రేమామృత కిరణ ప్రసారమును, చేతనా చేతన ప్రపంచమంతయు రాముని కంటె వేరుకాదని భావింపదగు భావనా విధానమును ఈ కాండముననే మహర్షివర్యులచే స్పష్టము గావింపబడినది.

మహర్షి ఈ కాండమునందొక్కచో ధర్మ సూక్ష్ముల చక్కగ వ్యాఖ్యా నించినారు. కథాముఖముగనే అర్థశాస్త్ర రహస్యములుకూడ అక్కడ తెలిపినారు. ధర్మానుబంధ కామమును పీతాకళ్యాణమున తెలుపుటచే అంధకార బంధురమగు కామమెంత అనర్థదాయకమో ఈ కాండతో ప్రారంభించినారు. ఇట్లు త్రివర్గముల తెలుపుచువే భంగ్యంతరముగ మోక్షశాస్త్రమున ప్రవేశింప చేసినాడీ కాండ చివరి భాగమున. ఇక కథకు వత్తము.

భరత శత్రుఘ్నుల పయనము

యుధాజిత్తు కైకేయి సోదరుడు. భరతుని మేనమామ. అతడు మిథిలా నగరమున కేతెంచి అచ్చట మేనల్లుని వివాహ మహోత్సవమును దర్శించి వారి తోడనే అయోధ్య కేతెంచినాడు. భరతుని తనతో తీసుకొనిపోవుట అతని కభిమత మైనది. అందుకు దశరథుని ఆజ్ఞయైనది కైకయు సమ్మతించినది. భరతుడును ఇష్టపడినాడు.

రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు నలుగురును దశరథ నందనులేయయ్యును రామ లక్ష్మణులొక జంట. భరత శత్రుఘ్నులొక జంట. రాముని వదలి లక్ష్మణు

డుండడు. భరతుని వదలి శత్రుఘ్నుడుండడు. నిజమునకు శత్రుఘ్నుడు లక్ష్మణుని తోటివాడు. కాని అతడు భరతునకు నిత్యసేవకుడు. సేవకుడు కాడు. సేవక శిఖామణి. రామునకు లక్ష్మణుడెంతయో, భరతునకు శత్రుఘ్నుడంతయే. రామ,లక్ష్మణ భరత శత్రుఘ్నుల ఈ విభాగమునుండి మనమేమి గ్రహింపవలెనన్నది ప్రశ్న.

రాముడు భగవంతుడు. భరతుడు భాగవతుడు. భరతుని సామాన్యముగ భాగవతుడనుట చాలదు. ఆతడు పరమ భాగవతుడు. భాగవతశ్రేష్ఠుడు. మానవజాతి కంతకును ఆదర్శమూర్తి.

సత్పురుషులయందగ్రగణ్యులు. సత్పురుషశ్రేష్ఠులు. అట్లే భాగవత శ్రేష్ఠులు. బ్రహ్మవిదులు. బ్రహ్మవిద్వర్యులు. బ్రహ్మ విద్వరిష్ఠులు. తరతమ భేదములతో విరాజిల్లు జ్ఞానులువీరు. భక్తిభాగమున భరతుని శ్రేష్ఠత్వమిట్టిదే.

మానవ జీవితమున తరించవలెనన్న భగవంతుని కంటే కూడా భాగవత శ్రేష్ఠుల ఇతివృత్తములు శిరోధార్యములు కావలెను. ఇది భక్తిసిద్ధాంతమునందు మకుటాయమానమగుమాట. భక్తులు లేక భగవంతుడు లేడు. భగవంతుడిడుగో అని చూపువారు భక్త శేఖరులే. అందుకు భక్తశిఖామణియగు ప్రహ్లాదుడు మనకు సాక్షి.

భరత శత్రుఘ్నుల ప్రయనము తోడనే అయోధ్యాకాండ కథాప్రారంభమును గావించినది. అయోధ్యకాండయందలి మొదటి శ్లోకమిది—

గచ్ఛతా మాతుల కులం భరతేన తదా నఘ:
శత్రుఘ్నో నిత్య శత్రుఘ్నో నీత: ప్రీతి పురస్కృత:

భక్తి సిద్ధాంతమున బాగుపడదలచిన జీవునకు భాగవత పారతంత్ర్యము పెన్నిధివంటిదని నొక్కి వక్కాణించును ఆ సిద్ధాంతము. భగవానునకు భాగవతులు నిత్యనివాస మందిరములు. ఏ ముహూర్తములగు జీవులు భగవత్పాదార విందముల దర్శించవలెనన్న భగవంతునకు నిత్యనివాసమందిరములగు భాగవతుల పదలియుండ రాదు. భాగవతుల పదలియుండరాదనుటి సాధకులనుద్దేశించిన యుపదేశము. సిద్ధులును భాగవతుల నిత్య సన్నిధానమును కోరుకొందురు. భాగవతుల పాదరజము భగదభక్తులకు సిద్ధాంజనము.

ఈ ఘట్టమున భాగవతము స్మరణీయము. గోపికలు భాగవతమున ముఖ్య పాత్రలు

మధురా నగరినుండి శ్రీకృష్ణుఁ డుద్ధవుని గోపికల వద్దకు పంపగా వా సాన్నిధ్యమున కొంతకాలము గడిపిన యుద్ధవుడన్న మాట ఇది.

"వందే నందవ్రజస్త్రీణాం పాదరేణు మభీక్ష్ణశః
యాసాం హరి కథోద్గీతం పునాతి భువనత్రయం

ఆనంద వ్రజమునందలి స్త్రీలకు నమస్కరించినాడు. శిరమును వారి పాదము లపై మోపి. అది చాలలేదు. అడుగుదమ్ములనున్న ధూళిని గూడ ధరించినాడు యుద్ధ వుడు. వారులేకున్న హరికథాగానము భూభాగమున మారుమ్రోగెడిదికాదని నిర్ణ యించినాడు. భూభాగమున గోపికల అవతరణమే శ్రీకృష్ణచంద్రుని నిజస్వరూప మును తెల్పినదని ఆనందాశ్రువుల రాల్చినాడు. భక్తుల ప్రభావమిది.

ప్రకృతమను సరామః

భాగవత పారతంత్ర్యమునకై బయలుదేరిన శత్రుఘ్నుని వర్ణనయందు మాత్రము రెండు విశేషణములున్నవి. అనఘః॥ నిత్యశత్రుఘ్నఃఅను పదములు. అవి శత్రుఘ్నుని పరిశుద్ధతను చక్కగా వివరించునవి.

శత్రుఘ్నుడు విశుద్ధజీవుడు. అంతేకాదు జితేంద్రియుడు కూడా. ఇంద్రియ యజములేక జీవునకు విశుద్ధత్వములేదు.

ఇక కైకేయి రాజ్యమునకేగిన భరత శత్రుఘ్నుల పరికింతము. వారికది మాతామహస్థానము. స్వర్గసుఖములవంటి సుఖములను వారికి కూర్చదగు స్థాన మది. అయ్యాను వారక్కడ క్రీడా విశేషములతో విలాస దివసముల గడపుట లేదనినారు మహర్షి. కారణమేమియట? వారిద్దరి హృదయ సీమలయందును దశర థేశ్వరుని వృద్ధాప్యమును పితృమూర్తి యెడలగల పితృభక్తియు నిత్యమై ప్రవ ర్తించుచుండుటే అందుకు కారణమట. మహర్షి గీతమిది..

"తత్రాపి నివసంతౌ తౌ తర్వ్యమాజౌ చ కామతః
భ్రాతరౌ స్మరతాం వీరౌ వృద్ధం దశరథం నృపం

ఇక్కడ చమత్కారమేమనగా "తర్వ్యమాజౌ చకామతః" తాతగారును మేనమామయు తల్లి తల్లియు వారి కోర్కెలన్నెల్ల తీర్చుచున్నను వారక్కడ దశర థునే చింతించుట వారియందలి ప్రత్యేకత. మరొక్క విశేషమేమన? మనము మన తండ్రిని ఎప్పుడు చూతుమను? చూడగలమా? అన్న ఆతురత వారి హృదయముల నిగూఢమై రాబోవు ఘట్టము వారికి తెలియకుండగనే వారియందు దాగియుండుటను

కవి ఇక్కడ దశరథునకు "వృద్ధం"అన్న విశేషణమును వాడి వాకిద్దరును దశరథుని మరల వారు చూడకపోవుటను సూచించినారు తాత్కాలిక చూడకపోవుటయేకాదు 'నృపం' అను విశేషణమున దశరథుని రాజసింహాసనము నందధిష్ఠించి యుండగ చూచుట కూడా వారికి దక్కక పోవుటను ధ్వనించినారు. మనకు రాబోవు కొన్ని ఘట్టములు మనకు తెలియకుండగనే మన హృదయముల పరిపర్తించుట అసహజముకాదు. తాత్కాలిక సుఖములెన్నిటిని అనుభవించుచున్నను భవిష్యదర్థములు కల్పించబోపు కల్పనలు స్థూల సూక్ష్మ శరీరముల కన్పట్టుచుండును. ముందుకు పోదము.

ఆ ఆదికవి మరొక్క ప్రత్యేకతను ఈ కథా ఘట్టమున తెలిపినారు. దశరథుని పాత్రను తీసుకొనినారు.

దశరథునకు నలుగురు పుత్రులలో రామునియందెక్కువ ప్రీతి. భార్యల ముగ్గురిలో కైకయందనురాగము. ఇవి రెండును దశరథునియందలి దోషములు. అందొక దోషము పుత్రులయందలి పక్షపాతము. అది చూచుటకు కన్పట్టునేగాని అది యనార్థమునకు కాదని యిక్కడ స్పష్టపరచుచున్నారు.చక్కని ఉపమానమును చెప్పి. ఏమా ఉపమానము ?

"రాజా పితా మహాతేజాస్సస్మార ప్రోషితా సుతౌ
ఉభౌ భరత శత్రుఘ్నౌ మహేంద్ర వరణోపమౌ

అక్కడ భరత శత్రుఘ్నులు లెట్లుండిరో దశరథునకు ఇక్కడ వారియందట్టి అనురాగము కలిగియే యుండెనట. అనగా నేమి? వారిక్కడ లేకున్నను ఇంద్ర వరుణులతో సమానమగు పరాక్రమముగల భరత శత్రుఘ్నుల నాతడు పిత్యమును స్మరించుచుండెనే గాని అతడు రాముని పైగల ప్రీతితో వారిని మనవలేదు. అందుకు ప్రమాణ ఉపమానము లేమందురా?

"సర్వ వీవతు తస్యేష్టైశ్చతుర్భిరపి పుత్రకైః
సర్వ శరీరాద్వివిర్వాతాశ్చతుర్భిర ఇవ బాహవః

పురుష శ్రేష్ఠులగు ఆ నలుగురు పుత్రులను దశరథునిట్లనిరి. ఎట్లు? తన శరీరము నందావిర్భవించిన నాలుగు చేతులవలెనట. ఈ ఉపమానమొక్క అనర్ఘ రత్నము. ప్రజలయందే పక్షపాత రహితుడై పరిపాలించు ఆ మహారాజు పుత్రుల యందట్టి పక్షపాతమును చూపునా? అతడు చూపలేదను దానిని స్పష్టపరచినాయి. ఇంతేగాక రాబోవు రామని యువరాజ్య పట్టాభిషేకమునకు రామునిపైగల అను

రాగము కారణము కాదని కూడ ఈ ఉపమానము స్పష్టపరచినది. మరియొక విశేషమేమన? దశరథుడు కశ్యప ప్రజాపతి కాగా అదితి కౌసల్యకాగా నారాయణుడే నాలుగుఅంశలతో నలుగురు పుత్రులయ్యేనని ధ్వనించినది ఈ ఉపమానము. ఇక మనమయోధ్యకేతెంతము. రామునిపై చూపు నిలుపుదము.

రాముడు మన కావ్యమునకు కథానాయకుడు మనయందంతర్యామి. స్థావర జంగమాత్మక ప్రపంచమునకు సృష్టికర్త. ఆ యుగము నందాతడీ భూలోకము నందొకరాజై రాజసింహాసనము నలంకరించి ధర్మమును స్థాపింపవచ్చిన శిక్షకుడు. మర్యాదా పురుషోత్తముడు. ఆతడు కాబోవు యువరాజు. నేడు ప్రజలు కోరుకున్న ప్రభువు.

భూదేవి కూడ విష్ణుపత్నియే. శ్రీ మహావిష్ణువునకీమె – రెండవ ఇల్లాలు. మహాలక్ష్మి సీతయై రాముని పాణి గ్రహణము కావింపగా భూదేవియు ఈతడెప్పుడు నాకు నాథుడగునా యని ఎదురుచూచుచున్నది. రాముడు సాక్షాన్నారాయణుడని వాల్మీకి ఈ విధముగ స్పష్టపరచినాడు.

"స హి దేవైరుదీర్ణస్య రావణస్య వధార్థిభిః
అర్థితో మానుషే లోకే జజ్ఞే విష్ణు స్సనాతనః

సనాతనుడగు నారాయణుడే రావణ వధకై దేవతలు ప్రార్థించగా ఈ భూలోకమునందవతరించెనని స్పష్టముగ చెప్పిన శ్లోకమిది. వేరొకపాత్ర ముఖముగ చెప్పిన శ్లోకముకాదు. ధ్వన్యర్థమును కాదు, రాముని దేవుడని వాల్మీకి వాచ్యముగ చెప్పెనా? అన్న జిజ్ఞాసువులకు ప్రమాణ శ్లోకమిది. ఈ శ్లోకమునుద్రవాసియే రామునిగుణముల వర్ణించినారు మహర్షి. భగవద్గుణాను వర్ణనమున కృతకృత్యుడ నగుదు ననుకొన్న వాల్మీకి మహర్షి తాను వర్ణించబోవు గుణములన్నియు పుంజీభూతమై ఒక సామాన్య మానవుని యందుండెనని ఎట్లు చెప్పును? కావున రాముడు సాక్షాన్నారాయణుడేనని నిర్ణయించియే రామని గుణవర్ణనను గావించినాడు.

నిజమునకు భగవానుని గుణములు లెక్కకు మిక్కిలియై వర్ణింపనలవికానివే అయ్యును ఆతని గుణ ప్రపంచము నెన్నినగాని మానవునకు ముక్తి కలుగదు. ఇదియే వ్యాస మునీంద్రులు గావించిన భాగవత రచనలోని రహస్యము.

వ్యాసులు వ్యాకుల చిత్తమున బాధనొందగా అంతటి వేద విభాగ కర్తకీ వ్యాకులము కలుగుటకు కారణము. భగవద్గుణాను కీర్తనను ప్రత్యేకముగ తావించక పోవుటే. ఉ. నీకీ కొంచెము పద్మ పెల్లయని హరిగోనుతింపమి నాద్యపూజతా॥ యని

నారదుఁ చెప్పినారు వరాళర సూనునకు. ఆ ఘట్టముననే హరికథావర్ణనగల కావ్యము వర్ణించబడినది. అందలి పోతనా మాత్యుల వాణిని స్మరింతము.

మ॥ హరినామ స్తుతిసేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళీ
సురుచి భ్రాజితమైన మానస సదస్భ్రాన్ వెలుగొందు శ్రీ
హరి నామస్తుతి లేని కావ్యము విచిత్రార్థాన్వితంబయ్యు శ్రీ
కరమైయుండ దయోగ్య దుర్మలిన వక్కోల గర్త కృతిన్.

ముందుకు పోదము.

భారతీయ రాజ్యాంగమున రాజున కుండదగు
- అర్హతలు -

రాముడు నిజమునకు భగవంతుడే అయ్యును ఆతడిప్పుడుకాబోవు యువ రాజు. కావున యౌవరాజ్యము నందధిష్ఠింప చేయదగు వానికెట్టి అర్హతలుండ వలెనో ఆ అర్హతలన్నియు మన మహాకావ్యమున వర్ణింపబడినవి. భగవంతుడగు శ్రీ మహావిష్ణువునందున్న గుణములే పరిపాలకుని యందును ఉండదగు గుణము లని భారతీయ సిద్ధాంతము. సృష్టి స్థితిలయ కర్తయగు శ్రీ మహావిష్ణువుయొక్క అంశకలిగియే పృథివీపతియగుటను భారతీయ రాజనీతి శాస్త్రములు వర్ణించినవి. నా విష్ణుః పృథివీపతిః అని.

ఈ జగత్తును పరిపాలించు పరిపాలనా విధాన మొకటియు భూలోకమును పరిపాలించు రాజనీతి వేరొకటియు అనునది భారతీయ సిద్ధాంతము కాదు. శ్రీమహా విష్ణువు నందున్న గుణసముదాయమే అఖండ భూభాగమును పరిపాలించు పరిపాల కునియందున ఉండవలెనని తెలుపుటకే వాల్మీకి మహర్షి ఈ ఘట్టమున రాముని గుణ ప్రపంచమును విస్తరించినారు. దేవుని ధ్యానముచేసి మన నిత్యజీవిత విధా నము వేరని నేటి చరిత్రకారుల అభిప్రాయము. భారతీయ గ్రంథములట్లు లేవు. నిజమునకు దేవుడే జీవుడు. లేక దేవుని అంశయే జీవుడు. మానవుడు దేవుడై భౌతిక సుఖదుఃఖముల కతీతుడు గావలెననునదే మన రామాయణ మహాకావ్యము నకు ప్రధానమగు లక్ష్యము. ఇక్కడ మీకొక ముఖ్యమగు విషయమును గూడ చెప్పెదను.

నేడు మన రాజనీతిజ్ఞులు నాడెప్పుడో కొనసాగించిన నిరంకుశ పరిపాలనకు

స్వస్తిచెప్పి ప్రజాస్వామ్యమును ప్రవేశపెట్టుట విశ్వశ్రేయమని ఉద్ఘాటించగా ప్రజానీకమునూ నేటి ప్రజాస్వామ్యమొక కల్పవృక్షమని నమ్మచుండుట ఒక అంధవిశ్వాసమని నా విశ్వాసము. ప్రజాస్వామ్య మనగనేమి ? ప్రజాస్వామ్యము నేడు క్రొత్తనై రూపొందినదా ? నాడును కలదా? నిరంకుశ పరిపాలనయన నేమి? నాడు నిరంకుశ పరిపాలన ఎట్లుండెడిది? అను విషయములను నేడు ప్రజలు చర్చించుచో నేటి ప్రజాస్వామ్యముగల విశ్వశ్రేయము కన్నులకు కట్టినట్లగపడగలదు. అందుకు ముందుగ పరిపాలకునకుండదగు గుణ సమూహాయమును వర్ణించినారు వాల్మీకి మహర్షి రామాయణ కావ్య కథానాయకుని యందు. ఇది అయోధ్యాకాండ యను మాటను శ్రోతలు మరువకుడు. తరువాతి కాండలలో నిరంకుశ పరిపాలకుని స్వరూపము వర్ణించబడును. ప్రజాస్వామ్యమున పరిపాలకుని అర్హతలెవ్వియో మీరు జాగరూకులై విని మనది ప్రజాస్వామ్యమగునా? కాదా? యని విజ్ఞులాలోచించుకొనుడు. ముందునాటి ప్రజల విజ్ఞతను చెప్పవలెనా? నాటి ప్రజలు ఎన్నుకున్న పరిపాలకుని గుణముల ప్రవచించవలెనా? అన్నది నాకు ప్రశ్నయైనది. కాని ఆలోచించగా మహర్షి పరిపాలకుని గుణంబుల వర్ణించియే ఆతని నెన్నుకొన్న ప్రజానీకములోని చైతన్యమును తెలుపగా నాకీ సందేహమెందుకు? నాడు ప్రజలు కోరుకొన్న పరిపాలకుని గుణములనే మీకు విస్తరించెదను. ఆ గుణ వర్ణననిట్లు ప్రారంభించినారు మహర్షి.

స హి రూపోపపన్నశ్చ వీర్యవాన్ననసూయకః
భూ మా వసుపమ స్సానుః గుణైర్దశరథోపమః

రాముడు తగిన రూపము కలవాడట. పరాక్రమ శాలియట. అసూయ లేని వాడట. భూలోకము నందెక్కడను అతనికి పోల్చదగిన పుత్రులులేని పుత్రరత్నమట. గుణములన్నియు దశరథునే పోలియుండెనట.

ఈ వర్ణనలోని ప్రత్యేకత ఏమి? మొట్టమొదట ఆకారము వర్ణించబడినది. తరువాతది పరాక్రమము. సాముద్రిక శాస్త్రము బాహ్యావయవ నిర్మాణము ననుసరించియే లోపలి గుణములను తెలుపును. మన గుణమయ దేహమునకును బాహ్య శరీరమునకునుగల అనుబంధమును తెలుపుట యందగ్ర గణ్యమైనది- భారతీయ సాహిత్యము. దీనినే కాళిదాసు రఘువంశ కావ్యమున "ఆకార సదృశ ప్రజ్ఞః" అని నాడు. ఆకృతికి తగిన ప్రజ్ఞ కలిగియుండెనని మరొకచోట దిలీపుని ఇట్లు వంచిర్ణి

నాడు. "ధనుర్భృతోవ్యగ్ర్య దయార్ద్ర భావమాఖ్యత మతః కరణైర్విశంక్తై" దిలీపుడు నందినీ ధేనువును తొలుకొని ధనుర్ధారియై అరణ్యమునకేగగా అచ్చట లేళ్ళు ఆయన చేతనున్న ధనస్సునుచూచి భయపడుటలేదట. మీదు మిక్కిలి ఆయన శాంతరూపము ఆయనలోని దయను ప్రకటించగా తమకు విశాలమైన నేత్ర ములు కలిగినందులకు ఆ ఫలము ననుభవించుచున్నవా? అనునట్లు చూచుచున్నవట. "ప్రకామ విస్తార ఫలం హరిణ్యః అని శ్రీరామచంద్రుని రూప సౌభాగ్యమును కవి ముందుగచెప్పి ఆ సౌభాగ్యముతో తులతూగు విక్రమమున్నదనిసారు. అనగా రాక్షోవు దుష్టసంహారమును సూచించినారు. తరువాతది అసూయలేకపోవుటయును ఉత్తమగుణమును కూడ చెప్పినారు. ఇది మొదటి పాదములోని వర్ణనా విశేషము. ఇక రెండవ పాదమును తిలకింపుడు.భూమియందీ రామునకు ఉపమింపదగుపుత్రుడే లేడనునది. ఇదిచాల విశిష్టమగు వర్ణనము. ఈ వర్ణనచెప్పిన విశేషమేమి? రామున కంటె ముందెందరో మహారాజుల చరిత్రలుండగా ఉపమించుటకు పుత్రుడే నేత పోయేనా? లేదు. కారణమేమందురా?

సర్వజ్ఞమూర్తియగు శ్రీ మహావిష్ణువే పుత్రుడగుటచే ఈతని జనకునకు కీడదేసాటి. తన మాయనే తాను ఆధారముగాగొని స్వసంకల్పముచే భక్తానుగ్రహము కొరకు పుత్రభావము నొందిన వ్యక్తి ఈ రఘువీరుడు. ఈతని కీడు సాటిగాక మరెవ్వరుసాటి? ఈ విషయమును చక్కగ ఉదహరించినారు మహర్షి. తరువాతది తండ్రి గుణములనే ఈతడు కలిగియుండెనను విషయము. ఆరువదివేల సంవత్స రములు ప్రజలను కన్నబిడ్డలవలె పాలించిన దశరథుని ప్రతిభా విశేషమే ఆతని తరువాత కాదగిన రాజు యందుండెనని రాముని యువరాజ్యార్హతను ధ్వనించినారు. తరువాత శ్లోకమిది—

"న చ నిత్యం ప్రశాంతాత్మా మృదుపూర్వంతు భాషతే
ఉచ్యమానోపి పరుషం నోత్తరం ప్రతిపద్యతే.

రాముడెవ్వడును ప్రశాంతాత్మయియ్యెయుండునట. అతడు మాటాడునప్పుడు కాఠిన్యముండదట. మార్దవ పూర్వకమట ఆతని సంభాషణము. ఎదిరివారెవ్వరైన కఠినముగ మాట్లాడినను ఆతడు తన మార్దవమును వీడడట. ఈ వర్ణన రాముని నీతిజ్ఞుడని ప్రకటించిన శ్లోకమని మనము సామాన్యముగ ఊహించుట కాక ఈ

శ్లోకమునందలి "న చ నిత్యం ప్రశాంతాత్మా" అనుభాగమును పరిశీలించుచో వాల్మీకి యొక్కప్రత్యేకత మనకు గోచరించగలదు. ఏమా ప్రత్యేకత?

ఈ శ్లోకమున రాముని దశరథుని నుండి విడదీసి రాముని ప్రశాంతస్థితి నిత్యమని చెప్పినారు. అనగా ఆతడొక కాలమున శాంతాత్ముడై యుండుటయు, వేరొక కాలమున కుపితాత్ముడై యుండుటయు ఇంకొక కాలమున సంతోషము కలిగియుండుటయు, వేరొకకాలమున దుఃఖశోకములతో కూడి యుండుటయులేదట. భూతభవిష్యద్వర్తమాన కాలములయందు మూడు కాలములయందును ఆతడు శాంతాత్ముడయ్యే యుండునని నిత్యశబ్దమును వాడినారు. "యత్సత్యం తన్నిత్యం" అని శ్రుతి. ఏది సత్యమో అది నిత్యము. ఒక కాలము నందుండి వేరొకకాలమున లేకపోవుట సత్యమును నిత్యమును కాదు. కావున రాముడు ఏ కాలమునందును వికారము చెందని ప్రశాంతాత్మగాని, జీవత్వము కలిగి జనన మరణాది వికారములు కలిగినవాడు కాడు. జీవన్ముక్తులయ్యను లోకవ్యవహారమునెట్లు కొనసాగించుటయో ఆదర్శమును చూపిన మనుష్యావతారమిది యని చక్కగ స్థాపించి ఆ తరువాత ఆతని సౌజన్యమును వర్ణించినారు. నిజమునకు ఉపనిషత్ప్రతిపాద్యపురుషుడు సచ్చిదానంద బ్రహ్మమే మాయామానుష విగ్రహమని చెప్పక చెప్పినారు.

రాముడు సీత కొరకై దుఃఖించెను. కైకేయి వలన నాకీ కష్టములు వచ్చెనని పలుమారులు పలికెను. తన మిత్రుడైన విభీషణునకు పట్టముగట్టి రావణుని ఖండించెను. మరొక్క విశేషమేమన? సీత కొరకై రాముడు కామాత్ముడై విరహపడెను. రాముడు జీవన్ముక్తుడా? జ్ఞానియా? అతడు క్షత్రియులు గావించు అశ్వమేధాది క్రతువుల గావించెను. ఆతడెక్కడి జీవన్ముక్తుడు? జీవన్ముక్తుల కండ్లకీ లోకము కన్పట్టునా? అను ప్రశ్నలు లేకపోలేదు. ఇక్కడనేయున్నది చిత్రము. ఉపనిషద్విజ్ఞానము వలననే తెలియదగు విషయమును మన సామాన్య బుద్ధితో ఆలోచించిన తెలియబడదు.

రాముడు తన పండ్రెండవ ఏటనే వశిష్ఠుని వలన ఆత్మతత్త్వోపదేశము నొందెను. అదియే యోగవాశిష్ఠము. ఈ వాశిష్ఠమును—వాల్మీకి ప్రణీతమనియే వాశిష్ఠము నందున్నది. కావున రాముడు జ్ఞానియయ్యే అవతార జీవితమును గడపినాడు. ఆయన అవతార ధర్మాచరణముగాని, ఆతడు ప్రదర్శించిన శారీరక ధర్మములు గాని ఆతని ముక్త స్వరూపమునకు అడ్డమురాలేదు. లోక సంగ్రహము వకై ఆచరించు ధర్మ కర్మలును, లోకాతీతుల జ్ఞానస్థితియు రామకృష్ణాకారములు

మిశ్రమములయ్యె యుండును. అందు కృష్ణావతారమున స్పష్టమై ఆయవతార బాల్య క్రీడల యందును విశ్వరూపాది ప్రదర్శనల యందును కన్పట్టగా రామావతారమునందలి ఆత్మారామత్వము నిగూఢమైయుండును. ఆతడు స్వయముగ చక్రవర్తియై ధర్మపరిపాలనను గావించ వలసి వచ్చుటే అందుకు కారణము.

రాముడు పరమాత్మ యను మాటను మరువక మనము రామాయణ మహాకావ్యమును గ్రహించవలెను. వాల్మీకి మహర్షి అక్కడక్కడ రాముని ఉపమించుటలో ఈ విషయమును స్పష్టపరచినారు. ఈ కాండయం దెన్నియో చోట్ల అట్టి ఘట్టములున్నవి. వాటిని ప్రదర్శించుచు కథను చెప్పుట నా లక్ష్యము. జడవాదులు చూచు చూపును రామునిపై ప్రసరించి మీ అంతరాత్మల కలుషితములు గావించు కొనవద్దని నా యుద్బోధము. జడవాద మన నేమందురా?

మానవదేహమెప్పుడు నిర్మితమయ్యెనో ఆదేహమెప్పుడు ప్రకృతి సంబంధమును కల్పించు కొనెనో ఆ కాలమే మానవ చరిత్రకు ప్రారంభ కాలమని చెప్పుట జడవాదము. ఆ కాలమును వారు నిర్ణయించలేరు. మానవుల ప్రారంభ జీవితము ఆటవిక జీవితమని వారి చరిత్రలోని అంశము. మానవ సంఘము కొంతకాలము పిట్టల కొట్టుకొని, ఆ తరువాత కాలమున జంతు మాంసమును తినుట కలవాటువడి, ఆ జంతువుల చంపుకొనుటకు తగు ఆయుధము లను రాతితోను కట్టెలతోను నిర్మించుకొని క్రమక్రమముగ యుద్ధ సామగ్రుల తయారు చేసుకొనుటకు సమర్థులై సాంఘికముగ ఎక్కువ బలము కలవారు తక్కువ బలము కలవారిని బానిసలగావించ కొని రాజులై వ్యవహరించిరని ఆ జడవాదుల వాదము. రాతియుగ లోహయుగములని వాదులు చెప్పినవే. నేడసుకొను నిరంకుశ పరిపాలన పునుమూట ఈ చరిత్రకు సంబంధించినదే. సద్వాదము ననుసరించిన ప్రజాస్వామ్యమును వారెరుగరు. రాముని వర్ణనమున మరొక శ్లోకమును వినుడు.

న స్మరత్యపకారాణాం శతమప్యాత్మవత్తయా
కథం చిదుపకారేణ కృతేనైకేన తుష్యతి.

మీరు అపకారములనైన ఇతరులు గావించుచో ఆ అపకారములను తలచనైన తలచదట. ఏదో ఒక ఉపకారము నేమాత్రము గావించినను వారి ఉపకార ఫలమును స్మరించి ఆనందించునట, ఇదియే భగవంతునిలోని ప్రత్యేకత. మీపు దోషముల నాయన క్షమించును. వాడందించు పూజాదికములత్యల్పములైనను

పంతసింది అనుగ్రహించును. రాజు కూడ ఇట్లుండవలెను. ఇట్లెన్నియో గుణములు వర్ణించబడినవి రాముని యందు. అందొక గుణమిది —

శీల వృద్ధైరాన వృద్ధైర్వయో వృద్ధైశ్చ సజ్జనైః
కథయస్వాస్తవై నిత్యమస్త్రయోగ్యాంతరేష్వపి

ఆతడెప్పుడును వృద్ధులతోడనే స్నేహమును చేయునట. ఎవరా వృద్ధులు? కేవల వయోవృద్ధులు కాదు. శీల వృద్ధులును, జ్ఞాన వృద్ధులును, సజ్జనులైన వయోవృద్ధులునట. ఈ వర్ణనలోని ప్రత్యేకత ఏమి?

మానవుని పరిశుద్ధ జీవితమును తెలుపునది ఆతని మిత్ర మండలి. ఆతడెవ్వరితో స్నేహము చేయుననునది చాల ముఖ్యమగు విషయము. కావున ఆదికవి రాముడెవ్వరితో మైత్రిని సలిపెడివాడో వర్ణించినాడు.

సజ్జనులు కానివారితో వారెంత వయోవృద్ధులైనను రాముని దృక్పథమున వారు స్నేహపాత్రులు కారు. శీలమున సడవడిక వక్రమార్గమున సడచు వారెట్టి వారైనను వారివంక తిరిగి చూడడు. శీలవృద్ధులు ఆతని ఆప్తమిత్రులు, సడవడిక వేరు. విజ్ఞానము వేయ, కావున జ్ఞాన వృద్ధుల నాతడు దగ్గరకు తీయునట. ఒక్కొక్కరి వలన ఒక్కొక్క ప్రయోజన మున్నది. శీలవృద్ధులతో ఆతడు సదాచార ప్రసంగముల గావించును. అనగా వారు ధర్మ శాస్త్ర నిపుణులన్నమాట. సడవడికను చెప్పునవి ధర్మ శాస్త్రములు. ధర్మము రెండు విధములు. సామాన్య ధర్మము, ఆపద్ధర్మమునని. ఆ రెండు ధర్మముల తెలసి సడవడికను దిద్దుకొనవలెను. జ్ఞాన వృద్ధులతో మోక్ష శాస్త్ర ప్రసంగముల గావించును. వయోవృద్ధులతో వంశ చరిత్రముల ప్రసంగించి తెలుసుకొనును. ఇంకొక్క విశేషమున్నది. వారితోటి మాట్లాడు సమయమెప్పుడు? వారి తోటి ప్రసంగములకు ప్రత్యేకముగ ఈ సమయమని లేదు. తాను ప్రధానముగ అభ్యాసమును చేయు ధనుర్వేదాధ్యయన కాలము నందుకూడ ఏమాత్రము అవకాశము దొరకినను సంభాషించునట.

బుద్ధిమాన్ మధురాభాషీ పూర్వభాషీ ప్రియం వదః
వీర్యవాన్నచ వీర్యేణ మహతా స్వేన విస్మితః

ఆతడు మహా మేధావియట. అతని వలుక్కులు తేనేలొలుకునట. ఎంత తక్కువ వానినైనను తానే ముందుగ మాట్లాడించునట. శత్రువుల యెడలూడ రాముడు ప్రియవచన శీలుడట. శత్రునిధనము వందాతడు అత్యంత సమర్థుడే

యయ్యును తన సామర్థ్యమునకు తానే ఆశ్చర్య పడుటట. ఇక్కడ కవి విస్మయ పదమును వాడెను. విస్మయమున గర్వము. గర్వము. లేని వాడని భావము. మరొక్క విశేషము-

"నచానృత కథో విద్వాన్ వృద్ధానాం ప్రతి పూజకః
అనురక్తః ప్రజాభిశ్చ ప్రజాశ్చాప్యను రంజతే.

రాముడు చక్కని పండితుడు. కాని అబద్ధపు కథల యందాతడు అనురక్తుడుకాడు. అబద్ధపు కథలననేమి ? కల్పితకథలని అర్థము. (తనాటి నవలలు) అసత్కావ్యములు విశ్వశ్రేయములుకావు. మహాకావ్యముల పఠనము అమృతము కాకపోదు. సంస్కృతమున కూడ నవలలు లేకపోలేదు. కాని అవి విశ్వశ్రేయ ములుకావు. ప్రజల నాతడు ప్రేమించును. ప్రజలచే ఆతడు ప్రేమింపబడినట. ఇవి ఇట్లుండ మరొక్క విశేషమూరాముని యందుండెనని మహర్షి ప్రత్యేకించినాడు.

కులోచిత మతిః క్షత్రం ధర్మం స్వం బహుమన్యతే
మన్యతే పరయా కీర్త్యా మహత్స్వర్గఫలం తతః॥

భారతీయ పరధర్మములు అనాది సిద్ధములు గాని సంఘము చేపట్టిన పుత్తుల ననుసరించి వచ్చినవి కావని ఈ శ్లోకము నిర్ణయించు చున్నది. రాముడు తన క్షత్రియ కులమునకు ఉచితమగు క్షత్రధర్మమునే ఉత్కృష్టమని తలచునట "స్వం క్షత్రం ధర్మం బహుమన్యతే" అనినారు తన ధర్మాచరణ వలన వచ్చు స్వర్గము నాతడు గొప్పదానినిగా భావించునట. స్వర్గమున్నదని నమ్మిన వారే ఆస్తికులు. రాముడు ఆస్తికుడు. కీర్తికి స్థానమిచ్చుట ధర్మము ననుసరించియేయట. ఇంతియే కాదు. మరి కొన్ని ముఖ్య విశేషముల చెప్పిముగింతును.

ధర్మకామార్థతత్త్వజ్ఞ స్మృతిమాన్ ప్రతిభానవాన్
లోకికే సమయాచారే కృతశ్రమ విచారదః

రామునకు ధర్మార్థకామముల తత్వముతెలుసునట. మరపు లేదట. ఆతని ప్రతిభ నిత్యనూతనమట.

ధర్మార్థకామముల సేవించుటకు శాస్త్రాచార్యులు కాలముల నియమించి నారు. ప్రాతఃకాలమున ధర్మమును, మధ్యాహ్నమున అర్థపురుషార్థ సేవనమును, రాత్రి కాలమున కామానుభవమునని. ఇందు ధర్మార్థములు కాలవ్యత్యానములు

కావచ్చును. ప్రాతఃకాల మధ్యాహ్నములు మారవచ్చును. కామము మారరాదు ఈ విషయములు తెలిపిన తత్వవేత్త యగు రాముడు. ధర్మార్థ కామములు శాస్త్రాధీనములు. ఆశాస్త్రములును వేదసమ్మితములే. అంతేగాక స్మృతి, ప్రతిభ అను గుణమును ప్రత్యేకములటస్మృతియగు కానాచరించవగు పనిని మరువ కుండుట. ప్రతిభయన ప్రతికార్యము నందును క్రొత్తదనమును కల్పింపదగు శక్తి. ఇవి గాక లౌకికాచార శిష్టాచారముల యందును ఆపస్తంబాది ముని ప్రణీత శాస్త్రము లందును ఆతడు విశారదుడగు. అనగా వాటిని ఆచరింప చేయుట యందు సమర్థు డని అర్థము. మరొక్కవిశేషము :

"నిభృత స్సంవృతాకారో గుప్తమంత్రస్సహాయవాన్
అమోఘ క్రోధ హర్షశ్చ త్యాగసంయమ కాలవిత్.

తన హృదయము నందలి విషయములను ఎదిరివారు గ్రహించకుండ చిలుపు కొనుట యందత్యంత కుశలుడగు. అనగా ఆకార చేష్టల వలన పర హృదయమును గుర్తెరుగు వాడందురు. వారికి రాముడు పట్టు కాడగు. అట్టి మంత్రులే అతనికి సహాయకులు గూడ. అవియట్లుండ అతనికి వచ్చు క్రోధము గాని సంతసము గాని గడ్డిమంటవలె వెలిగి చల్లారునని కావట. అవి కార్యరూపమును దాల్చియే తీరునట. మరొక్క విశేషమేమన? త్యాగమెప్పుడు చూపవలెను? నిగ్రహము నెప్పుడు వాడవలెనను కాలముల నాతడు తెలిసివర్తించు వాడట. అన్నిటికంటె ముఖ్యమగు విషయమొకటున్నది. అది ఆదాయమెట్లు చేయవలెను? వ్యయము నెట్లు చేయవలెను ననునది.

దీనిని భారతీయ అర్థశాస్త్రము చక్కగ చెప్పినది. బృహస్పతి, శుక్రా చార్యుడు సంగ్రహించిన అర్థశాస్త్రమునే కామందకుడు, చాణక్యుడు మొదలగు వారు మరల మరల సంగ్రహించినారు. రాజపుత్రులే, అర్థశాస్త్రాధ్యయమును చేయుట చాలా ముఖ్యముగ జరిగెడిది. దీనిని వాల్మీకి రాముని వర్ణనలో ప్రతే కించినారు.

"ఆయకర్మణ్యపాయజ్ఞస్సందృష్టవ్యయ కర్మవిత్"

ఆదాయమును చేయుట యందు రాముడు చాలా నేర్పరియట. వ్యయ మును చేయుట యందాతడు దీర్ఘదర్శియట. "సం" అనుఉపసర్గను వాడినారు. దృశిర్ ధాతువునకు సమ్యక్ దృష్టః అని అర్థము. వ్యయము చేయుటయందు అది మూపు ఎంతదూరము పోవునో చెప్పినాడు. ఇట్టి గుణముల నెన్నిటినో

వర్ణించినారు మహర్షి. మనకు కాలము చాలదు. ఇక చివ్వరి శ్లోకమును మీకు వినిపించెను. రామునియందీ గుణ సముదాయ మెట్లుండెనో ఒక చక్కని ఉపమానముతో వర్ణించినారు.

గుణైర్వీరుచే రామో దీప్తిస్సూర్య ఇవాంశుభిః

ఈ వర్ణించిన గుణములన్నిటితో రాముడు చక్కగ వెలుగొందు చుండె నట- ఎట్లుట ? ప్రకాశవంతుడగు సూర్యుడు తన కిరణములతో వెలుగొందునట్లు రాముడు వెలుగొందు చుండెనట. ఈ ఉపమానములోని ప్రత్యేకత ఏమి?

సూర్యుని కిరణములు సూర్యుని కంటె వేరుకావు. ఆ గుణములకు సూర్యుడే అధిష్ఠానము. సూర్యుడు వేరై గుణములు వేరై లేవు. సృష్టిస్థితి లయములకు సూర్యుడాధార భూతుడు, రాముడాతడే. కాని ఇక్కడ ఉదయ భానునిగ పోల్చక "దీప్తః" అను విశేషణమును వాడి ప్రస్తుతమున రాముడు పాలకుడుగా స్థితికాలము నందలి సూర్యునకే పోల్చినారు. సూర్యుడు లోకబాంధవుడయినట్లే రాముడు లోక బాంధవుడని సూచించినారు. సూర్యుడు చీకట్లను పోగొట్టునట్లు రాముడును అజ్ఞానమును తొలగించు ఆత్మరాముడని ధ్వనించినారు.

ఇట్టి రాముని ప్రజలు రాజు కావలెనని కోరినారు. అట్టి రాముని యువ రాజును గావింప దశరథుడు యత్నించినాడు. ఇది నాటి పరిపాలనకు ప్రారంభ ఘట్టము. నేనే తగిన నాయకుడనని ప్రజలకు ప్రజానాయకుడు దోసిలియొగ్గలేదు.

ఈ సంచికామున నాటి నేటి పరిపాలనా విధానముల పరిశీలింతము.

నేటి పాలనము ప్రజాస్వామ్యము. నేటి ప్రజాస్వామ్యమున రాజను వాడొకడు నియతుడై లేక ప్రతి పరిమితకాలమునందును ప్రజా బాహుళ్యము ఒప్పు కొన్న వ్యక్తి పరిపాలకుడగును.

ఏ వ్యక్తి తాను పరిపాలకుడను కావలెనుకొనునో. ఆ వ్యక్తి నన్ను ఎన్నుకొన్నవారి కీలాభములను నేను చేకూర్తునని ప్రచారము చేసుకొనుట కలదు నేటి ప్రజాస్వామ్యమున. ఈ ప్రచారమున ప్రచారమున కయ్యెడి ఖర్చునకు మితము లేదు. ప్రజలను తన కభిముఖము గావించుటకై యత్నించు ప్రయత్నములం దగ్రగణ్యుడు పరిపాలకుడు. ప్రజలు తనను ఎన్నుకొనునట్లు ప్రయత్నించుట రాజకీయ చతురత. ప్రజల పలుకుబడియే పీనికి శిక్షాస్థలుల విజ్ఞానముగాని చరిత్రలోని పవిత్రతగాని న్యాయశాస్త్రైద్యయనముగాని పితృ పితామహ ప్రభావమున వచ్చెడి ప్రజ్ఞా విశేషముగాని ప్రమాణములు కావు. పరిపాలకుని ఎన్నుకొను

ప్రజలు ఈతనిని ఏమెందుకొర కెన్నుకొనుచుండిరో ఆతనికిగల సామర్థ్యమెట్టిదో తెలియని ప్రజలకు తూత ఓటుహక్కు ఉన్నది.

సర్వమానవ సమత్వము, సర్వమానవ సౌభ్రాతృత్వము ప్రతి మానవు వకుసు తన ప్రాథమిక హక్కుల పరిరక్షించుకొను స్వేచ్ఛయు ప్రజల సొమ్మని చాటుట ప్రచారకుల ప్రచార సూత్రములు.

పరోక్షపాలనముగ ప్రజలలో అధిక పంఖ్యాకులచేత ఎన్నుకొనబడిన ప్రతినిధులచేత నడుపబడు ప్రభుత్వమునకు ప్రజా ప్రభుత్వమని పేరు. (డెమొక్రసీ)

ఏనాడైనను ఏ పరిపాలన యు డైనను మూడు ఆంకములుండును. ఒకటి పరిపాలకుడు రెండు పరిపాలింపబడువారు. మూడు పరిపాలనా విధానము.

పరిపాలనా విధానమన చట్టనిర్మాణము, పరిపాలకుడన్న ఆ చట్టమున్ను అమలుపరచువాడు. పరిపాలింపబడు వారన ఆ చట్టములకు బద్ధులై నడచువారు.

ఒకనాటి పరిపాలనము నిరంకుశపరిపాలన మనియు నాడు ప్రజలు అస్వతంత్రులనియు నేటి ప్రజాస్వామ్యవాదము చెప్పు ముఖ్య విషయము——

అనగా ప్రజలకు స్వాతంత్ర్యము నిచ్చి, వారి అభిమతములను తీర్చుటకు వారి అనుకూల విధానమున పరిపాలించుటయే ప్రజాస్వామ్యములోని అమృత పూర్ణ ప్రధానమని నేటి ప్రజాస్వామ్యవాదుల నినాదము.

ఈ మీటమున నా ప్రశ్నలివి.

ప్రజాస్వామ్యమున ప్రజలకు స్వాతంత్ర్యము నిచ్చినదేభాగమునందు? అసలా ప్రజాస్వామ్యపదమునకు అర్థము కుదురునా?

మన ప్రజాస్వామ్యమున ప్రజలకు గల స్వాతంత్ర్యము పాలకుని ఎన్నుకొనుట యందు మాత్రమే కలదుగాని పరిపాలనా విధాన నిర్మాణమునందు లేదు, కాక తమచే ఎన్నుకొనబడిన పరిపాలకులు గావించు శాసనములను ధిక్కరించుట నేరము కూడ. ఇది ఇట్లుండ——

ప్రజాస్వామ్యమున నేను చెప్పునది గాని నీవు చెప్పునదికాదను వాగ్వివాదములలో ఆ విజ్ఞయము ముక్కలు ముక్కలై ఆ ప్రజాస్వామ్యము రూపు మాపబడి దిద్దుకొనలేని స్థితికి దిగజారి దేశదౌర్భాగ్యమునకు మాత్రమే కారకు

మైనదనుట నిర్వివాదము. నేనిప్పుడు చెప్పినమాట బుద్ధిమంతు లొప్పుకొననిదికాదు. ఒప్పుకొనక తప్పని మాట కూడ.

ఒప్పుకొననిచో పాలకులు అర్హతలనిర్ణించు గీటురాయి ఏదియట? భిన్నభిన్నములగు పార్టీల విధానములను తూచుకొను ప్రాసు ఏమున్నది? పార్టీలకును మితములేదు. ప్రతివాని పైత్యమును ఒక పార్టీయైనది.

ప్రజాబాహుళ్యము ఒప్పుకొమట అధికార నిర్ణయమగునా? బంగారమిదియని నిర్ణయించునది ప్రజావాణియేనా?

ఒక దేశద్రోహి నేతేచ్చిన లోహమును బంగారమని మీరందరన్నచో మీకు చాలినంత ద్రవ్యము నిత్తునను. ఆ ద్రవ్యలోభులు చాలమంది తాత్కాలిక లాభము నపేక్షించి అతని మాటకే ఓటు విచ్చినచో అది బంగారమనుట విజ్ఞానమగునా? ప్రజాస్వామ్యమున ఎక్కువమంది ఒప్పినదేగదా? బంగారమగుట? ఇంతకంటె తెలివి తక్కువ తన మేమున్నది? పరిశీలింపుడు —

అసలు ప్రజాస్వామ్య పదము దోషభూయిష్ఠము. రక్షకుడును రక్షింపబడువాడును ఒక్కడెట్లగును?

రక్షణయనునది క్రియాపదము. ఇది ఆత్మనేపది ధాతువు ధాతువు. చేతబోధితమగు ఫలము ఇతరులకు చెందుచో అది పరస్మైపది ధాతువు. ధాతువుచే బోధితమగు ఫలము కర్తకు చెందుచో ఆది ఆత్మనేపది ధాతువగును. ఆత్మనేపదియగు రక్షణ ధాతువుయొక్క ఫలము రక్షింపబడువానికి చెందవలెనుగాని రక్షకునకెట్లు చెందును? రక్షణ క్రియకు కర్తయు, కర్మయు ఒక్కటి కాజాలదు. కావున శాసన క్రియాఫలము ననుభవించువాడు వేరెశాసనకర్త వేరెయుండవలెనుగాని శాసనకర్తయు, శాసన క్రియాఫల భోక్తయు ఒక్కడు కారాదు. ఇది ప్రజాస్వామ్య పదములోని దోషము.

ఇక నాటి రాజ్యాంగ విధానమును పరిశీలింతము.

భారతీయ రాజ్యాంగమున పరిపాలకుడగు రాజును పరిపాలింపబడు ప్రజలును అస్వతంత్రులే. స్వతంత్రులుకారు. పరిపాలన అనుపదమున్నను పరిపాలకునకంటె ముందే యున్న విధానమును పాలింపుట అది అర్థముగావి ఎన్నో

కొనబడిన ప్రతి ఒక్కరును ఇష్టము వచ్చినట్టు పాలనా విధానమును సృష్టించుట పాలన అనుపదమునకు అర్థము కాదు.

పాలనా విధానమునకు సృష్టికర్త వేరై పాలకుడు వేరైయుండి సమాజమునకు వచ్చు కల్లోలములకు తావివ్వక కల్లోలములు కలిగినప్పుడు ధర్మాను సరణమగు రాజనీతిని అనుసరించుటయే నాటి పరిపాలనలోని సౌజన్యము. బ్రహ్మ సృష్టికర్త కాగా విష్ణువు పాలకుడయ్యెను. నేను చేయునది ధర్మమేనని గాని కాదని గాని ధర్మాధర్మనిర్ణేతలు ప్రజలేయగుచో న్యాయస్థానము లెందుకు ? నాటి పాలనా విధానమున ధర్మాధర్మముల నిర్ణయించునవి వేదశాస్త్ర ములు.

సూర్యుడు దయించునది తూర్పుదిక్కు అస్తమించునది పడమర అను నిర్ణయము ఎవరికి వారే చేసుకొనుట నాటివిధానమునలేదు. "వేదోఖిలోధర్మ మూలం" అనునది సిద్ధాంతము. పుణ్యపాపముల నిర్ణయములు వేదమూలకములు. ధర్మోవిశ్వస్య జగతః ప్రతిష్ఠా" అను వాక్యమాధారముగా నాటిపాల నావ్యవస్థ నడచినది.నాటి వ్యవస్థావిధానమిది.

లక్షాధికారి మొదలు భిక్షాధికారి వరకును గల అన్ని వృత్తుల యందును లోక శాస్త్రనిందితములగు జారత్వ, చోరత్వ, మద్యపాన ద్యూతాది వృత్తులతో జీవించు వారినివదలి పాలకుడు ప్రతివారికిని యోగక్షేమముల కల్పించవలెను.

తమ బ్రతుకుతెరువు వరకే జీవన విధానమును నడుపుకొనువారికి పన్నులు లేవు. నిల్వచేయదగిన ఆదాయము లేనివారికి రక్షణను మాత్రమే కల్పించ వలెనుగాని పన్నుల భారము వారిపైమోపరాదు.

అధికాదాయము కలవారికి ఆరవవంతు పన్నును వేయవలెను. ఇట్టివెన్నియో నిర్ణయములున్నవి. అట్టి నిర్ణయములతో నాటి వ్యవస్థ సాగినది. మరొక్క విశేష మును చెప్పివిరమింతును. నేను చెప్పబోవునది చాలా ముఖ్యమగు మాట. నాడు గ్రామాధికారి మొదలు అఖండ భారతమును పరిపాలించు ప్రభువు వరకును వారు అధ్యయనము గావింపదగు పాఠ్యగ్రంధము లుండెడివి. అవి ప్రతిసంవత్స రమును మారునవికావు. తర్కవ్యాకరణ మీమాంసా శాస్త్రాను బంధములుగ నుండెడివి. ఆగ్రంధముల పఠించియే ప్రజాప్రతినిధులుగ నిలువవలెను. నేటి తాలూకా, జిల్లా రాష్ట్ర విభాగముల వలెనే మండల ఉపమండల రాష్ట్ర, దేశనామ ములతో వ్యవహరింపబడెడివి. ఈ మండలాదులకు పాలకుల నిర్ణయము ఆదేశ

ప్రధానియే నిర్ణయించెడివాడు. పరిపాలనాధికారమును గుర్తించదగు ప్రజలకును ఆనిర్ణయమున అధికారముండెడిది కాని నాటి పరిపాలనా వ్యవస్థ ఏ క్షణమున కాక్షణముననే మారుచుండెడిది.కాదు. ప్రజాప్రతినిధులకు వేతనము లుండెడివికావు. గౌవరవేతనములుండెడివి. గ్రామ రాష్ట్రాది పాలకులు ఆయిదు సంవత్సరముల పరిమితి కలిగి, క్రొత్తవారికి ఎన్నికలుడెండివి. క్రొత్తవారి దొరకనిచో పాత వారు అంగీకరించినచో పూర్వులైన ఎన్నుకొన వచ్చును. ఒక విధముగ చెప్ప వలసి వచ్చుచో నిస్వార్థ దేశభక్తులకే ఆయా పరిపాలనాధికారము లబించెడిది. పదవీ వ్యామోహితులకు స్థానముండెడిదికాదు. ఉపమంత్రి మంత్రి నిర్ణయములలో ఎవ్వడు ఏశాఖకు సంబంధించిన శాస్త్రమునందు పారంగతుడో వానికే ఆమంత్రి పదవి యుండెడిది. ఇట్లు చెప్పవలసి వచ్చుచో మరొక గ్రంథ మగును. ముఖ్యముగ చెప్పతగినమాట ఎన్నికల ఖర్చులు, ఎన్నికల సంరంభములు కొట్లాటలు, రక్షణ శాఖతో ఎన్నికలు జరుపుట నాడులేవు. నేటి ప్రజాస్వామ్యము బూరుగచెట్టు పూవు వంటిది.

చిలుక బూరుగచెట్టు పువ్వునుచూచినది. అది పెద్దగ కనుపించగా దీని వండును ఇట్లే యుండుననుకొన్నది. చివరకాపువ్వు పండైచిలుక కంటుబడినది. దానిని చిలుక ముక్కుతో పొడిచినది. ఆపండునందున్నది దూదిగాని రసముకాదు. కండయు లేదు. ఆదూదియు ఆచిలుకకు దక్కలేదు. ఆదూది గాలికెగిరిపోయినది. ఇదియే నేటి ప్రజా స్వామ్యఫలితము. కథకు వృత్తము.

దశరథుని వార్ధక్యము వరించినది. యౌవనమాతని నిర్దాక్షిణ్యముగ వదలినది. అతడిక తన రాజ్యభారమును దింపుకొనదలచినాడు. చచ్చువరకును నేనే రాజునైయుండవలెనను దురాశ అతనిని సమీపించలేదు. కావున తాను దించు కొన దలచిన రాజ్యభారమును యోయగలవాడు రాముడని అతడు నిశ్చయించు కొనినాడు. అప్పటికి దశరథునకు అరువదివేల వత్సరములు.

కాని ఆ భావమును కార్యరూపము నొందిచవలెనన్నవాడును నేడును రాజు (లేక) తత్కాల ప్రభుత్వము స్వాతంత్ర్యము కలిగిలేదు. ప్రజావాణికి రాజు నాడును బద్దుడే. ప్రజల యనుమతి లేక రాజపీఠమున మరియొక రాజును స్థాపింపదగు అర్హత రాజునకు లేదు. ఈ చట్టము సనాతన సిద్ధాంతము లోనిదే. పుత్రుడెట్టివాడైనను తండ్రి రాజ్యమును ఆతనాజ్యేష్ఠ పుత్రునకే సంక్రమించ

వలెవిను నియమము నాడులేదు. పుత్రుడు గుణ జ్యేష్ఠుడైననే పరిపాలనా దక్షత్వము కలిగి యున్ననే ఆతనిని తండ్రి యువరాజును గావింపవలెను. గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రుని రాజుని చేయలేదు నాటి భారత రాజ్యాంగము. ప్రస్తుత కథాంశమున దశరథుని దృక్పథమున రాముడు నిలిచినాడు. ఇక ప్రజావాణి ఆతనిని వరించి ఎన్నుకొనవలెను. అకదుకు ముందుగ మంత్రులతో మంతనములు గావించినాడు. మంత్రులగు వారి నిశ్చయమును ప్రజావాణి స్పష్టము గావించవలెను. ప్రజావాణి యన—ఆ నగరవాసుల వాణి యొక్కటే కాదు. నానాదేశాగత రాజ బృందమును, పౌర జానపదులును పరిషద్గణమై పరిషన్మధ్యమున నిలిచి ఏకగ్రీవ మున తన అభిప్రాయమును బలపరచవలెను. దశరథుడట్లే పరిషత్తునేర్పాటు గావించినాడు. ఆతని సంల్పహాయములు పరుగులెత్తగా ఆతడు కాల విలంబనను గావించలేదు. దశరథుని హృదయ పీమయందేదియో ఒక మహాభయముండి యుండ వచ్చును. రాష్ట్రపతుల రాకలకై ప్రతి రాష్ట్రమునకును దశరథుని సందేశ మందినది. గ్రామ పీమలిందు విడువబడలేదు. ఆటవిక రాజులకును, మ్లేచ్ఛరాజ్య ములకును గుండ సందేశము లందినవి. కాలవ్యవధి లేక పోవుటచే కేకయ రాజు నకుకు, జనక చక్రవర్తికిని మాత్రము కబురందలేదు. "పశ్చాత్తా ద్రోష్యతః ప్రియం" తరువాత నైన వాప సంతోషింతురని తలచినాడు దశరథేశ్వరుడు.

అతి శీఘ్రముగ పరిషత్తు ఏర్పాటైనది. ఆ మహా పరిషత్తునకు రాని వారు లేరు. ఎందరో పండిత ప్రకాండులు విచేసినారు. కవులును లేక పోలేదు. మునివర్యులు తమకు తగిన పీఠముల నలంకరించినారు. వివిధ రాష్ట్ర ప్రతినిధులును సామంత ప్రభువులను, జానపదులును గూడ ఆ మహా పరిషత్తు నలకరించినారు. ఇక నా పరిషన్మధ్యమున వృద్ధభూపతియగు దశరథ రాజేంద్రుడు తన రాజ పీఠము నలంకరింప వలెను. అతడును రాజపీఠమున ఆసీనుయ్యెను.

అదియొక భవన రాజము. ప్రజాహృత్కుహరంతయు నిశ్శబ్దమై నిస్తరంగ సముద్రమువలె ప్రశాంతముగ నున్నది దశరథేశ్వరుడేమి మాట్లాడునోయని. ఆ రాజు కంఠనినాదము మేఘగంభీర ధ్వానమై సభాసదుల ముగ్ధుల గావించుచు వారిని సంబోధించిన ఆతని ఆహ్వానము సభాస్థలి కంతకు నందించినది.

పౌరులారా!

మా పూర్వులందరును మిమ్మా కన్నబిడ్డలవలె దీర్ఘ కాలముగ పరిపాలిం చిరి. పవిత్రమగు ఇక్ష్వాకు వంశమున పుట్టిన నేనును పరమ పావనులగు

మా ఇక్ష్వాకు వంశజుల మర్యాద ననుసరించి వారి కీర్తి ప్రతిష్ఠలకు భంగము కాకుండ ఇంత వరకును రాజ్య పరిపాలనను చేయగలిగితిని. ఇప్పటికి నాకు ఆరువది వేల వత్సరములు నిండినవి. నాకిక రాజ్యము భారమైనది. ఏమరుపాటును నన్ను వరించినది. ధైర్య స్థైర్యములతో జితేంద్రియుడనై ధర్మ స్వభావము నుండి వెనుకకుమరలకయే దీర్ఘకాలముగమోసిన ఈరాజ్యభార్యమును దించుకొనక నాయంతరంగమ్ము సుఖించుట లేదు. ఇది నాకు విశ్రాంతి కాలము, మీ యనుజ్ఞను బడయక నేనీ రాజ్యభారమును దించుకొన సమర్థుడను కాను. రాజ్యము గతియే మందురా? జ్యేష్ఠుడై నా గర్భమున బుట్టిన రాముడు సకల గుణాభిరాముడు. నర్వజన ప్రియదర్శనుడు. రాజకార్యములందు మేటి. ధర్మార్థవేది. సమాచార ముల నెరిగిన ప్రౌఢ, కాలమునకు వెనుకు కాడు. లోకోత్తర గుణ విరాజితుడు. ఆ రఘువీరుని ఆగ్రహానుగ్రహములు వ్యర్థములు కావు. కులోచితమగు క్షాత్ర ధర్మ ప్రకారము వర్తించుటచే కలుగు కీర్తియే మోక్షమిచ్చునని ఆ ధర్మాత్ముని సిద్ధాంతము. వేదవేదాంగముల సారము నెరిగిన రసజ్ఞుడు; యుద్ధము నందజేయుడు. బుద్ధి కౌశలమున బృహస్పతియే. అట్టి రాముడు ఇచ్చట గల స్థభాసదులెల్ల నిండు మన్ననలతో నంగీకరించెదరేని, షోడశ కళా పరిపూర్ణుడై పుష్యమి నక్షత్రముతో కూడిన కుముద బాంధవుని భంగి యువరాజ్య పట్టాభిషేక సింహాసనా సీనుడై ప్రజాహితుడై రాజ్యపాలన చేయగలడు. రాముడు పాలింపదగినది ఈ అల్ప రాజ్యమేనని మీరు భావింపకుడు. త్రిలోక సామ్రాజ్యలక్ష్మి నెవ్వని వరించి నాథునిగా గొని నాధపంతురాలు భాగలదో అట్టిరాముని మీకు వప్పగించి నేనీ సింహాసనము నుండి దిగ దలచినానని తన గంభీర వాక్య పరణిని ముగించి మౌన ముద్రను వహించినాడా వృద్ధ భూపతి.

రాముడు ముల్లోకముల పరిపాలింప సమర్థుడని పలికిన దశరథుని పలు కును వినుడు—

అనురూపస్సవై నాథో లక్ష్మీవాన్ లక్ష్మణాగ్రజః
త్రైలోక్యమపి నాథేన యేన స్యాన్నాథవత్తరం.

ఇది వాల్మీకి వాణి, శ్రోతలారా! ఇందు కవి తన కావ్య నాయకుని ఎవ్వడని ప్రకటించెను? ఇంద్ర యమ వరుణ కుబేరాది దిక్పాలురకెల్ల పాలకు డని స్పష్టపరచెను. దశరథుడంతతో ఆగలేదు. ప్రజలకు రాముని గుణముల నిని

పించి రాముడు సమర్థుడని తెలిపియు మీరు నిశ్చయింపుడని వారిపై నెందుకు పెట్టెను? అదియే మన మిక్కడ గ్రహింపదగు విషయము.

అనురాగము దోషమును చూడనివ్వదు. ద్వేషము గుణమును గ్రహించ నివ్వదు. కావున రాగద్వేష రహితుని నిర్ణయము తగిన నిర్ణయము. అందుచేతనే దశరథుడు ప్రజలపై పెట్టి మీరు నిర్ణయింపుడని వారికి స్వేచ్ఛ నిచ్చినాడు.

యద్యప్యేషా మమ ప్రీతిర్హితమన్యద్విచింత్యతాం
అన్యా మధ్యస్థ చింతా హి విమర్దాభ్యధి కోదయా

వెనుక ముందుల బాగుగ విచారించుట చాల అపసరమని—స్పష్టపరచి నాడు. అనగ తనను రాజుగ భావించుటగాక నన్ను కార్య నిర్వాహకునిగ భావించి, మీరును మధ్యస్థులై విచారించి నిర్ణయింపుడనినాడు. ఇదియే రాజున కుండదగు ఆత్యుదారమగు భావము.

ఇక ప్రజల దగ్గరకు పోదము. వారి అభిప్రాయమును విందము—

వాల్మీకి మహర్షి ప్రజల హృదయ సీమల ప్రవేశించినారు. రాముని యువరాజును చేతునన్న వార్తను విని ఉప్పొంగి పోయినవారి సంతుష్ట స్వాంతముల తిలకించినారు. వర్షాకాల మేఘమును దర్శించిన మయూరముల వలె నాట్యములు నలుపుచున్నవి వారి మనస్సులు. యువరాజై భద్రగజము నధి రోహించి, శ్వేతచ్ఛత్రము—రాముని ముఖమండల శోభకు అలంకారమును గూర్చిగా అట్టి రాముని ఊరిగింపతో ఎప్పుడు చూతుమాయని ఉవ్విళ్ళూరుచున్న -ఆరసజ్ఞ శేఖరుల రసభావ తరంగముల గమనించినారు. ప్రజలు రాముని కేవల మూఢముగ భావించిరా? అని కూడ మహర్షి ప్రజల మనస్సులను పరిశీలించినారు. రామునియందున్న ప్రత్యేకత నెరిగియే వారానం దించుచుండిరని మునివర్యులు నిశ్చయించుకొనినారు. తరువాత ప్రజలందించిన సమాధానము నిట్లు చెప్పినారు.

ఇచ్ఛామోహి మహాబాహుం రఘువీరం మహాబలం
గజేన మహతాయాంతం రామం ఛత్రావృతాననం॥

మహారాజా! రామునే యువరాజుగ చేయుటను మేము కోరుచుంటిమని నారు. మీరు చెప్పగా మేము ఒప్పుకొనుట కాదు. ఎప్పటి నుంచియో మా కోరిక

ఇట్లున్నదని వారి ఉత్సాహమును సూచించినారు. రాముడు మీ క్షణకంళము నందగ్ర గణ్యుడనినారు. రాముని బలపరాక్రమములు కొలతలేని వనినారు. అట్టి రాముని భద్రగజముపై నెక్కించి రాజవీధుల రాముని త్రిప్పుచు అంతర్గృహముల వసించు స్త్రీలకు సైతమును రామునెప్పుడు దర్శింప చేతురా? యని ఉపక్రమించు చుంటిమనినారు. రాముని ప్రత్యేకతను ప్రజలు నిర్ణయించి రాముని పరిపాలకుని గావింపుమని కోరుటకు ముందు రామునకీ విషయము తెలియదు. రాముడు తనను పరిపాలకునిగ ఎన్నుకొనమని ప్రజలలో ప్రచారమును చేసుకొనలేదు. నాటిది పెట్టుబడితో కూడిన ప్రజాస్వామ్యము కాదు.

తన పుత్రుని పట్టాభిషిక్తుని గావించుటకు ప్రజలందించిన సంతోష వార్తకారాజు తృప్తి నొందెనా? అతడు వారి ఒప్పుదలకు సంతృప్తి నొందలేదు. ప్రజలు మనసారా చెప్పిరా? నామమాత్రముగ ప్రకటించిరా? అనునది తేలవలెను. స్థూణానిఖన న్యాయమని ఒక న్యాయమున్నది. నేలపై గుంజను పాతి దానిని బాగుగ అటునిటు కదిలించి, అది కదలగా వచ్చిన ఖాళీ ప్రదేశమున రాళ్ళను కూరి ఆస్తంభమును గట్టిపరచవలెను. ఆ క్రియకు స్థూణానిఖన న్యాయమనిపేరు. ఆ న్యాయము ననుసరించి దశరథుడు ప్రజలను మరలనిట్లు ప్రశ్నించినాడు వారి ఒప్పుదలను ధృవపరచుటకై. సభాసదులారా! నేను ధర్మాత్ముడనై మిమ్ములను పాలింపుచుండ రామునేల కోరిరి? అని సూటిగ ప్రశ్నించినాడు ప్రజలను. వారిప్పుడు వృద్ధ రాజున కిచ్చిన సమాధానమే రామునకును ప్రజలకును గల సంబంధము.

ప్రజలిచ్చిన సమాధానమిది —

దశరథేశ్వరా! మేము రాముని కోరుకొనుట మీ పరిపాలన యందలి లోపమునుబట్టికాదు. రాముని గుణ సంపదయే మా అంతరాత్మల ప్రేరేపించి పలికించినది. అని నాటికి వారు రాముని గుణ సంపద నెట్లనుభవించుచుండిరో చెప్పినారు. సత్పురుషుడన రాముడొక్కడేనని నాటి ప్రజలకు నిర్ణయమైనది. సత్య ధర్మములు వేరై గుణములను పేరుతో రాముని 'ఆధారముగాగొని యుండక సత్య ధర్మములే రామ రూపమున తమ్ము పాలించు చుండెనని వారు తలచినారు. ఆ విషయమును వారు స్పష్టపరచినారు.

రామ స్సత్పురుషో లోకే సత్య ధర్మ పరాయణః
సాక్షాద్రామా ద్వినిర్వృత్తః ధర్మశ్చాపి శ్రియాసహ॥

ఈ విషయమిట్లుండ రాముని పరిపాలనా దక్షత్వములోని ప్రత్యేక తనే ప్రజలెన్నియో విధముల వర్ణించినారు. అందు రెండు ముఖ్య విషయములను చెప్పెదను. ఒకటి గ్రామ సీమల యందుగాని, నగర రాజముల యందుగాని కల హాములు చెలరేగుచో ఆయా ప్రదేశములకు పోదగు రథ గజ తురగాది వాహనముల నెక్కి సౌమిత్రితో కూడ ఆ ప్రదేశముల కేగి అక్కడ చెలరేగిన విరోధి వర్గముల నణచి, అందలి ప్రజలకు శాంతి భద్రతల చేకూర్చి వెనుకకు రాడట ఇది యొక ముఖ్యమగు విషయము. వెనుకకు మరలి వచ్చిన వెంటనే తన రాజధాని యందాతడు చూపుల నిగిడ్చి ప్రజల యోగక్షేమముల నరయునట. ప్రజల యోగక్షేమముల నరయుట ఏదియో ఒకరోజున కాదట. ప్రతి నిత్యమును ప్రజల యోగక్షేమముల నాతడు కనుగొనునట.

"పౌరాన్ స్వజనవన్నిత్యం కుశలం పరిపృచ్ఛతి"

అని నారు వాల్మీకి. తన కుటుంబసంక్షేమములను కనుగొన్నట్లు ప్రజల నందరను నిత్యమును పరామర్శించుట ఎట్లు? పరిపాలకుడు ప్రజల యోగక్షేమముల నెట్లు కనుగొనవలెనో వాల్మీకి రామాయణము చక్కగ బోధించినది.

దేశక్షేమము అయిదు భాగముల రక్షణపై ఆధారపడి యుండునని భారతీయ రాజ్యాంగము నిర్ణయించినది. ఆ అయిదు భాగము లేవియందురా? ఆ అయిదు భాగములను రెండు భాగములుగ విభజించుచో సేవకుడు, సేవ్యుడు నను వారిద్దరుందురు. అనగా సేవింపబడువాడును సేవించువాడును. వారిద్దరి మధ్యనుండు సేవ్యసేవక భావము చెడకుండ రక్షించుటయే-- ప్రజా సంరక్షణము. సేవకుడు పుత్రుడు సేవ్యుడు తండ్రి. ఆ తండ్రి కొడుకుల మధ్యనుండునది సేవ్యసేవక భావము. అట్లే భార్యాభర్తలును, సేవకుడు యజమానియు, గురువు శిష్యుడును, అగ్నియు, తదారాధకుడును. ఈ ఐదు వ్యవస్థలును బాగుపడినచో (లేక) చెడక యుండినచో దేశము క్షేమముగ యుండును.

కర్మాగారముల సేవకుల సమ్మెలు కొనసాగగా భార్యాభర్తల మైత్రి భగ్నముగాగ, గురు శిష్యుల గ్రుద్దులాటలు పెచ్చు—పెరగగా, తండ్రి కొడుకుల పరస్పర పూజ్య వాత్సల్యములు అడుగంటగా, అగ్నిహోత్రాది కర్మలకు స్థానము లేకపోగా దేశ సౌభాగ్యమెక్కడిది? కావున రాముడు దేశాంతరముల నుండి వచ్చిన వెంటనే మీ పుత్రులు మాతృ పితృ పుత్రోషల నెరవేర్చుచుండిరా? యని తండ్రు

లను, శిష్యులు వశవర్తులై యుండిరా? అని గురువులను అగ్నిహోత్ర సపర్యలు గావించుచుండిరా? అని ఆహితాగ్నులను ప్రశ్నించి తెలుసుకొనుచుండుటే నిత్య కుశలముల తెలసి కొనుట. ఇది ప్రజలు రామునిపై తమకుగల ప్రేమకు కారణముల చెప్పిన సంగ్రహ కథనము. తరువాతి కథ—

దశరథుని మనసుప్పొంగినది. తన పుత్రుని సద్గుణ-రాశిని ప్రజల ముఖముగ వినుటకంటె సంతోషమొండు లేదు గదా?

పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడె పుట్టదు
జనులా పుత్రుని కనుగొని పొగడగ పుత్రోత్సాహంబు నాడు పొందును
సుమతీ ॥

వెంటనే దశరథుడు రామ పట్టాభిషేకమును నిశ్చయించి పశిష్టాదులను ఆప్రయత్నములకై పెచ్చరించినాడు. రాముని ప్రజలకెరుక పరచుటకై ఈ సభాస్థలికి తోడ్కొని రమ్మని సుమంత్రుని ఆజ్ఞాపించినాడు.

రాముడధిరోహించిన రాజరథము దశరథుని ఆజ్ఞానుసారముగ బయలు దేరినది. దశరథుడు తాను సౌధాంతర్భాగము నుండియే తన దగ్గఱ శేలెంచు రాముని రథమధ్యము నందుండగనే చూచినాడు. ఆతడాత్మారాముడు. ఒకవిధముగ దశరథరాముడు. దశరథుడు ఆ ఆత్మారాముని తన పుత్రుడు గనే దర్శించినాడు. మనమును ఆ దశరథాత్మజుని దర్శింతము. ఇప్పుడు దశరథుడు తూర్పొన్న సభాస్థలిని ఇంద్రసభయనినారు వాల్మీకి. ఆ సభకమూల్యాలంకారమై సింహాసనా సీనుడగు దశరథుని దేవేంద్రునిగ పోల్చి, ఆదేవేంద్రుని దగ్గరకు వచ్చు రాముని వర్ణించినారు మహర్షి. ముందు మీకు వాల్మీకి వాణిని వినిపింతును.

గంధర్వరాజప్రతిమం లోకే విఖ్యాత పౌరుషం
దీర్ఘబాహుం మహా సత్వం మత్త మాతంగ గామినం
చంద్ర కాంతాననం రామం అతీవ ప్రియదర్శనం
రూపౌదార్యగుణైః పుంసాం దృష్టిచిత్తాపహారిణం
మర్త్యః తప్తాః పర్జన్యం హ్లాదయంతమివ ప్రజాః
నతతర్ప సమాయాంతం పశ్యమానో నరాధిపః

ఆ రాముడు గంధర్వరాజువలె నుండెనట. ఆతడు ప్రపంచఖ్యాతి నొందిన వీరుడట. ఆతడతి బలశాలియగు ఆజాను బాహువట. ఆతని నడక మత్త మాతంగమును బోలియుండెనట. అతని ముఖమండలము చంద్రకాంతికి పోలి యుండెనట. అతడు చూపరుల కత్యంత ప్రియదర్శనుడట. ఆతని రూప సంపద పురుష పుంగవులకు కూడ మోహమును కల్పించి వారి చూపుల నపహరింపగా అతని గుణ సంపద వారి మనసుల పవహరించునట. రథాధిరూఢుడై వచ్చు అట్టి రాముని మండుటెండలకు ప్రగ్గిన ప్రజానీకముచే చూడబడు తొలకరి మబ్బును వలె జూచి దశరథుడు తృప్తినొంద లేదట. ఇది అ శ్లోకముల లోని వర్ణనము. ఈవర్ణనము. వాల్మీకి మహర్షి వారి మధురాను భూతి యనక తప్పదు. ఆయన అనుభూతియే మధుర వాణియై రథము నందున్న ఆ రామవిగ్రహ దివ్య కళాఖండమును మనముందుంచినది. కాని మనమిప్పుడా వర్ణనలోని పదగుంఫనల గమనింపనిచో ఆయనకు కలిగిన మధురాను భూతిలోని భాగమును మనము ఎందుకు పంచుకొన జాలమో. గమనింతము.

మునివర్యులు రామునిలోని దివ్యసౌందర్యమును దర్శించి గంధర్వ రాజువలె నుండెనని భావించినారు. అంతలో రామునిలోని వీరత్వము ఆతనికి గోచరించగా లోక ఖ్యాతి నొందిన వీరత్వము గదా! ఇది యని ఆనందరస నిమగ్నుడై ముని "లోకే విఖ్యాత పౌరుషం" అని వాక్రుచ్చినారు.

అంతలో రాముని బాహు సౌందర్యమాతనికెదురై నిలవగా ఆ దీర్ఘ బాహువులను గూడ మనకన్నులకు చూపి, ఆ బాహువులను మీరు సౌందర్య మాత్రములని భావింతురేమో? కాదు కాదు. ఆతడు మహాబలశాలియై ప్రజల రక్షించ దగిన బాహుదండముల కలిగియుండెనని మనకు తెలిపినారు. అంతలో ఆయనకు ఆ సుందరమూర్తి వయ్యారపు నడక న్మృతికిరాగా మదపుటేనుగగమ మనముందుంచి మత్తమాతంగగామినం అని వర్ణించినారు. అంతలో ఆ భావనా సౌందర్యగరిమ రాముని ముఖ మండలము వైపుకు తిరుగగా ఆముఖ మండలము చంద్ర మండలమునకు పోల్చదగినది కాదు. చంద్ర మండలము కంటె మనోహరమైనదని ఆ రాముని ముఖ కాంతిని దర్శించగా వచ్చిన ఆనందమును కొల్చుటకు కాలతపాత్ర లేదనునది సిద్ధాంత మగుటచే "అతీవప్రియదర్శనం" అని వర్ణించి చంద్రుని నుండి రామచంద్రుని విడదీసినారు. కారణమేమి?

చంద్రుడు పరిమితమగు ప్రీతిని మాత్రమే తన్ను చూచు వారల కందించగా రాముని ముఖకాంతి నిరతిశయప్రీతిని గొలుపును సుమా! అని

సత్యజ్ఞానానంద లక్షణ లక్షితుడగు ఆత్మారాముని చెప్పిన ఉపనిష
ద్వాక్యమును వ్యాఖ్యానించి, ఉపనిషత్ప్రతి పాద్యమీ రామ బ్రహ్మమని ధ్వనించి
నారు. తరువాత వాల్మీకి మహర్షి అనుభూతి ఏమి? ఆ సచ్చిదానంద బ్రహ్మము
సగుణ మూర్తియై కల్పించు ఒక దివ్యానుభవము ఆయనకు కలిగినది.
ఆ రాముడొక్కమారుగ హరియను నామమును ధరించి వాల్మీకికి దర్శన మిచ్చి
నారు. "హృజ్ హరణే" అనుధాతువు నుండి హరి శబ్దము వచ్చినది ఈతడేమి
హరించి హరియయ్యెను? అని విచారించి, తన అప్రాకృత సౌందర్యమువే
చూచువారి చూపుల హరించి తన ఔదార్యాది గుణములచే మనస్సును హరించు
నుగాన ఈతడు హరిశబ్దవాచ్యుడయ్యెనని ఆ విషయమును తెలిపినారు. "రూపౌ
దార్య గుణైః పుంసాం దృష్టిచిత్తాప హారిణం" అని. మరొక్కసంగతి—

పుంసాం అని పురుషుల నేల పేర్కొనెను? ఇక్కడ పురుష శబ్దముచే
చెప్పబడిన వారు జీవులు. జీవులన మానవ మాత్రులేయని అర్థముగాదు. స్థావర
జంగమములన్నియునని భావము. రాముడు జగదంతర్యామి. కాపుననే రాముడ
రణ్యమున కేగగా చెట్లుకూడ ఈ ముగ్ధమోహన మూర్తియా? ఈ అరణ్య
వాసము ననుభవించునది? అని తన్నీరు కార్చినవి అనినారు ఈ మహర్షి మరొక
చోట.

అంతేకాదు. పురుష శబ్దముచే మనుజులను ధ్వనించి రాబోవు కృష్ణావ
తారమునుకూడ ధ్వనింపచేసినారు. కృష్ణావతారము అరణ్యములోని మునిబృందము
యొక్కకోర్కెను తీర్చినది గదా? తరువాత మహర్షి మరొక ఉపమానమును
వాడినారు. ఏమది? రామునొక మేఘమునకు పోల్చినారు. ఆమేఘ మెట్టిది యన?
గ్రీష్మ ఋతువు నందు తపింప జీవుల నానందింపజేయు మేఘమనినారు. అట్టి
మేఘమువలె ఆనందమును కూర్చుచువచ్చు రాముని చూచి దశరథుడు తృప్తి
నొందలేదని వర్ణించినారు. ఆ శ్లోకము మొక్కమారు మరల జ్ఞాపకమును చేయు
చున్నాము.

ఘర్మాభి తప్తాः వర్జన్యం హ్లాదయంతమివ ప్రజాः
న తతర్ప సమాయాంతం పశ్యమానో నరాధిపः ॥

కనురెప్పల వాల్పక దశరథుడా పుత్రుని చూచుచుండెనట. దశరథుడే
కాదు. దశరథుని వంటి ఏ పుణ్య జీవుడు రాముని దర్శించి తృప్తి నొందును?

ఇక మునము జీవుల తాపత్రయ నివారకమగు రామమేఘమును వదలి కథా వృత్తము.

అది దశరథుడును సభాసదులును వసించియున్న సౌధరాజము. రాము డెక్కివచ్చిన రథమా సౌధరాజ ద్వారము కడనే నిలచినది. సుమంత్రుడు రాముని రథము నుండి క్రిందకు దింపినాడు. రాముడా సౌధోపరి భాగమున కేగవలెను.

రాముడు మేడమెట్ల నెక్కనారంభించినాడు. సుమంత్రుడు దోసిలియొగ్గి రాముని వెంట నుండినాడు.

అది దశరథేశ్వరుని రాజాసనము. రాముడు పితృపాదుల పాదమూల మున కేగినాడు. తన గోత్ర నామములతో తండ్రికి అభివాదన గావించి, తండ్రి గారి పార్శ్వభాగమున నిలచినాడు.

దశరథునకు వాత్సల్యరసముప్పొంగినది. పుత్రుని కౌగలించి నాడు. శిరమున మూర్కొనినాడు. రామునికై ఏర్పరచిన వేరొక మణిమయాసనముపై పుత్రుని కూర్చుండ నియోగించినాడు. అప్పుడా రాముడెట్లుండెనట? ఆప్పుడా రాముడెట్లుండెనో మహర్షి వర్ణింపక రాముడాయాసనము నెట్లు ప్రకాశింపజేసెనో వర్ణించినారు. ఉదయభాస్కరుడు తానధిరోహించిన పర్వతమును వెలిగించు నట్లు అతడా మాసనమును వెలిగించెనట. రాముతొక వెలుగుచే వెలుగొందువాడు కాడు. వెలుగులకు వెలుగునిచ్చువాడు రాముడనినారు.

తరువాతి కథ —

రాముని పుష్యమీ నక్షత్రమున యువరాజ్యమును స్వీకరింపుమని ఆజ్ఞా పించి అందుకు తగిన అర్హతలు నీకున్నవని పుత్రునకు తెలిపి, రాజ ధర్మములను కొన్నిటిని పుత్రునకు బోధించినారు. అంతతో ఆ సభాస్థలి ముగిసినది. ప్రజలు అత్యంత ప్రీతియుక్తులై రాజాజ్ఞను గైకొని తమ తమ గృహముల కేగినారు. పునమొక్కమారు రాముని మాతృమూర్తి కౌసల్యా మహాసాధ్వి మందిరమున కేగుదము.

అది కౌసల్యా మహాసాధ్వి మందిరము. నేడది యొక కళ్యాణ మంటపము. తన పుత్రుడు యువరాజగునని కౌసల్య ఇంతకు ముందు ఊహించలేదు. దశరథు నకు కైకేయి యందెక్కుడు ప్రీతియని ఆమె ఎరుగనిది కాదు. కావున రాముడే పట్ట భద్రుడు కాగలడన్న నిర్ణయమామెకు లేదు. కాని ఆమె కీనాడు తన పుత్రునే

రాజుయువరాజును చేయ నిశ్చయించెనను వార్త అందినది. ఆమె ఆనందము నెవ్వరు వర్ణించ గలరు? రాజు రామునే యువరాజునుగావింప యత్నింప వచ్చును. మానవుని యత్నము సంపూర్ణముగ సఫల మగునని నిర్ణయమెక్కడ గలదు? దైవికములగు ప్రతిబంధకములు దానిని అడ్డగించ వచ్చును. కావున భారతీయ శాస్త్రములు నీవు తలచిన లేక నీవుకోరుకొన్న అభ్యుదయ కర్మను అడ్డగించు విఘ్నబాహుళ్యమును దృష్టియందుంచుకొని నీవాచరింపబోపు పుణ్య కర్మ నిర్విఘ్నముగ కొనసాగుటకై కొన్ని శాంతి కర్మల నాచరింపుమని చెప్పినది. అదియే మనము ఏపనిని తలపెట్టినను ముందుగ ఆచరించు విఘ్నేశ్వర పూజ. అభాగము లోనివేదాన ధర్మములు కూడ.

కౌసల్య ఈనాడు తన పుత్రుని యువరాజ్య పట్టాభిషేకము నిర్విఘ్నముగ జరుగుట కొరకై అనేక దాన ధర్మముల కొనసాగించుచున్నది. ఇది రాముని యువరాజ్య పట్టాభిషేక మహోత్సవము నిర్విఘ్నముగ సాగుటకై దశరథాంతఃపురమున జరుగు ప్రయత్నము. ఒకమారు మనము రాముడు యువరాజు కాగలడని సభామధ్యమున దశరథ ముఖముగ విని వెళ్ళిన ప్రజల దగ్గరకు పోదము. వారేమి చేయుచుండిరి? ప్రజలు కూడ—ప్రత్యేకముగ తమ తమ గృహముల యందును, దేవాలయముల యందును రాముడు రాజగుటకు అర్చనల గావించుచుండిరి. ఎవరా ప్రజలు? స్త్రీలా? పురుషులా? వృద్ధులా? యువకులా? రాముడెవ్వరిని ముందిడుకొని నడచుచుండెను? రాముడానా డెవ్వరికి ప్రత్యేక స్థానము నిచ్చెను? అనునది ప్రశ్నకాకపోదు. నాడు ఎవరికివారిచే సంఘములు లేవు. రాముని ఎన్నిక ఏకగ్రీవ మగు ఎన్నిక. వాల్మీకి వాణి ఇది—

"స్త్రియో వృద్ధాస్తరుణ్యశ్చ సాయం ప్రాతస్సమాహితాః"

స్త్రీలును, పురుషులును, వృద్ధులును, యువకులును గూడ రాముడు రాజు కావలెనని సాయంకాల, ప్రాతఃకాలముల యందు ఏకాగ్రచిత్తులై దైవ ప్రార్థనల గావించు చుండిరట. ఒకవంక కౌసల్య తన పుత్రుని అభ్యుదయమునకై కొనసాగుచున్నకాలమది. నాటి ప్రజాస్వామ్యము ఆధ్యాత్మిక కొన్నత్యముతో ఐక్యత నొందిన ప్రజాస్వామ్యము.

మన మొకమారు దశరథుని వద్దకు వత్తము—

దశరథుడు తన అభీష్టమును ప్రజలకు తెలిపి, ప్రజల అనుమతిని తీసి కొనినాడు. ప్రజావాణి తనకు వ్యతిరేకమైలేదు. అది చాలదు. మంత్రి మండలిని

కూడ ప్రత్యేకముగ సమావేశము గావించి వారికి తెలుపనవసరము లేక పోలేదు. కావున దశరథుడు ప్రత్యేకముగ మంత్రి మండలిని సమావేశ పరచినాడు. వారికి తన నిశ్చయమును తెలిపినాడు. రేపే రాముని యువరాజ్య పట్టాభిషేకమని. వారి అనుమతి సోత్సాహమై కన్పట్టినది. అంతటితో మంత్రులతోటి సమాలోచనము ముగిసినది. కాని దశరథుని కర్తవ్యము ముగియలేదు. అతడు రామునకు కొన్ని రహస్యములను ప్రత్యేకముగ తెలుపదలచినాడు. కావున ఆతడు తన రహస్య గృహమునకేగి మరియొక సమావేశమును జరుపదలచినాడు రామునితో—రాముని పట్టాభిషేకము నందిది మూడవ సమావేశము

అది రాముని అంతర్గృహము. ఆతడప్పుడే పితృపాదుల సన్నిధి నుండి వచ్చి కూర్చొనినాడు. ఆతడప్పుడు ఏమి ఆలోచనలు సలుపుచుండెనో ఎవ్వ డెరుగును? ఆతని అంతఃపురదార్వము కడసుమంత్రుని రథము నిలచినది. తండ్రిగారు తననెందుకో ఆహ్వానించెనని సుమంత్రుడు తనకాహ్వానము నందించినాడు.

ఒక్కొక్కప్పుడు రాబోవు ఘట్టములు కొన్ని విశుద్ధాంతఃకరణులగు వారి మనసున శంకారూపములై గోచరింప వచ్చును.

సుమంత్రుని వార్త రామునకు శంకా కారణమైనది. రాముని హృదయము కొంచెము శంకించినది. నిర్ణయ కార్యమున కంతరాయమేమైన కలిగినదా? అని, కాని రాముడాలసింపలేదు. వెంటనే సుమంత్రునితో బయలు దేరినాడు.

అది దశరథుని రహస్య సమాలోచనా మందిరము. అందుండ దగిన వాడు రాముడొక్కడే. రాముడొక్క క్షణమాత్రమునసే దశరథుని ఎదుట నిలిచి ఆతని పాదములకు ప్రణమిల్లుట జరిగినది. అప్పుడు దశరథునిది పెల్లుబికిన పుత్ర వాత్సల్యము. మితి మీరిన ప్రేమ శోడనే ఆ పుత్రుని కౌగలించుకొని ఆసనమిడి కూర్చుండ నియోగించినాడు.

ఆతడిప్పుడు రామునకెమి తెలుపవలెను. దశరథుడు పట్టాభిషేకమును నిశ్చయించి ప్రజలకు తెలిపినరోజు పునర్వసు నక్షత్రము. పట్టము కట్ట దలచిన రోజు పుష్యమి. భరత శత్రుఘ్నులింట లేరు. ఇంటలేరు కాదు దేశమున లేరు. ఇంత అసందర్భముగ పట్టాభిషేక మెందుకు నిర్ణయింప బడింది? ఇది రామునకు తెలుపదగు ముఖ్య విషయము. దైవికములగు కారణములతి చిత్రములు రాజధర్మములతి సూక్ష్మములు. దశరథుడు తన మృత్యుకాలమును దైవజ్ఞుల వలన తెలిసి కొనినాడు. తన నక్షత్రము పాపగ్రహములగు సూర్యాంగారక రాహువులచే

ఆ క్రాంతమైనది. తనకు వచ్చు స్వప్నములను తన మరణమును నిశ్చయించు చున్నవి. ఈ సమయమున రాజొక పెద్ద ఆపదకు గురియగుట కాని, మరణము నొందుటగాని జరుగుట నిశ్చయము. ఇది తప్పునది కాదు. దీనికిక శాంతులులేవు. తానింత వరకు నెరవేర్చదగిన కర్తవ్యములలో మిగిలిన కర్తవ్యమిదియే. దేవ పితృ ఋణములు తీరినవి. ఋషి ఋణమును తీరినది. కావున రాముని పట్టాభిషేకమునకు విఘాతము రాకుండ తాను యత్నించదగు ప్రయత్నము నాలోచించి ఇంత శీఘ్రముగ పట్టాభిషేకమును నిర్ణయించినాడు. ఈ విషయమునే ముఖ్యముగ రామునకు తెలిపినాడు. కాని దశరథుడు భరతుడు దేశాంతరమునందున్న సమయము వందీ కార్యమును తలపెట్టినాడు. ఇట్లేల చేయవలసి వచ్చినది? ఆవిధముగా చేయవలసి వచ్చుట చేతనే అట్లు చేసినాడు. ఆ విషయమును రామునకు స్పష్టముగ చెప్పినాడు. దశరథుడు దాచలేదు.

విప్రోషితశ్చ భరతో యావదేవ పురాదితః
తావదేవాభిషించస్వ చలా హి ప్రాణినాం మతిః

దశరథుడు కైకను పెండ్లి యాడు నప్పుడు ఆమెయందు కలిగిన సంతానమునకే రాజ్యమిత్తునని రాజ్యశుల్కమున పెండ్లియాడినాడు. అప్పటికిసంతానము లేదు కౌసల్యయందు. కావున అట్లు చేసినాడు. ఇప్పుడది తారుమారైనది. రాముడు జ్యేష్ఠుడు. ప్రజాహితుడు. ప్రజలు కోరుకొన్నరాజు. ఆతనిని వదలి భరతునకు రాజ్యమిచ్చుట ధర్మము కాదు. మరి అన్నమాటను తప్పుట ధర్మమా?

విశేషధర్మము సామాన్యధర్మమును త్రోసిపై చును. రాముని రాజును గావించుట విశేషధర్మము. కావున ఈ ధర్మమును నెరవేర్చ దశరథుడు యత్నించి వాడు.ఒకవేళ భరతుడు అడ్డుపెట్టుట గాని ఆతని తాత కేకయరాజు అడ్డుతగులుట గాని జరుగ వచ్చును. కావున భరతుడు రాక పూర్వమే రామునకు రాజ్యమిచ్చు టను నిర్ణయించినాడు. భరతుడు ఈ రాజ్యము నాదియన్నచో అబద్ధమాడుట దశ రథుని హృదయము కాదు. భరతుడు పచ్చిలోపల నెరవేర్చుట నీతి, నీతియన ఉపాయము. భరతుడు మానింపదగిన వ్యక్తియా? కాదు. కాని మానవుల చిత్తము అనిత్యమని దశరథుడుతెరుగును. "కింతు చిత్తం మనుష్యాణా మనిత్యమితి మేమతిః" అని దశరథుని వాక్యము కావున. అట్లు చేయుచుంటినని రామునకు తెలిపి, పట్టాభిషిక్తుడవు కమ్మని నాడు. ఈ విషయమంతయు మంత్రులతో ముందుగనే ఆలోచించి రాముని వంటరిగ పిలిచి చెప్పినాడు. రాముడొప్పుకొని

నాడు. మరొక్క విషయమేమనగా వివాహకాలము నందలి ప్రతిని పాటించక తప్పించుకొన్నచో అన్యత దోషమురాదు. ఇంతతో దశరథుని వదలుదము. మురానే వైపు తిరుగుదము.

రాముడు తండ్రియాజ్ఞకు మారు మాట్లాడలేదు. దశరథుని ఆజ్ఞను శిరసావహించినాడు. అక్కడ నుండి మాతృ గృహమున కేగినాడు. సుమిత్రా లక్ష్మణులును, సీతాకాంతయు, ఆసమయమున కౌసల్యకడకేతెంచిరి కాబోలు వారును అక్కడనే యుండిరి.

నాటి సనాతన భారత నారీమణులు విదుషీమణులు కూడ. ఆ సమయమున కౌసల్యా మహాసాధ్వి తన ధ్యాన మందిరమున శుచిర్భూతయై తెల్లని పట్టు పుట్టమును గట్టి ఆర్ధనిమీలిత నేత్రయై ప్రాణాయామమున చిత్తమును బంధించి తన—— పుండరీకమున పుండరీకాక్షుని ధ్యానించు చున్నది ఆమె ధ్యానము రాముని గురించియే కావచ్చును.

రాముడు మాతృమూర్తిని దర్శించివాడు. అట్లేకాగ్రచిత్తయై యున్న ఆ తల్లి అడుగు దమ్ములపై శిరమును మోపినాడు. తన పుత్రుడు పట్టభద్రుడగు చుండెనను వార్త కౌసల్యకు తెలియనిది కాదు. తన పుత్రుడు భద్ర పీఠము నధిరోహించుటకు——విఘ్నము రాకుండుటకే నాటి ఆమె ప్రత్యేక కృత్యమంతయు. రాముడు తల్లికి తన తండ్రి ఆజ్ఞను తెలిపినాడు. ఏమని ?

"అంబ! పిత్రా నియుక్తోస్మి ప్రజా పాలన కర్మణి"

తల్లీ! ప్రజలను పాలించుటయను కర్మయందు తండ్రి గారిచే ఆజ్ఞాపితుడ నైతినని. వింటివా? రాముని మాటను! నేను రాజు నైతినని అతడు చెప్పలేదు. ప్రజలను పాలించుటయను విధి కర్మయందాతడు తండ్రిచే నియమితుడయ్యెనట. ఇక్కడ రాముని హృదయమేమి? క్షత్రియునకు వేదశాస్త్రములు విధించిన ప్రజా రక్షణ కర్మను తండ్రియాజ్ఞాపించగా పిత్రాజ్ఞా పరిపాలనమునకు బద్ధకంకణుడనై వ్రతదీక్షితుడను రేపు కాబోవు చుంటిననుటదే రాముని హృదయము. కృష్ణావతారము నందర్జునునకు బోధించినదీ ధర్మమునే.

"బ్రాహ్మణస్య తపోజ్ఞానం తపః క్షత్రస్యరక్షణం"

అనినారు పెద్దలు. పట్టధర్మమును పాలించుటకే తపస్సనిపేరు బ్రాహ్మణునకు వేదవేదాంగముల జ్ఞానమును సంపాదించుట తపస్సుకాగా రాజు

నకు ప్రజారక్షణధర్మమును నిర్వర్తించుటే తపస్సని మనువు చెప్పినాడు. కథకు రండు.

నాడు రాజ్యాభిషేకమునకు ముందు ఋత్విక్పురోహితులు గావించు హోమాదికములును యజమానియగు వారొనరింపదగు ఉపవాసాది వ్రత నియమములు. శాస్త్రప్రసిద్ధములనును. కావున రాముడు తల్లితో అమ్మా! ఋత్విక్పురోహితాచార్యులతో తండ్రిగారు ఉపవాసాది వ్రతమును నాకు విధించిరని చెప్పి సీతకు నీవాజ్ఞాపింపు మనినాడు, అంతియే కాదు. రేపు జరుగనున్న పట్టాభిషేకమునకు కాదగిన మంగళ కార్యముల నన్నిటిని నా చేతమ సీత చేతను గూడ నీవు చేయింపుమని విశదీకరించిచెప్పినాడు. అది కౌసల్యమహాపాధ్వికిమధురక్షణమైనది. రాముని మధుర కంఠధ్వని తరంగములు ఆమె చెవుల సోకగా ఆమె ఆనందము నకు కొలతబద్దలేదు. ఆనంద బాష్పములు కనుకొలకులనిండి కాల్వలైప్రవహింప మధుర స్వనముతో వత్సా! రామ! చతురంభోధి పరీతమగు నీ ఇక్ష్వాకు సామ్రాజ్య లక్ష్మినిన్ను వరించినదా? ఏమి? నా భాగ్యము. ఎట్టి కళ్యాణ నక్షత్రము నందు ధ్భవించితివి? దీర్ఘాయుష్మంతుడవై శత్రువుల జయించి సామ్రాజ్యలక్ష్మి నమే తుడవై సుమిత్ర హృదయమునేగాక సమస్త జ్ఞాతి బాంధవులకును సౌఖ్యము నొనగూర్చుపు గాక యని రాము నాశాసించినది ఆ మాతృదేవత.

వత్స! రామ! చిరంజీవ హతాస్తే పరిపంథినః
జ్ఞాతీనాం మే త్వం శ్రీయా యుక్తః సుమిత్రాయాశ్చ నందయ ॥

కౌసల్య రాముని నీ శత్రువులకు అపజయమును, వీకు జయమును కలుగుగాక! జ్ఞాతులకు నీ పట్టాభిషేకము సౌఖ్యప్రదమగుగాక, సుమిత్రకును ఆనందాదయక మగుగాకయని ఆశీస్సు నొసంగుటకేమైన ప్రత్యేకత యున్నదా? కౌసల్య ఇట్లు మాట్లాడుటకొక ప్రత్యేకత లేకపోలేదు.

రాముడు పట్టభద్రుడగునని కౌసల్య ఊహించలేదు. కైకేయి పుత్రునకే ఈ రాజ్యమని ఆమె నిశ్చయము, ఆ విషయము తారుమారు కాగా ఆమె చకితురాలై రామునకు నిష్కంటక రాజ్యలక్ష్మి చేకూరుగాక యని పలికినది. కైకేయిని వదిలి సుమిత్రను మాత్రమే స్మరించినది. మరియొక పోతపము రామదేవునెను? ఇక్కడ రావణుని మాట మనకు చాల అవసరము.

రాముడు తల్లి మాటకు సమాధానముగా లక్ష్మణునివైపు తిరిగి, ఇట్లనినాడు—

లక్ష్మణే! మాం మయా సార్ధం ప్రకాధి త్వం వసుంధరాం
ద్వితీయం మేంతరాత్మానం త్వామియం శ్రీరుపస్థితా
సౌమిత్రే! భుంక్ష్వ భోగాం స్త్వం ఇష్టాన్ రాజ్య ఫలానిచ
జీవితం చ హి రాజ్యం చ త్వదర్ధ మభికామయే॥

లక్ష్మణా! నన్నిపుడు వరించిన సామ్రాజ్యలక్ష్మిని నీవే శాసింపుము. నిజమునకే రాజ్యలక్ష్మి నిన్ను వరించునట్లే భావింపుము. కారణమేమందువా? నీవు నాకు రెండవ అంతరాత్మవు సౌమిత్రీ! ఈ రాజ్యభోగములను రాజ్యఫలమును నేను నీకొరకే కాంక్షించుచుంటిని. ఈ రాజ్యభోగములే కాదు. ఈ జీవితము కూడ నీ కొరకే నవినాడు. ఎంత చక్కని పలుకు లివ్వి! ఈ పలుకులు కేవలముగ లక్ష్మణుని ఉద్దేశించియే పలికిన పలుకులు కావు. జీవులందరకును బోధించిన బోధలు. శ్రీకృష్ణులు అర్జునుని నిమిత్తముగాగొని తన నిజస్వరూపమును బోధించగా రాముడు ప్రతి ఒక్కనిని నిమిత్తముగాగొని ధర్మతత్వ ఆత్మతత్వములను ప్రదర్శించుచు బోధించును. తన జీవితమును రాజ్యముగూడ లక్ష్మణుని కొరకేయట తనకోరకు కాదట. అనగా నాయవతార సహాప్రసములను నా చరిత్రలను—నా భక్తులగు వారు తరించుటకే నాచేత గ్రహింపబడుచున్నవి. కాని అవి నాకోరికలు కావని లక్ష్మణునకు బోధించినారు. మనకు చెప్పినారు. కృష్ణుని వాక్యమిది.

నానవాప్తమ వాప్తవ్యం వర్తఏవ చకర్మణి.

నేను పొందనిదిలేదు. పొందవలసినదియును లేదు. కర్మల నాచరించుచునే యుండును. ఈ మాటయే ఆమాట. రామకృష్ణావతారములకు సిద్ధాంతభేదము లేదు.

రాముడక్కడనుండి, తన మందిరమున కేగినాడు. మాతృమూర్తుల ఆయుజ్ఞతో ఇక రేపు రాముని యువరాజ్య పట్టాభిషేకము జరుగవలెను. సీతయు కౌసల్యాసుమిత్రల ఆశీస్సులతో తన అంతర్గృహమున కేగినది.

ఈ యువరాజ్య పట్టాభిషేక మహాయజ్ఞమునకు కావలసిన సామగ్రి చాల యున్నది. నాటి పట్టాభిషేకములు వైదికములు కేవల తాంత్రికములురావు. ఈ కార్యమున సువర్ణఖండములు కావలెను. రత్న విశేషములుండవలెను. చతురంగ

బలముల కూర్చవలెను. లక్షణ యుతమగు భద్రగజమును, సువర్ణకుంభములును, శ్వేతచత్రమును అట్లే చామరమును, లక్షణలక్షితమగు ఆబోతును, సంపూర్ణావయవములతో కూడిన వ్యాఘ్రచర్మమును వంది మాగధులును మొదలగు పరికరములెన్నియో కూర్చబడవలెను. నగర రక్షణ మవసరము. కావున ప్రత్యేకమగు సైనికులు కావలెను. దేవాలయముల దేవార్చనలు జరుగవలెను. హోమనిధాన ముండును. సాలంకృతలగు వేశ్యా స్త్రీలు కావలెను. వేదవేదాంగ పారగులగు బ్రాహ్మణోత్తము లీకార్యమునం దత్యంతా వశ్యకమై యుందురు. భారతదేశ మందలి వృత్తులన్నియు ధర్మరక్షణకు అంగములు.

ఇదంతయు వశిష్ఠమునీంద్రుల ఆజ్ఞచే మంత్రి మండలి చేకూర్చినది. రాజాజ్ఞ ననుసరించియే వశిష్ఠులీ ఏర్పాటును చేయించినారు. తరువాతి కార్యక్రమము సీతారాములకు మునీంద్రులు రక్షాబంధనమును బంధించి, ఉపవాస వ్రతమును నియమించవలెను. దశరథుడు తనకోర్కెను పురోహితశ్రేష్ఠుల కెరింగించినాడు. వశిష్ఠమునీంద్రులు రాజాజ్ఞచే బ్రాహ్మ్యరథము నధిరోహించి సీతారాములకు దీక్ష తంకణములు కట్టినారు.

నాడే సువిశాల సుందరభవనములతో తీర్చిదిద్దిన రాజవీధులన్నియు తోరణ పతాకా లంకృతములైనవి. రాజవీధులేకాదు. ప్రతి పౌరుని గృహాభ్యంతరమును తోరణాలంకృత మగుటగాక ప్రతిపౌరుని గృహోపరిభాగమును చిత్ర విచిత్ర వర్ణపతాక సమలంకృతముకాగా పౌరులు బృంద బృందములుగ గుమిగూడి రాముని పట్టాభిషేకమహోత్సవ సంతోష వార్తలనే చెప్పుకొనుచుండుట నాటి నగర విశేషమై విరాజిల్లినది. గృహ ప్రాంగణముల బాలుర ఆటలలో, గృహాంత ర్భాగముల కన్నెల పాటలలో పూజామందిరముల దేవార్చనాసమయములలో రాముని పట్టాభిషేక మహోత్సవమును గూర్చిన ప్రసంగములే ధ్వనించుచుండ వశిష్ఠులీనగర విశేషముల తిలకించుచునే చెవుల పండుగలై వినబడు రాముని స్తుతివాక్యములతో పౌరజానపదుల వలవ వినుచునే రాజమందిరమునకేగి, తన కర్తవ్యమును నెరవేర్చితినని దశరథునకు తెలిపి, తన ఆశ్రమమున కేగినారు.

నాడు అయోధ్యానగరమునందేమూలను చీకటి లేదు. నగర రాజమంతయు దీపవిశేషములతో అలంకరింపబడినది. ఆ దీప సహస్రములు వృక్ష

కారములుగ కూర్చబడి ప్రేక్షకులకు వింతను గూర్చుచున్నవని వాల్మీకి వర్ణించి నారు.

దీప వృక్షాంస్తథా చక్రుః అనురధ్యాసు సర్వశః

ఒక్కమారు మనము రాముని కడకేగుదము.

సీతారాములు నాడుపవాసము. నాడు వారు గానించిన హోమశేషమును మాత్రమే వారు భుజించినారు. ఆరాత్రికాలమున రాముడు బ్రహ్మచర్య నిష్ఠుడై యుండ నిశ్చయించియు సీతను వేరొక ప్రదేశమునందుంచలేదు. సీతతో కూడియే అతడా రాత్రి తన దర్భాస్తరణమున పడుండినాడు సీతతో మాటనైన మాటాడ కుండ. అప్పుడాతని కర్తవ్యమేమి? నిద్రపోవుట కాదు. అతడు ధ్యానగతుడై యుండెనని వాల్మీకి వర్ణించినారు.

ధ్యాయన్నారాయణం దేవం స్వాస్తీర్ణే కుశసంస్తరే

వాగ్యతస్సహ వైదేహ్యా భూత్వా నియత మానసః

రాముడు దేవుడను చుంటిరిగదా? అతడెవ్వరిని ధ్యానించెను? అనగా రాముడిక్ష్వాకు వంశమున జన్మించెనను భావమున అతడు నారాయణుని ధ్యానించెను. అతడే నారాయణుడను భావమున ఆత్మనిష్ఠుడై యుండెను. దశరథుడు రాముని పట్టాభిషేకమును నిర్ణయించిన పునర్వాసు నక్షత్రము నాటి కార్యక్రమమిది. రేపు పుష్యమీ నక్షత్రము. రాముని పట్టాభిషేకము జరుగవలెను. తెల్లవారవలెను. కానున్న కార్యమునకై నిరీక్షింతము. నాడును నేడును ఇంతియే గృహములకేగుదము. ఉపన్యాసము సమాప్తము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

మంగళం మహత్

శ్లో॥ బ్రహ్మ యేన కులాల వన్నియమితో బ్రహ్మండ భాండోదరే
విష్ణుర్యేన దశావతార గహనే క్షిప్తో మహా సంకటే
రుద్రో యేన కపాలపాణి పుటకే భిక్షాటనం కారితః
సూర్యశ్చామ్యతి నిత్యమేవ గగనే తస్మై నమః కర్మణే.

ఆర్య మహాశయులారా!

మన రామాయణ మహాకావ్య ప్రవచనమునందిది ఎనిమిదవరోజు. అయోధ్యాకాండలోని కథా భాగమండలి

భరతశత్రుఘ్నుల పయనముతోడ ప్రారంభించిన నిన్నటి యుపన్యాసం రాముని పట్టాభిషేక ప్రయత్నకథా భాగము తోడ ముగిసినది. నేటి యుపన్యాస కథాభాగము నిన్నటి పట్టాభిషేక యత్నకథా పరిణామము.

తానొకటి తలచును. దైవ మింకొకటి తలచును. అనునది సిద్ధాంతము కాకపోదు. పరమ సిద్ధాంతము. ఆ దైవమెవ్వరు? తలచిన తానెవ్వడు? అనునది ప్రశ్న. అందెవ్వరు బలవంతులనునది కూడ ప్రశ్నయే. ఈ రెండు ప్రశ్నలకును సమాధానమును కోరని వారుండరు. అందరును కోరుదురు. ఆ సమాధాన మెక్కడ తేలవలెను? ఆ తేల్చు వారెవ్వరు? అనుజిజ్ఞాసయు మేధావంతుల మస్తిష్కములు తిరుగాడనిది కాదు. అడుగడ్డునను ఈ ప్రశ్నలు మానవుని ఎదుర్కొనుచునే యుండును. ఈ ప్రశ్నలకు పరిష్కార గ్రంథములే భారతీయ శాస్త్ర గ్రంథములు. రామాయణ కథాభాగమున ప్రవేశింతము.

మంధర కైకేయికి దాసి. ఆ దాసి ఎక్కడ పుట్టెనో ఆమె తల్లిదండ్రు లెవ్వరో ఎవ్వరును ఎరుగరు. కైకేయి కాపురమునకు వచ్చినప్పుడే కైకేయి పుట్టినింటి నుండి ఆదాసియు వచ్చినది.

"జ్ఞాతిదాసీ యతో జ్ఞాతా కైకేయ్యాస్తు సహోషితా"

అనినారు వాల్మీకి. ఎందరెందరో ఏవియో కథలను మంథరను గూర్చి చెప్పెదరు. అవినాకక్కరలేదు. పాత్రల పోషించు బాధ్యత కవులదేఅగుచో ఆ కథలవసరములైన కావచ్చును. వాల్మీకి రామాయణము నందలి పాత్రలు కవి కల్పితములు కాదనునది నా సిద్ధాంతము. ఆ పాత్రలను మనము పోషించవలసిన పని లేదు. అవి మహర్షి మొలిపించిన పాత్రలు కావు. మొలిచి నిలిచిన పాత్రలనే కవి వర్ణించి చెప్పినారు. కవి పాత్రల సరిదిద్ది పోషించుట నాటకరంగములోని విషయము. నాది వ్యాఖ్యానము. నేను చేయదగినది పాత్రపోషణము కాదు. ఆయా పాత్రల వివరణము. ప్రస్తుతమున మంథర పాత్రవలన కలిగెడు (లేక) తెలియ బడెడు విషయములు మనకు చాల ముఖ్యములు. మన రామాయణ కథయందా పాత్ర ఏ భాగమున ప్రవేశించినది? ఆ పాత్రలోని ప్రత్యేకత ఏమి? కథయందా పాత్ర ఎక్కడతో వెనుకకు మరలినది? అను విషయములు మనకు చాల ముఖ్యములు. మంథర పాత్ర రాముని పట్టాభిషేకయత్నములో ప్రవేశించి రాముని ఆరణ్యగమనము తరువాత మరలినది. ఆ పాత్ర ప్రత్యేకత రాజకుటుంబమున చిచ్చు పుట్టించుటే.

ఇక కథలోనికి వత్తము.

రాముని యువరాజును గావించుటకై జరిగిన బాహ్యాభ్యంతర ప్రయత్నములు మీరెరుగనివికావు. నిన్నటి యుపన్యాసములోని కథాభాగమదియే.

నేడెందుకో మంధర నగర సంచారమునకు బయలు దేరినది. ఏ కార్యక్రమమునకై బయలుదేరినదన్న ప్రశ్నకు సమాధానము లేదు. దొరకదు కూడ. స్వేచ్ఛా సంచారుల సంచారములకు కారణము లుండవు. కారణము లేకుండగనే ఆ దాసి ఒక రాజసౌధము నధిరోహింప నారంభించినది. మహర్షి ఆ దాసి మేడ నెక్కుటనిట్లు వర్ణించినారు.

"ప్రాసాదం చంద్రసంకాశ మారురోహ యదృచ్ఛయా"

నాడును నేడును అంతియే. కొందరు వీధులవెంట ఎందుకో తిరుగుచుందురు. వారికి ప్రత్యేక కార్యక్రమములుండవు. ఇంటింటికి వెళ్ళి కలగా పులగపు మాటలతో కాలమును గడుపుట వారి నిత్య జీవిత విధానము. ఇందుకు మంధర నేటిపయనము అదర్శము.

ప్రస్తుత కథాంశమున మంధర మేడమెట్ల నెక్కుచుండగా నగరమునందేదియో యొక ప్రత్యేకత గోచరించినది. నాడు రాముడు యువరాజగునని మంధరకు తెలియదు. ఏదియో యొక మహోత్సాహమును ప్రకటించుచు గుంపులు గుంపులై తిరుగాడు జన సందోహమును ఆ దాసికి ఆశ్చర్యమును కలిగించినది. అంతేకాదు. రాముని ధాత్రేయిక (పెంపుడు తల్లి) చేతనేవియో కొన్ని ఉపాయనముల నుంచుకొని అత్యుత్సాహసమన్వితయై వచ్చుటయు ఆ గూని దాసి చూపున పడినది. అంతతో మంధర గమనవేగ మాగినది.

ఆధాత్రేయిక రాక కౌసల్యా మహాసాధ్వి గృహాభ్యంతరమునుండియని మంధర నిశ్చయించుకొన్నది. ఇక ఆ దాసికి ఈ రాజవీధుల ప్రత్యేకాలంకారములకును, ఈ తిరుగాడు జన సందోహముల యుత్సాహమునకును, నేడు కౌసల్య తన దాసీలకు గావించిన ప్రత్యేక సత్కారములకును కారణము కావలసి వచ్చినది. ధాత్రేయికనుపిలచినది, కారణమడిగినది.

ఆధాత్రేయికయే గాక మరెందరో కౌసల్యా మహాదాజ్ఞి పరిచారికలుగూడ నూడనాలంకరణములతో మంధరకన్నులబడగా దాసికన్నులు మండి యుండ వచ్చును. రాముని ధాత్రేయిక మంధరకు రాముని పట్టాభిషేక వార్తను తెలిపినది.

అంతియే. ఆక్షణముననే మంథరపయనము వెనుకకు తిరిగినది. ఆ దాసి చూపు కైకేయి మేడపై కురికినది.

అది కైకేయీ మహారాణి రాజసౌధము. కైకేయి మంథరను దాసిగ చూడదు. కైకకు మంథర ఆప్తురాలు కూడ. కైకేయి రాణివాసమా మంథరకు స్వంత ఇల్లు. మంథర రాకపోకలకు ఆ కైకరాణివాసమున కాల నియమములేదు. ప్రొద్దున రావచ్చును మధ్యాహ్నకాలమున రావచ్చును. సాయంకాలమునకూడ రావచ్చును. రాణి వాసమంతలి దాసికి అట్టి స్వాతంత్ర్యముండుట ఆ దాసిలోని నేర్పరితనము కావచ్చును. లేక కైకేయిలోని బేలతనమును కావచ్చును. పట్ట మహిషి కుబ్జావామని కాదులకివ్వదగు స్వతంత్రమున కొక కొలత బద్ధయున్నది. ఆ కొలత బద్ధయే మంథర కైకేయీల మధ్య మృగ్యముకాగా కైకేయి మంథరకు పట్టు మహిషియై కన్పట్టదు. కైకేయి రాజమాతయను గౌరవ మీ దాసికిలేదు. రాణిని భూషించవచ్చును. దూషించవచ్చును. తిట్టవచ్చును. దీవించవచ్చును.

అనంతమగు నీ విశ్వరంగమున మానవ ప్రకృతులు భిన్నభిన్నములై విరుద్ధభావముల కాస్పదములై యుండును. పరిపూర్ణ పూర్ణిమా చంద్ర వంద్రిక లొక్కరికి హృదయంగమములై హాయిని గూర్చ వేరొక్కనికా జ్యోత్స్నయే విషాదమును దుర్భరతాపమును కలిగించును. మనోహర శీతల సమీర మొక్కనికి సేదతీర్చి శాంతి నొసంగ వేరొక్కని కయ్యది శ్రమకారణమగు చుండును. కాకున్న చంద్రకిరణ సంస్పర్శనమునకు విరహులు బాధనొందుదురా? మలయ మారుతములు వారికి బాధల కల్పించునా?

రామచంద్రుని పట్టాభిషేక వార్త సకల ప్రపంచమున కానందమును గూర్చుచుండ మంథరయను గూనిదాసికి విషాదమును కల్పించుటలో మానవ ప్రకృతుల భిన్నత్వమే కారణమనుటకంటె ఏమనవలెను?

ఈ ఘట్టమున మంథర దుర్భర విషాద క్రోధవేదనలతోడనే తానెక్కి మేడను దిగినది. కైకేయి మేడపై కురికినది.

మంథర కైకేయి అంతఃపురమున కేగినది. అది కైకేయి తనశయన తలమున పండి విశ్రాంతి సుఖము పొందుచున్న సమయము. మంథర సరాసరి ఆమె శయన తలము కడకేగినది. మూడురాలా! లెమ్ము! లెమ్ము! అని మాటుగ పలికినది. నిన్నొక ముఖ్యమము ఉపరించసుండగా నిన్ను నీవెరుగక యుంటివా? అని భీకరముగనే పలికినది. కైకేయి చలించలేదు. అట్లే పరుండి మంథరను

ప్రశ్నించినది. మనకు వాటిల్లిన భయమేమియని. మంధర అప్పుడే ఏమి చెప్పును? కైకేయి ఇట్లుండునని మంధర తలచలేదు. తన మాటను వినగనే దశరథుని పట్ట మహిషి ధూ్రమాక్షీయగు ననుకొన్నది. అది జరుగలేదు. కైకేయి కన్నులైన మార్పునొందలేదు.

రామాయణమునందలి మంధర పాత్ర సామాన్యమని మనము తలచగూడదు. ఇదియొక గూనిదాసియని వాల్మీకి మంధరను ప్రోసిపేయలేదు. తఃపొట్టిదానిగట్టి తనమును చాటి చెప్పినారు మహర్షి, రామాయణమున లేని పాత్రలీ సృష్టిఖండము నందేక్కడున్నవి? మంధరను వర్ణించుచు వాల్మీకి ఈమె వాక్యనిశారదయని వర్ణించినారు. మంధరకు బిరుదు నిచ్చినారు. నిజమునకు కైకేయితో మాటాడునప్పుడు వాక్యవిశారదయయ్యెడు ర్నీతిని బోధించినది. ఆదాసి వాక్య విశారదత్వము రాజాంతఃపురము నందొక విప్లవమును సృష్టించుటకు పనికి వచ్చినది. కావుననే మంధరను "పాపదర్శిని" అని వాడినారు మహర్షి. రామపట్టాభిషేకమని తెలియగనే "పాదహ్యమానా కోపేన మంధరా పాపదర్శినీ" అని, "ఉవాచ క్రోధ సంయుక్తా వాక్యం వాక్యవిశారదా" అనినారు.

నిజమున కొకవ్యక్తి మరియొక వ్యక్తిపైనున్న ప్రేమ మోహినిని ఇంకింపజేయవలెనన్న ఎంతమాట నేర్పరి తనము కావలెనో (లేక) అట్టి వ్యక్తుల యందెంత చతురత యుండునో రామాయణ కావ్యమున మంధర పాత్ర ఆదర్శ పాత్రయై నిలిచినది. కైకేయి యందును భరతుని యందును తనకు ప్రేమ ఉట్టిపడుచున్నట్లు చూపి, దశరథుని యందును రాముని యందును కైకేయికిగల ధర్మబంధ ప్రేమబంధములను త్రెంచి వేసిన మంధర ప్రతిభ సామాన్య మెట్లుగును? ఈ ఘట్టమున కైకేయీ మంధరల సన్నివేశమొక చిత్రమై నడచినది వినుడు.

కైక : మంథరా! నీవెందుకట్లు మండి పడుచుంటివి?

మంథ : నేను మండిపడుటలేదు. రాబోవు నీ జీవితమును తలచి భయ పడు చుంటిని.

కైక : నా జీవితమునకు భయమా?

మంథ : రేపే రాముని యువరాజ పట్టాభిషేకము నీవెరుగుదువా?

కైక : రాజు నాకు తెలుపగలడు.

మంధర : ఎంత అమాయకురాలవు ?

కైక : ఇందు నా అమాయకత్వమేమున్నది ?

మంధర : రాజు నీవాడను కొనుటయే నీ అమాయకత్వము.

కైక : కాదా ?

మంధర : భర్త విషహృదయమును నీవు గుర్తింపలేదు.

కైక : నీమాట నాకర్థము కాలేదు

మంధర : రాముడు రాజగు చుండెనని అర్థమైనదా ?

కైక : ఆ అమృతసూక్తిని వింటిని. ఇదిగో ఆసూక్తిని చెప్పిన నీకు మణి హారము !

మంథర : ఇంకేమైన నాకివ్వదలచితివా ?

కైక : నీవేమి కోరిన అదిస్తును. కోరుకొనుము.

మంథర : చాలుచాలు. నీ మణి హార ప్రదానము.

కైక : అట్లను చుంటివేమి ?

మంధర : భరతుని దేశాంతరమునకు పంపి, రామునికి రాజ్యము నిచ్చుచుండ అది అమృతసూక్తియై నీవు నాకీ హారము నివ్వగా నాకు దుఃఖము వచ్చుచున్నది. నీ భర్త నల్లకాచని నీవు గ్రహించక పోవుట నీదురదృష్టము.

కైక : మంధరా ! పొరబడు చుంటివి. రామునకు భరతునకు భేదములేదు. (రామేవా భరతేవాహం విశేషం నోపలక్షయే.) రాముడు పట్టాభిషిక్తు డగుచో భరతుడు రాజైనట్లే మంధరా !

మంధర : రామునకు రాజ్యము వచ్చిన తరువాత భరతుడు బ్రతికియే యుండునను కొను చుంటివా ? భరతునకు దేశాంతర ప్రాప్తి. లేదా లోకాంతర గమనము తప్పదు.

కైక : ఎంతమాట ? రాముడు ధర్మాత్ముడు. సత్యవంతుడు. అతడు పేవకులకును సోదరులకును తండ్రి వంటివాడు. (భ్రాత్యాంశ్చ భృత్యాంశ్చ దీర్ఘాయుః పితృవత్పాల యిష్యతి)

మంధర : నీ సవతి యగు కౌసల్యను మరచితివి కాబోలు ?

కైక : మరవలేదు. కౌసల్యకంటె రామునకు నేనే ప్రీతురాలను. (కౌసల్యాతో ఆతిశ్రీకంచ సోమకు ప్రూష తే హి మాం)

మంధర : కార్యార్థులగు వారట్లే యుందురు. నీయందు రామునకు గల గౌరవము రాజ్యము చేతికి వచ్చునంతవరకే. నీవు రాముడు రాజగునంతవరకు రాణివి. తరువాత కౌసల్యకు దాసివి నీవెంత కాలమునుండి కౌసల్య నవమానించు చుంటివో ఒక్కమాయ జ్ఞాపకమునకు తెచ్చుకొని ఇప్పుడామె నీవగ తీర్చుకొనునని తెలుసుకొనుము.

కైక : అవునవును మంధరా !

శ్రోతలారా ! వింటిరిగదా ? మంధర ప్రబోధమును. కైక మారినది. మంధర విషబీజములు కైక హృదయక్షేత్రమున నాటినవి. రామునిపై ప్రేమ వాహిను లింకినవి. దశరథుడు కృష్ణసర్పమయ్యే ఆమె ఎదుర నిలిచినాడు. మంధర మంత్రోపదేశము ఫలించినది. రాముడెంత మంచివాడైనను కౌసల్యారాముని మార్చునని కైక నిర్ణయించుకొన్నది. ఈ నిర్ణయమును మంధర కెరిగించినది. వన్నిప్పుడేమి చేయమందువని మంధరనేశరణు జొచ్చినది. మంధర ఇప్పుడు కైకేయికి సలహాదారురాలైనది.

మంధర : కైకా ! నీవిప్పుడు చేయదగు కార్యమును నేను వేరుగ చెప్పవలెనా ? రాముని ఇంటినుండి ప్రవాసమునకు పంపుటయు, భరతునకు రాజ్యము ఇప్పించుటయు, నీ కర్తవ్యములు. అప్పుడు భరతుని ప్రతికించు కొన్న దానివగుదువు.

కైక శయనతలమునుండి లేచినది ఉగ్రమూర్తియై. వేడి నిట్టూర్పుల విడిచినది. తానిప్పుడు గాఢనిద్రనుండి మేల్కొంటినని తలచినది. మరి నేనీ కార్యము నెట్లు నెరవేర్చ కొనగలనెను ? అని ఆలోచించుకొన్నది. ఆమెకు తోచలేదు. భరతునకు రాజ్యమువచ్చు నుపాయమును నీవే చెప్పవలెనని మంధరనే వేడుకొన్నది. మంధర ప్రొత్తగ ఆలోచించ వలసినదేమున్నది ? కైకను గట్టి పరచినది. కైకకు చాల కాలము క్రిందజరిగిన ఒక కథను గుర్తుకు తెచ్చినది. ఆ కథ నిజమునకు మంధర ఎరిగిన కథకాదు. కైకేయి వలన విన్నకథయే.

ఒకనాటి దేవాసుర యుద్ధమున దశరథుడు దేవేంద్రునకు సాహాయ్యము చేయుటకై వెళ్లగా అప్పుడు కైకకూడ దశరథునితో వెళ్ళుట జరిగినది.

అది దక్షిణ దిశయందున్న దండకారణ్యప్రదేశము. ఆ ప్రదేశములోనిదే వైజయంతీపురము. దానిని తిమిధ్వజుడను రక్కసుడు పాలించుచుండెను. అతనికే శంబరాసురుడని కూడ పేరు. అతడు మహామాయావి. అతడు దేవతలతో వగటి కాలమున పోరాడి క్షతగాత్రులగు వారు నిద్రించుచుండగా రాత్రికాలమున వారందరిని చంపుచుండెడి వాడు.

దశరథుడు డాతనిని జయింప రథాధిరూఢుడై వెళ్ళగా కైకేయికూడ రాజుతోటి వెళ్ళినది. ఆయుద్ధమున దశరథుడు శత్రువులే మూర్ఛిల్లగా తాను దశరథునకు సారథియై ఆతనిని రెండు సార్లు రక్షించుట జరిగినది అనాడు దశరథుడామేరకు రెండు వరముల నిచ్చినాడు. కాని ఆవరములను కైకవాడుకొనలేదు.

ఆనాటి రాచవనితలు, యుద్ధ కౌశల్యము కలవారగుట ప్రసిద్ధము. సత్యభామ నరకాసురునితో యుద్ధమును సాగించుటను పోతన వర్ణించినారు వీరశృంగార భయ రౌద్ర విస్మయము లొక్కచోట కూడిన సత్యభామను మనకన్నుల ఎదుట పెట్టినారు. ఆవిషయమును యుద్ధమునుండి తిరిగివచ్చి, కైక మంథరకు చెప్పినది. మంథరదానిని గుర్తుపెట్టుకొని కైకకు నేను నీకొరకై ఆవరముల గుర్తుంచు కొంటినని చెప్పుకొని తన ప్రత్యేకతనను నిర్ణయించుకొనుచు, ఆరెండు వరములనే ఇప్పుడు భరతునికి రాజ్యమిచ్చునట్లును, రామువరణ్యమునకు పంపునట్లును వరముల కోరుకొమ్మన్నది. భరతునికి పట్టాభిషేకము చేసిన చాలదా ? అన్నచో ప్రజలలోని స్నేహ భావమును రాముకు కోల్పోవలెనని ఉపాయమిచ్చినది..

చతుర్దశ హి వర్షాణి రామే ప్రవ్రాజితే వనం
ప్రజాభావగతస్నేహః స్థిరః పుత్రో భవిష్యతి.

ఆవిషయమును వాల్మీకి స్పష్టపరచినాడు. ఆనాటికే అనాగరికురాలగు మంథర కెంత విజ్ఞానము కలదో చూడుడు. మంథరకు రాజనీతి కళయందుగల ప్రావీణ్య మింకను మనకు తెలియవలసి యున్నది. కైకను అంతతో వదలలేదు.

దశరథుని వలన ఈవరద్వయము నెట్లు సాధించుకొన వలయునో కూడ బోధించినది ఉపాధ్యాయినియై.

రాజాంతఃపురములయందు కోపగృహమొకటి ప్రత్యేకమై యుండును. అలిగిన రాణులయొక్క అలకను తీర్చ గృహమది. కైక ఆ గృహమునందెట్లు ప్రవేశించి ఎట్లు మెలగవలెనో గూడ మంథర కైకేయిని తీర్చిదిద్దినది. అంతతో మంథర ఉపదేశ ఘట్టము పూర్తియైనది. తరువాత కైక భరతుని పట్టాభిషేకానంతరము తనకింత సాహాయ్యమును గావించిన మంథరకు రాదగిన గౌరవ మర్యాదలను కూడ వినిపింపగా ఆ వరముల నడుగుకొన్న మంథర కైకేయి అభ్యంతర గృహమును వదలినది.

మారిన కైక

రాముని పట్టాభిషేక వార్తను మంథర కైకకు వినిపింపగనే కైక మంథరకు చెప్పిన సమాధానములు మీకు మరపురాలేదనియే నా నమ్మకము. అయ్యను ఒక్క మారు స్మృతికి తెచ్చెదను.

మంథర రాకపూర్వము కైక హృదయ క్షేత్రమున రాముడు ధర్మమూర్తి. కైక ప్రేమించిన గారాబు బిడ్డ. దశరథుడును అంతియే. మంథర రేపే రాముని పట్టాభిషేకమని చెప్పగనే శ్వేతచ్ఛత్రముతో గజారూఢుడై ఆభద్రగజము వధిష్ఠించిన రాముడు కైకేయి హృదయ క్షేత్రమున రామభద్రుడై దర్శనమిచ్చినాడు. ఇప్పుడా రాముడే నారచీరెల ధరించి కఠిన కాంతారములచరించు వేషమున నిలిచినాడు. కైకేయి జీవితము నందిది యొక పెద్ద పరిణామము. ఆమెకు రాబోవు వైధవ్యమును చేతబెట్టి వెళ్ళినది మంథర. మానవ జీవితమునందలి పవిత్రాంతఃకరణల ప్రవహించు ప్రేమవాహినులను ఇంకింపజేయు పదమటి గాడ్పులే మంథర వంటి దుర్బోధలని మన రామాయణ మహాకావ్యము ఈ కథా భాగమున మనకు బోధించినది. కావుననే "దుస్సంగ స్సర్వదైవత్యాజ్యపిఃు" అనినారు నారదులు తన భక్తి సూత్రములయందు. సజ్జన సాంగత్యమెంత అవసరమో దుర్జన సాంగత్యమును వదలుట కూడ అంత అవసరము.

"అనర్థమర్థరూపేణ గ్రాహికా సా తతస్తయా"

అనర్థకమునే పరమార్థముగ గ్రహించినది కైకేయి కథకు వత్తము.

కైక తన కనుబొమలలో రౌద్రరసము నొలికించినది. మంథరకు తన నిశ్చయమును చెప్పినది. మంథర వెళ్ళిపోయినది.

అది కైక ప్రవేశించిన కోపగృహము. ఆ గృహము అంధకారబంధురము తమో గుణము ఆవరించిన కైకకు ఆ గృహము ప్రాప్తమైనది. కైక తన తలపై నున్న చిత్రవిచిత్ర పుష్పమాలికలను, ఒంటిపైనున్న సువర్ణరత్నఖచిత భూషణావళులను గూడ ఆ కోపగృహమున నేలపై విసజిమ్మినది. కాని ఆమె తనులతా సౌందర్యమునేమి చేయగలదు? అది ఆమెను వదలలేదు. కిన్నరాంగనవలె నేలపై పరున్నది. అది కోపగృహమైనను గుహవంటిదికాదు. అతి విశాలము. అచ్చటచ్చట పడిన ఆమె భూషణములు విశాలాకాశమునందలి నక్షత్రములవలె ప్రకాశింప చీకట్లతో అలముకొన్న ఆకాశమైనదట ఆ ఇల్లు. వాల్మీకి అనినారు. దీని భావమేమి? ఆకాశమన శూన్యము. కావున అది శూన్యగృహమైనదని అర్థము మాంగళ్యము తొలగినది. ప్రణయ క్రోధమునకది నిలయమైనను నేడు ప్రణయక్రోధాగారమైనది. మనమొక్కమారు దశరథునివైపుకు మరలుదము.

విపత్తు విశ్రాంతి లేరూపమును ధరించి మనవద్దకు వచ్చునో తాము ధరంచ దలచుకొన్న రూపమును మనకు తెలపవు. ఇదియే సృష్టికి నిమిత్తకారణమైయుండు మాయాశక్తి యొక్క ప్రభావము.

అది సాయంకాల సమయము. దశరథునకు రాముని పట్టాభిషేక వార్తను కైకేయికి తెలుపవలెననిపించినది. ఇంతవరకీ వార్త కైకేయికి తెలియదనియే అతని నిశ్చయము. నిజమునకు కైకకు తెలియవగు విషయము మాత్రమెక్కడున్నది? ఈ వార్తను విన్న కైకేయి సంతోషపడునని యే అతడెఱుగును? తన మృత్యువు ఆ మందిరమందున్నదని అతడెరుగడు.

కైకేయి మందిర మత్యున్నతము. శరన్మేఘమువలె అతి స్వచ్ఛమై ఆకసము సంటి యున్నట్లుండును. దశరథుడు తన ప్రియురాలికి ప్రియవార్తనందించవలె ననియే బయలుదేరినాడు. మహర్షివాల్మీకి దశరథుని ఆ మేడనెక్కుటను రాహువుతో కూడియున్న ఆకాశమునకు పోల్చి, వెళ్ళబోవు దశరథుని చంద్రునిగ చెప్పినారు. "రాహుయుక్తం నిశాకరః" అని. రాబోవు ఘట్టమును కవి ఎరుగును. కైక రాహువు కాగలదు. దశరథుడు చంద్రుడై వెళ్లుచుండెను. ఇకడు పూర్ణ చంద్రుడై వెళ్లుచుండెను. రాబోవునది దశరథునకు కృష్ణపక్షము. అని చెప్పినారు. మనమును కవి పుంగవులతో కైకేయి అంతఃపురమున కేగుదము.

అది కైకేయి అంతఃపురము. ఒకవంక ఱుకసారికా ప్రలాపములు చెవుల కింపును గూర్చుచుండ వేరొకవంక వాయిద్య విశేషములు మృదుమధుర ధ్వనుల

నీనుచుండును. దానదాసీ జనములొకవంక తిరుగాడుచుండ, వేరొకవలక నానావిధ భక్ష్యభోజ్య పదార్థము లమర్చబడి యుండెను. కామికులకీ దృశ్యము కామోద్దీపకము కాక తప్పదు.

దశరథుడు ఆ అంతఃపురమున ప్రవేశించినాడు. అతడు వృద్ధుడే కావచ్చును. ఆయ్యును అతడు మహారాజు. విరక్తుడైన వానప్రస్థుడు కాడు. వానప్రస్థుడను కావలెనన్న కోర్కెయు ఆయనకు కలిగిలేదు. స్వర్గసీమవలెనున్న ఆ అంతఃపురమున ప్రవేశించగనే పూ విలుకాడు తన బాణమును వెక్కుబెట్టినాడు. దశరథునకు కైకేయితో కూడి కామకేళి ననుభవించవలెనని కుతూహలము కలిగినది. కైకేయి కనబడలేదు.

విషయ వాసనలతి బలిష్ఠములు. ఆ వృద్ధునకీ కోర్కెయా? అనకుడు. కోర్కెలు వాసనాధీనములు. వార్ధక్యము స్థూల శరీర సంబంధము. సూక్ష్మశరీరమునకు వార్ధక్యము వచ్చునో మోక్షలక్ష్మి వరించుటకు తగిన వయఃపరిపాకము.

కైకేయి లేని శూన్యగృహమున కాతడు వచ్చుట కిదియే మొదటి రోజు. అక్కడనుండు ప్రతీహారిణిని (ద్వారపాలకురాలు) అడిగినాడు. ఆ ప్రతీహారిణి దోసిలి యొగ్గి మహారాణి కోపగృహమున కేగినదని సమాధానమిచ్చినది.

అది కైకేయి వసించియున్న కోపగృహము. దశరథుడా రాణీవాసములోని కోపగృహమున ప్రవేశించినాడు. మునలి మొగునకు పడుచుపెండ్లాము పైనుండు తీపి వర్ణింపరానిది. ఇది ప్రకృతి సహజము. వాల్మీకియే చెప్పినాడు. "సపత్న్యస్తు ణీం భార్యాం ప్రాణేభ్యోపిగరీయసీం" అని. ప్రాణములపై తీపికంటె పడుచు పెండ్లామపై తీపి పెద్దదట. కామికుడైన ఆ వృద్ధభూపతి కైకను చూడముచ్చటపడినాడు. ఆ చంద్రముఖి ముఖచంద్రమండల దర్శన మా భూపతి కబ్బలేదు. వలచినాడు. కామినీ సంభాషణా శ్రవణసుఖమున కాతడప్పుడు నోచుకొనలేదు. ఆమె తల ఎత్తలేదు. మాటాడలేదు. కైకేయి స్థితి అర్థముకాలేదా రాజునకు. అతని బుద్ధివైభవము మందగించినది. ప్రియురాలిని సమీపించినాడు. ఆమెపై చేయి వేసినాడు. పలుకరించినాడు. అతనికి ఒడలు జలదరించినవి. త్వగింద్రియ మాతని లోబరుచుకొన్నది. కైకేయిపై అనురాగ మా దశరథునకు చాల పెరిగినది. ఆమె అందచందములా మహారాజున కెపుడు నివురగా, ఇంతవరకామె తోటి అనుభవించిన అనుభవములు స్మృతిపథమున పొడచూపగా ఆ రాజు అఘటనఘటనా పటీయసి

యగు మాయాదేవి పన్నిన వలయందు చిక్కుకొనినాడు. "ధరనెవ్వాడు సృజించె పూరుషగళోద్భంధ క్రియాపాశముల్" అనినాడొక కవి. ఈ స్త్రీ వ్యామోహము నెవ్వరు సృజించెనో ఇంతవరకెవ్వరికిని అర్థము కాలేదు. కాని వేదాంతశాస్త్రము నీవు సృజించుకొన్న దేనని సమాధానమిచ్చినది.

కధకు వత్తము.

దశరధుడు ఆమె ఎట్టి కోర్కెను కోరినను ఇత్తునని బద్దుడై వలికినాడు. ప్రస్తుతమును అర్థము చేసుకొన్నది కైకేయి. స్త్రీలకు ఇంగిత జ్ఞానమెక్కువ. నా కొక కోరిక యున్నది. ఆ కోర్కెను తీర్తునని నీవు గట్టిగ వలుకుచో నా కోర్కెను చెప్పెదనన్నది.

దశరధుని ముఖమున చిరునవ్వు మొలకెత్తినది. ప్రియాతి ప్రియమై కన్పట్టు కామభోగ సుఖమును అనుభవింప మనుకొన్న దశరధుడు కైక తలను చేతులతో తాకి స్పర్శ సుఖానుభవభ్రాంతుడై తన తొడపై నిడుకొని తల దువ్వుచు కైకా! నీకంటె నాకు ప్రియమగు కాంత లేదు. రామునకంటె ప్రియమగు వస్తువు లేదు. రాముని సాక్షిగ నీ కోర్కెను తీర్తునని నాడు. ముమ్మాటికిని తీర్తును చెప్పుమని ఒట్టుపెట్టినాడు.

తేనాజయ్యేన ముఖ్యేన రాఘవేణ మహాత్మనా
శపే తే జీవనార్థేన బ్యాహియన్మనసేచ్ఛసి.

కైక ముఖము కలకల లాడినది "నాధా! నీవనిన మాటను సూర్యచంద్రుల సాక్షిగ వలుకుమన్నది. ఒక్క సూర్యచంద్రులనే కాదు. దేవతలనందర సాక్షులుగ నిలిపినది దశరధుని పాశబద్ధుని గావించినది. అతడిప్పుడు ఆడినమాటను తప్పుకొనుట కవకాశములేని ధర్మపాశమున బద్ధుడయ్యెను. ఆ బంధమున కట్టుబడి యున్న దశరధునకు శంబరాసుర సంగ్రామ రంగమును జ్ఞాపకము చేసినది. తన కిచ్చిన వరద్వయమును జ్ఞాపకము చేసినది. రాజు తలయూపినాడు. అది తల యూపుట మాత్రమే కాదు. ఒప్పుదలయే. నాడిచ్చిన వరద్వయమును నేనివ్వలేదని అతడెట్లనును? ఆ రెండు వరముల నేనివ్వమని కోయకొందునన్నది. దశరధుడింతకు ముందు ఆమె కోరిన కోర్కెల తీర్చనివాడు కాడు ఆమె కోర్కెల తీర్చియే ఆ ముద్దులగుమ్మననుభవించిన రసికుడనక తప్పదు. ఇప్పుడును అతడట్లే తలచినాడు. చేప అడుగును నీటియందు చూడవచ్చును. ఆడవారి మనసునెవ్వడెఱుగగలడు? ఇది త్రికాల సత్యము.

మత్స్యపాదం జలే పశ్యేన్న నారీ హృదయ స్థితం.

కైక వరములను కోరుకొనునప్పుడే ఆ వరముల నివ్వకున్నచో ప్రాణముల వదలుదునని గట్టిగ చెప్పినది. రాజు విని భరింపరాని మాట అది.

సత్యధురంధరుడగు దశరథుకు వీలుకాని వలలో చిక్కిన మృగమువలె కైక వాక్కునకు బద్ధుడయ్యెను. ఆ రెండు వరముల కోరుకొమ్మనెను. కైకేయి రెండు వరముల కోరినది. ఒకటి రామునికై చేకూర్చిన అభిషేక సామగ్రితోడనే భరతుని పట్టాభిషిక్తుని చేయుట. రెండు రాముడు జడధారియై నారచీరెల ధరించి పదునాలుగు సంవత్సరములు దండకారణ్యముల కేగుట. ఆ వరములిప్పుడే జరుగ వలెనన్నది.

కైకేయి పలుకులు దశరథుని చెవిని బడినవి. అవి ములుకులైనవి. ఆ కయికు ములుకులు చెవిని గ్రుచ్చుకొని మనసున నాటినవి. తానిప్పుడేయవస్థయందు తిరుగు చుండెనో ఆతనికర్థము కాలేదు. నేను జాగ్రదవస్థయందే యుంటిననుకొనుట కాతని ఆత్మ సందేహించుచున్నది. స్వప్న ప్రపంచమునందీ మాటలు వినబడినవని కొంత నేపాత డూహించినాడు. స్వప్నమన్న అసంభవములగునవి అనుభవమునకు వచ్చుట. కావున ఇది స్వప్నము కావచ్చునవి అతడు కొంతసేపు భావించుట యుక్తము కాకపోదు. అంతలో ఆతడు బాహ్యేంద్రియ వ్యాపారముండగ ఇది స్వప్నమెట్లగును? అని జాగ్రద్దశయే ననుకొనినాడు. కాని ఇది చిత్త విభ్రమము కావచ్చునని పించినదాయనకు కొంతసేపు. భ్రమకు కారణము లేదు. కావున పూర్వ జన్మలలోని సంస్కారమేమో?....కాదు. ఇట్టి సంస్కారమసంభవమనిపించినది. ఉన్మాదమా? కాదు మరి ఏమి? ఈ యాలోచనలతో కొంతకాలమా మహారాజునకు మానసిక ప్రపంచము గడచినది. ఆ ప్రపంచము నుండి బయటపడినాడు. కైక ముఖమునుండియే ఈ మాట వెలువడినదని నమ్మినాడు. ఆయనకు తన ఎదుట సుందరాంగియై యున్న కాంత పెద్దపులియై కన్పట్టినది. ఆతడు లేడిపిల్లయై కైకను చూచినాడు. శరీరము వణికినది. మాట కూడ తడబడగా ఛీ! అని పలికినాడు. అంతలో మూర్ఛిల్లినాడు, ఆతడు మూర్ఛనుండి లేచుటకు కొంతకాలము పట్టినది. లేచినాడు. కైకపై ఆతని చూపు మారినది. కైక మారలేదు. ఇదియే దృష్టి సృష్టి వాదము. వస్తువు మారదు. చూచువాని చూపు మారుటయే వస్తువు మారుటయగును. దశరథుని మధుర భావమున కైక సుందరాంగియైనది పూర్వక్షణమున. ఇప్పుడు

వ్యాప్తియైనది. ఆ కైకనే కామభావముచే ముట్టుకొనగా శరీరము జలదరించినది. ఇప్పుడు భయభావమున వణకినది. ఇది చూచు వాని యొక్క చిత్త వికారము. అనగా కర్తయైన వాని చిత్తవికారము. ఇని వేదాంతసారము. గౌడపాదులు, "చిత్తదృశ్య మవస్తుకం" అనినారు. 4-36. అ.లా.కాం.ప్ర.

యథాస్వప్నదృశ్యఃకాయః అసత్ తథాసర్వం చిత్తదృశ్యం అవస్తుకం.

శం. భా.

తరువాతి కథ.

దశరథుని క్రోధదృష్టులు కైకపై ప్రసరించినవి. కైక తన వంశమునుద్ధరింప వచ్చిన పత్నికాదని నిశ్చయించుకొనినాడు. కాటువేయవచ్చిన మహోరగమని తలచినాడు. ఎర్రబడిన కన్నులతో కైకవంకకు తిరిగి, కైకను మధుర ధ్వనితో సంబోధించి, రామునకు కైకపైగల మాతృప్రేమ నుద్ఘాటించినాడు. కైక అప్పుడప్పుడు రాముని గురించి చెప్పిన ముచ్చట్లలోని మాటలను జ్ఞాపకము చేసినాడు. హా! యని ఏడ్చి, కౌసల్యను ఎట్లు వదలుదును? సుమిత్రను ఎట్లు వదలుదును? రామునెట్లు వదలుదునని ఏడ్చినాడు. కైక హృదయమును మార్చ చాల యత్నించినాడు. తన క్రోధమును మాని ప్రసన్నుడై ప్రసన్నురాలిని గావింప యత్నించినాడు. పీ పాపమును పట్టుకొందుననని ప్రణయ కలహములోని శరణాగతిని ఇక్కడను వాడినాడు. ఇది ప్రణయ కలహమని అతనికి నిర్ణయము కాలేదు. కైక మాటలకు పరసత్వమును కల్పించి, నన్ను పరిహసించుచుంటివా? ప్రియా? అనినాడు. ఆమె విరసమగు కోర్కె పరసమెట్లగును? ఈ ఘట్టమున వాల్మీకి దశరథుడు రాముని గురించి వర్ణించుకొన్న మాటలను మనకు వినిపించినారు. రాముని విజయ యాత్రను దశరథుడు వర్ణించుకొనినాడు.

సత్యేన లోకాన్ జయతి దీనాన్ దానేన రాఘవః
గురూన్ శుశ్రూషయా వీరో ధనుషా యుధి శాత్రవాన్.

రాముడు, సత్యవ్రతముచే లోకాంతరములు జయించెనట. దానముచే దీనుల జయించెనట. శుశ్రూషచే గురువుల జయించెనట. తీక్షణ కోదండమును చేతబూని శత్రువుల జయించెనట. ఇట్లు విజయ సార్వభౌముడగు రామునెట్లు వదలుట? అని ఏడ్చినాడు. రాముని యందున్న గుణముల వన్నిటిని వినిపించి ప్రార్థించినాడు. ఆమె హృదయము ద్రవించలేదు. అరుణ కషాయిత నేత్రయై రాజును చూచి సత్య

ధర్మములకు పుట్టినిల్లగు ఇక్ష్వాకు వంశమునకు కళంకము తెత్తువా? ఇప్పుడే విషము మ్రింగి చత్తునన్నది. అప్పటికి మూడు జాముల ప్రొద్దు గడచినది.

దశరథుడు కౌసల్యను తలచుకొని ఆమె సత్స్వభావమును కొనియాడుచొని' ప్రజల దలచుకొని, ప్రజలాడబోవు మాటలకు బాధనొందుచు, రాముడు వనవాసము నందనుభవింపబోవు దుఃఖానుభవముల స్మరించి, కైకేయి మూర్ఖత్వము నెదుర్కొన శక్తుడు కాక చివరకు కైకేయిని పెండ్లాడు మంత్రపూర్వకముగ పరిగ్రహించిన పరిగ్రహమును వదల నిశ్చయించుకొనినాడు.

యస్తే మంత్రకృతః పాణిః అగ్నౌ పాపే మయా ధృతః
తం త్యజామి స్వయం చైవ తవ పుత్రం త్వయా సహ.

కైకా! అగ్నిసాక్షిగా నేనెందుకు పెండ్లియాడితినో ఆ ధర్మ సంబంధము నీతో నాకు తెగినది. పాపాత్మురాలా! నీతో టాయ్తే కాదు నీ కడుపున పుట్టిన కొడుకును కూడ వదలుచుంటిననినాడు. "ధర్మపాశేనబద్ధోస్మి" ధర్మ పాశమున బిగ్గుడ నైతినను మాటతో వరముల నొప్పుకొనినాడు.

నేనబద్ధమాడదలచలేదనినాడు. ధార్మికుడగు రాముని చూచుట కిచ్ఛయించుచుంటిననినాడు. ఓ! రాత్రీ! భగవతీ! నీవు గడవక ఇట్లేయుండుమని కాలమును ప్రార్థించినాడు. ఎందుకు? తెల్లవారగనే వచ్చు ప్రజలకుతానేమి చెప్పును? అందుకు. రామదర్శనమున కెదురుచూచుచు దశరథుడు దుఃఖ సముద్రమున మునిగినాడు. దశరథుడు భగవతియగు రాత్రికాలంను ప్రార్థించినాడు నీవు తెల్లనాయటకు తావునివ్వవద్దని ప్రభాతమువచ్చుచో రామునిపట్టాభిషేక కాలంపచ్చును. తానేమి జవాబివ్వవలెనో యని అతడుభయపడినాడు. ఎంత చిత్రమో చూశితిరా? జీవులకోర్కెలు తీవ్రములు. కాని జీవుల కోర్కెలనుసరించి కాలము నడుచదు. ఒక తుమ్మెద కమల షండములోని మాధుర్యము నాస్వాదించుటకై ఆ కమలమున వ్రాలినది. అంతలో సూర్యుడస్తమించినాడు.కమలము ముకుళించినది. అప్పుడా భ్రమరము కోరిక ఏమి? రాత్రి వేగముగ వెళ్ళగా ప్రాతఃకాలము తొందరగ రావలెనని, కారణమేమి? రాత్రి వెళ్ళగా భగవాను డుదయించగా కమలము వికసించును. తన ప్రతిబంధకము తొలగును కాని ఆ భ్రమరమునకు రాత్రికాలము సాయపడలేదు. ఆకాలము స్వతంత్రముగ ప్రవర్తించుచున్నదా? లేదు. కాలమునుకూడ జీవుల కర్మాను గుణ్యముగ నడువమని శాసించు శాసకు డొకడుండెను. ఆతుమ్మెద రాత్రిపోవును, సూర్యుడు ఉదయించును, నేను విముక్తనగుదును అనుకొను చుండగనే ఒక ఏనుగ

ఆ సరస్సునబడి ఆడుకొనగా ఈ భ్రమరమున్న తామరపూవే ఆ ఏనుగ కాలిక్రింద పడినలిగినది. ఇదియే సృష్టిఖండములోని చిత్రము జీవుని కర్మలను పరిపాకము గావించునది కాలమని మనము మరువకూడదు. కాలము స్వతంత్రమై వక్షపాతము కలిగి మనలనుద్ధరింపదు. క్రుంగదీయదు. దశరథుకుడా రాత్రిని దుఃఖరూపముగనే గడపవలసి వచ్చినది. "చేసుకొన్నవాడికి చేసుకొన్నంత మహాదేవయను" నానుడి దశరథునియందు సార్థకమైనది. దశరథుని ఈస్థితికి తెచ్చినది కామ పిశాచము. కావుననే "కామో ర్తాహి ప్రకృతి కృపణాః" అనినాడు కాళిదాసు.

ఒక్కమాట. దశరథుడు రాముని పట్టాభిషిక్తుని గావింప యత్నించినాడు. దైవము దానిని తారుమారు గావించినది. ఇక్కడ దైవమన ఆర్థమేమి? ఈ దైవ శబ్దమునకు భగవంతుడని అర్థము కాదు. వెనుకటి జన్మయొక్క కర్మఫలమొక విధముగ పక్వమై ఫల రూపము నొందియుండగా జీవుడు దాని నెరుగక వర్తమాన మున కొన్నిటిని సంకల్పించును. ప్రాక్తన కర్మఫలము అత్యంత బలముకలది కాగా దాని నెదుర్కొనుశక్తిలేని జీవునకు ప్రాక్తన కర్మఫలమిప్పుడనుభవింపక తప్పదు. భగవంతుడు కర్మ ఫల ప్రదాత. ఎప్పుడైన ఒకానొక ధీరుడు భగవంతుడు తనకు తాత్కాలికముగ పంపిపెట్టు కర్మఫలమును కాదని (లేక) నాకక్కరలేదని తాను ప్రయత్నించు ఫలమునకే స్థానమిచ్చి ప్రబల ప్రయత్నము కలవాడగుచో అతడు కృతకృత్యుడు కాలేకపోనునది సిద్ధాంతము కాదు. ప్రస్తుత ప్రయత్నమునకును, వెనుకటి కర్మకును ద్వంద్వయుద్ధము వచ్చుచో ప్రస్తుత ప్రయత్నము వెనుకటి కర్మను గెలువనేరదను మాట సామాన్యముగాని, తిరుగులేని సిద్ధాంతముకాదు. యోగ వాశిష్ఠమున వశిష్ఠుని నిర్ణయమిది.

పరం పౌరుషమాశ్రిత్య దంతైర్దంతాన్ విచూర్ణయన్
శుభేనాశుభముద్యుక్తం ప్రాక్తనం పౌరుషం జయేత్.

పండ్లను పటపట కొరికి నా వెనుకటి అశుభలమును నేటి నా ప్రయత్నము బలసి నివారించు కొందునని ఎవ్వడైన ప్రాక్తన కర్మఫలము నెదుర్కొనుచో అతడు తప్పక జయించుననినారు. ఇక్కడ దశరథుడు కామమునకు వశుడయ్యే కైకేయిచేత బంధింపబడినాడనునదే గ్రాహ్యము.

ఈ నాటికీ యుపన్యాసమును ముగింతము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

- వరోజు

శ్లో॥ సీతా మనోమానస రాజహంస
సంసార సంతాప హర క్షమా వన్
శ్రీరామ దైత్యాంతక శాంతరూప
శ్రీ తారకబ్రహ్మ నమో నమస్తే.

ఆర్య మహాశయులారా!

మన రామాయణ మహాకావ్య ప్రవచనములందిది తొమ్మిదవ రోజు. అయోధ్యాకాండ కథాభాగమున ఇది మూడవరోజు

విన్నటి కథాభాగము "తానొకటితలచిన దైవమొకటి తలచు"నన్న సూక్తికి సరితూగునట్లు దశరథేశ్వరుడు దుఃఖమున మునిగిన ఘట్టము.

నేటి కథాఘట్టము మానవ జీవితమున ఆకస్మికమునైవచ్చు వియోగాది దుఃఖముల నెదుర్కొని జీవితమునకు వన్నె చిద్దుకొనుటయే మానవుని ప్రత్యేకత యని రాముడు ప్రదర్శించిన భారతీయాధ్యాత్మిక రహస్య ప్రదర్శనా ఘట్టము.

కథా మాత్రముగ రామాయణాది గ్రంథముల పఠించి ఆనందించుటతో హృదయ గ్రంథులు విడివడవు. హృదయగ్రంథి విచ్ఛేదనముగ గాని జీవునకు ముక్తిలభించదు మోక్ష ప్రాసాదము నెక్కినగాని శాశ్వత సుఖానుభూతికి స్థానము లేదు రామాయణాది గ్రంథములయందు కథాభాగమునకు స్థానము లేదని నాభావము కాదు. సామాన్య అసామాన్య ధర్మములు సశాస్త్రీయములై చర్చింపబడి మనకు ఆచరణయోగ్యము లెట్లగునో వివరించుట మన గ్రంథములందలి కథాభాగములకు ప్రధానలక్ష్యము. ధర్మపురుషార్థఫలమే మోక్షప్రాసాద నిర్మాణము.

నేటి యువన్యాసమున రాముని ముఖముగ ధర్మసూక్ష్మములు చర్చించబడుట మీరు గమనింపదగు ముఖ్యవిషయము. కథాభాగమునకు వస్తువు.

భగవతియగు రాత్రి నీవిట్లే యుండి నామర్యాదను కాపాడుమని విన్నవించు కొన్న దశరథుని విన్నపమును వినలేదు. తనత్రోవనతాను వెళ్ళినది. ఉదయాద్రికి రానున్న సూర్యభగవానుడును అనూరుడు ఆయత్నము గావించి తెచ్చిన రథము

పధిరోపించినాడు. ముందుగ అనూరుని అనుజుకీరణి సహస్రములు అయోధ్యా నగరముగ వ్యాపించినవి.

నగరరాజము పతాకాలంకృతమైనది. రాజవీధులు కస్తూరికా జలసిక్తము లైనవి కర్మసాక్షియగు సూర్యభగవానులు సమస్త భూతములకును దర్శనమిచ్చినారు రామ పట్టాభిషేక మహోత్సవమును చూడ నువ్విళ్ళూరుచు వచ్చు ప్రజానీకమునకు రాజవీధులలోని కస్తూరికా గంధముల నందుకొన్న పిల్లగాడ్పులు స్వాగత మిచ్చు చున్నవి.

అప్పుడే తన శిష్యగణముతో వశిష్ఠమునీంద్రులు నగరములోని కేతెంచినారు.

అది వృద్ధభూపతియగు దశరథేశ్వరుని నివాసమందిరము. మునీంద్రులా రాజమందిర ద్వారము వైపుకు తిరిగినారు. మహారాజగు దశరథుని మందిరము ఆనగర రాజమునందలి బ్రాహ్మణ ప్రవరులతో నిండి కలకలలాడుచున్నది. తన ఆజ్ఞచే మంత్రులు చేకూర్చిన పట్టాభిషేక మహోత్సవ సామాగ్రినంతను వశిష్ఠ మునీంద్రులు తిలకించినారు. ఇక మునీంద్రులకు మహారాజ సందర్శనము కావలెను. కాలేదు.

వశిష్ఠుడు సుమంత్రుని మాత్రమే చూచినారు. పట్టాభిషేక మహోత్సవ కాలము అతిక్రమించరాదు. అందుకు యజమానిని తొందరబెట్టి కార్యోన్ముఖుని గావించుట ఋత్విక్పురోహితుల కర్తవ్యము. వశిష్ఠ మునీంద్రులు పురోహిత శ్రేష్ఠులు. మహారాజును తొందరజేసి కార్యోన్ముఖుని గావించుటకై సుమంత్రుని నియమించినారు.

అది రాజాంతఃపురములందొకటగు కైకేయీ మహారాణి భవనము. సుమం త్రుడు కైకేయీ భవనద్వారమునకే సరాసరి వెళ్ళినాడు. రాజు మేల్కొనలేదని అతడూహించినాడు. ప్రాతఃకాలమున రాజులమేల్కొలుపునవి మంగళ గీతాలా పములు అవి సూతుల కర్తవ్యము. సుమంత్రుడా కర్తవ్యమును నెరవేర్చుచు సుప్ర భాత మంగళగీతముల నారంభించినాడు రాజుళయ్యోగార ద్వారదేశమున

రాజా! శ్రీమంతమైన రాత్రి వెళ్ళినది. ప్రభాతమేతెంచినది. భవిష్యత్కాల కార్యనిర్వాహక సమయమాసన్నమైనది నీవిక నిద్రలెమ్ము. మహారాజా! రామ పట్టాభిషేక కార్యమును నెరవేర్చుము. అనునవి సుమంత్రుని మంగళగీతములు.

అది నిజమున కంతకాలమగా దశరథుడు నిద్రమేల్కాంచక కాలవిళంబన చేయ దగు రోజుకాదు. ఆసమయము వశిష్ఠ మునీంద్రుల రాకకు పూర్వముననే సభనలం కరింపదగు సుదినము. అదినేడు విపరీతమైనది.

నిజమునకు మంగళగీత ప్రబోధములు రాజులకు నిత్యనూతనములు. అయ్యాను దశరథునకీనాటి సుమంత్రుని మేలుకొలుపులు దుఃఖకారణములైనవి. అరువదివేల సంవత్సరములుగ వందిమాగధుల సుప్రభాత వాద్యఘోషములు ఆత్మానందదాయకములుకాగా నేడేల ఆ రాజునకవి దుఃఖప్రదమునైనవి? ఇదియే కాల ప్రభావము. భర్తృహరి "కాలాయతస్మైనమః" అని కాలపురుషునకు దోసిలొగ్గినాడు. సుమంత్రునకు రాజదర్శనమైనది. రాజు సుమంత్రుని చూచి నన్నికదాధ పెట్టవద్దనినాడు. సుమంత్రుని మేలుకొలుపు అంతతో ఆగినది. జరుగనున్న కార్యక్రమమునకు ఇక దశరథరాజు యజమానికాడు. కాలప్రభావము కైకయై అక్కడనే నిలచియున్నది.

సుమంత్రా ! నీవు వెళ్ళి రాముని తోడి తెమ్మని సుమంత్రునికి చెప్పినది. రాజేమియు మాట్లాడలేదు. సుమంత్రుడు కైక పలుకును రాజాజ్ఞగనే భావించినాడు. రాజు అక్కైల నిద్రకువశమైయుండెనని సుమంత్రునకు సందేహమును కలుగనివ్వ లేదు కైకేయి రాత్రి అంతయు రాజపట్టాభిషేక మహోత్సవమును తలచి తలచి రాజునకు నిద్ర సుఖము తడుగైనదని సుమంత్రునకు తెలిపినది.

సుమంత్రుడు రాముని తీసుకొని వచ్చుటకు బయలుదేరినాడు. రాజద్వార మును సమీపించినాడు. సుమంత్రుని వాహనము ముందుకు సాగలేదు. వారు వీరనక సామంతరాజులతో కూడ ఆ రాజద్వారము క్రిక్కిరియున్నది ప్రజల కోలాహల ధ్వని తరంగములు సుమంత్రుని వెనుకకు త్రిప్పినవి.

మహారాజెక్కడనుండెను ? రాజప్రతినిధులైనను ఇక్కడెవ్వరును కనబడ కుండిరేమి ? మన ఉపాయనములు తీసుకొను వారెవ్వరు ? అను ప్రజల సందేహ సంభాషణము సుమంత్రుని ముందుకు పోనివ్వలేదు. రాజాజ్ఞలేక తానా ఉపాయనముల తీసుకొను కార్యక్రమమును కొనసాగించుటెట్లు ?

సుమంత్రుడు బాధ్యతగల మంత్రిసత్తముడు. ప్రజల నొకవిధముగ సమా ధాన పరచినాడు. కైక చెప్పినది రాజాజ్ఞయా ? కైక మనిషా ? అన్న సందేహ మ్మాకనిని వెంటాడినది. వెనుకకు మరలినాడు. రాజును మరల మేల్కొలుప నారంభిం

చినాడు. కన్నులు తెరచి సుమంత్రునికి విశదముగ సమాధానమిచ్చుటకు రాజు సమర్థుడైలేడు. అయ్యను ఎట్లో కన్నులతెరచి, రామునేల తీసుకొని రాలేదని తన ఆతురతను ప్రకటించినాడు.

సుమంత్రుడీక ఆలసింపలేదు. ఆతడు రామాంతఃపురమున కేగినాడు. రాచ బాటలన్నియు జనసమూహముచే క్రిక్కిరిసియుండి సముద్రమా ఇది? అన్నట్లున్నను సముద్ర మధ్యమున చొచ్చుకొనిపోవు మకరములవలె ఆ ప్రజావాహిని నుండి ఈదుకొని రాముని తోడితెచ్చుటకు వెళ్ళినాడు.

అది రామాంతఃపురము కాషాయాంబరధారులు వేత్రహస్తులై కొందరు వృద్ధులును, మరికొందరు యువకులును, నానారూపధరులెండరో ఆ ద్వారదేశముల వద్ద కావలా కాయుచుండిరిగాని సుమంత్రుని వారెవ్వరును అడ్డలేదు. రాజాంతఃపురమునం దాతడు సర్వస్వతంత్రుడు. రాముని ఎత్తుకొని ముద్దాడిన మంత్రిసత్తముడు. అయ్యను తాను ద్వారము వద్దనే నిలచి రాముని అనుమతికై వేచినాడు.

ఒక్కక్షణకాలమునసే రాముని ఆహ్వానముందినది సుమంత్రునకు. అది సుమంత్రుని జీవితమునందొక మధురక్షణము. అప్పుడు సుమంత్రున కబ్బిన రామ దర్శనము మధురాతిమధురము.

రాముడప్పుడు సీత తనప్రక్కననిలచి వింజామర వీచుచుండగా సీతతోకూడ సుమంత్రునికి దర్శనమిచ్చినాడు అదియే సుమంత్రుని మహాభాగ్యము. నిజమునకు రాముడుదాత్మారాముడు. సీత ఆ అఖండ చైతన్యమునందంతర్లీనమై యుండు సృష్టిశక్తి. అఖండాత్మయుదా మహాశక్తి అంతర్లీనమైనప్పుడు రాముడొక్కడే. ఆ రాముడిప్పుడు దశరథరాముడై జానకితో కూడ ఇద్దరుగ సుమంత్రునకు దర్శన మిచ్చినాడు. కథకు వత్తము.

రాముడిప్పుడు కౌసల్యా యువరాజు. వ్రతదీక్షితుడు. అలంకృతుడు. మణి మయసువర్ణాసనమున కూర్చొనినాడు. అతని విశాల వక్షము సువర్ణోత్తరీయముచే కప్పబడియున్నది. అతని వినీలదేహమున పరాహరక్తమువలె కన్నుచెదిరి పోవు రక్తచందనములంకరింపబడి యున్నది. అది కుంకుమ పూవుతో మిశ్రమమై ఘుమ ఘుమలాడు సుగంధముల గుబాళించుచున్నది.

ఆ రామభద్రుని మైథిలీ సీతాకాంతయే నాడు అలంకరించియుండవచ్చును.

ఆ చందనగంధములవందలి రక్తిమయు అందుండి ఘుమ ఘుమ లాడుచు గుబాళించు సువాసనలును రాముని లోకోత్తరత్వమును ప్రదర్శించుచున్నవి. అట్టి సీతారాముల అప్రాకృతశరీరములు సుమంత్రుడను నేత్రగోచరములై ఆతని ధన్యునిగావించినవి.

రాముని పట్టాభిషేక యత్నము చైత్రమాసము. కావుననే సీతతోకూడిన ఆ రాముని చిత్తానక్షత్రముతోకూడిన చంద్రునిగ వర్ణించినారు ఆదికవి. "చిత్రయా శశినం యథా" అని అప్పుడు రాముడు పూర్ణచంద్రునివలె నుండెననుటతో రాము చంద్రుని వర్ణనను ముగింపలేదు. రాముని సూర్యునకును కుబేరునకును పోల్చినారు.

ఆ రఘువీరుడప్పుడు సూర్యునివలె కూడ వెలుగుచుండెననినారు. అంతేకాదు అతడు కుబేరునివలె కూడ నుండెనట. ఇట్లు రాముని వర్ణించుటలోని ప్రత్యేకత ఏమి ?

వైశ్రవణ సంకాశుడని రాముని పోల్చి కాబోవు ఈ మహారాజు కోరిన వారి కోర్కెలనెల్ల తీర్చదగు దాతయని సూచించినారు. అంతేకాదు. వేదమున కుబేరుని వర్ణన 'కామేశ్వరో వైశ్రవణోదదాతు'. అని ఉన్నది. ఆ కామేశ్వరుడగు కుబేరు డీతడేనని వేదార్థమును వ్యాఖ్యానించినారు చైత్రశుద్ధపూర్ణిమ నాటి చంద్రమండలము వకు పోల్చి రాముని నిరావరణ విశుద్ధ తేజమును ధ్వనించినారు. ఎట్లందురా?

హేమంతము కాదు గావున చంద్రమండలము మంచుచే ఆవరింపబడదు. వర్షఋతువుకాదు కావున మేఘములచే కప్పబడియుండదు. ఆవరణ రహితమును ఆచ్ఛాదనారహితమునగునదే పరబ్రహ్మతేజము. మరొక్కవిశేషము. రాముని సూర్యునికి పోల్చినప్పుడు "తంతపంతమినాదిత్యం" అని మధ్యాహ్నభాస్కరునికి పోల్చి "ఉపమన్యం స్వతేజసా" తన స్వీయ తేజమున వెలుగుచుండెననినారు. ఈ ఉపమానముచే సూర్యచంద్రులకు తేజమును కూర్చువాడీ రాముడేనని స్వప్రకాశ బ్రహ్మచైతన్యమును స్ఫురింపచేసినారు. ఈ ఘట్టమున మరొక్కవిశేష మున్నది.

సూర్యచంద్రతేజములను రాముని యందు వర్ణించి సూర్యకాంతితో శత్రు వులకు చూడరాని ప్రతాపవంతునిగను చంద్రకాంతితో ప్రజలకు ఆహ్లాదకరుడుగూడనైయుండెనని సూచించినారు. ఈ ఘట్టమున మరొక్కవిశేషమేమన ? ఇట్టి రాముని సుమంత్రుడు చూచెననక "దదర్శసూతః" సూతుడు చూచెనని వాడినారు మహర్షి. ఇది యొక ప్రత్యేకమగు ప్రబోధము.

బ్రాహ్మణాది వర్ణములవలె సూతజాతి అత్యంత పవిత్రముకాదు. అయ్యను మహర్షులకు గూడ అందరానిఇట్టి దర్శన మబ్బినదని భక్తికి ప్రత్యేకస్థానమునిచ్చి నారు. సుమంత్రుడు భక్తాగ్రగణ్యుడు. "భక్త్యాతుష్యతి కేవలం నచగుణైః భక్తి ప్రయోమాధవః" అని వ్యాఖ్యానించినారు. కథకు వత్తము.

సుమంత్రుడు రాముని దర్శించినారు. రామునకు ప్రదక్షిణ నమస్కారముల గావించినాడు. రామా! అని సంబోధించి మంగళాశీస్సుల నొసంగి దశరథుని ఆజ్ఞను తెలిపినాడు.

రాముని కైకేయీ మందిరప్రవేశము

రాముడాలసించలేదు.

పితృవాక్య పరిపాలనా రూపధర్మ నిర్వహణము రామావతారము నందొక ప్రత్యేకమగు ఆదర్శము.

దశరథ కైకేయీల సమాలోచన యందేదియో తనకొక మహాఫలము చేకూర నున్నదనియే రాముని ఆశయము. నవతి తల్లియే యైనను కైకయందాతనికి భేద భావములేదు. ఇదికైక ఒప్పుకొన్నమాట.

రాముడాసనము నుండి లేచినాడు. అతడు రసజ్ఞశేఖరుడు. తనమెడలోని మంచిముత్తెముల సరమును తీసి సీత మెడకలంకరించినాడు. ముఖమండలమున చిరునవ్వు మొలకెత్తగా సీతకు తన వయసమును తెలిపినాడు. ఆ వైదేహి తన క్రీగంటి ప్రసారముల రామునిపై ప్రసరించవేయగా ఆమె కటాక్షముక్తి సీలోత్పల మాలికయై రాముని అలంకరించినది. ఆ సీతారాముల మధుర రసానుభూతి ఆక్షణము వందంతలో ముగిసినది.

ఆగృహాభ్యంతరము నుండి రాముని అడుగులు ముందుకు సాగినవి. ద్వార దేశము దాక సీతయు రామునసుసరించినది. ఊరక అనుసరించుటకాదు. భర్తకు కొన్ని మంగళాశాసనముల నందించినది.

రాజసూయమను యజ్ఞము రాజులు కావింపదగు ఒక మహాధ్వరము. అది వారికి సామ్రాజ్యాభిషేకము. భావికాలమున రాముడా మహాధ్వరమున బ్రాహ్మణ ప్రవరులచే అభిషిక్తుడు కావలెనని ఆమెస్మరించి ఆశాసించినది. ఇంద్రుడు ఇంద్ర

వదవి నధిష్ఠించినట్లు తనభర్తను ఈ భూభాగమునకు దశరథుడు రాజును చేయగల డవి ఆమెభావించియే తనభర్త రాజుగాయ మహాయజ్ఞ దీక్షితుడు కాగలడని ఆశీస్సు నిచ్చినది.

చిన్నవారు పెద్దవారి నాశీర్వదించుటయా? అనకుడు. ఇవి మంగళాశాసన ములు. ఇవి మంత్ర పూర్వకములు కావు. వీటినెవ్వరైన పలుకవచ్చును. దిగధిష్ఠా దేవతల రక్షణము రామునకు గలుగవలెనని పలికినది.

సీతా కాంతను నిలుమని ఆజ్ఞాపించి రాముడు అంతర్గృహమును చాటినాడు సుమంత్రునితోకూడ.

అది ప్రథమద్వారము. లక్ష్మణుడు వెంబడిలేని వయనమెప్పుడును రామునకు జరుగదు.

లక్ష్మణుడు తన ప్రభువగు రామునకు భ్రాతృచారములు పట్టగా రాముడు రథాధిరూఢుడయ్యెను. రామలక్ష్మణుల రథము బయలుదేరినది. మందముగ సాగి వేగము నందుకొన్నది.

విజయునకది క్రిక్కిరిసి యున్న జనమధ్యము. ఆయ్యెను ఆజనసమూహము రాముని రథమును చుట్టుముట్టి విరగ ద్రొక్కుకొనుచు రథమును అడ్డలేదు. నాటి సమాజము క్రమ శిక్షణ లేని సమాజము కాదు. రక్షణ శాఖ వారి లాఠీ దెబ్బలతో నాటి ఉత్సవములుండెడివికాదు.

నేటి మంత్రుల ఉపన్యాస వేదికలు కొట్లాటలతో బాష్పవాయు ప్రయోగము లతో నడవగా నేడు నాగరికత వృద్ధి నొందినదని మనకుమనకోవచ్చును. నవసమాజ క్రమ వికాస వాదము భారతీయతకు కళంకము ప్రకృతమనుసర్తామః.

అంతఃపుర కాంతలు చల్లు కుసుమ సహస్రములును లాజాక్షతలును రాముని రథముపై జల్లుచు జల్లులై పడుచున్నవి. అప్పుడే కన్యకామణులతోకలసినస్వరంధ్రీ మణులును రాచబాటలు క్రిక్కిరిసి తీర్చి దిద్దిన జనసంఘమును రాముడు రాజగుట మామహాభాగ్యమను చెప్పుకొను కోలాహల ధ్వనులు మిన్నుముట్టు చుండగా రాముని రథము జనమధ్యమును దాటినది రాముడును వారి చూపులకు మరుగు పడినాడు. కానీ ఇక్కడొక్క చిత్రము జరిగినది.

రాముని చూచువారల చూపులు మాత్రము రామునుండి మరలలేదు. వారి చూపులు రామునితో అశ్లేషయనించినని. మరి చూచు వారి మనస్సులో? అన్వయ

రామునితోడనే వెళ్ళిపోయినవి. ఆచూపరులు తమచూపులను, మనస్సులను తమ దగ్గరకు మరలించుకొన ప్రయత్నించిరిగాని వారు సమర్థులు కాలేదు రాముని దివ్య సౌందర్య సౌభాగ్యములను మరగిన నేత్రేంద్రియము తిరిగివచ్చునా? మనస్సు కూడ అంతియే.

"స హి తస్మాన్ననః కశ్చిచ్చక్షుషీ వా నరోత్తమాత్
నరశ్శక్నోత్యపాక్రష్టు మిక్రాంతేపి రాఘవే"

నరోత్తముడగు రామునివెంట నరుల చూపులను మనస్సులను వెళ్ళి తిరిగి రాలేదట. మహర్షివర్ణనమిది భావ గర్భితమగు ఈ వర్ణన మనకు ఆస్వాద యోగ్యముకావలెను.

ఇక్కడి "నర, నరోత్తమ" పదములు సహృదయముల స్పందింపజేయు పదములు.

నరోత్తమ పదము భగవద్వాచకము. పురోషోత్తముడు భగవంతుడు ఉత్తమః పురుష స్తన్యః పరమాత్మేత్యుదాహృతః- గీత.

అని గీతా శాస్త్రము. రాముడిక్కడ పురుషోత్తముడు. అతడే నరోత్తముడు. నర పదముచే జీవులను తెలిపి, నరోత్తమ పదముచే రాముడు భగవంతుడగుటను తెలిపి, ఆభగవంతుని అనుసరించిన భక్తశేఖరుల చక్షురింద్రియమును, మనస్సును కూడా మరల వెనుకకు మరలి రాలేదనినారు చూచువారిచూపులనుండి దాటినవాడెవరు రాఘవుడు. రఘువంశమునందవతరించి దశరథపుత్రుడని వ్యవహరింపబడు వ్యక్తి. ఇతడు కథలోనిపాత్ర. ఇక్కడ భారతీయాధ్యాత్మిక శాస్త్రములు భగవంతుని రెండు విధములుగ వర్ణించినవి. ఒకటి సగుణము. అనగా విగ్రహరూపము. ఇది మనస్సుచే గ్రహించి, చక్షురాంద్రియములచే అనుభవించదగు స్వరూపము. రెండవది నిర్గుణము ఇది కేవల అనుభవరూపము. సచ్చిదానందైక స్వభావము. ఇది అవ్యక్తము. సగుణము వ్యక్తము. నేను అనువదమునకు వాచ్యమైన జీవభావము నందుపాసించ దగినది సగుణము. జీవుడు కించిజ్ఞుడుకాగా భగవంతుడు సర్వజ్ఞుడు. సర్వజ్ఞుడగు భగవంతుని కించిజ్ఞుడగు జీవుడు ఆరాధించి, దర్శించి కృతకృత్యుడు కాగలడు. సగుణము భక్తికి ఆధారము. సేవ్యసేవక భావము కలది భక్తి. సగుణమూర్తి యందలి రూపమాధుర్యమును గుణ మాధుర్యమును చొక్కిన భక్త శేఖరుని మనస్సు తుచ్ఛములగు విషయ సౌఖ్యముల వైపు తిరగదు. ఈఘట్టమున మీకు భోరనామాత్యుల భాగవత సూక్తిని వినిపింతును.

పీ. మందార మకరంద మాధుర్యమునదేని
మధువంబు వోవునే వదనములకు

నిర్మల మందాకినీ వీచికలదూగు
రాయంచ సనునే తరంగిణులకు

లలిత రసాలపల్లవ ఖాదియైచొక్కు-
కోయిల సేరునే కుటజములకుఁ

బూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరక
మరుగునే సాంద్ర నీహారములకు

తే. నంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృత పాన విశేషమత్త
చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు
వినుత గుణశీల మాటలు వేమునేల.

ఈ పద్యము నాంధ్రులందరు చదివి యుందురు. ఆంధ్రుల జిహ్వాలన్నియు ఈ పద్యమధువును గ్రోలియే యుండును. దీనికి ప్రతిపదార్థమును నేను చెప్పనక్కరలేదు. అయ్యను దీని భావమును కొంచెము చెప్పెదను.

ఏభక్త శేఖరుల హృదయము తేటి, హంస, కోయిల, చకోరపక్షి అను ఆర్యగ్రంథులలోని రసాస్వాదన చాతుర్యము కలది అగునో వాని హృదయము భగవానుని దివ్య పాదారవింద చింతనలోని మాధుర్యమును చొక్కి ప్రపంచాభిముఖము కానేరదట. ఇది ప్రహ్లాదుని అనుభూతి నాలుక యున్నమాత్రమున ప్రతి వ్యక్తియు పదార్థము నందలి రుచిని గ్రహింపజాలడు. అన్ని జంతువులకును నాలుక యున్నది. ప్రతి కీటకమును తామరపువ్వుపైన వాలకపోదు. కాని తామర పువ్వువందలి మధువును గ్రోలదగు అర్హత తుమ్మెదకే కలదు. సృష్టిలోని ఈ ప్రత్యేకతను ఏ బుద్ధిమంతులును తారు మారు చేయజాలరు. మిగిలినవన్నియు అంతియే. అందము మానవులే కావచ్చును. అందరికిని బుద్ధి యుండవచ్చును. హృదయమున్నంకమాత్రమున ఆ హృదయము భగవద్భక్తి రసాయనము నందు కొనవలెనని ఎక్కడున్నది? ఈగకూడ తీపి పదార్థమున వాలును. కాని అదివెంటనే అమేధ్యమునందును చీము, రక్తముకారు పుండుమీగ కూడ వాలును. తుమ్మెద వేప పూవుపైన వాలదు. ఇంతవరకు మీకు చెప్పినది సగుణభక్తి. రామదాసు, మీరా

కొయి ....దలగువారి అనుభూతులెన్నియో ఈ భక్తికి ఉదాహరణలు కావచ్చును. ఇప్పుడు చెప్పిన శ్లోకమువలన వాల్మీకి నిర్గుణ బ్రహ్మమును వర్ణించెనా? కేవం సగుణ బ్రహ్మమునే వర్ణించెనా? అనునది ప్రశ్న కావచ్చును. ఈ రఘు పీరుడను పేర వ్యవహరింప బడువాడు సచ్చిదానంద బ్రహ్మమే సుమా? అని కూడ ఈ శ్లోకము నందా మహర్షి ధ్వనించక పోలేదు. ఆపరోత్తమ పదమునే అఖండబ్రహ్మ చైతన్యమునుచెప్పి, ఆ బ్రహ్మానందరసానుభూతినొందిన జ్ఞాని యొక్క చక్షు రాదీంద్రియ వర్గమును ఆ వర్గములోటి తాదాత్మ్యమునొందిన జీవ చైతన్యమును మరల ఈ ద్వైత ప్రపంచానుభవమును పొందరు అని స్పష్ట పరచినారు. ఇచ్చటి నరోత్తమ పదము నిర్గుణ బ్రహ్మపరము ఎట్లుందురా?

ఏ వ్యాస భగవానులు మహాభారత మధ్యమున గీతా శాస్త్రముచే అద్వైతా మృత వర్షమును కురిపించెనో ఆవ్యాసభట్టారకులే మహాభారత ప్రారంభమున తద్గ్రంథ నిర్విఘ్న పరిసమాప్తికై చెప్పిన మంగళ శ్లోకమున నరోత్తమ పదమును వాడినారు. ఆశ్లోకమిది

"నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమం
దేవీం సరస్వతీంచైవ తతో జయముదీరయేత్.

ఇచ్చట నారాయణునికి నమస్కరించి నరునకు, నరోత్తమునికి నమస్కరించి దేవియగు సరస్వతికిని మ్రొక్కి జయమును ప్రారంభించినాము.

ఇక్కడ భారత వ్యాఖ్యాతయగు నీలకంఠుడు నరోత్తమ పదమునిట్లు వ్యాఖ్యానించినారు.

"స్వావిద్యాసృష్టసంసేన తాదాత్మ్యం యో గతో నరః
స జీవః స పరంబ్రహ్మ నరోత్తమ పదాభిదం.

ఏజీవుడు తన అవిద్యచేతనే ఈశరీరాదికమును సృష్టించుకొని, ఈశరీరాది తాదాత్మ్యముచే నేను జీవుడను, సంసారిని, కర్తను, భోక్తను అని జనన మరణ ప్రవాహము వీడుచుండెనో ఆజీవుడు పరబ్రహ్మయేగాని యథార్థముగ జీవుడుకాడు. అతనినే అనగా ఆ పరబ్రహ్మనే నరోత్తమ పదముచే నమస్కరించి, సంసార జయమగు జయనామక గ్రంథమును ప్రారంభించినారట వ్యాసుడు.

ఈ వ్యాఖ్యానము నాస్వీయముకాదు. వాల్మీకి ప్రజలనిట్లు వర్ణించి ఆ విధమగు అనుభూతిని పొందిన ప్రజలేమని తలపోసిరోకూడ వర్ణించినాము. ఆశ్లోకమిది.

"యశ్చ రామం న పశ్యేత్తు యం చ రామో న పశ్యతి
నిందితస్సవసేల్లోకే స్వాత్మాప్యే నం విగర్హ తే॥

ఈ శ్లోక తాత్పర్యమిది.

ఎవ్వడు రాముని దర్శించడో ఎవనిని రాముడు చూడడో వాడు లోకమున నిందార్హుడుగనే బ్రతుకునట. అంతేకాదట. తన ఆత్మయే వీనిని నిందించునట. ఈ మాట నాటి ప్రజలమాట. ఆనాటి ప్రజలు ఆనాడు రాముని చూడవచ్చును. మనమిప్పుడెట్లు చూతుము? అనునది ముఖ్యమగు ప్రశ్న ఈ ప్రశ్నకు సమాధానమును కుదుర్చు కొన్నప్పుడే రామాయణ కావ్య పఠన ప్రయోజనము మనకు కలుగును. దీనికి సమాధానమిది.

వాల్మీకి నాటి ప్రజలనుకొన్నమాటనే చెప్పినను యచ్ఛబ్దమునిబాడి ఎవ్వడు ఆట్లు రాముని దర్శించడో అనినారు. అక్కడ కాలనిర్దేశము లేదు. ఎవ్వడైనను ఎప్పుడైనను అనగా ఏకాలముండైనను రాముని దర్శించడో రాముని చూపునందు పడడో అని అర్థము. అప్పుడా రాముడు దశరథ రాముడు కాడు. అతడు ఆత్మ రాముడు. దానికర్థము ఎవ్వడు ఆత్మదర్శనమునకై యత్నించడో ఎవ్వనిని భగవంతుడు జ్ఞానిగ దగ్గరకు తీసుకొనడో అతనిని లోకమునిందించుట కాక ఆత్మయే నిందించునట. ఇక్కడ ఆత్మయననేమి? మనస్సని అర్థము. మనస్సు నిందించు టేమిటి? ఆహా! ఈ జీవుడెంతటి పశువు? మానవశరీరమును ధరించి, ఇంద్రియ పాటవముకలిగి పశుపులకంటె గొప్ప విజ్ఞానవంతుడనునేనని నిర్వహించు తానెవ్వడైనట్లు చరించు చుండెనో మనస్సు ఆధారముగా గొని ఏల కారించడు? అని మనస్సు ఆత్మను చివాట్లుపెట్టునట. ఆత్మను చివాట్లు పెట్టుట మనస్సిని నిందించునని అర్థము. భగవంతున కత్యంత సన్నిహితుడు ఆత్మజ్ఞాని. జ్ఞానీత్వాత్మైవమే మతం" అనినారు గీతాచార్యులు. ఇక కథకు వత్తము.

రాముని రథము కైకేయీ మందిరద్వారముకడ నిలచినది.

రాముని స్థితప్రజ్ఞత్వము

అది రాముని పితృపాదుల శయ్యాగృహము. ఆతనికి మధ్యమాంబయగు కైకేయియు అక్కడనేయున్నది.

మాతృపితృమూర్తి ద్దరును రామునకు ఆరాధ్య దైవములే. కైక సవతి తల్లియను తారతమ్యము రామునకు లేదు. రాముడు ముందుగ పితృపాదుల పాద పద్మములపైబడి వందన మాచరించి, తల్లియగు కైకకు సాష్టాంగ ప్రణామము గావించినాడు. కాని రామునకొక విషమసమస్య ఎదురై నిలచిన దానమయమునన్నే. రాముడు భరింపరాని సమస్య కది.

రాముడింతవరకు తనతండ్రి తనపైచూపు వాత్సల్యరసమునే ఆస్వాదించెను గాని అరుణ కషాయిత నేత్రములతో తన్ను చూచుట అతడెరుగడు. దశరథుడెప్పుడును రాముడు తన దగ్గరకురాగా తన రెండుచేతులతో రాముని కౌగిలించి, శిరమును మూర్కొని ఆనందించునేగాని ఉపేక్షాభావముతో రాముని చూచుట దశరథుడును ఎరుగడు. ఈనాడాభాగము లోపించినది. దశరథుడు రాముని మాట్లాడించ నుత్సాహించలేదు. దశరథుని ముఖమండలమున రాముని దర్శించిన ఉత్సాహము రవంతయైనను కనబడలేదు. దీన స్వరమున రాముని సంబోధించినాడు తప్పని సరిగ పలంరించునట్లున్నది ఆ పలకరింపు.

తన తండ్రి ఈనాడట్లు తననుగురించి ఎందుకుండెను? తనలోపమేమి? తానే మైన అపరాధము గావించకున్న తన తండ్రి తన నట్లెందుకు చూచును? అను సమస్య రాముని నెదుర్కొన్నది. రాముని అంతరంగము వెనుకకు మరలినది. ఆత్మ పరీక్షను చేసుకొన్నది. రాముని అంతరాత్మకెక్కడను సమాధానమందలేదు. బహిర్ముఖమైనది.

రాముడు కైకవైపుకు తిరిగినాడు. తల్లికి మరల మ్రొక్కి అజ్ఞాతముగ తండ్రికి నేనేమైనా అపరాధమును గావించితినా? తల్లీ! తండ్రిగారిట్లుండుటకు కారణ మేమియో నీవు కనుగొని చెప్పుమని వినయ విధేయతలకు గురువై యుండదగు రాముడు కైకను అడిగినాడు.

ఈ శరీరము వచ్చుటకెవ్వడు ఆధారమో ఆతండ్రికంటే దైవములేదను తన ఆత్మనిశ్చయమును తెలిపి, ప్రత్యక్షదైవము తండ్రియేయని అట్టి దైవతమును

పూజించుట కంటె నాకు వేరొక వ్రతములేదని పిత్రాజ్ఞాపాలనమును చేతునని చేయు టకుద్యుక్తుడయ్యే కైకను అడిగినాడు.

స్వార్థమొక విచిత్రమగు రక్కసి. స్వార్థమునకు బాహ్యమగు ఆకారము లేదు. లోకావవాదమునకు వెరువని తనము దాని శరీరము. దయాదాక్షిణ్యములకు అణుమాత్రమైన స్థానమును కల్పింపక పోవుటయేదాని నిజాత్మ.

ఇప్పుడు కైక కర్తవ్యమేమి? తన వరద్వయమును తెలుపవలెను. సిగ్గు అనుగుణము కైకను అడ్డగించినచో కైక తన కార్యమును సాధించుకొనజాలదు. కైకలజ్జాత్యాగమునకు ఇంకుగొనలేదు. సంపూర్ణముగ సిగ్గును వదిలినది. ఆ రాత్రి అంతయు తనకును దశరథునకును జరిగిన సంభాషణను రామునకు చెప్పినది. శంబరాసురుని యుద్ధమున దశరథుడు తనకిచ్చిన వరములను రెంటిని నేనిప్పుడు కోరితినన్నది. కాని ఆవరముల నిచ్చిన నీ తండ్రి ఆజ్ఞను నీవు తప్పక పాలింతు వన్నచో ఆవరములెవ్వియో రామా! నీకుతెలిపెదనన్నది. ఈ సంభాషణ అంతయు దశరథుని ఎదుటగనే జరిగినది. దశరథుడు విసుచునేయుండెను. దశరథుని నోట అడ్డుమాట రాలేదు. దశరథుడు సత్యపాశబద్ధుడై మాటాడలేదు.

రామునకింతవరకు దశరథుడు కైకకు రెండు వరముల నిచ్చెనని మాత్రము తెలసినది ఆవరములనిప్పుడు తనతండ్రి సత్యవ్రతుడై కైకకు అప్పుతీర్చ కొన వలసిన వాడయ్యెనని అర్థమైనది. ఆబాధ్యత తన యందుండెనని స్పష్టమైనది. ఆ రెండు వరముల నేమూపముగ కైక కోరినదో మాత్రము అతనికి నిర్ణయముకాలేదు. అయ్యను తండ్రి ఆజ్ఞపాలించుటలో తనను అనుమానించి తనను గట్టి వరచుటకు కైకచేసిన ప్రయత్నమునకు మనసు కలతనొందగా అతడిట్లు ప్రతిజ్ఞనుగావించినాడు.

"అహం హి వచనాద్రాజ్ఞః పతేయమపి పావకే
భక్షయేయం విషం తీక్ష్ణం మజ్జేయ మపి చార్ణవే.

తల్లీ! తండ్రిగారి ఆజ్ఞయైనచో జ్వలించుచున్న అగ్నియందు ప్రవేశింతును. హాలాహలము సైతమును భక్షింతును. సముద్రమున దుమికుటకైనను సంశయింపను. ఇది నావ్రతిన అని దృఢముగ పలికి రాముడు రెండుమాటల మాట్లాడువాడు కాదని ముక్తకంఠమున పలికినాడు. "రామోద్విర్నాభిభాషతే" అని.

కైకకు ధైర్యము వచ్చినది. దశరథునితాను కోరిన రెండువరము లెవ్వియో రామునకు తెలిపినది.

"సప్త సప్తచ వర్షాణి దండకారణ్యమాశ్రితః
అభిషేక మిమం త్యక్త్వా జటాజిన ధరో వస
భరతః కోసలపురే ప్రశాస్తు వసుధామిమాం.

మొదటివరము రాముడిప్పుడు కట్టుకొను పట్టాభిషేకమును వదిలి నారచీరెల ధరించి, జడదారియై దండకారణ్యభూములలో పదునాలుగు సంవత్సరములు గడు పుట. రెండవవరము ఈ కోసల సామ్రాజ్యలక్ష్మికి భరతుడే రాజగుట. ఈమాటలను నీకు చెప్పుటకు రాజునకు మొగము చెల్లకయున్నది, నీవు నీతండ్రిని సత్యవ్రతుని గావింపుమన్నది. రాముని మనఃపరివర్తన మెట్లుండునో ఊహింపజాలడనునది త్రికాల సత్యము. అంతేకాదు కైకేయి తన మాటనుగా రామునకు తెలియ చేయుచుండ రాముని పట్టాభిషేక మహోత్సవమును చూడదలచుకొన్న దశరథుని స్థితిని ఊహించుట మాత్రము సాధ్యమా? ఈ రెండు పాత్రలను ఒకే ప్రాసున రెండువైపుల నుంచి తూచుట మానవబుద్ధికి సాధ్యమగునదికాదు. ఉపనిషద్విజ్ఞాన వేత్తలగు వారి బుద్ధి తులాదండమునకు రెండుపైపులా హెచ్చబడిన పాత్రలలో ఈ రెండు పాత్రలనుంచి, తూచినగాని ఈ రెండు పాత్రలలోని ప్రత్యేకత బోధపడదు.

ఇందొక పాత్ర సంసారియై సుఖదుఃఖములనుభవించుభోక్త. అతడు దశరథుడు. రెండవపాత్ర సుఖదుఃఖములకు నిలయమై యుండు గృహస్థాశ్రమము నందుండి లోకవ్యవహారమున వ్యవహరించుచు, చూడువారల కళ్లకే కన్పట్టుచు తాను కర్తకాక, భోక్తకాక సాక్షియై యుండుపాత్ర. అతడే రాముడు. రెండవది అసలుగా రాముని స్థితి మానవమాత్రునకు సాధ్యమా? అను సంశయము మనకు కలుగుట అసహజముకాదు. పారమార్థిక ప్రపంచము నందడుగిడని మన మనస్సు సుఖదుఃఖములకు సాక్షియై యుండుటను నమ్మజాలదు. నమ్మజాలని విషయమును శాస్త్రములు చెప్పునా? అను విషయమున శాస్త్రవిశ్వాసమైన యున్నచో అభ్యాసము ఇట్టి సిద్ధత్వమును కల్పించునని నమ్మగలము. గౌడపాదులు చెప్పినమాట ఇది.

"త్రిషు ధామసు యద్భోజ్యం భోక్తా యశ్చ ప్రకీర్తితః
వేదైతదుభయం యస్తు స భుంజానో న లిప్యతే.

జాగ్రత్స్వప్న సుషుప్తులలోని భోక్తృభోజ్య భావము నెవ్వడు తెలిసికొనునో అతడు సుఖదుఃఖముల ననుభవించియు ననుభవించని వాడయ్యెయుండునట. ఇదియే జీవన్ముక్తి కావున ఇక్కడ వాల్మీకి మహర్షి రాముని అంతఃకరణమున ప్రవేశించి తన విశుద్ధాంతఃకరణమున రాముని దర్శించి, సత్యజ్ఞానానంద లక్షణ లక్షితుడై యున్న రామ బ్రహ్మము ఆసమయమునందెట్లుండెనో తెలిపినారు. దశ రథుడెట్లుండెనో కూడ చెప్పినారు.

"ఇతీవ తస్యాం పరుషం వదంత్యాం
న చైవ రామః ప్రవివేశ శోకం
ప్రవివ్యథే చాపి మహానుభావో
రాజా తు పుత్రవ్యసనాభితప్తః అనినారు.

కైక ఈ విధమగు కఠిన వాక్యము పలికినను రాముని ముఖమండలము పందేమాత్రమును వైవర్ణ్యము కలుగలేదట. మఱస్సుకూడ వ్యథను చెందలేదట. కావున రాముని "మహానుభావః రామః" అనినారు. పుత్రవ్యసన సంతప్తుడగు దశ రథుని, "తు" అను పదముచే పిడదీసి, "రాజా దశరథః ప్రవివ్యథే" అని తెలిపి నారు. దేహాత్మ బుద్ధికలిగి, రాజునన్న అభిమానము తో కూడినవాడు దశరథుడు బాధపడినాడు. (జీవుడు, సంసారి) రాముడు సంసారియై కన్పట్టు అసంసారి. తరువాతేమి జరిగినది ?

రాముడతి సంతోషము తోడనే రాజ్యమును వదిలినాడు. కైకేయితో భరతుని రప్పించి రాజ్యమును ఏప్పగింతునని సంతోషముగనే చెప్పినాడు. కైకయు సంతసించినది. కాని భరతుడు వచ్చిన తరువాతగదా? రాముని అరణ్యగమనము? అనునది కైకకు సమస్యయైనది. రాముడరణ్యమున కేగుటకు కాలవిళంబనమును సహించలేకపోయినది. అందుకై ఆమె రామునివంక తిరిగి ఇట్లన్నది.

రామా! నీవు అరణ్యమున కేగునంతవఱకును నీ తండ్రి దశరథుడు స్నాన పానముల గావింపడన్నది ఇక నీపు ఆలసింపక దండకారణ్యములకు పయనము కమ్మన్నది. ఈ పలుకు దశరథుడు భరింపరానిది. కైకేయి పలుకాతనికొక పిడుగు పాటైనది. ఆముదుసలికి కైకేయి రూపమున మృత్యువు సాక్షాత్కరించినట్లయినది ఆ క్షణమునసే మూర్ఛనొందినాడా వృద్ధభూపతి. ఆయంతఃపురమునందప్పుడే మిగిలిన అంతఃపురకాంతల ఆర్తనినాదములు చెలరేగినవి.

దశరథుని రాముడాక్షణమననే లేవనెత్తి, వేదతీర్చి కైకకు కలిగిన అనుమానమును తీర్చినాడు. కైక అనుమానమును రాముడుతీర్చుటతో మనకొకప్రత్యేక సంబంధముస్నది. రామని జీవిత లక్ష్యమేమియో మనకు స్పష్టముకాగలదు గాన జాగరూకులైవినుడు రాముని సిద్ధాంతమిది.

"నా హమర్ధ పరోదేవి లోకమావస్తు ముత్సహె
విద్ధి మాం ఋషిభిస్తుల్యం కేవలం ధర్మమాస్థితం."

రాముడు కేవలముగ ధనసంచయమునే ప్రధానము గావించు కొనలేదట. ధర్మమునాచరించుటే అతని జీవితముయొక్క ప్రధానలక్ష్యమట. ఇట్టి జీవితమును గడపుటకు ఉదాహరణ ఎవ్వరట? ఋషుల జీవితమట. ఋషులకు జీవిత లక్ష్యమెద్దియో రాముని జీవిత లక్ష్యమదియట. ఇక కైకకుగల అనుమానమేమి? ఆమె అనుమానము నెట్లె తీర్చెను? అనునది ప్రశ్న. రామునకు కాలవ్యవధి నిచ్చుచో ప్రజలు రామునివైపుకు తిరుగుచో తనప్రయత్నము ఫలమగునను భయము కైక కున్నది కాదేకాదు భరతుడు వచ్చుచో భ్రాతృభక్తి పరాయణుడగు భరతుడును రాముని వనవాసమును మాన్పునన్న భయము కైకేయికి లేకపోలేదు. కావున రాముడు "తల్లీ! నేను "లోకం ఆవస్తుం నోత్సహే" అనినాడు. అనగా ప్రజలనను సరించువాడనుకాను. పితృవాక్య పరిపాలనా రూపధర్మము నాకు ఏకైక లక్ష్యమని నొక్కిచెప్పినాడు ఇక్కడ మనకు తేలిన సారాంశమేమనగా రామునిది ధర్మప్రధానమగు అర్థ కామముల సేవనముగాని అర్థప్రధానమగు ధర్మసేవనముకాదు. తరువాత జరిగినదేమన?

రాముడు కైకేయిని నేనిట్టివరముల నేల యడిగితినని చింతింపను కూడ చింతింపవద్దని తనకు కౌసల్యకును, సీతకును ఈ విషయమును తెలిపి చెప్పుటకు అనుజ్ఞనిమ్మని కోరినాడు. కైక అంగీకరించినది.

రాముట్లు కైకేయికి చెప్పెనుగాని ఆతని మనస్సునందైన రాజ్యవియోగమును గూర్చిన చింతలేకుండునా? అని మన మనస్సు రామునిగూర్చి శంకింపకపోదు. తప్పక శంకించును. ఆశంకనుకూడ వాల్మీకి మహర్షి తీర్చినారు. ఎట్లు తీర్చినారు?

రాముడు కైక నుండిరమును వదలి కౌసల్యాగృహమునకు వెళ్ళినప్పుడు ఆతడు పట్టాభిషేక సంభారములను తిలకించి, ప్రదక్షిణమాచరించి, ఈయభిషేక

ద్రవ్యములు భరతునికే వినియోగపడుగాక అనఘనిర్మల హృదయముతోడనే అను కొనుచు వెళ్ళెనట. రామునికాద్రవ్యముల తిలకించినపుడు చిత్తముచలించలేదట. అప్పుడాతని చిత్తమెట్లుండెనట?

"సర్వలోకాతిగస్యేవ లక్ష్యతే చిత్తనిక్రియా"

రాముని చిత్తము సమస్తలోకముల నతిక్రమించిన వాని చిత్తమువలె నున్న దట. సర్వలోకాతిగుడన ఎట్లుండునట?

ఆనందమనునది రెండు విధములు. ఒకటి అనుభవింపబడు ఆనందము. అనుభవరూపమగు ఆనందము ఈ అనుభవింపబడు ఆనందము తనకంటె వేరొక వస్తువుచే ప్రాప్తమై ఒకదానికంటె నొకటి ఎక్కువైయుండును. ఒక లక్షాధికారి యగు ధనవంతుడు నేను లక్షాధికారినని అనుకొని ఆనందించు ఆనందమున కంటె కోటీశ్వరుని ఆనందమునకంటె చక్రవర్తి ఆనందము గొప్పది. ఆ కోటీశ్వరుని ఆనందమునకంటె చక్రవర్తి ఆనందము గొప్పది. ఇట్లే భూలోకవాసుల ఆనందమున కంటె స్వర్గలోక సౌఖ్యముల వలన కలుగు ఆనందము మించగొప్పది. ఇట్లు లెక్కపేయుగా బ్రహ్మలోకమున కధిపతియగు వాని ఆనందము గొప్పది. కాని ఈ ఆనందములకు పరిమితియున్నది. ఆపరిమితమగు ఆనందమునకు అఖండానందమని పేరు. ఆ అఖండానందమునకే అత్మానందమని పేరు. ఇదియే అనుభవరూపమగు ఆనందము. ఇట్టి ఆనందముననుభవించువారు భాగవతోత్తములును పరమ జ్ఞానులును. భాగవతులు భగవత్సారతంత్ర్యమును గ్రోలి ఇంద్రియములచే అనుభవింపబడు ఆనందమును ధిక్కరించగా, జ్ఞానులు తమకును భగవత్తత్వమునకును వేరులేమిని సాధించుకొని ఆత్మానుభవమునొందుట ఇతరవస్తువుచే కలుగు చిత్తవికారము నొందకయుందురు. జ్ఞానులకు సహజముగ ఏ వ్యవహారమునందును వాసనల ప్రకోపము కలుగదు. లోక సంగ్రహదృష్టితో శాస్త్రము ననుసరించి ప్రవర్తింతురు. వారికీ రాజ్యభోగములు తృణప్రాయములు. అట్టిమహనీయుల చిత్తవృత్తి ఎట్లు బాహ్యపదార్థముల తృణప్రాయముగ చూచునో అట్లుండెనట రాముని చిత్తవృత్తి. ఇప్పటిరాముని చిత్తవృత్తియే స్థితిప్రజ్ఞుని చిత్తము. త్రిగుణాతీతుని చిత్తము గీతలోని త్రిగుణాతీత, స్థితి ప్రజ్ఞతలక్షణములను అర్జునునకు బోధించినవాడెవరను కొనుచుంటిరో ఈ రాముడే. రామావతారమున ఆదర్శప్రాయుడై కృష్ణావతారమున జగద్గురువయ్యెను. ఇది రాముని స్థితప్రజ్ఞత్వ ప్రదర్శన రంగస్థలము. ఇక రాముడు చూపబోవునది మానవుడాచరింపదగు ధర్మప్రదర్శన రంగస్థలము.

తరువాతి కథ.

అది కౌసల్యా మహారాణీమందిరము. అందెందరో బ్రాహ్మణులీ నాడు వైదికములగు మంత్రములతో సధ్యక్షతలిలా హోమములగావించుచుండిరి. ఆమెయు తెల్లని వట్టు పుట్టమును ధరించి రాముని పట్టాభిషేకవార్త వినినది మొదలుగా వ్రత దీక్షితయై వ్రతదీక్షచే కృశించిన శరీరముతోడనే అగ్నిని ఆరాధించుచుండెను.

కైకేయి మందిరమునందలి అంతఃపురకాంతల అంతఃకరణములు దుఃఖాక్రాంతములైయున్న ఆసమయమున కౌసల్యాంతఃపురము మంగళకార్యములతో అలరారుచున్నది. క్షణకాలమున రాబోవు దుఃఖఫలముల నెవ్వరెరుగుదురు? సృష్టి ఖండమునందేనాడును ఎవ్వరును గ్రహించరాని విషయమిది. ఒక్కక్షణకాలమాననే దురదృష్ట ఫలము తన్ను ఎదుర్కొనబోపుచున్నదని కౌసల్యకు తెలియదు? పుష్యమి నక్షత్రముతోకూడిన ఈనాటి రాముని పట్టాభిషేక మహోత్సవమే కౌసల్యామనఃఫలకమున చిత్రింపబడియున్నది.

రాముడు మాతృగృహమున ప్రవేశించినాడు. మూడవకక్ష్యయందలి వేదపారగుల వేదపాఠధ్వనుల వినినాడు. ఆభద్రమూర్తులకు వందన సమర్పణాదిగావించినాడు. తన మాతృమూర్తిని సమీపించినాడు. తల్లిపాదములకు ప్రణమిల్లి నిలచినాడు.

పుత్రునిదర్శించి అనుభవించు ఆకౌసల్య సంతోషమునకు చివరఎక్కడ? అప్పుడామె ఆనందము అపారావారము. ఆక్షణమునసే రామునకొక సువర్ణ పీఠము నుంచినది. దానికి ముందుగ భోజన పాత్రనుంచినది. పుత్రుని కొగిలించుకొన్నది. బిడ్డా! ఈ పీటపై కూర్చొనుమన్నది.

రాముడు తల్లియిచ్చిన ఆసువర్ణాసనమును చేతముట్టినాడు. అంతియే అతడు కూర్చొనలేదు.

ఒక్కమాఱుగ నేనరణ్యములకు పోవలసిన యిదదాకని నేని ఆననమున కూర్చుండమని తల్లికి చెప్పుచో కౌసల్యగుండె బ్రద్దలగునని రాముడెరుగక పోలేదు. కావున తల్లీ! నేనీ పీటపై కూర్చుండదగు కాలముకాదు నాకు. అని సమాధానమిచ్చి ఇంచవది అయిదు దర్భలతో అల్లిన విష్టరాసనముపైన కూర్చొనదగు కాలమని కాలమునకొక వ్రత్యేకతనిచ్చినాడు. "విష్టరాసన యోగ్యోహి కాలోయం మాము పస్థితః" అనినారు. విష్టరాసనమన దర్భాసనము.

తాననుభవించిన సాంసారిక దుఃఖములు కూడ ఆమె తలపునకు వచ్చినవి.ఈనాడు పుత్రవతియై అనుభవించు సుఖమునకంటె నాటి గొడ్రాలితనము మేలనిపించినది.

ఒకనాడు దుఃఖమై కనబడినదే మరొక కాలమున నాటి దుఃఖమే సుఖమని పించుట ప్రకృతి స్వభావము. ప్రకృతిలోని సుఖదుఃఖములకు నియతిలేదు. ఆత్మ సుఖమొక్కటే నిత్యము.

విషయసుఖమునకై జీవుడెంతయో ప్రయత్నించును. ఆ ఫలమునను భవింప జీవుడెదురు చూచును.

ఆ ఫలమాతని చేతికి పూర్ణరూపమై అందునన్న నిర్ణయములేదు. ఒకవేళ అందినను అది శాశ్వతముకాదు. కర్మఫలము పుట్టుక కలది. పుట్టిన దానికి నిత్యత్వము లేదనునది త్రికాలసత్యము.

కథకు వస్తువు.

రాము మాత మూర్ఛనుండి లేచినది. తన దుర్దష్టజీవితమును మాటి మాటికి తలచుకొనుచు విలపించినది. అప్పుడామె దుఃఖశోకము లెట్లుతీరును ? ఆమెనెవ్వరాదరించవలెను ? రాముడు తల్లీ ! నేనరణ్యమునకుపోవను నీవేడువకుమనునా ? అట్లైన ఆమె దుఃఖము మానును. అది అసంభవము.

లక్ష్మణుడామె దీనత్వమును చూచి సహించలేక పోయెను. అప్పుడామెను ఓదార్చదగిన వాడు లక్ష్మణుడొక్కడే.

ఒకప్పుడు బాధపడువాని బాధను పరిపూర్ణముగ తుడిచివైచుటకు సాధ్యము కాకున్నను తాత్కాలికముగనైన ఆ దుఃఖభాగుని శాంతింపజేయ యత్నించుట మానవ సహజము. కావున లక్ష్మణుడు "తత్కాలసదృశంవచః" ఆ సమయమున కనుగుణ్యముగ కౌసల్యను ఓదార్చయత్నించినాడు.

ప్రస్తుతమగు కౌసల్యబాధవేమి? రాముడరణ్యమున కేగుటను గురించియే. అందుకు కారణభూతురాలు కైకేయి. ఆమెకిచ్చిన వరద్వయమునను సరించి రాముడరణ్యమునకేగుచుండెనుగాన ఆమె వరద్వయమును పాటించి రాముడరణ్యమునకు పోవలసిన పనిలేదని కౌసల్యవైపుకు తిరిగివచ్చినాడు. అంతతో రాముడు దశరథుని ఆజ్ఞను పాలింపవలసిన పనిలేదని తేలినది. ఆక్షణమున ఏరులైపారు ఆమె కన్నీటి

ధారలు కొంచెము వెనుకకు మరలినవి. ఆ సమయముననే దశరథుని మాటను పాటించుట కవసరమెందుకు లేదో కొన్ని కారణములను ప్రతిపాదించి దశరథుని అవివేకమును చూపినాడు.

"విపరీతశ్చ వృద్ధశ్చ విషయైశ్చ ప్రధర్షితః
నృపః కిమివ న బ్రూయాచ్ఛోద్యమానస్సమన్మథః"

వయోధర్మము ఆయన బుద్ధికి వైపరీత్యము కల్పించినదనినాడు. అదిగాక విషయ సుఖాభిలాష ఆతనిని వంచించినదని కూడ ననినాడు. ఏమైనను ఇదిరాజశాసనముగదా? అనుటకుకూడ వీలులేదనినాడు కామకుడగు రాజుకు వివక్షితాజ్ఞానమెక్కడిదని రాజాజ్ఞగ తీసుకొనవలసిన పనిలేదనినాడు. అంతతో కౌసల్యకు మరింత వెనుకకు నడచినదిశోకము. అతడంతతో ఆగలేదు. రాముని వంకదిరిగి అవసరమగుచో నా బలపరాక్రమములను కూడ దశరథుని అడ్డగించుటకు ధారవోయుమదనని మాట్లాడి ఇది ధర్మమా? అను ప్రశ్నకు సమాధానమిచ్చినాడు ధర్మశాస్త్రాచార్యుడై. గురువులైనను నిష్పథమును తప్పి నడచుచో వారిని ధిక్కరించవచ్చునన్న వాక్య మును ప్రమాణీకరించినాడు. క్షాత్రధర్మమునందిది యొకముఖ్య ధర్మము. లక్ష్మణు డిక్కడ ఉగ్రవాడియై పలికిన పలుకుకాదు. అందుచేత రాముడు లక్ష్మణునికి ప్రత్యేకముగ సమాధానమిక్కడేమియు చెప్పలేదు.

కౌసల్యకు కొంచెము బాగుగనే బలముచిక్కినది. సరాసరిగ భర్తమాటను ఆమెకాదను చెట్లు? లక్ష్మణుని అనుసరించి రాముని వనవాసము నుండి మరలించు టకు ప్రయత్నించినది. కైకకే ఇట్టి సమయము దొరకుచో గట్టిగనే చెప్పెడిదిగాని కౌసల్య "రామా లక్ష్మణుని వాక్యముల వింటివిగదా?" అని రాముని నివారింప యత్నించినది.

రాముని పాత్రచాల చిత్రమైనది. ధర్మమున కెదురైనిలుచు దయాదాక్షిణ్య ములు ఆ ధర్మమూర్తి చూపున నిలువవు. కౌసల్యకు తన హృదయమును స్పష్ట పరిచినాడు.

నాస్తి శక్తిః పితుర్వాక్యం సమతిక్రమితుం మమ.

తల్లీ! తండ్రివాక్యమును నేనెన్నడును అతిక్రమింపజాలను. నన్ను గ్రహింపుమనినాడు. మాతృవాక్యమట్టిదికాదా? కాదనియే ఆయన సమాధానము.

తల్లినూరురెట్లు తండ్రికంటె అధికమని ధర్మశాస్త్రములు చెప్పినను క్రూరయందా ధర్మము వర్తించునుగాని ఆజ్ఞాపాలనము నందా ధర్మము వర్తించదనియే రాముని నిర్ణయము. దీనికే సూక్ష్మధర్మమని పేరు ఒక విధముగ కౌసల్యయు లక్ష్మణుడును రాముని వనవాసమును మాన్పయత్నించినారు. ధర్మాచరణమున రాముని హృదయము శిలాసదృశము. లోహమయము. కఠినాతికఠినము. లక్ష్మణుని మనసును నొప్పింపలేదు. తల్లిమనస్సునుకూడ అంతియే. కౌసల్యకు సాధ్వీమ తల్లుల ధర్మమును బోధించి, పుత్రవాత్సల్యము కంటె పతిదైవతము నారాధించుటే ముఖ్యమని సిద్ధాంతీకరించినాడు. ఆమె తనను వెంటనంటుటకూడ అనుమతించలేదు. భర్త జీవించియుండ స్త్రీ పుత్రుననుసరించుటకు ధర్మశాస్త్రాచార్యులు ఒప్పలేదనినాడు. దశరథుని ఆజ్ఞను అతిక్రమించుట కెవ్వరికిని హక్కులేదనినాడు. రాముడు సనాతన ధర్మవాది.

"గురుశ్చ రాజా చ పితా చ వృద్ధః
క్రోధాత్ప్రహర్షాద్యదివాసికామాత్
యద్వ్యాదిశేత్కార్యమవేక్ష్య ధర్మం
కస్తం న కుర్యాదనృశంస వృత్తిః

దశరథునకున్న హక్కులను ముందు చెప్పినాడు. అతడు గురువు, రాజు, తండ్రి, వృద్ధుడు. అట్టి దశరథుడు క్రోధముచేత పలికినను, కామముచేత పలికినను సంతోషమున ఆజ్ఞాపించినను ఆయన వాక్యమును కాదను హక్కు ఎవ్వరికిని లేదని నాడు. అట్లు ధిక్కరించుట అధర్మమని లక్ష్మణుని వాక్యములకు కూడ సమాధానము నందించి, ఈ ఘట్టము దైవికమని తేల్చినాడు. లక్ష్మణునివాదము తన యందుగల భక్తికి మాత్రమే స్థానముగలదైనదని తేల్చినాడు. తరువాతేమి జరిగినది ?

కౌసల్యయే తన హృదయమును మార్చుకొన్నది. ఆమె రామమాత. ధర్మాధర్మముల నెరిగినసాధ్వి. రాముని ధర్మదీక్షకే స్థానము విచ్చినది. ఆతడు వయనింపబోవు వనవాసమునకు రక్షణ కల్పించుచు మంత్రౌషధములచేత ఆ జగద్రక్షకుని బాహుదండమున రక్షాబంధనమును బంధించినది. జీవులకు మంగళముల నందించు దేవతలందరను తన పుత్రునకు మంగళముల నొసగుగాక యని మంగళాశాసనములు గావించి పుత్రునకు వనవాసమున కేగుమని అనుజ్ఞనిచ్చినది పుత్రవియోగ దుఃఖమును దిగమ్రింగి.

భారతీయతలో అర్ధాంగి పాత్ర

సీతారాముల జీవిత లక్ష్యమే భారతీయత. భారతీయతే సీతారాముల జీవిత చరిత్రము.

భారతీయుల గృహస్థాశ్రమము గృహరాజ్యమును పాలించుటకై అధిష్ఠించ దగు ఒక రాజపీఠము. అందు సగ భాగము హక్కుకలిగి యుండు భాగస్వామిని భార్యామణి. కావుననే ఆమెకు సంస్కృత వాఙ్మయమున అర్ధాంగియని పేరు. భారతీయ గృహస్థు అర్ధనారీశ్వరుడు. ఒకే ఒక తేజము రెండగుట అర్ధనారీశ్వరత్వము. శివదొక్కడే అర్ధనారీశ్వరుడుకాడు. ప్రతి భారతీయుడును బ్రహ్మచర్య వ్రతదీక్షను వదలి గృహస్థాశ్రమ వ్రతదీక్షకు బద్ధకంకణుడగుట అర్ధనారీశ్వరుడగుట. గృహస్థాశ్రమమును వదలి సన్యాసాశ్రమ ప్రవేశము గావించుట ఈశ్వరుడగుట. ఆయాశ్రమమును కూడ వదలి ఏవ్రత దీక్షానామముగూడ లేక దిగంబరుడై చరించుట మృత్యుంజయుడగుట.

ప్రతి ఆశ్రమమును కొన్ని నియమ నిబంధనలలో కూడియే యుండుటను నిర్ణయించినవి భారతీయ శాస్త్రములు. ప్రతి వ్యక్తికి హక్కు భుక్తములు శాసనాధీనములు. భారతీయ శాసనములు వేదశాస్త్రములు. వేదశాసన మిట్లున్నది. "అర్ధోవా వష ఆత్మన ఉత్పత్తి" పత్నియన ఆత్మలోని సగభాగమట. కథకు వస్తువు. నేచెప్పిన సిద్ధాంతమును సీత వ్యాఖ్యానించును.

ఇంతకు ముందు రాఘవేశ్వరుడు యువరాజగుటకు రాజచిహ్నము ధరించి ఆ చిహ్నములతోడనే పితృపాదుల ఆహ్వానమువైన సుమంత్రునితో కైకేయీ అంతఃపురమున కేగినాడు. అక్కడ రాజపీఠము తారుమారైనది, దండకారణ్యములే కొంత కాలము తన నివాస గృహము కావలసివచ్చినది. ఆ వార్తను తల్లికి తెలిపి, భార్యకు తెలిపి వెళ్లమనన్న అనుమతిని కైకేయి వద్ద తీసుకొని సరాసరిగ మాతృ గృహమున కేగినాడు. తల్లిని ఓదార్చి, ఆమె ఆశీస్సుల గ్రహించి, ఆమెబంధించిన రక్షిబంధనమును బాహుదండమున ధరించినాడు. అక్కడ నుండి తన ఇల్లాలికి తెలిపి తన అంతఃపురమునకు బయలుదేరినాడు. అప్పుడు రాముని ధీరత్వము వంచెందుకో మార్పుకలిగినది. అప్పుడాతని నెందుకో లజ్జ ఆవరించినది. ఆతని ముఖమండలమును కొంచెము క్రిందకువచ్చినది. కారణమెవ్వరెరుగుదురు? కవివరులు మాత్రము "హ్రియాకించిదవాఙ్ముఖః" సిగ్గుచే కొంచెము అవాఙ్ముఖుడయ్యెనని నారు.

తల్లి కట్టిన రక్షాబంధన మొక ప్రత్యేక చిహ్నము కాగా పాదచారి యయ్యె రాముడు ఇల్లాలి దగ్గర కేగినాడు. శ్వేతచ్ఛత్ర మూడని శరీరమునకు అలంకారమై లేదు. అతని కిరుప్రక్కలనుండదగు వింజామరలులేవు. వందిమాగధుల స్తోత్రములతో అతడు రాలేదు. బారులు తీర్చి యుండదగు పరిషజ్జనులుగాని మంత్రి మండలిగాని, ఆతనివెంట లేరు. పట్టాభిషిక్తుని వెంటనలటి స్వస్తి వాచనములతోడ రాదగు బ్రాహ్మణ ప్రవరులును రాముని వెంటలేరు. అట్లురాజచిహ్నములు తొలగిన తన నాథుని సీత చూచినది.

సీత దృష్టులతి విశాలములు. రాముని దృశ్యమామెకర్థమైనది. ప్రస్తుత రాజ్యలక్ష్మి రామునకు దూరమయ్యెనని ఆమె గ్రహించినది. ఆక్షణముననే ఆమె అంతరాత్మయు నీనిప్పుడు రాణివి కావని సీతకు తెలిపినది. సీతమనసు కలత బారినది. కలత బారిన ముఖమండలము తోడనే రాముని ముందు విలచినది. ఎందు కట్లయ్యెనో సీత కేమి తెలుసును? తెలియదు పాపము!

తన జీవితము సీత కర్థమైనదని రాముడు గ్రహించకపోలేదు. గ్రహించి నాడు. రాముడు గంభీర హృదయుడు. అతని హృదయమొక సముద్రము. కావచ్చును. అతడు ప్రస్తుతమున తన ముఖవర్ణమును కోల్పోవక తప్పలేదు. సీతకు తన వృత్తాంతమును చెప్పక తప్పదు. రామునకిదియొక ప్రత్యేకమగు సంఘటనము. సీతను అయోధ్యయందే వదిలి తాను అరణ్యమున కేగుటయా? సీతనుకూడ తోడ్కొని పోవుటయా? అను ప్రశ్నయొకటున్నది.

కైకేయి కోరిన వరములందు సీత విషయము లేదు. దశరథుని శాసనము రామునకు మాత్రమే సంబంధించియున్నది. ఇదియొక విషమ సమస్య. రామునకిది యొక పెద్దసమస్యకాదు. అయ్యను సీతను ఒప్పించుట సమస్య కాకపోదు. ఆమె విదేహ రాజ తనయ. ధర్మకర్మల నెరిగిన ప్రౌఢ.

రాముడు తన వృత్తాంతమును సీతకు తెలిపినాడు. తన వనవాసప్రయోజనము ఒంటరిగనే నెరవేర్చుకొనుట సీత కెరిగించినాడు. సీతకు నీతి ధర్మముల బోధించి వనవాస ప్రయోజనమునకు ముందడుగు వేయుటకు ప్రయత్నించినాడు. అతడు సీతకు చేసిన నీతి ధర్మముల ప్రబోధమిది.

సీతా! నీవు అయోధ్యయందే యుండి అత్తమామలకు సేవచేయుచు, దేవతా

రాధనము గావించుచు, భరతుని ద్వేషింపక, నాయుత్కృష్టతను ప్రశంసింపక పదునాలుగు సంవత్సరములు జీవితమును ఒంటరిగ గడుపుమనినాడు.

అప్పుడు సీత స్థితి ఏమి? ఆమె ముందుగనే నావయనమని రామునకు సమాధానమిచ్చినది. రాముడు ఒప్పుకొనలేదు. వసములదుండు దోషముల తెలిపి ఆ దండకారణ్యముల చరింపదగవని సీత సౌకుమార్యమును కారణముగ తాను ఒంటరిగ వెళ్ళు అభిప్రాయమును సిద్ధాంతీకరించినాడు.

సీత రామునకు తీసిపోలేదు. నా సౌకుమార్యము మీసేవకేనని సమాధాన మిచ్చినది. భర్తతోటి అరణ్యవాసము భార్యకు భరింపరాని కష్టము కాదని భారత నారీ మండలమున కధ్యక్షురాలై పలికినది.

కఠిన శిలలని తలవక ముండ్లను లెక్కపెట్టక పాదయాత్రను సాగించునది నావయనమని తెలిపిననాథునకు తమతో ఆకఠిన కాంతారముల చేయదగు పాదయాత్ర నాకు వట్టుపరుపులపై నడమట కాగలదని రాముని హేతువును మృదుమధుర తర్కముతో ధర్మబద్ధముగ ఖండించి తన రాకను సిద్ధాంతీకరించుకొన్నది.

రాముడు ఒప్పలేదు. సీత అంతతో ఆగలేదు.

మీరా కఠిన కాంతారముల నడచునప్పుడు మార్గమధ్యమున ప్రతిబంధకము లై యుండు శిలల తొలగించి, ముండ్లను ఏరి మీరు నడువదగిన బాటను తీర్చిదిద్దుటే నారాకకు ప్రయోజనమని గౌరవప్రపత్తులను ప్రకటించి రాముని వ్యతిరేక సిద్ధాంతము నడ్డగించినది. వారి సంభాషణ అట్లు కొంతసేపు నడచినది.

సీత కన్నులెర్రబడినవి మనస్సును తొందరపడినది. ఆమెవాక్కునందలి మాధుర్యము వెనుకకు మరలినది. కోపలక్షణము లన్నియు ఆమెను వరించినవి. కాని ఆ సాధ్వి కోపము భర్తపై గల అనురాగముతో కలసి నాథునకొక మధుర రసానుభూతిని కల్పింపదగు వాగ్రూపమును ధరించినది. అది ప్రణయస్నేహముల రంగరించుకొన్న కోపము. భర్తపై గౌరవము తరిగిన కోపముకాదు. తన ప్రాథమిక హక్కును కోల్పోవుటకు ఇష్టపడని కోపము. అందొక వీరత్వము కూడ యున్నది. రసమయగు అనుహ్యనాయిక క్రోధరసమును వాల్మీకి ఇట్లు వర్ణించినాడు.

"ఏకమున్తా తు వైదేహీ ప్రియా హ్యా ప్రియవాదినీ
ప్రణయాదేవ సంక్రుద్ధా భర్తారమిదమబ్రవీత్.

వాల్మీకి మహర్షి ఈశ్లోక రెండవపాదమున, "భర్తారబిభ్రతి స్త్రీహి" అని, భరత నారీమణులకు భర్తపైవచ్చు కోపవేగము ధర్మసీమను దాటదని తెలిపినారు. సీతా రాముల సంభాషణమట్లేనడచినది. వారి సంభాషణలోని ఒక భాగమిది.

రాము: నీవేల బాధపడెదవు ? సీతా! రాజాన్నముల తిని అత్తమామలకు సేవచేయు భాగ్యమును సంపాదింపుము.

సీత : స్త్రీలకు పతి శుశ్రూషయే ముఖ్యఫలము.

రాము : వృద్ధసేవయు అట్టిదే.

సీత : స్త్రీకి భర్తకంటె అన్యమగు దైవములేదు.

రాము : దశరథుని ఆజ్ఞనాకు మితమైయున్నది.

సీత ; అదియే నాకును ఆదేశము.

రాము : ఱదెట్లు ?

సీత : భార్య ఒక్కతే వరలోకమునను కల్పించు భర్త భాగ్యమునమభవింప అర్హురాలు. మిగిలిన వారికి ఆయర్హతలేదు. భార్య అర్ధాంగి. కావున నా పయనము తప్పదు. నాకు నా తండ్రి గృహమునందే ఎందరో బ్రాహ్మణులను ఒక ధర్మ బిక్షుకియు, నీకరణ్యవాసమున్నదని చెప్పినారు. అందుకై ఉత్సాహమున నేనెంతురు చూడగా ఆ బ్రాహ్మణోత్తముల వాక్యములను సత్యమును గావించు సమయమిదియే గావున మీతోటి నా వయనము తప్పదు. పురాకృత కర్మఫల మెవ్వరికి తప్పించ శక్యము.

రాముడు మారలేదు. సీత సమాధానముకు ఫలింపలేదు. రాముడు తన్ను విడిచి వెళ్ళుటనియే సీత నిర్ణయించుకొన్నది. ఈ ఘట్టమున రాముని తీపి మాట లామెకు తీయదనము నివ్వలేదు. సీతాకాంతకు కన్నులనిండ నీరుగ్రుమ్మ తిరిగినది. అది ఆపరాని దుఃఖము. కన్నుల నిండిన నీరు ధారలై కురిసినవి. ఆమె ఉత్తుంగ నిశాల వక్షమును తడిపివేసి రాముని మనస్సు కరుగలేదు. కాని రాముని చూపులు సీత ముఖమండలము పైననే నిలచినవినిరనమయములై.

సీతాకాంతకు కోపమాగలేదు. రామునిపైగల ప్రణయ స్నేహములు సీతకు ముందు నిలచి రామునిపైకి దుముకగా సీత బాహువల్లులు రాముని విశాలవక్షమును చుట్టినవి. ప్రియురాలి ఆ బిగుకౌగిలిలో రాముడు బంధింప బడినాడు. సీతది తప్పుడు పట్టరాని కోపము. రామునియందలి ప్రణయ స్నేహములమ అట్టివే.

కాని, వట్టిరావి కోపముతోడనే ఒడలు వణకగా రాముని కౌగిలించినది. పరిపూర్ణ ప్రేమధామున లీనమైయున్న ప్రణయక్రోధము వలికించు పలుకుల రసహృదయులకు మనోహరములును హృద్యములు కాబోవు. అవి మహాకవులకు వర్ణనీయములు కూడ. సీత రాముని ఇట్లు మందలించినదట.

"కిం త్వామన్యత వైదేహః పితా మే మిథిలాధిపః
రామ జామాతరం ప్రాప్య స్త్రియం పురుషవిగ్రహం."

నాథా! విదేహ వంశమున జన్మించి మిథిలాధిపతియైయున్న నా తండ్రి మిమ్ములనేమని భావించెను? పురుష వేషధారియైయున్న స్త్రీయని భావించెనా? అని ఘాటుగనే వలికినది. ప్రణయ స్వాతంత్ర్యమున భయమునకు చోటుండునా? భయమును తీప్పనదే ప్రణయము.

సీత వలుకు నందింతటి ఘాటుతనమును రాముడెప్పుడును ఇంతవరకందుకొని యుండడు. ఇప్పుడందినది. లోలోన అతడేమనుకొను చుండెనో మనకు తెలియదు. ఆతడందించు సమాధానమున బయటపడును. సీత వలికిన పలుకులలోని ఘాటుతనమును వరికింతము. వాల్మీకి మహర్షి ఈ ఘట్టమున "పరిచిక్షేపరాఘవం" అనినారు. పరిచిక్షేపయన నిందించెనని అర్థము.

నా తండ్రి పురుష వేషమునందున్న స్త్రీవని భావించెనా? అన్న ప్రశ్నార్థకముతో ముగించినది సీతాకాంత. ఆ ప్రశ్నార్థకము తలచెను అను సమాధానముతో కలవనిది కాదు.

నిజమునకు నా తండ్రి మీ మగతనమును విల్లునెక్కుపెట్టుట వరకేమాచి, ఒడలుమరచి, నన్నిచ్చెనుగాని భార్యనిట్లు వదలి వెళ్ళుదురని పెండ్లినాడు భావించి యుండకపోవచ్చును. కాకున్న నాథా! మీరు మగవారగుచో యౌవనవతియగు ఇల్లాలిని పసుల రాజ్యమున వదలి వెళ్లుదురా? అను భావమును స్పష్టపరచినది. ఆతడు మిథిలాధిపతియే అయ్యును విదేహ వంశీయుడగుటచే వల్లెవరచె ను సమాధానమును తన తండ్రికి వాడిన నిదేహుతను నిశేషణము నందిమిడ్చినది చక్రవర్తియగు జనకుడు అంత భ్రాంతుడయ్యెనా? అనుచో రాక్షసాది వీరులకూడ అలవికాని శివధనస్సును మానవ మాత్రుడవై చూపట్టుచు వెక్కుపెట్టుట నా తండ్రికి ఆశ్చర్యమును కల్పించగా భ్రాంతుడయ్యెనని వాఖ్యానించినది అంతతో ఆమెకు

రామునిపై ఆగ్రహము చల్లారలేదు. మరొక్క రీతిలో రాముని వ్యంగ్యముగ తనను విడిచి వెళ్లుట తప్పని తేల్చినది.

ఆ చెప్పినపుడొక చక్కని ఉపమానమును వాడి మందలించినది.

"అనృతం ఖత లోకోయమజ్ఞానాద్యద్ధి వక్ష్యతి
తేజో నాస్తి పరం రామే తపతీవ దివాకరే"

నాథా! లోకము సత్యమును నుడివెడుగదిది. సత్యమును గుడివెరుగవి లోకము ఏమైన మాట్లాడగలదు. లోకమునంతను తపింపచేయు సూర్యుని తేజో విశేషమును తెలుసుకొనక ఎట్లు వింటింటిలో లజ్జే నిన్నును రాముడు తేజోవంతుడుకాడని నన్నిక్కడ దిగవిడుచునను ఆధారముగాగొని నిందింతురన్నది.

మొదటి మాటకంటె ఈ రెండవదాని యందొక విధముగ స్పష్టతను చూపినది. దీని తరువాత మరింత స్పష్టముగ చెప్పినది. తననిక్కడ దిగవిడచి వెళ్లుట పర్వధా దోషమని.

"స్వయం తు భార్యాం కౌమారీం చిరమధ్యుషితాం సతీం
కైలూష ఇవ మాం రామ పరేభ్యో దాతు మిచ్ఛసి."

రామా! అగ్నిసాక్షిగ భర్తృత్వము నంగీకరించి, కౌమార వయస్సు నందుండి, ఎంత కాలమునుండియో నిన్ను సేవించుచు సతీత్వము కలిగియున్న నన్ను కైలూషునివలె (భార్యవలన జీవించు వానివలె.) పరులకు వప్పచెప్పి వెళ్లుదురా? అన్నది. తన ప్రత్యేకతను మీరచి మాట్లాడిన రాముని ఒక విధముగ మేలుకొలిపి అతడాచరించు విధానమును పరిపూర్ణముగ నిషేధించినది ఆ ఎర్ర బారిన ముఖమండలము తోడనే.

కేవలముగ అతడాచరింపదగు కార్యమును నొక్కివక్కాణించుట మాత్రమే కాదు. దాని పర్యవసానమగు ఫల పరిణామముకూడ ఎట్లుండునో వివరించినది.

అథ మామేవమవ్యగ్రం వనం నైవ న యిష్యసి
విషమద్యైవ పాస్యామి మావరం ద్విషతాం వరం.

రామా! నీయందింత గాఢానురాగముగలిగి ధర్మపత్నినైయున్న నన్ను సీతోటి గొంపోవని యడల ఈ నా జీవితము నీ భూమిపైన నిలవను విషపానమున మరణింతును. ఆ మరణమెవ్వడో కాదు అద్యైవ ఇవ్వుడే అన్నది.

ఇక మనము రాముని వంశకు తిరగుదము. ఆ రాముని దర్శింతము ఒక్క క్షణకాలము. దర్శించుటకాదు. దీర్ఘకాలముగ ఈ సీతారాముల సన్నివేశమును మన నము గావించుట చాల అవసరము. రామాయణ కావ్యములోని సన్నివేశములు ఆధ్యాత్మికజీవులు బాటసారులై పయనించుట కేర్పడబడిన విశ్రాంతి భవనములు. ఈ సన్నివేశము నందు రాముని చూతము

ప్రేమమూర్తియై ధర్మదేవతయై, భర్తృవియోగ దుఃఖమును భరింపలేక పరితపించుచు, స్వచ్ఛాతి స్వచ్ఛములై స్ఫటికమణులవలె వెడలివచ్చు కన్నీటి ధారలు కలువరేకుల నుండి జాలువారునట్లు జాలువారుచుండగా శరణార్థినియై ప్రాణాధారణ మిక భూమికపై లేదనునది విశ్వయించుకొన్న సీతాకాంత బాహు లతలతో బంధింపబడియున్న రాముడతడు. కేవల దశరథరాముడే కాదు. ఆత్మ రాముడై దాంపత్య జీవితమున పరమపవిత్ర శృంగారము వనుభవించుటకు ఆదర్శ మూర్తియగు రాముడుగూడ. కావుననే పీక తనను అధిక్షేపించిన అధిక్షేపణకు కన్నుల నెర్రజేసుకొనలేదు. అంతేకాదు, ఎట్టి భక్తశేఖరుల నాత డెట్లాదరించునో మనకు తెలుపుటకు మన కావ్యమున కథానాయకుడైన రాముడతడు. కాకున్న సీత కోపముతో పలికిన కఠోరవాణి ఆతనికెట్లు మధురవాణి కాగలదు? రాముడు రసికశిఖామణి. ధర్మవీరుడు. ధీరుడు. సీతాకాంత నట్లు మాట్లాడింప కుతూహలు డయ్యె ఆకడట్లు పలికించినాడు. అందును సమయమును గుర్తెరిగి మాట్లాడించి నాడు. శీలవతులగు ఇల్లాండ్రకు సీకచే ధర్మక్షోభమును చేయుంచదగు సమయ మిదియే యని భావించి మాట్లాడించినాడు.

లోకతంత్రము నెరుగదగు పురుషులకు సమయము వచ్చినప్పుడు ఇల్లాండ్ర చిత్తవృత్తుల నెట్లు బహిర్గతములు గావింపవలయునో తెలుపుటకు గూడ సీకచే ఇట్లు మాట్లాడించి యుండవచ్చును.

తనకుతానై సీతను అరణ్యమునకు ప్రయాణముగు మన్నచో ఆమె హృదయమెట్లుండెనో తెలియుటెట్లు? అంతియే కాదు.

ప్రణయప్రేమ స్నేహ సంబంధములు ముప్పిరిగొనగా ఎర్రబారిన ఇల్లాలి ముఖశోభను చూచి ఆనందించుచే గార్హస్థ్య జీవితమున కొక పరమావధి యని కూడ భావించి యుండవచ్చును. రసికశిఖామణియగు శ్రీకృష్ణుడొకప్పుడీ పమా ధానము విచ్చినాడు కూడ. ఇది పోతన వాణి.

ఉ॥ కింకలు ముద్దువఱ్ఱాలును కెంపు కనుంగవ తియ్యమోవియున్
జంకెలు తేరిచూపు లెకసక్కెములున్ నెలవంక బొమ్మలుం
గొంకక వీడనాడుటలు గూరిమియుంగల కాంత గూడుటల్
లంకి వివేక జన్మఫలమబ్బుటగాదె తురంగలోచనా.

రుక్మిణీదేవిని ఏకాంతవాసమున శిశుపాలాదులవదలి మమ్మేల పెండ్లియాడితి వని పలికి ఇవ్వుడైవను "దగిన మనుజేంద్రు నొక్కని దగులుము" అని, రోష కషాయితనేత్రము గావించి పొమ్మనిల్లిన రుక్మిణీదేవికి చెప్పిన సమాధానము.

ఒకే విధముగ ధర్మశృంగారముల సమ్మేళన ఘట్టమీ సీతారాముల శృంగార ఘట్టము. వేరు ఈ రసిక ప్రపంచము రసికపదమునకే కర్థము వ్యభిచారమని వ్యవహరించిన వ్యవహరించ వచ్చును. విజ్ఞుల వ్యవహారమున రసికపదమున కర్థమదికాదు. రసమన పరబ్రహ్మ యని అర్థము. "సోవైరసః" అని చెప్పినది శ్రుతి. భారతీయశాస్త్రములు నెప్పిన రసికత్వము పార్వతీ పరమేశ్వరులవంటి నాయికానాయకులలోని రసికత్వము. "సీతారాముల దాంపత్యములోని రసికత్వము, భారతీయ స్త్రీపురుష సంబంధము లక్ష్మీనారాయణుల సంబంధము. కావున రాముడు రసికుడు శివుడు రసికుడు. నారాయణుడు రసికుడు. ఇట్టి రసికత్వము నాధార ముగా గొనినదే అలంకారశాస్త్రము. ఒక్కొక్కశాస్త్రము ఒక్కొక్క కవికాలమున పుట్టినదను వాదము భారతీయతలోనిది కాదు. సమస్త శాస్త్రములును సనాతనములే యనునదే వైదిక సిద్ధాంతము. అలంకారములన్నియు వేద సాహిత్యములోనివే. ప్రకృతమునకు వత్తము.

ఇవ్వుడు రాఘవేశ్వరులు తన ఇల్లాలి ముఖమండలమును, జల మధ్యము నుండి వెలువడివచ్చి వాడు సూపిన పద్మినివలె నుండుటను చూచి సహించలేక తన కౌగలింతచే సీత నాదరించి, "సీతా! నీవులేని స్వర్గము కూడ నాకక్కరలేదు. నేను భయస్థుడనై నిన్ను అరణ్యములకు పద్దన లేదు. నీ భావమును గుర్తెరుగక అట్లంటిని. అని తన ఆదరవచనముల సీతకు సంతోషమును కల్పించి, తనకును సీతకునుగల సంబంధమును మనకు తెలిపినాడు.

"యత్పృష్టాసి మయా సార్ధం వనవాసాయ మైథిలి
న విహాతుం మయా శక్త్యా కీర్తిరాత్మవతా యథా"

సీతా తనతోపాటుగనే వనవాసము చేయుటకు సృష్టింపబడినదట. ఆత్మవంతు డగు వానిని కీర్తి యనునది ఎట్లు వదలియుండదో అట్లు సీత తనతో విడివడి యుండదట. ఎంత చక్కని ఉపమానము? గుణము గుణీని వదలియుండునా? అట్టిదట సీతారాముల సంబంధము. తరువాతేమి జరిగినది?

తానిప్పుడుచేయు ధర్మపరిపాలనకు ఫలము గోలోకప్రాప్తి యని చెప్పి, సీతా! నీవిక సేవకులకును బ్రాహ్మణులకును స్వీయమగు ధనమును పంచిపెట్టుమని ఆజ్ఞాపించి, సీతను తనతో సయనమగుటను నిర్ణయించినాడు. సీత అట్లే దానధర్మ ముల కొనసాగించినది. అంతతో వారి సంభాషణ ముగిసినది.

సీత రాముని నీవు మరువాడవేనా? నన్ను శైలూషునివలె పరులకు వప్ప గింతురా? అన్నమాట ప్రశ్నార్థకముగదా? నీవట్టివాడవే అనునదియే సమాధా నమా? కాదు. చెప్పెదను.

సీతారాముని నాతండ్రి నిన్ను పురుషవేషమును ధరించిన స్త్రీయని తలచెనా? అన్న ప్రశ్నకు అంతరార్థమున్నది.

భక్తిశాస్త్రమున జీవుడు స్త్రీ స్వరూపముకాగా భగవంతుడొక్కడే పురుషు డనునది సిద్ధాంతము అప్పుడు జీవుడు నాయిక. భగవంతుడు నాయకుడు. నాయికా నాయక సంబంధము జీవేశ్వర సంబంధము. జీవుడు నాయికాభావమున భగవంతు నకు దగ్గర కాగలడు. ప్రేమభావమిందు ప్రాముఖ్యము. దీనికి మధురభక్తియని పేరు. ఈ భక్తి శృంగారరస ప్రధానము. భక్తుడనుభవింపదగు భక్తి శృంగార మునకు ఆధారము భగవంతుని అప్రాకృత మంగళ విగ్రహమును ఆయన గుణ గణమును కూడ. సీతారాములు జీవేశ్వరులు. సీత జీవుడు. రాముడీశ్వరుడు. సీత మాట్లాడినది నింద్యాగర్భమగు భగవన్నుతి రామా! నీవొక్కడవే పురుషుడవని నా తండ్రి నిన్ను నీచేతబెట్టినాడన్నది. వనువరించితినన్నది. ఏకస్వరూపముగనిన్నారా ధించుచుంటివన్నది. నీవువదలిన నేను బ్రతుకలేదన్నది. నీవొక్కడవే నాకుపోషకు డవై యుంటవలెనుగాని వేరొకడు పోషకులై యుండుట ఎట్లు భరింతునన్నది. భక్తి శాస్త్రమున భగవంతుడొక్కడే నాకు భర్తగాని వేరొకరు పురుషులే కారు. అందరును స్త్రీలే. అను భావముండవలెను గావున హే భగవన్! నన్ను వేరొకరి పోషణమునందుంచుట కులకాంతను వట్టులకు వప్పజెప్పుటవంటిదని భక్తిశాస్త్ర

ధర్మమును ప్రతిపాదించినది. భగవంతున కత్యంత సాన్నిధ్యమును చేరుకొన్న భక్తశిఖామణుల భాష ఇట్లే యుండును.

భాగవతములోని గోపికా గీతములును భ్రమరగీతములు కూడ ఇట్టివే. శ్రీకృష్ణుని ఒక ఘాతుకునిగ వర్ణించినారు గోప్యాంగనలు. ఇదియే సీత రాముని వెంటనంటు ఘట్టములోని అంతరార్థము. తరువాతి విషయము.

మన రామాయణ కథలోని రాముని అరణ్యవాసపు సమయమున ఆ రాముని అనుసరించిన వారిద్దరుగదా! అందొక వ్యక్తి సీతాకాంత. రెండవ వ్యక్తి లక్ష్మణార్యుడు. సీత కార్యక్రమము ముగిసినది. తరువాతి వాడు లక్ష్మణుడు. ఆతడును సీతకు సరితూగు భక్తశిఖామణియే. ఆతనికిగూడ రాముని వెంట వెళ్లుటకు రాముని అనుజ్ఞ కావలెను ఆతడు రాముని తన వయనమునకు ఆజ్ఞ యిమ్మని అడుగుట యందొక ప్రత్యేకత యున్నది. లక్ష్మణునిపాత్ర, మనకు బోధించు ప్రబోధమొక ప్రత్యేకతను కలిగియున్నదనుట యందేమాత్రమును సందేహము లేదు. సీతా రాముల ప్రయాణమును విన్న లక్ష్మణునకు శోకమాగలేదు. లక్ష్మణుడు తాను రామునివెంట బయలుదేరుటకు అతని అనుజ్ఞ నెట్లు కోరుకొనవలెను? నేను వత్తునను ప్రార్థన గావించు విధానమేమి? అను ప్రశ్నలు లక్ష్మణుని ముందు నిలిచినవి.

ఆతడొక నిశ్చయమునకు వచ్చినాడు. నోటితో వరమడుగుట చాలదని నిర్ణయించుకొనినాడు. సీత ఆర్ధాంగియయ్యే కష్టాతికష్టమున ఆతని ఒప్పించగా నాకు సాధ్యమగునా? అని నిర్ణయించుకొని, సీతారాముల నిద్దర ప్రార్థించి మన కార్యమును గట్టెక్కించుకొనుట అవసరమనుకొనినాడు. వారిద్దర వేర్వేరుగ ప్రార్థించుట కాదని ఆతని అంతరాత్మ చక్కని ప్రబోధము నందించినది. ఎవరినెట్లు ప్రార్థించ వలెనను బాధ ప్రశ్నయైనది. మాతాపితరులిద్దరును ఆరాధ్యదైవతములే. కావచ్చును. అందెవరి చిత్తము తొందరగ కరుగును? తల్లిమనసు వెన్నవంటిది. బిడ్డ విన్నవమును తండ్రికి నచ్చచెప్పి ఒప్పించగల శక్తిగలది కావున తనకును పితృమూర్తికిని మధ్య ఆమె కావలెను. కావున సీతను ఆధారముగాగొని లక్ష్మణుడొక్కమాటుగా వచ్చి రాముని పాదములపై వ్రాలి గట్టిగ పట్టుకొనినాడు ఇక వదలదలచలేదు. "గాధం నిపేద్య" అనినాడు మహర్షి. అప్పుడే సీతనుకూడ ప్రార్థించినాడు నన్నును అనుగ్రహింపుమని.

"న భ్రాతుశ్చరణౌ గాఢం పీడ్య రఘునందనః
సీతామువాచాతియశాః రాఘవం చ మహాబలం
అహం త్వానుగమిష్యామి వనమగ్రే ధనుర్ధరః
న దేవలోకాక్రమణం నామరత్వమహం వృణే
ఐశ్వర్యం వాపి లోకానాం కామయే న త్వయావినా.

ఇప్పుడు లక్ష్మణుడు అనుసరించిన విధానమునకు శరణాగతియని పేరు. భగవంతుని పరిపూర్ణానుగ్రహమును కోరుకొను జీవుడు విషయానందముల నెంత వరకు వదలుకొన్న భగవత్పారతంత్ర్యమును భగవత్పాదారవింద మకరంద రసాస్వాదనమును చేయగలదో లక్ష్మణుని సూత్ర మనకు బోధించినది. లక్ష్మణుడేమని రామునితో విన్నవించుకొనెను? ఎట్లు విన్నవించుకొనెను? అను దానిని పరిశీలింతము.

ఇహలోకసుఖముల వదలుటగాక దేవలోకములలో కలుగు సుఖమును, దేవాదిలోకములను గూడ ఆక్రమించి దేవత్వము పొందదగు అధికారములనుగూడ ఆతడు వదలుకొనినాడు రామా! నిమ్ము కప్ప నేను దేనినికూడ కోరుట లేదని విన్నవించుకొనినాడు. అనగానేమి? అయోధ్యను వదలినాను. తల్లిదండ్రుల వదలుకొనినాను. నీ పాదాశ్రయుడనే అయి నీవెంట వత్తుననినాడు. భగవద్భక్తులకును ఆత్మ జిజ్ఞాసువులకు కూడ ఇదియే ఉపదేశము. ఇక్కడ భాగవతసూక్తి ఒక్కటి స్మృతికి వచ్చినది.

ఒల్లనిర్జరేంద్ర పదమొల్లరు బ్రహ్మపదంబు నొందగా
నొల్లరు చక్రవర్తి పదమొల్లరు సర్వరసాధిపత్యము
నొల్లరు యోగసిద్ధి మరియొండు భవంబుల నొందనీని నీ
పల్లవితాంఘ్రి రేణువుల నొందిన ధన్యులెవ్వడున్.

రాముడొకవిధముగ అంగీకరించలేదు. అయ్యెను లక్ష్మణుని ప్రార్థనలోని భక్తిప్రపత్తులు రాముని అంగీకరింపజేసినవని. సర్వకాల సర్వావస్థలయందును మీకు కింకరుడనై మిమ్ముల సేవించుకొని కృతార్థుడనౌదునని కోరుకొనినాడు. మీకును నావలన కలుగు లాభము లేకపోదని విన్నవించుకొనినాడు. కందమూలముల భక్ష్యకాము గుద్దలి మీచేత నిడుకొని అరణ్యమునకేగుట నేను సహించలేనని చెప్పి ఆఖువిక్షితకమల ధరించి ధనుర్ధరుడై మీకు ముందుగయుండి దారిచూపుచు

రాదగిన నేనుండగ మీరు ఒంటరిగ వయనించుట తగదనిచెప్పి లక్ష్మణుని. రాముడు కాదనుచెల్లు! భగవంతుని ప్రపన్నుని గావింపదగు బాధ్యత భక్తునిదే ననుటను లక్ష్మణుడు నిరూపించినాడు.

ఇక సీతారామలక్ష్మణులు మూగ్గురును తండ్రికార్యములకు వయనము కావలెను. మన రామాయణ కథాభాగమున దేవతలకుకూడ సంబంధమున్నదనుమాటను మనము మరువకూడదు. వరుణదేవుడు రాక్షస సంహారమునకు పనికివచ్చు ధనుర్బాణములను, బాణముల నిల్వచేసుకొను తూణీరమును కూడ జనకుని యజ్ఞ కాలమున ఆయనచేతి కందించినాడు. అవి రామలక్ష్మణులకు జనకచక్రవర్తిగారి మూలముగనే అందినవి. వారును వాటిని తమదగ్గర యుంచుకొనలేదు. అవి వశిష్ఠ మునీంద్రుల పూజాగృహమున పూజింపబడుచున్నవి. ఇప్పుడు వాటిని చేపట్ట వలెను. ఆధనుర్బాణము లమానుషములు. ఆ తూణీరము అక్షయ తూణీరము. ఎప్పటికప్పుడే బాణముల నింపుకొనవలసిన అవసరము ఆ తూణీరమునకుండదు. వే కువేలుగ ఆతూణీరము నుండి బాణము లుత్పన్నము లగుచునే యుండును. ధనస్సులో! అతిరౌద్రములు. నేటికి అవసరములగు ఆధనుర్బాణ తూణీరములు నాడెప్పుడో రామలక్ష్మణుల కందినవి. అని వశిష్ఠుని పూజామందిరమునందున్నవి. గ్రహింపుడు. దుష్టరాక్షస సంహారమున కెంత రహస్యభూతము నడచినదో! వశిష్ఠ మునీంద్రుల మందిరమునకేగి ఆ ధనస్సులను తెచ్చుటకు లక్ష్మణుని పంపినాడు రాముడు. వచ్చువప్పుడు ఆయన కుటుంబమును ఆహ్వానము చేయమని చెప్పినాడు. కేవలముగ వశిష్ఠుని బంధువులనేకాదు. ఎందరెందరినో బ్రాహ్మణులను, సేవక గణమును రప్పించినారు శ్రీరామచంద్రుడు. ఎందుకు? వారందర పూజించుటకు. సీతాలక్ష్మణులచేత కూడ వారందరకును మణిసువర్ణ రత్నాభరణములను అర్పింప జేసినాడు. పేరుపేరు వయసగ సత్కారముల చేయించినారు. కౌసల్య దగ్గరనుండు దాసదాసీజనములకు ప్రత్యేక సత్కారము లందినవి సీతారామలక్ష్మణులచే.

ఈ మట్టనుండి శిజటుడను బ్రాహ్మణోత్తముడొక వనవాసి, ఆకస్మికముగ వచ్చినాడు. నిజమునకా బ్రాహ్మణుడు యాచకుడు కాదు. యాచ్ఞా దైన్యమాతని వదింపలేదు. యాచనావిధానము నాతడెరుగడు. ఆతడు కుటుంబి. దైన్యజీవితము నాతడు పెనుకతో్రసి, హింసారహితమగు వనజీవితమునే ఆతడు గ్రహించిన వ్యక్తి. ఇంక ఎంతకాలము మనమిట్లు జీవించుట? కందమూలముల త్రవ్వుకొను

త్రవ్వక పొధనములను అవ్వల పారవైచి రాముని దర్శింతమని ఆ బ్రాహ్మణుని కల్లాలు ఆయనను ప్రేరేపించగా ఆతడు భార్యను బిడ్డను వెంటనిడుకొని అయోధ్య కేతెంచినాడు. రాముని దర్శనమబ్బినది. రాజద్వారములందా బ్రాహ్మణ కుటుంబము నడగించిన వారెవ్వరును లేరు, ఆతడు రాముని దర్శించి, రామా! "నిర్ధనోబహుపుత్రోస్మి ప్రత్యవేక్షస్వమాం" అనినాడు. నేను ధనహీనుడను. కాని సంతానము బహుళము అని నీ కటాక్షమును బరపుమనినాడు. యాచించుట తెలియని ఆ బ్రాహ్మణుని మాటలకు నవ్వువచ్చినది రామునకు. ఇంత ధనమిమ్మని అడుగలేదనియే రాముని ఆశ్చర్యము. రాముని హాస్యము అతి గంభీరము. ఈ వృద్ధబ్రాహ్మణుని ప్రాణశక్తి ఎంతకలదో చూతమని ఈమాట అనినాడు. బ్రాహ్మణోత్తమా! నీవు చేత కర్ర నిడుకొని ఆవులు వేనకువేయిగనుండు ఈ ప్రదేశము నుండెంత దూరము విసరుదువో అన్నివేల గోవులను తీసుకొందువనినాడు. ఆ బ్రాహ్మణుడు నడుమునకు పైనున్న కాటిని బిగించినాడు కర్రను చేతపట్టినాడు. గాలిని గట్టిగపీల్చి, చేతనున్న కర్రను గిరగిర త్రిప్పి విసిరినాడు. ఆ దండము సరయూనది ఒడ్డునందున్న ఒక వృషభరాజము వద్ద పడగా అంతదూరముగ విస్తరించియుండు ఆవులనన్నిటిని ఆ బ్రాహ్మణునకిచ్చి ఆశ్రమమునకు తోలించి వేరేమియు ద్రవ్యమడుగని ఆ బ్రాహ్మణుని నిర్లిప్తత కాతడు సంతసించి, చమత్కారమునకు మీచేత కర్రను విసిరించితిని గాని వేరుకాదని ఆ బ్రాహ్మణుని గౌరవించి వేరుగ ధనమునుగూడ ఇచ్చి పంపినాడు.

ఇక సీతారామలక్ష్మణులు దండకారణ్య భూములనేలుటకు పయనించవలెను. అప్పుడే సీతాకాంత పతివ్రతయై రాముని ఖడ్గతూణీరములకును అతని తీక్ష్ణ కోదండమునకును పుష్పమాలలనలంకరించినది. రాముని దివ్యాయుధములు సీతాకాంతచే అలంకృతములై రాముని వరింపగా రాముడును ధనుర్ధారియై ఖడ్గతూణీరములు ధరించినాడు. ఆకడప్పుడు కోదండరాముడు మహారాక్షస విమర్దనుడు. లోకోద్ధరణ పారిజాతము. నిజమునకు రాక్షస సంహారమునకే సీతాకాంతరాముని అర్ధాంగియైనది ఇదితెరలోని విషయము.

రాముడిప్పుడు సీతాలక్ష్మణ సమేతుడై పితృపాదుల అంతఃపురమునకు పోవలెను. తన భార్యయు తమ్ముని తనతో వనవాసమునకు బయలుదేరినని రాజాజ్ఞను తీసికొనవలెను.

రామావతార మాదర్శావతారము. కావున ఆతని జీవితము చట్టబద్ధము. రాముడిప్పుడు రాజపుత్రుడు. సీతాకాంత దశరథుని కోడలు. లక్ష్మణుడు రాముని సోదరుడు, భక్త వర్యుడు కూడ. రాముని బహిఃప్రాణము.

సీతారామలక్ష్మణులు తమ అంతర్గృహము నుండి బహిర్ద్వారమును దాటినారు అది రాజమార్గము. కిక్కిరిసియున్న జనమధ్యము. ఆ జన మధ్యము నుండియే రాముని వయనము. ఆతడు భార్యాసోదరులతో పాదచారియై బయలుదేరినాడు. రామ లక్ష్మణులను చూడని ప్రజాసీకము ఉండుట దుర్లభము. సీతనెవ్వరెరుగుదురు? ఆమె మహారాణి. అంతఃపురకాంత. ఆకసమున విహరించు దేవతలకును ఇంతవరకామె కంటబడలేదు. లోకోద్ధరణకై అవతరించిన వారి జీవితములట్లె అంతఃపురముల దాగి సమాప్తములగుట సృష్టిఖండములోని విషయముకాదు. కావుననే ఆ మహా రాణి నేడు మార్గమధ్యమందలి సామాన్యజనుల కంటబడి వారిచూవులయందామె దుఃఖభాగినియైనది? ప్రజలు కన్నీటి బిందువులు కార్చక తప్పలేదు. కొంతసేపు మాత్రము చూపరుల కన్నులనుండి నీటిబిందువులు రాలక అట్లే నిలిచినవి. ఆ సమయము సీతాకాంత సామాన్య జనుల కంట బడకుండుటకై చతుర్ముఖుడు వారి నేత్రములకు అడ్డము వైచిన తెరగా వచ్చును.

రాముడు కైకేయి అంతఃపురమునకేగునప్పుడు రాజమార్గమున తీర్చిదిద్ది యున్న హర్మ్యప్రాసాదము లాతని కంటబడక పోలేదు. పౌరులు కైకేయిని నిందించి, భరతుని సామ్రాజ్యమును వదలిపోవుదమనుకొనుటయు ఆతని చెవిని పడుచునేయున్నది. అయ్యను ఆతడుదాసీనుడయ్యె పయనించినాడు. సుమంత్రుడు మార్గమధ్యమునసే కలియుట జరిగినది. ఇక రాముడు సీతాలక్ష్మణ సమేతుడై కుంద్రిని దర్శించవలెను. ఆయన ఆనుజ్ఞయ్యె సుమంత్రుడు లోనికేగినాడు. రాముని రాకను చెప్పినాడు. దశరథుడు పుత్రవియోగదుఃఖమున మునిగితేలుచున్న సమయమది. అయ్యను దశరథుడు సుమంత్రుని కాజ్ఞాపించుట జరుగకపోలేదు. దశరథుడు తన భార్యలనందర నొక్కచో చేర్చి రాముని ప్రవేశ పెట్టునట్లాజ్ఞా పించినాడు.

దశరథునకు పట్టపు రాణులు మువ్వురేయైనను భార్యలై అంతఃపురమున వసించు సహితామణులు మూడు పందల ఏబదినుండి కలరు. వారందరును రామునకు తల్లులై రాముని ప్రేమింతురు. ప్రస్తుతమున వారందర నొక్కచో చేర్చి, వారందరి

మధ్యనున్న రాముని దర్శింపదలచినాడు వృద్ధభూపతి. అట్లే జరిగినది. కౌసల్యా సుమిత్రలతో కలసియే మూడువందల ఏబదిమంది భార్యలను కైకేయి అంతఃపుర ముస కూడినారు. సీతారామలక్ష్మణుల ప్రవేశమైనది ఆదియొక విచిత్రమగు పన్ని వేశము దశరథాంతఃపురమంతయు ఒక్క క్షణకాలముననే అల్లకల్లోలమైనది. జీవుడు కోరుకొన కోరికలు తాను కోరినట్లుగనే ఫలవంతములై ఆతనిని సంతోష పెట్టునను నిశ్చయమీ సృష్టిఖండమునలేదు. ఒక్క క్షణకాలమున రాజాంతఃపురము సంతోషసాగరమధ్యమున నోలలాడవచ్చును. ఆదియే శోకసాగరమై దుఃఖతరంగ ములలో ఉయ్యాలలూగవచ్చును.

శ్రోతలారా! మీరిప్పుడు దశరథాంతఃపురమును దర్శింపుడు. కైకేయి నొక్క దానిని అవ్వలనుంచగా సీతారామలక్ష్మణుల యునికికి అంతఃపురమంతయుగగ్గోలు పెట్టగా వారి రోదనధ్వనులు మిన్ను ముట్టినవి. రామమాతలందరును రాముని వసవాసమును తలచి తలచి ఎలుగెత్తి ఏడ్వగా దశరథుడును హా! యని పెద్ద కలత మునను ఏడ్చినాడు. ఈక్షణమునేమనవలెను? జీవుని సంతోషము నిత్యసత్య మన వలెనా? స్వర్గసీమయు ఇట్టిదే. బ్రహ్మలోకమును అంతియే. "ఆబ్రహ్మభువనాల్ లోకాన్ పునరావర్తినోర్జున" అన్నది గీత. కథకురండు.

ఇప్పుడు కలిగిన పుత్రదర్శనము దశరథునకు చివ్వరిదర్శనము. మూత్ర మండల మధ్యమునందాతడు దశరథునకు కంటబడినాడు. దోసిళ్ళ నొగ్గి వినమ్రులై విలచిన పుత్రులజూచి తానిక లోకాంతరమునకు వయసము కాబోవుచుంటినని తలచిన ఏ తండ్రి బిడ్డల కొగిలింప సశ్యాతుడై వేవేగలేవనుంకింపడు? రాముని విడచి ఒక్క ముహూర్తకాలముకూడ జీవింపలేనని విశ్వామిత్రునకు మనవి చేసి కొనిన దశరథుడీకడు. రాముడు తన దగ్గరకు వచ్చుటకు ముందుగనే రాముని తన చేతులజాపి కొగలించుకొనవలెనని దశరథుడాతురుడై వక్కమీదనుండి తటాలున లేచినాడు. ఆమహాభాగ్యమాయనకు దక్కలేదు మార్గమధ్యమునసే మూర్ఛిల్లి క్రిందపడినాడు. రామలక్ష్మణులే పరుగుపరుగున వచ్చి తండ్రిని తను కొగిలించి లేవనెత్తి ఆసనమున కూర్చుండబెట్టుట జరిగినది ఇకరాముడు తండ్రిగారి అనుజ్ఞ కోరవలెను. తనతో సీతాలక్ష్మణుల గొంపోవుటకు, తండ్రి దుఃఖమును చూడ చూడ రామునకును దుఃఖమాగుటలేదు. అయ్యను తండ్రీ! సీతాలక్ష్మణులు నా వెంట వచ్చుటకనుజ్ఞనిమ్మని దుఃఖాగద్గదయ్యే గద్గదకంఠమునసే కోరినాడు. ఇదియే రాముని పాత్రలోని ప్రత్యేకత.

తన వియోగమును భరింపలేక దుఃఖభాజనులైన తల్లిదండ్రులు కన్నీ
కాల్వల ప్రవహింపజేసినను అతని ధర్మహృదయమున మాన్పురాలేదు. ఆ
మూర్తుల హృదయములలో మార్దవమొక భాగమును ఆక్రమించియుండగా,
న్యమును ఆప్రక్కనే నిలచి, ధర్మాచరణమునకు మాత్రము కాఠిన్యము ఆ
దోహదము చేయుచుండును. కాకున్న అత్యంతమార్దవముగల బ్రాహ్మణుని హ
యమున యజ్ఞపశువును విశసనము గావించి దేవతలకు హవిర్భాగము నిచ్చు
తావెక్కడ కలదు? పశు విశసనము గావించి, మంత్రపూతముగు హవిస్సును
తల కందించుచు వేదవిధిని అనుసరించునప్పుడు అతని హృదయమునందుండ
మార్దవమొక ప్రక్కకు జరుగగా కాఠిన్యము వేదవిధిని ఆచరింపజేయును.
మునకు "మాహింస్యాత్సర్వ భూతాని, అగ్నీషోమీయం పశుమాలభేత" అను
రెండునూ వేదవిధులేయగుటచే ఆవిధుల నిర్వహణ నిర్వహింపచేయునది గ
వేదవిధియే కావలెనుగాని మన అంతరాత్మకాగూడదు. రాముడిక్కడ పితృమూ
సత్యవ్రతుని గావించుటకే తావునిచ్చి, వాని సామాన్య దుఃఖమును తీర్చు
తావునివ్వలేదు, ఇదియే మనము రామునిలో గ్రహింపదగు విషయము. కథరం
కథ వరుసగ జరుగునో లేదనుకొనకుడు. నాటివన్యాసములకు లక్ష్యము కేవలమ
కథాకథనము కాదు. వేదవేద్యుడగు రామునకును వేదవిధులకునుగల సంబంధమ
తెలుపుట నా లక్ష్యము.

అందుకు దశరథుడేమనెను? వెళ్లుమనెనా? కన్నకుమారుని సద్గుణాభిరా
రాజ్యార్హుని వనసీమలకు పొమ్మని ఏతండ్రి తన నోట చెప్పగలడు? ఒక్కమా
చెప్పినాడు.

అహం రాఘవ కైకేయ్యా వరదానేన మోహితః
అయోధ్యాస్థ్వమేవాద్య భవ రాజా నిగృహ్యమాం

రామా! కైకేయీ వరదానమోహితుడనగు నన్ను నిగ్రహించి అయోధ్య
మనినాడు. రాముడు మారునా? తండ్రీ! నీ సత్యవ్రతదీక్షను సఫలము చేయ
నాకు సామ్రాజ్య లక్ష్మీ పాణిగ్రహణమనినాడు. నీయాజ్ఞాపాలనమే స్వర్గపీఠమ
తన మధుర వాక్కులచే దశరథుని లాలించినాడు. దశరథునకామాటలు చెవినిబడ
అతడు మరల మూర్ఛిల్లినాడు. కైకేయివంటి కాంతకు భర్తయగుటకంటే పురుష
వేయదుఃఖములేదు.

"లోకే తు నిర్ధనో దుఃఖీ ఋణగ్రస్తస్తతోధికః
తాభ్యాం రోగయుతో దుఃఖీ తేభ్యో దుఃఖీ కుభార్యకః "భార"

లోకమున దుఃఖమిచ్చునది దరిద్రము అంతకంటే ఋణము. దానికంటే వ్యాధి. ఈమూడింటి కంటెను గూడ మిక్కిలి దుఃఖమిచ్చునది దుష్టురాలగు భార్యకు భర్తయగుట. ఇప్పుడు మూర్ఛనొందినది దశరథుడే కాదు. కైకేయి తప్ప మిగిలిన వారందరును ఉచ్చైస్వరమున ఏడ్వగా సుమంత్రుడు కూడా మూర్ఛిల్లినాడు. కానీ అతడెట్టకేలకు లేచినాడు ఆతనికి కోపమాగలేదు కన్నులనెర్ర జేసుకొని పండ్లు పటపట గొరుకుచు కైకేయి వైపుకు తిరిగినాడు. సుమంత్రుడు అంతఃపుర కాంతలను గూడా తీర్చిదిద్దగల వాక్స్వాతంత్ర్యము గల మంత్రి కావున కైకేయిని వేధించదగు వాగ్బాణములతో కొట్టినాడు. భర్తృఘాతుకీ! కులపాంసనీ! నీచేత సంపాదింపబడిన ఈ పాపిష్ఠి రాజ్యమున మేమెవ్వరమును నివసింపమనినాడు. బ్రాహ్మణు లెవ్వరిం దుండరని గట్టిగ చెప్పినాడు ఎడఁకలచే త్రవ్వబడిన మట్టిరాసులే నీదృక్కృతము నందుండదగిన వనినాడు. కాక నీజన్మ అట్టిదనుటకు నింబవృక్షమునుండి తేనె (సోనలు గురియునా?నింబమనవేవ)ఁని ప్రశ్నించి నీవుపుట్టిన కడుపు అట్టిదని కైక తల్లి చరిత్రను జ్ఞాపకము చేసినాడు ఆమెదొక చరిత్ర, కేకయరాజునకు చీమలభాష తెలియును. అది ఒక మహాత్ముని ప్రసాదము. ఆతడొకనాడు భార్యతోకలసి యుండగా రెండు చీమలు మాట్లాడుకొనుట జరిగినది. ఆయనకు వాటి సంభాషణ నవ్వును తెప్పించగా నవ్వినాడు. భార్య ఆతని హాసమును తన అవమానముగ భావించి కారణమడిగినది. అతడు చీమల భాషను బయట పెట్టుచో తనకుమరణము కలుగుటను ఆమెకుచెప్పగా నీవుచచ్చినను సరియేచెప్పుమన్నది. కేకయమహారాజు తనకు ప్రసాదించిన మహాత్మునితో సంప్రదించగా ఆతడు చెప్పుటకు అనుజ్ఞనీయ లేదు. అంతతో భార్యకా విషయమును చెప్పక సుఖపడెను ఆ చరిత్రను కైకకు చెప్పి, నీ తల్లిబుద్ధియేనీకు వచ్చినదనినాడు. కైకేయి మారలేదు. అంతలో దశ రథుడు మూర్ఛనుండిలేచి సుమంత్రునిచూచి, సుమంత్రా! రామునకు వలయు ధనము నిమ్మని ఆజ్ఞాపించినాడు కైకేయి సహించునా? దెబ్బతిన్న త్రాచువలె లేచినది. ధనహీనములగు ధాన్యాగారముల నా పుత్రునకిత్తువా? అని గద్దరించి పలికినది.

సిద్ధార్థుడను మంత్రిముదుసలి. అతడును కైకకు బోధించినాడు. కైక తన పట్టును విడువలేదు. దశరథుడు మేమందరమును రాముని వెంట వెళ్ళుదు మనినాడు.

ఇట్లైన్నియో విధముల రాముని వనవాసమును మాన్పుటకు ప్రయత్నములు జరిగినని. ఆసమయమున రాముని సమాధానమిది.

తండ్రీ! నాకేల ద్రవ్యము? నేనరణ్యముల వపింప మీరు నాతోడ వచ్చుట నాకు సుఖమును గూర్చుటరాదు. నాకిప్పుడు కావలసినవి అరణ్యజీవనము చేయు వారికి కావలసిన సాధనములు. నారచీరెలు, గంప, గడ్డ పారలున్నచాలును. ఏనుగను వదలినవానికి, దానిని కట్టివైచు త్రాడునందు మోహముండునా? కావున నాకు వలసిన నారచీరెలనిచ్చి, నన్నరణ్యములకు వేవేగ వంపుమనినాడు.

కైకేయి సంతసించినది సీతారాములకు కావలసిన నారచీరెలనామె అదివరకే చేకూర్చినది. చివాలునలేచినది. రామునికి నారచీరెలను ఇచ్చుట కాలస్యము చేసిన ఏదియోకార్యభంగ మగునని తలచినదేమో! తానే తనహస్తములతో రామునకు నారచీరెలనిచ్చి, కట్టుకొమ్మనినది. ఆమాటను చెప్పుటకామెసిగ్గుపడలేదు. అట్టి వారిట్టి కార్యములకు సిగ్గుపడరు. రాముడా తల్లియిచ్చిన నారచీరెల చేత తీసికొని నాడు. వట్టుపుట్టములవిడిచి, ఆ నారచీరెల ధరించినాడు. లక్ష్మణుడును ధరించినాడు. సీతకుకూడ ఇచ్చినది. ఇక సీతాకాంత ధరించవలెను. ఆ నారచీరెల ధరించుట ఆమెకు చేతకాలేదు. ఒకచేత కంఠసీమకు మట్టుకొన్నది. అంతియే నాథునివంకతిరిగినది. "కథంను చీరం బధ్నంతి?" ఈ నారచీరెలనెట్లు కట్టుకొనవలెనో? వనవాసులెట్లు ధరింతురో? అన్నది. రాఘవేశ్వరుడే తనవిత్ర పాణితలములతో అర్ధాంగికి ఆమెధరించియున్న వట్టు పుట్టములమీదనే నారచీరెను కట్టినాడు. మీరొక్కమారీ దృశ్యమును తిలకింపుడు.

నిత్యనూతనములగు వట్టుచీరెల ధరించు నాకాంతా లలామకు రాముడే స్వహస్తములతో నారచీరెల ధరింపజేసిన దృశ్యమా అంతఃపురము నందున్న వారి కెంత కలవరమును కల్పించునో యూహింపుడు.

వశిష్టమునీంద్రుని బ్రహ్మమానస పుత్రులు జ్ఞానసంపన్నులు. అట్టిమహా నీయుడే ఆదృశ్యమును చూడలేకపోయెను. మిగిలినవారి సంగతి చెప్పెడి దేమున్నది? ఆయన హృదయమొక విధముగ కదలి పోరినది. రామునివెంట సీత వెళ్ళవలసిన వనికేదనినాడు. సీతరాముని అర్ధాంగి కావున రాముడధిష్ఠించు సింహాసనము వండామెను కూర్చుండ బెట్టెదననివాడు.

"ఆత్మా హి దారాస్సర్వేషాం దారసంగ్రహవర్తినాం
ఆత్మేయమితి రామస్య పాలయిష్యతి మేదినీం"

గృహస్థులకు భార్యవారి ఆత్మస్థానమలంకరింపదగువ్యక్తి. సీతరాముని ఆత్మ. కావున ఆమెరాజ్యమేలగలదు అనినారు

శ్రోతలారా! భారతీయుల పవిత్రభావముల గమనించితిరా? స్త్రీల కొసం గిన ఉన్నతస్థానమును తిలకించితిరా? మాంసమయదేహ సౌందర్యమును మాత్రమే లక్షించుచు స్థూలదేహమునే యారాధించుచు, అంతఃకరణ పారిశుధ్యమావంత యైనను స్త్రీలపట్ల చూపని పాశ్చాత్యసోదరులు నేడుమనకు స్త్రీలకివ్వదగు స్వాతంత్ర్యమందును వారిని చూడదగు ఉన్నత దృక్పథములకును ఆదర్శచరిత్ర కారులగుట దౌర్భాగ్యమనుటకంటె మరేమనవలెను? కథాభాగమునకు రండు.

దశరథభూమీశుడు సీతకు ఆభరణములను చీనిచీనాంబరములకూడ నొస గుట కాజ్ఞయివ్వగా అట్లేజరిగినది రాముడు తనతల్లియగు కౌసల్యను దశరథునకు వప్పచెప్పగా సిగ్గునొందిన దశరథుడు మూర్ఛనొందినాడు.

కొంతసేపటికి మూర్ఛతెలసినది. రాముడరణ్యములకు బోవతప్పదుగావున సుమంత్రునిపిలచి రథమునాయత్తముగావింపుమని దశరథుడాజ్ఞాపించినాడు. రథము సిద్ధమైనది.

సీతారామలక్ష్మణులు రథము నధిష్ఠింపవలెను.సీతాకాంతముఖమున విచారము మిసుమంతయునులేదు. ఆమెభర్తతోటి అరణ్యావాసము స్వర్గమను కొన్న ఇల్లాలు గదా? కౌసల్యకోడలిను చూచినది. ఆమెకొక ప్రత్యేకమగు సంతసము కలిగినది. కోడలిను దగ్గరకు తీసుకొన్నది. సీతాకాంతకు భర్తకుగల సంపద తొలగగా ఉండ దగు ధర్మమెట్టిదో తననోటచెప్పి, రాముని యందాదరమును చూపుమని పలికినది. సీతాకాంతకాయుపదేశము వింతకాదు. నా పితృగృహమున నేను పొందిన శిక్షణను స్మృతికి తెచ్చితినని గంభీరముగా అత్తగారికి సమాధానమిచ్చినది. తాను చరించదగు విధిని గూడ వర్ణించి కౌసల్యకు తృప్తిని గూర్చినది. కౌసల్యామహాసాధ్వి కన్నుల నుండి ఆనంద బాష్పములును, దుఃఖాశ్రువులు కూడ జింటయయ్యేరాలినవి. రాముడు కౌసల్యమొదలగు మాతృమూర్తులందర నొక్కమారుగ పలకరించి అనుజ్ఞను కోరి నాడు. మీరందరు దుఃఖార్తులు కాకుండడని ఓదార్చినాడు సీతాలక్ష్మణులచే ప్రత్యేక వందనముల సమర్పింపజేసినాడు మాతాపితరులకు, తాను ప్రత్యేకముగ కౌసల్య

చగ్గరకేగి,తల్లికాగిటిలో బిడ్డయై ప్రత్యేకముగు వాత్సల్యరసమునను భవింపజేసినాడు. మనమిక వనములకు పోవు సీతారామలక్ష్మణుల దర్శించుటయే మిగిలినది. కాని ఈ ఘట్టమున సుమిత్ర లక్ష్మణునకు బోధించిన బోధామృత సూక్తిని మీకు వినిపింపవలసి యున్నది.

లక్ష్మణుడు తన నిజమాతయగు సుమిత్ర కడకేగినాడు. వందన మాచరించి అరణ్యమునకు పోవుచుంటిననినాడు.

రామాయణమున సుమిత్ర పాత్రకొక ప్రత్యేకత యున్నది. ఆమె విజ్ఞానిని లక్ష్మణుని దగ్గరకులాగికొని శిరమును వాసనచూచి, లక్ష్మణానీవు వనవాసమునకే సృష్టించబడితివని ఆతని కర్తవ్యమును గురించి ప్రత్యేకముగ బోధించి, పురిగొల్పినదే గాని నీవును అరణ్యమునకు పోవుచుంటివా? అని కంటనీరు పెట్టుకొనలేదు. ఇదియే ఆమెలోని ప్రత్యేకత. ఆమెబోధ ఇది.

రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజాం
అయోధ్యామటవీం విద్ధి గచ్ఛ తాత యథా సుఖం

లక్ష్మణుడప్పుడు వదలివెళ్ళినవి మూడు స్థానములు. ఒకటి పితృస్థానము. రెండు మాతృస్థానము. మూడు స్వదేశము. పుట్టిన చోటులు రెండును పెరిగిన చోటు ఒకటియు. అందొకటి తాను. రెండవవాడు దశరథుడు. మూడవది అయోధ్య. ఈమూడును నిన్నువిడిచిలేవు అని బోధించినది లక్ష్మణునకు. నీ పితృ మూర్తికి బదులుగ నీ అన్న ఉండెనన్నది తల్లినైననాకు బదులుగ వదినె యున్నదన్నది. మరి అయోధ్యయో? అదవియే అయోధ్యఅన్నది. ఒకటి మరియొకటి ఎట్లు కాగలదు? దశరథుడు రాముడెట్లగును? సుమిత్రసీతయగునా? అరణ్యము నగరమగునా? తప్పక కాగలవన్నది భావనయే మానవునకు దుఃఖమును కల్పించును భావనయే సుఖము నిచ్చును. మాంసపు కన్నులకు కనబడునది భావించుట కాదనన్నది. అనగానేమి? స్థూలమగు జగత్తుభావనకు ఆలంబనమని అర్థము. మాంసమయ శరీరము ప్రధానము కాదన్నది. సూక్ష్మమగు గుణమయ శరీరము నందలి కన్నును తెరువ వలెనన్నది. ఆకన్నును తెరువని వాని జీవితము వ్యర్థమన్నది బిడ్డా! నీవు సీమనో నేత్రమును తెరచియే ఇప్పుడు రామునితో వనమున మగుచుంటివి. ఇక ఈ నేత్రమును మయ్యవద్దన్నది. పెద్దన్న తండ్రియని భావించుటను ధర్మశాస్త్రము చెప్పినది. జ్యేష్ఠ సోదరుని భార్య తల్లియనియు ధర్మ

శాస్త్రమే నిర్వచించినది. ఆ ధర్మశాస్త్రమును పుత్రుని మనస్సున దృఢపరచినది తరువాతది భక్తిశాస్త్రము. ధర్మనిర్వహణకు ఫలము భక్తి. తరువాత ఆభక్తికి స్థానము ఇచ్చినది.

ఈ స్థూల శరీరమును తల్లిదండ్రులివ్వగా జ్ఞానమయ దేహము లిచ్చువాడు భగవంతుడు. ఆ భగవంతుని పుత్రునకు తెలిపినది.

సీతారాములు లక్ష్మీనారాయణులన్నది. కేవల ముగ నీ స్థూలదేహమునకు సంబంధించిన బంధువులు కారన్నది. ఆలక్ష్మీనారాయణు లింతవరకీ అయోధ్య యందుండిరి. వారున్నంతవరకీ ఆయోధ్య వైకుంఠమన్నది. ఇప్పుడువారు అరణ్య మునకు పోవుచుండిరి గాన అరణ్యమే అయోధ్య లేక వైకుంఠమన్నది. ప్రస్తుతమగు అయోధ్యానగరము ఆరణ్యమేనన్నది. అంతేకాదు. లక్ష్మణా! అయోధ్యయన నీవు చూచు ఈ నగరమేకాదు. నీదేహమే అయోధ్య అన్నది. నీ శరీరమధ్యమున పెరిగొందు హృదయపుండరీకమున నివసించు సీతారాములు నీకు బాటగుచో అడియొక అరణ్యమన్నది. నీ మనోమయ శరీరమున కామక్రోధాది క్రూరమృగములు చరించుచున్నది. నీ మనఃఫలకమున సీతారాముల ముద్రించు కొన్నచో నీ దేహము వైకుంఠమగునన్నది. ఆశ్లోకాన్వయమిది.

రామం దశరథమితివిద్ధి. జానకీం మాం ఇతివిద్ధి. అరణ్యం అయోధ్యామితి విద్ధి. దశయన పక్షి. గరుడుడు. దానిని ఎక్కువాడు విష్ణువు. మాయన లక్ష్మి. ఆయోధ్యయన వైకుంఠము. ఎట్లందురా?

అయోధ్యయన శత్రువుల కప్రభేద్యమగు నగరరాజముగదా? ఇక్కడ శత్రువులన కామాది శత్రువులని అర్థము. అని వంచింపని, (లేక) భేదింపని నగరరాజము సాక్షాన్నారాయణుడు వసించు నగరము. అదియే వైకుంఠము ప్రస్తుతమున రాముడు వసింప బోవు వనసీమలే వైకుంఠనగరము. లక్ష్మణా! రాముడు వెళ్లినట్టి మహారణ్యసీమయే నీకు వైకుంఠము కాగలదని సుమిత్ర తనబిడ్డకు బోధించినది. ఇదియొక బోధామృత భాండము. ధ్రువునకు నీతి ఇట్టి అమృతభాండమునే చేతికిచ్చి తపస్సునకై అయిదేండ్ల బాలని అరణ్య మనకంపినది. భారత నారీమణుల బిడ్డలను కనుటయందు లక్ష్యమిదియే ఇట్టి బోధము అందించలేని తల్లియైనది కైక. భౌతిక రాజ్యమునే తన బిడ్డ వ్వడలపినది.

ప్రకృతము ననుసరింతము

లక్ష్మణుడు మాతృదేవత అందించిన ఆధ్యాత్మిక ప్రసాదమును శిరమువంచి, దోసిలియొగ్గి గురు ప్రసాదముగ అందుకొని రామునితో వయనమయ్యెను. అంతలో సుమంత్రుడు అత్యంత వేగ సంపన్నములగు గుర్రముల పూన్చి యాత్రారథమును ద్వారదేశమున నిలిపినాడు. ఇక సీతారామలక్ష్మణులు వనవాస ప్రారబ్ధయాత్రను సాగింపవలెను. ఆ యాత్రను సాగింప సీతయే ముందుగ రథము నధిరోహించినది. తరువాత రామ లక్ష్మణులెక్కినారు. వారి రథము వనసీమల కభిముఖమైనది. మరి అయోధ్యా నగరసామ్రాజ్యము నేనిరభిముఖమైనది? చెలియల కట్టలేని దుఃఖసముద్రమున మునిగినది. అయోధ్యాపుర వాసులు మధురానుభూతులననుభవించు కాలము వెనుకకు మరలినది. ప్రస్తుతమున రాముని దర్శనభాగ్యమబ్బుకొనువారు అరణ్యవాసులేయని కాలము పాఠమును చెప్పగా నగరవాసులకు రాముని వియోగము భరింపరానిదైనది.

రాముడు దశరథుని పుత్రుడు మాత్రమేకాదు. కౌసల్యకు కొమరుడై మాత్రమేలేడు. రాజాంతఃపురమునగల దశరథుని భార్యలే అతని మాతృమూర్తులు కారు. రాముడందరివాడు. అందరిలోనివాడు. అతడు పరమప్రేమమూర్తి. అతడు అందరిఆత్మ.

నగరము నందలి ప్రజానీకము దుఃఖకాతరులై ఆబాలగోపాలము తరుణ ఆయన వెళ్లు రథమును కదలనిచ్చుటలేదు కొందరు పెంటనంటినారు. మరికొందరాతని పయనమును తలచి ఒడలెరుగక కపడియుండినారు. ఏ ఒక్కరి మనస్సును వారి వారి స్వాధీనమున లేక రాముని స్వాధీనమైనవి. శోకరసనిమగ్నులైన ఆపౌరులందరిలో రాముడు నిలచినాడు. సీతారామలక్ష్మణులు ప్రతిబింబించని అంతరాత్మలు లేవు. కౌసల్య పుత్రునివెంట పరుగెత్త మొదలిడినది. దశరథుడు సుమంత్రుని పిలచి సుమంత్రా! రథమును తోలకుము తోలరుము అని కేకలు పెట్టుచు రథ పరాగము కన్పట్టునరకు అట్లే చూచుచుండెను. తల్లులకు పుత్రులపై ప్రేమలుడిగినవి. సోదరులమ ప్రేమించుటలేమ. బిడ్డలను తల్లుల ప్రేమించుటలేదు. భార్యలకు భర్తలపై ప్రేమభావము లంతరించినవి. మొట్టమొదట కాన్పున పుత్రుడు పుట్టగా ఏ తల్లియు సంతసించుటలేదు ఆనాడు గృహస్థులెవ్వరును వంటలు చేయలేదు. అగ్నిహోత్రముల ప్రేల్చువారును ఆ అగ్నులనారాధించుటలేదు. అగ్నులును అదృశ్యావము నొందినవి. ఆవులు దూడలకు పాలనిచ్చుట మానినవి. సూర్యుడాకసమున మరుగుపడినాడు. గ్రహమండలములలో గురుబుధులు క్రూరగ్రహములు

కాకున్నను నేడు అంగారకునితో కూడి క్రూర గ్రహములైనవి. అశ్విన్యాది నక్షత్రములు కాంతిమాపి తేజోహీనములై కన్పట్టినవి. విశాఖానక్షత్రము ధూమ కేతువుతో కలసినవి. (విశాఖ ఇక్ష్వాకువుల నక్షత్రము) ఇవన్నియు నిట్లుండ పసిబాలుడు కూడ తల్లుల చూచి పాలకేడ్చుటలేదు. వేయేల? పంచభూతములును ఆసుకునూర గాత్రులు అరణ్యమునవడు పాట్లను తలచి వాచుూపెనని వాల్మీకి వర్ణించినాడు. శ్రోతలొక్కుూరిపుడు రాముని పరిశీలింపుడు ఈదశరథ రాము డెవ్వడైయుండెను? ఆత్మారాముడయ్యెయుండెననుటకు మీరు సందేహింతురా? ఆత్మకంటె ప్రియమగు వస్తువులేదని ఉపనిషద్వాణి తెలిపినది. ఆత్మానందము కొరకే తనకంటె అన్యమగు వస్తువును ప్రతివాడును ప్రేమించుతురు. కాకున్న భార్య భర్తనే లవచలి బ్రతుకును? దారాపుత్రాదులనే లపురుషుడు వదలును? తనను తానేల వదలుకొనడు? రాముడు సర్వభూతాత్మయని మన కథాభాగము వ్యాఖ్యానించినది. కాకున్న భూతములన్నియు అట్లు కంటినీటిని విడుచునా? ఇక కథలోనికి పోదము. కథాంతర్భాగమునందు మీకొకముఖ్యమగు విషయము చెప్పవలసియున్నది. రాముని రథము కదలి వెళ్లుచున్నప్పుడు దశరథుడు సుమంతుని రథమును ఆపుము ఆపుము అని కేకలు పెట్టుచుండగా రాముడు తొందరగ తోలుము సుమంత్రా! అని సూతుని తొందరపెట్టెను. ఆసమయమున సుమంత్రుడు రాజాజ్ఞను రామునాజ్ఞను మధ్యనుండగా రాముడు దశరథునిమాటను లెక్కపెట్టవద్దనియు, అంతగ నీపు తిరిగిరాగా రాజు అట్లేల చేసితివని అడుగుచో మీమాట నాకు వినబడలేదని చెప్పుమనియు, సుమంత్రునకు సలహానిచ్చి రథమును ముందుకు నడిపించినాడు.

రాముని పాత్ర చాల చిత్రమైనది. రాముడు సత్యవ్రత దురంధరుడు. తానెప్పుడును అబద్ధమాడడు "అనృతం నోక్త పూర్వం మే నచ వక్ష్యేకదాచన" అని ఆయన ప్రతిజ్ఞ. కాని సుమంత్రుని ఇప్పుడు అబద్ధమాడుమని చెప్పుటేమిటి?

ఇట్టి ఘట్టములే మన పురాణములందు భ్రమపెట్టు స్థలములు. ఈ ఘట్టమును మనసు నందుంచుకొనిన ఒక మిత్రుడు నన్నిట్లు ప్రశ్నించినాడు.

మిత్రుడు: నేనెన్నడును అబద్ధమాడనన్న రాముడు నీవిట్లబద్ధమాడుమని మరొకరిని ప్రోత్సహించిన చోటు రామాయణము నందున్నది మీరు చూచితిరా?

నేను : అట్టి ఘట్టము రామాయణము నందెచ్చటను నాకంట బడలేదు.

మిత్రుడు: మీరు రామభక్తులు.

నేను : కాదు. కాదు నేను విమర్శకుడను కూడ. నాది మూర్ఖభక్తికాదు. మా గురువర్యులు విమలానంద భారతీయతీంద్రులు చక్కని తర్కమునకు స్థానము నొసంగెడివారు. కాని అది శ్రుతిమత తర్కము. శాస్త్రాధారమగు విమర్శయే మోక్షమొసంగునని శంకర సిద్ధాంతము. మీరెక్కడైన రామాయణమును మరొకరిచే రాముడబద్ధ మాడించుటను చూచితిరా?

మిత్రు: అయోధ్యాకాండమయందు రాముడరణ్యమునకు పోవునప్పుడు దశరథుడు సుమంత్రుని రథము నాపుమని ఆజ్ఞాపింప నా రాముడు సుమంత్రునితో నేమనెను.

నేను : మీరే చెప్పుడు.

మిత్రు :"నా శ్రౌషమితి రాజా నం ఉపాలబ్ధోపి వక్ష్యసి" సుమంత్రా రథమును పోనిమ్ము అపవద్దు. ఒకవేళ రాజునిన్ను నా ఆజ్ఞనేల ఉల్లంఘించితివని తిరిగి వచ్చినతరువాత అడుగుచో వినబడలేదని చెప్పుము. అవి చెప్పెను గదా? దీని నేమందురు.

నేను : దీనిని అబద్ధమాడించుటయని విజ్ఞులనరు.

మిత్రు: మరేమనెదరు?

నేను : దశరథుడెందుకు ఆపమనెను? రాముడెందుకు పోనిమ్మనెను? అవి విచారింతురు.దశరథుడు రాముని పయనమును ఆపుటకు రథము నునిలుపమనలేదు రాముడు తండ్రిమాటను ధిక్కరించుటకు ఆపవద్దనలేదు. "చిరందుఃఖస్యపాపిష్ఠం" మన రథమును ఆపిన కొలది దశరథుడు దుఃఖపడుటయే గావున మన పయనము తప్పదుగావున పోనిమ్మనెను. అంతగ రాజడుగుచో ఆజన ఘోషమున వినబడలేదని సర్దమనెను. ఇక్కడ "నాశ్రౌషమ్" అనుమాటకు నేను వినలేదని చెప్పుట అర్థముకాదు. నాచెవిని పడలేదని అర్థము. అనగా మీ మాట ఆ సమయమున నా చెవికెక్కలేదు అను అర్థమున వాడబడినది అపదము. పర్యవసానమున చెవికెక్కక పోవుటయేనని దాని భావము. ఇక్కడ నీవు చెప్పినట్లు చేయలేదను అర్థమునందు నీమాట వినలేదను ప్రయోగమువంటిదీ ప్రయోగము. యుద్ధకాండమున రావణుడు నైతచ్ఛ్రోత్ర గతం మమ" అని మాల్యవంతునకు సమాధానమిచ్చినాడు. సామాన్యముగ

కూడ నీమాటను ఆనాడు నేను వినలేదు అనుట కలదు గదా? కావున ఇది అబద్ధమాడించుట కాదని విజ్ఞులు తలతురు.

మిత్రుఁ: బాగున్నది. నా సందేహం తీరినది. అనినాడు.

నేను: ఇక కథకు వత్తము.

సీతారాముల రథము దశరథుని చూపును దాటినది. రథధూళియు కొంతసేపు దశరథునకు ప్రియమును గూర్చి అదియు దశరథుని చూపునకందలేదు. అంతలో అతడు మూర్ఛిల్లినాడు. ఆ జనమధ్యముననే కైకేయియు, కౌసల్యయును, ఆతని ప్రక్కననే నిలిచియుండి లేవదీసినారు. రాజునకు మూర్ఛతెలిసినది. కైకేయిని చూచినాడు. దశరథుని దృష్టి యందామె అస్పృశ్య. తన్ను తాకుటకు సంపూర్ణముగ అనర్హురాలనియే ఆతడు భావించి కన్నుల నెర్రజేసి, ఆమెతోటి సంబంధమును ఇహపరముల రెంటి యందును త్రెంచుకొనినాడు. భరతుడు కూడ ఈ రాజ్యమును సంతోషముగ స్వీకరించుచో ఆతడును కైక తోటివాడే కాగలడని కోపోద్రేకమును శోకోద్రేకమును కూడ రెట్టించగా పలికినాడు.

అక్కడనే కొంత సమయము గడిచినది. ఆతడట్లే దుఃఖించి దుఃఖించి నగరమధ్యకు వచ్చి, అయోధ్యనంతను పరికించి కాంతిహీనమగు ఆ నగరరాజమును చూడలేక చూచినాడు. అచ్చట నుండి తిరిగి కైకేయి మందిరమునకు వెళ్ళలేదు. కౌసల్యాగృహమునకు చేర్చుడని పరివారమునకు తెలుపగా కౌసల్యాగృహముననే ప్రవేశపెట్టినారు. దశరథుడిప్పుడు కౌసల్యాంతఃపురముననే యుండెను. అప్పటికి రాత్రికాలము వచ్చినది. ఆతడు హంసతూలికా తల్పమునననే పరుండియు సుఖనిద్రను చెందలేదు. రాముడే ఆ మహారాజు దృష్టియందుండెను. ఆరాజు నేత్రేంద్రియమప్పుడు రామునకే సమర్పింపబడినది. దృశ్య ప్రపంచము నంబే పదార్థమును ఆతడు చూడలేకపోయెను. కౌసల్యను పిలిచి ఇట్లు చెప్పినాడు.

"రామం మేనుగతా దృష్టి రద్యాపి న వివర్తతే
న త్వాం పశ్యామి కౌసల్యే సాధు మా పాణినాస్పృశ"

కౌసల్యా! నాదృష్టి రామునికోడనే పయనించినది. ఇంతవరకును నాదగ్గరకు రాలేదు. దీని నిర్ణయమెట్లందువేమో నీవు నాకన్నుల కగపడుటలేదు. నా త్వగింద్రియము నిన్ను తాకుట కుత్సహించుచున్నది కౌసల్యా వన్నొకమారు తాకుమనినాడు. రాముని తల్లితన్ను తాకగా ఆతని శరీరము చల్లబడుననుకొనినాడు. పాపము

తొలగుననుకొనినాడు. ఏమి దశరథుడు! భారతీయ చరిత్రలోని పాత్రలు లోకోత్తరములు.

లోకోత్తరములన లోకమునలేని ధర్మములు కలవని అర్థముకాదు. కేవల భౌతిక దృక్కులకు అర్థమగునవి కావని అర్థము. నిజమునకు దశరథుని పాత్ర లోకసామాన్యముకాదు. ఆతని పుత్రప్రేమ అసాధారణము. పుత్రుని ఆలంబనముగ గొన్న ఆయనలోని వాత్సల్యరసము పూర్ణరూపమునొంది ప్రపంచమును మరపించి రామునొక్కనే ఆతని అంతఃకరణమున స్థాపించినది. లేకున్న నాదృష్టి రామునితో వెళ్ళి మరలరాలేదని ఎట్లు చెప్పగలడు చక్షురింద్రియమే కాదు. త్వగాదీంద్రియ ములను రాముని వైపునకే తిరిగినవి. రాముని జననముతోటి ప్రారంభమైన వాత్సల్య రసము రాముని వనవాస వయనకాలమున స్థాయీ భావమునొందినది. దశరథుని యందు కావున దశరథుని పాత్ర వాత్సల్య భక్తికి ఆదర్శము. పుత్రవిరహక్లేశమున దుఃఖసముద్రమున మునిగియున్న ఒశరథుని భక్తుడనియు, ఆయన శోకమును భక్తి రసమనియు అనుట యుక్తమా? అందురేమో? దశరథుని శోకము భక్తిరసమెట్లయ్యెనో చెప్పెదను.

మన చిత్తము లక్ష్యవంటి గట్టి పదార్థము .అయ్యను అది గట్టిదనమును వీడుట కరగుట అను రెండవస్థలు కలిగియుండును. సామాన్యముగు వేడి తగులగా లక్ష్య కొంచెము శిథిలమగును. వేడి బాగతగులచో అధికరగును. అట్లె మనచిత్త ద్రవ్యముకూడ సామాన్యమగు తాపమునకు మెత్తవడును. అధిక తాపమున కరుగును. కామము, క్రోధము, భయము, స్నేహము అను గుణములు మనస్సునకు సామాన్య తాపమును కల్పించుచో మనసు మెత్తవడి అందా గుణములకు ఆలంబనమగు వస్తువు వాసనా రూపమున నిలుచును. అనగా ఒకనిపై క్రోధము కలుగుచో ఆతని ఆకృతి వాసనా మాత్రమై మనస్సున నిలుచును. ఆ క్రోధము ఒక వ్యక్తి యందు తీవ్రముకాగా ఆ తీవ్రకోధమున తాపము నొందిన చిత్తము తన్మయమై ఆ వ్యక్తినే చూచును. అనగా ఆ ద్రవీభూత చిత్తమున ఆ వ్యక్తికి సంబంధించిన భావము స్థిరమై నిలచును. ఇట్లె కామము, భయము. స్నేహము మొదలగు గుణములు కూడ. ఇది పాకృతవ్యక్తుల నాలంబనముగా గ్రహించుచో దుఃఖప్రదమునై జీవుని బంధించగా భగవంతుని ఆలంబనముగ గ్రహించుచో ముక్తి నొసంగును. అప్రాకృతమగు భగవత్తత్వము నాలంబనగాగా దానికి భక్తియనిపేయి. చిత్తమున తాపము తీవ్రమగుటకు గలుగు వాతావరణమునే విభావ సంచార, వ్యభిచారీ భావ

ములను పేర అలంకార శాస్త్రము పిలిచినది. భక్తి శాస్త్రముగూడ భగవంతుని ఆలంబన గావించి ఆ పేర్లను వాడినది. కావున ప్రస్తుతమున దశరథుని పుత్ర స్నేహమునకు రాముడే ఆలంబనముకాగా దశరథుని చిత్తము ఆతని విరహాగ్ని జ్వాలలకు కరుగగా ఆ నారాయణుడే పుత్రుడనుపేర దశరథుని అంతఃకరణమున నిలచి, ఆతని బాహ్యేంద్రియములను కూడ తనవైపు త్రిప్పుకొనినాడు. కావున దశరథుని శోకరసమును భక్తిరసమని చెప్పినాను. భగవంతునే పుత్రునిగకన్న దశరథుని భక్తుడనుటకు సందేహమేమున్నది ?

తరువాతి కథాఘట్టము రామలక్ష్మణులను కన్న తల్లుల సంభాషణము. ఇందు రాముని కన్నతల్లి రాముని పుత్రుడనిమాత్రమే గ్రహించి దుఃఖభాగిని కాగా లక్ష్మణుని కన్నతల్లి రాముని యథార్థస్వరూపమును చెప్పి ఆమెకు దుఃఖోపశమన మును చేయును. ఈ అయోధ్యాకాండము నందిది యొక ముఖ్యమగు ఘట్టము. అన్నియు అట్టివే అయినను ఇది మణిహారమున కొలికిపూసవంటి దనక తప్పదు. వారి సంభాషణ మిది.

సుమిత్ర : అక్కా ! బహుజన్మార్జితమగు నీ పుణ్యపుంజము పక్వముకాగా రాము డను పేర పుత్రరూపము నొందినది. అట్టి పుత్రుని గురించి నీకు దుఃఖ మెందులకు ?

కౌస : నా పుణ్యపుంజము దుఃఖరూపముగ మారినదిగదా ?

సుమిత్ర : లేదు లేదు. నీ పుణ్యపుంజము నేటి సద్వాసనల గుబాళించుచు దశదిశల వ్యాపించినది.

కౌస : సుమిత్రా ! సట్టభద్రుడై రథ గజ తురగ పదాతులు తన్ను వెంటనంటగా రాజాంతఃపురమున వసింపదగు నా రాముడు అరణ్యముల పాలై, కందమూలముల భక్షించుచు శీతవాతాతపముల క్రుక్కి దుఃఖభాగు డగుట నా పుణ్యఫలము పక్వమై సద్వాసనల వెదజల్లుచున్నదని నేనెట్లు తలతును ?

సుమిత్ర : అక్కా ! నీవిక్కడనే పొరపడితివి. రాముడివ్వుడు వయనించినది అరణ్యములకు కాదు. ధర్మాత్ముడగు రాజు పెద్దలదగు విజయయాత్ర కాతడు పయనమయ్యెను. పితృవాక్య పరిపాలనారూప ధర్మ నిర్వహణ మును రథము నెక్కి ధర్మ సత్యవ్రత ధనముల కోల్పోవక శాశ్వత

కీర్తి పతాకమును గగనతలమున స్థాపించినాడు. అట్టి పుత్రుని కనుట నీ మహాభాగ్యము. కన్నబిడ్డలు తల్లికి తాము సంపాదించి అందెంచదగు ధనమే రాముని వనవాస పయనము.

కౌస : సుకుమారగాత్రుడగు రాము డరణ్యవాస దుఃఖము నెట్లనుభవించగలడో.

సుమిత్ర : ఆతడొక్కడై అరణ్యము కేగలేదు. ఎండ యను దానిని కన్నులచూడని సుకుమారగాత్రి సీతాకాంతయు ఆతని ననుసరించినది. ధనుష్పాణియై లక్ష్మణుడును ఆతనివెంట నంటినాడు. పగలు సూర్యుడు తన కిరణసహస్రములచే రామునికి వెచ్చ తగులనీయడు. రాత్రికాలమున చంద్రజ్యోత్స్నలు రాముని కౌగలించి ఆతనికాహ్లాదమును కల్పించును. వాయువును ధర్మమూర్తియగు రాముని సుకుమార శరీరమును ముట్టించ జేయు గాలిని వీచడు. నిత్య సుఖస్పర్శ నొసంగుచునే ఆతనికి సుఖమును కలుగజేయుచు వీచును. భూకాంత నీ పుత్రునకు వట్టువరుపై మెత్తని శయ్యాతలము నమర్చును. రామునకు భూమి కఠినతలము కాదు. నీవు ధర్మమూర్తియగు నీ పుత్రుని తలచి దుఃఖించకుము. వంచభూతములును ఆతని సేవకులై సేవము చేయుదురు. నీవనుకొనునట్లు రాముడు నీ పుత్రుడు మాత్రమేకాడు. అతడు జగన్నాథుడు. సూర్యునకాతడు సూర్యుడు. అగ్నికి అగ్ని. లక్ష్మికి ఆతడు లక్ష్మి. కీర్తికికీర్తి. ఓరిమికాతడు ఓరిమి. దేవతలకెల్లర కాతడే దైవము. అక్కా! వేయేల? ఈ ప్రపంచములోని వెలుగులన్నియు రాముని వెలుగును ఆధారముగా గొనియే వెలుగుచున్నవని తెలియుము. రాముని వనవాసమునకు భేదము నొందకుము.

"సూర్యస్యాపి భవేత్సూర్యోహ్యగ్నేరగ్నిః ప్రభోః ప్రభుః
శ్రీయశ్రీశ్చ భవేదగ్ర్యా కీర్తిః కీర్త్యాః క్షమాః క్షమా
దైవతం దైవతానాం చ భూతానాం భూతసత్తమః.

కౌస : సుమిత్రా! దుఃఖభాగినినైన నాకు మరల ఆ రాముని దర్శన మబ్బువందునా?

సుమిత్ర : అక్కా! ఒట్టుపెట్టి చెప్పుచుంటిని అడవినుండి అయోధ్యకు మరలి

వచ్చి, పట్టాభిషిక్తుడై నీ ప్రియపుత్రుడు నీకు కన్నులవిందును చేయు గలడు పట్టాభిరాముడై.

కౌస : ఎక్కడి పదునాలుగేండ్లు ? ఎక్కడి నేను ? అంతవరకు నేను జీవింతు నని ఏమి నమ్మకము ?

సుమి : కాదు కాదు. శుద్ధపాడ్యమి (నెలపొడుపు) నాటి చంద్రునివలె నీవు నీ పుత్రుని చూడగలవు. నీవు సుశీలవు. నీకీ శోకము మబ్బువలె విడి పోవును. రాముని సుకుమార సుందర హస్తతలములు నీ పాదముల తాకగలవు ఈ జన్మమునే. నీవు నీ కన్నులవెంట ఆనందభాష్పముల జలజల రాల్చెదవు. నా మాటను నమ్ము.

శ్రోతలారా ! సుమిత్ర వాక్యామృత బిందువులు కౌసల్య దుఃఖమును పోగొట్టినవి ఆ క్షణకాలముననే. "సద్యశ్శరీరే విననాశశోకః" అనినారు మహర్షి.

నిజమునకు జ్ఞానుల తాత్కాలిక దుఃఖము లిట్లేయుండును. కావుననే వాల్మీకి మహర్షి ఇక్కడ కౌసల్య దుఃఖ మెట్లు పోయినదనగా, "శరద్గతో మేఘ ఇవాల్ప తోయదః" కొంచెము నీరుగల శరత్కాల మేఘము ఆ నీటిని విడిచినట్లు కౌసల్య శోకము అంతము నొందెనట. అనగా నేమి ? అజ్ఞానావరణము దట్టమగుట వర్షాకాల మేఘము. అజ్ఞానము నామమాత్రమై యుండి, తాత్కాలిక శోకము కలిగి యుండుట శరన్మేఘము. మేఘమునందలి మాలిన్య మంతయు శరదృతువు పోగొట్టునట్లే భగవత్తత్వ ప్రబోధము చెవినిబడ్డ మాత్రమునననే జ్ఞానుల తాత్కాలిక శోకము తొలగునని వాల్మీకి తెలిపినారు.

మనమింక ముందుకు నడచి రాముని వనగమనమును చూతము

రాముని రథము నగరమును దాటినది. ప్రజలు మాత్రము రాముని వదల లేదు రాముడు ప్రజల నెట్లైన మరల్ప చూచెను. ఆతని కోర్కె నెరవేర లేదు. వారు వెనుకకు మరలుట లేదు. రాముని యందలి పద్మకుపుంజము వారిని బంధింపగా వారు వెనుకకు మరలతేదు.

అందుకొంత బ్రాహ్మణ బృందమ్మున్నది. అదికర్మయోగుల బృందము. వారు గావించిన వేదోక్త కర్మానుష్ఠానములకు ఫలమే రాముని రూపమున అయోధ్య యందవతరించినదని నిర్ణయించుకున్న భక్తబృందము. వారు గృహస్థులకు విధిం

చిన విధికల్పములను ఆచరించుచునే భక్తి, ధ్యాన, జ్ఞాన యోగముల యందుత్తీర్ణులైన బ్రాహ్మణోత్తములు. వారు బ్రాహ్మణునకు మాత్రమే అర్హతగల వాజపేయమను మహాక్రతువును కూడ ఆచరించిన బ్రాహ్మణ సామ్రాట్టులు. బ్రాహ్మణునకు వాజపేయయాగము రాజునకుగల సార్వభౌమాధిపత్యము వంటిది. అట్టి ఆధిపత్యము గలిగి ఎనుబది సంవత్సరములకు పైబడిన వృద్ధభూసురులెందరో రాముని వెంట వెంటనంటినారు. వారి భుజములపైన ఆరణులు కూడా ఉన్నవి. (అరణులంటే యజ్ఞాలలో అగ్నిని మధించే కర్ర) ఆ అరణులలో తమతమ నిత్యాగ్నిహోత్ర విధులను నెరవేర్చుకొనుటకు మంత్రపూర్వకముగ అగ్నిహోత్రమును అందు ఉంచుట శాస్త్రవిధి. ఆవిధులననుసరించి వెళ్ళు బ్రాహ్మణులు కొందరు రాముని రామా! నీవు వెళ్ళవద్దు నిలుమని బిగ్గరగ వణకెడు స్వరములతో వేడుకొనుచుండిరట. వాల్మీకి వర్ణించినారు ఈ సందర్భముననే మహర్షిబ్రాహ్మణుల భుజములనెక్కి అగ్నులుకూడా రాముని వెంటనంటినవని వర్ణించినారు. వారి నెరసిన వెంట్రుకల తెలుపును వారి శిరములందున్న వాజపేయ యాగమునందు ధరించిన వారి శ్వేత చ్ఛత్రములను రాముని వెంటనంటి, రామా! మా శ్వేతచ్ఛత్రములతో వనమున నీకు నీడను కల్పింతుమనుచుంటిరట అంతేకాదు మేము ఇంతకాలముగా అగ్నిహోత్ర విధులనెరవేర్చిన దానికి ఫలితము నిన్ను వెంటనంటుచేనని వేదములద్వోషించుచున్నవిగాన మేము నీవెంట నంటితిమని వివరించి రథముతోపాటు వారును పరుగెత్త నారంభించినారు. రథము ఆగక వెళ్ళుచుండ ఆరథమునకు కట్టబడియున్న గుఱ్ఱములనుకూడ ప్రార్థించినారు. మీరైనా మా మొరను ఆలకింపుడని. రాముని రథము ఆగలేదు. కాని రాముడు రథమును దిగినాడు. అప్పుడు వారు రామా! మేమొక్కరమే నిన్ను అడవికి వెళ్ళవద్దని యాచించుటలేదు. చెట్లపైనున్న పక్షులను చెట్లునుకూడ సమాధినిష్ఠను పొందినవి చూడుమనినారు. "పక్షిణోపి ప్రయాచంతే" అనినారు. రాముని ప్రయాణమాగలేదు.

రాముడెంత ధర్మమూర్తియై ఆరణ్యములకేగుచుండెనో ప్రజల హృదయము లంత రాముని అనుసరించినవి. ఈఘట్టమున వాల్మీకి ఒక విశేషమును చెప్పినారు.

భారతదేశమున నాటి బ్రాహ్మణులకు తరగని ధనము వేద వాఙ్మయము. ఆధనము నాడు గ్రంథాలయములందు నిక్షిప్తమైలేదు. భారతదేశము నెందరు కొల్ల

గొట్టివను ఆధనము వేరొకరికి స్వాధీనమగునదికాదు. ఆ విషయమును బ్రాహ్మణులు రామునితో చెప్పుకొన్న మాటనుగా వర్ణించినారు.

"హృదయేష్వేవ తిష్ఠంతి వేదా యేనఃపరంధనం"

వేదవాఙ్మయమను ధనము వారి హృదయములయందే విక్షిప్తమైయున్నదట. వారి మస్తిష్కములే నాటి గ్రంథాలయములు.

వర్యవసానమున రాముని వన ప్రయాణమును ఆపుట కెవ్వరును సమర్థులు కాలేదు రాముడధిరోహించిన రథమును, ఆరథమును వెంటనంటిన ప్రజలును అట్లే కొంతదూరము వ్యయనించినారు. వారందరును తమసా నదీతీరమునకు చేరినారు. నదీమతల్లి మాత్రము రాముని ప్రయాణమునకిష్టపడునా? ఆ తమసానది తన ఉత్తుంగ తరంగ హస్తములతో రాముని నాటి ప్రయాణమును నివారించినది. రామునకు రథమునాపుకొనక తప్పినదికాదు. అప్పటికి సాయంకాలమైనది. సీతా రామలక్ష్మణులును, ప్రజలును గూడ ఆ తమసా నదీతీరమునే నిలిచినారు. ఆ రాత్రికి వారి నివాసమక్కడనే. మనమును ఈనాటి కిక్కడనే ఆగుదుము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

తరువాతి కథా భాగము రేపు. 3వ రోజు పూర్తి.

4వ రోజు

శ్లో॥ రామేతి వర్ణద్వయమాదరేణ సదా స్మరన్ ముక్తిము
పైతి జంతుః
కలౌయుగే కల్మషమానసానామన్యత్ర ధర్మే ఖలు
నాధికారః
భక్తప్రియం భక్తసమాధిగమ్యం చింతాహరం చింతిత
కామధేనుం
రవీందుకోటిద్యుతి భాస్వరంతం రామం భజే రాఘవ
రామచంద్రమ్

- ప య న ము -

ఆర్యమహాశయులారా !

నేటి మన ఉపన్యాసమేమి? రాముని దండకారణ్యవసనము. నిన్నటి మన ప్రవచన మెంతవరకు వడచినది? రాముని రథము తమసానది యొడ్డున నిలిచినది. మన ధనుర్మాస కార్యక్రమము నందిది పదకొండవరోజు. రామునితో వయస్కులైన పురవాసులను ఆ తమసానది ఒడ్డుననే నిద్రించినారు. వారందరను రామునితో దండకారణ్యములకు వెళ్లుటకయ్యే అతనిని వెంబనంటి వచ్చినారు. గుంపులుగుంపులై వారందరను అచ్చటచ్చట నిద్రించినారు.

ఆ ప్రజల నందర తనతోపాటు ఆ మహారణ్యముల దుఃఖభాగులు గావించుటకు రామునకు మనసొప్పలేదు. కావున ప్రజలు గాఢనిద్రలో నుండుటను గుర్తెరిగి రాముడు తన పయనమును సాగించినాడు.

రాముని రథము తమసానదిని దాటినది. ప్రజలకు తాను వెళ్ళిన త్రోవ గుర్తు పట్టుటకు వీలుకాకుండునట్లే సుమంత్రుని రథము తోలమనగా సుమంత్రుడట్లే చేసినాడు.

పూర్వోదయమైనది. ప్రజలు మేల్కొనినారు. రాముని రథమేది? రథ మార్గమును గుర్తింప యత్నించిరి గాని ఆమార్గము వారికర్థము కాలేదు. ప్రజలకు అయోధ్యయే శరణ్యమైనది. కన్నీటిధారల కార్చుకొనుచు, రామవియోగమునకు వారి దురదృష్టమును స్మరించుకొనుచు అయోధ్యకేగినారు. అది రాముడు లేని అయోధ్యకావున అదినగర రాజమైలేదు ఇంకిపోయిన మహా సముద్రమువలె నున్నది. రాచబాటలు చూడ ముచ్చటలైలేవు. విపణివీధులు లక్ష్మీనిలయములుగకన్పట్టలేదు. కళావిహీనమగు ఆనగరమును చూచిన ప్రజలును, బ్రాహ్మణులును తమతమ గృహముల కేగినారు. ఆగృహములును శాంతినిలయములైలేవు. గృహిణులు దుఃఖాగ్నులై వారి కెదురుగ వచ్చినారు. రాముని ప్రతిపత్తిసుకొని రాలేని భర్తలను నిందించుచు వారు గౌరవించలేకపోవుట ఈఘట్టమునందలి ప్రత్యేకత. విజముగ వారందరును భర్తలయెడ పూజ్యభావము లేని గృహిణులవలె మీరు తలచకుడు.

రాముడరణ్యమునకేగగా రామునకందదండలై నిలువదగిన పురుషపుంగవులు మరలగృహముల కేతెంచగా, రాముని వదలిన ఈగృహస్థాశ్రమము జన్మకు సార్థకము గావించలేదను వారి పరితాపము వారి నిందాపూర్వకములగు ప్రేమయుక్తులలో స్ఫుటమైనది.

కిం ను తేషాం గృహైః కార్యం కిం దారైః కిం ధనేన వా
పుత్రైర్వా కిం సుహృద్భిర్వా యే నపశ్యంతి రాఘవం.

ఎవరి చూపునుండి రాముడంతర్ధానమయ్యెనో వారికీ గృహస్థాశ్రమ మెందుకు? ధన ధాన్యములును దారాపుత్రాదులును వారికి కృతార్థతను కల్పింతురా? మీరేమని తలచి మరల ఇండ్లకేతెంచిరి? అని ఆగృహిణులు తమభర్తల నిందించినారు. ఇదినిందయా? ఖేదమా? రాముని కటాక్షమునకు పాత్రులుకానివారి గార్హస్థ్యము వ్యర్థమని వారి గము

అంతేకాదు. వారు తమ భర్తలతో స్త్రీపురుషుల మందరమును రాముని ద్దకు పోదమనినారు. "యత్రరామో భయంనాస్తి తత్ర వరాభవః" అని సిద్ధాంతీకరించినారు. రాముడెక్కడకలడో అక్కడ భయముండదు. అక్కడ పరాభవముండదు. మా స్త్రీల కందరకును సీత రక్షకురాలుకాగా పురుషులకు రాముడు మోగక్షేమముల కల్పించునని తమ భర్తల ప్రోత్సహించినారు.

ఎంతటి దురదృష్టవంతులము కాకున్న రాముడులేని అయోధ్యయందు నసింతుమా? అని బాధనొందుచు, దండకారణ్యములందలి వృక్షలతావికుంజములను అక్కడి పర్వత శ్రేణులను తమకంటె ఎంతయో పుణ్యముగావించుకొన్న జీవులని ఆస్థావరములను పొగిడినారు. వాటి పుణ్యమేమియట? ఆ వృక్షలతా నికుంజములు రామునకు ఫలపుష్పోపహారములనందించి ధన్యత నొంద నోచుకొన్న వనినారు. అందలి సరస్సులను సీతారాముల స్నానపానములతో కృతకృత్యత నొందుగదా? అని వాపోవుచు రాముని తమ హృదయముల నిలుపుకొనినారు. ఇక మనము రాముని యొద్దకు పోవుదము.

రాముడు తమసానదిని దాటి, నిత్యవిధులను గావించుకొని, వేదశ్రుతి, గోమతి స్యందికానదులను దాటి కోసలదేశమునకు దక్షిణదిశయందున్న గంగావది యొడ్డున తమరథమును నిలుపుకొనినారు. మధ్యమధ్యనెన్నియో పల్లెలను, గ్రామములను గడచినవి. వారందరి ఆదరములు పందుకొనినాడు.

ఆ నది ఒడ్డుననే ఇంగుదీవృక్షము. అక్కడనే శృంగిబేరపురము. దానికి పరిపాలకుడు గుహుడను నిషాదుడు(బోయ). అతడు పరమభాగవతుడు. ఆ గుహునకు స్థపతి అనుపది ప్రసిద్ధనామము అచ్చటి అటవీప్రదేశమంతయు ఆగుహుని పరిపాలనలోనిదే. అతడు రామునకు ఆప్తమిత్రుడు. రాముడక్కడి కేతెంచుట తెలియుటతోడనే రామదర్శన కాంక్షియై మంత్రి జ్ఞాతి బాంధవులతోకూడ బయలు దేరినాడు.

రాఘవేశ్వరునకు నేను రాజవంశమున జన్మించితినను జాత్యహంకారము లేదు. రాముడు గుహుని రాకనుచూచి ఆతడు కొంతదూరమునందుండగనే లక్ష్మణునితోకూడి రాముడెదురేగినాడు.

అది భగవద్భాగవత సమాగమము. ఒకభక్తుడు భగవద్దర్శన కాంక్షియైవచ్చుచుండ ఆభక్తవత్సలుడు భగవంతుడెదురేగెను. ఇదివరమార్ధము. కథా భాగమునకు వత్తము.

రాజశేఖరుడు కాదగినరాముని తాపస వేషధారణము గుహుని హృదయమును భేదించినది. రాముని కౌగలించుకొనినాడు రాముడిప్పుడు గుహునకు అతిథి కూడనైకన్పట్టినాడు. గుహునిహృదయము ముప్పొంగినది. "కః ప్రాప్స్యత్యతిథిం

ప్రియం" ఇట్టి అతిథినెవ్వరు సంపాదించుకొనగలరని అతని అంతరాత్మతాండవించి నది. ఆత్మార్పణగావించినాడు.

రామా! ఈసామ్రాజ్యమునీది. నేను నీవాడను. ఈనారాజ్యము అయోధ్యకు వేరైలేదు. ఇవిగో సుసంపన్నములగు భోజ్యపదార్థములని రామునకు నివేదించు కొని స్వాగతము పలికినాడు.

ఆభక్తశేఖరనిపలుకులు భక్తిరసాయన ఘటికలైనవి. ఆగుహుని రాముడు గాఢాలింగనము కావించుకొనినాడు.

గుహుడు రామునకాప్తుడు, మిత్రుడు, భక్తుడు. రాముని ఆలింగనమునందీ భాగములబ్బియు ఇమిడియేయున్నవి. కాని ఆతడుతెచ్చిన భోజ్య పదార్థములను మాత్రము స్వీకరించలేదు. గుహుని యోగక్షేమములనారసి గుహా! నేనిప్పుడు మునిధర్మము నాశ్రయించితిని గావున ప్రతిగ్రహము చేయనని చెప్పి తనరథవాహకములగు అశ్వములకు గ్రాసమును కూర్చుమని ఆజ్ఞాపించినాడు, గుహుడు రామాజ్ఞను శిరసావహించినాడు. అదిరామని ఆదరపూర్వకమగు ఆజ్ఞయే.

నాటిరాత్రి ఇంగుదీ వృక్షమూలమే రామునికి నివాస స్థానము. లక్ష్మణుడు అందించిన గంగాజలమే ఆహారము. కటికినేలయే హంసతూలికాతల్పము. సీతతో కూడ ఆ తల్పమున రాముడు నిద్రించినాడు.

లక్ష్మణునకు నిద్రలేదు. సీతారాముల నిద్రాకాలమున కూడ ఆతడు వారికి రక్షకుడు. గుహుడు లక్ష్మణునకు శయ్యా నేర్పరచి వరుండమనెను కాని ఆతడు పరుండలేదు. రాముని రక్షణకు నేనుంటినని గుహుడు చెప్పెనుగాని లక్ష్మణుడా మాటకు మౌనమును దాల్చి తన కర్తవ్యమును నెరవేర్చుకొనినాడు.

గుహుడును మేలొనియే యుండెను. నాటి ఆ భక్తశేఖరుల జాగరణము మనకేమైన జన్మసార్థకతను ఉపదేశించెనా? సాధుసమాగమము శాలమును వ్యర్థము గావింపదు. నాటిరాత్రి గుహుడు లక్ష్మణునితో చెప్పుకొన్న ఆతని జీవితలక్ష్యము మనకు తత్త్వోపదేశము.

లక్ష్మణా! నాకు రామునకంటె ప్రియమైన వస్తువు ఈ భూమిపైన లేదు. ఇది నామమాత్రము కాదు. ఆత్మసాక్షిగ చెప్పుమాట. నాకీసంపకంటయు రామాను

గ్రహము. నాకు ధర్మజీవితము గడచుట రామ కటాక్షము అని చెప్పుకొనినాడు. ఇంతకంటె తత్త్వోపదేశ మేమి కావలెను? గార్హస్థ్యమున ముక్తిమార్గ మిదియే. గుహుని అహంత రామున కర్పితమైనది. ఆతని సంపదకు రాముడు యజమాని వాడి యనునది గుహునకు దూరమైనది. తిన్నని భక్తి ఇట్టిదే.

జాతి భేదమును చెప్పి వేదాధ్యయనాధికారము కొందరకే కలదన్న భారతీయ ధర్మము జాతిసమైక్యతకు భంగము కల్పించిన దనువారి నేటి వాదము నేమనవలెనో నాకు తెలియదు. వేదవేదాంగముల పఠింపకున్నను తపస్యులు కాకున్నను తిన్నడు, గుహుడు మొదలగువారు ఆదర్శపాత్రలై తదనంతర వారికి ఉపదేశముల నిచ్చినారు. వేదవిధులు నాడును నేడును కలవు. కథకు వస్తువు.

తెల్లవారినది. ఇక రాముని వయనము సాగవలెను. ఆ గంగా ప్రవాహములు దాటినగాని సీతారామ లక్ష్మణుల వయనము సాగదు

లక్ష్మణుడు గుహునకు అన్నగారి ఆజ్ఞను తెలుపగా గుహుడు పడవను సిద్ధము చేయించినాడు. కాని గుహునకు రాముని వయనము ఇష్టములేదు. రాముడు మిత్రుని ఒడంబరచినాడు. ఇక సుమంత్రుని ఇంటికి పంపి, తాము నావను అధిరోహించవలెను. అయోధ్యకు తిరిగి వెళ్ళవలసిన సుమంత్రునకు తన తల్లిదండ్రులకు తెలుపదగు క్షేమవార్తల తెలిపినాడు. మాతాపితరులకు వందన సమర్పణల గావించినాడు. తనతోపాటుగనే సీతాలక్ష్మణులును వందనముల గావించిరని దశరథ కౌసల్యలకు తెలుపుమని భక్తి వినమ్రతలతో సుమంత్రునకు చెప్పినాడు. రాముడు మర్యాదా పురుషోత్తముడుగదా? అయన కర్తవ్య నిర్వహణలయందు లోపమేముండును? సుమంత్రునకు చేయదగిన అప్పగింతలన్నియు సక్రమముగనే జరిగినవి. మనమొక్కమారు సుమంత్రుని వైపుకు మరలుదము.

సుమంత్రుని ముఖమండలము చిన్నబోయినది. కన్నుల నీరు నిండినది. సుమంత్రుని ఊహ తారుమారైనది. తానును రామునితో వదునాలుగు సంవత్సరములును అరణ్యముల గడపవలెనన్న ఉత్సాహముతో రథమును తోలకావిరాగా అతని మనోరథము భగ్నమైనది. రాముడు లేని రథమును తోలుకొని అయోధ్యకు వెళ్ళవలసి వచ్చినది. దుఃఖము పొర్లి వచ్చినది.

రాముడు సుమంత్రుని ఓదార్చి వెళ్ళదగు కారణముల ప్రతిపాదించి పంప వలెను. సుమంత్రునకు ముఖ్యాపసరముల కొన్నిటిని తెలిపి ఆతని భక్తిప్రపత్తులకు తన కృతజ్ఞతను తెలిపి సుమంత్రుని ఒప్పించినాడు.

సుమంత్రుడు అయోధ్యకేగి తమ గమనమును కైకకు తెలుపుట చాల అవసరమట. తన మాతాపితరుల ఆదరించుటకు తనప్రతినిధిగ సుమంత్రు డయోధ్య యందుండుట అత్యంతావశ్యకమట. సుమంత్రుడు కాదనలేని కారణము లివ్వి. రాముడీకారణముల తెలుపగా సుమంత్రుని మనసు కరిగి నీరైషది. అతడు రామాజ్ఞ నే శిరసావహించినాడు. అత డయోధ్యకు వెళ్ళక తప్పలేదు.

సీతారామ లక్ష్మణులు శుచిర్భూతులై ఆ గంగా నదీమతల్లికి ప్రణామముల పర్పించి నావ నధిరోహించినారు.

రాముడిప్పుడు వానప్రస్థుడు. అతడు జడల ధరించవలెను. గుహునిచే పుర్తిపాలను తెప్పించి, ఆ దివ్యశోభనుడు జడదారి యయ్యెను. నావికులు రామాజ్ఞచే పడవను వదలినారు. నావ నదీ మధ్యమునకు చేరినది. సీత తన రెండుచేతుల జోడించి నా భర్తను సోదరసమేతముగ చల్లగ చూడుము తల్లీ ! మా వనవాసము పూర్తియై అయోధ్యకు చేరగనే నీ పేరుతో భూతములకు సమారాధన గావింతునని ప్రొక్కినది.

భారతక్షేత్రమున గంగాదితీర్థరాజములు పరాశక్తి యొక్క అంశభూతములు. అవి జలమాత్రములుకావు. వైదికధర్మ ప్రతిపాదకము రామాయణము పాశ్చాత్యుల దేశచరిత్రలవంటి చరిత్ర మాత్రమే కాదు ఈ మహాకావ్యము.

నావ నదీమధ్యము నుండి అవ్వలఒడ్డుకు చేరినది. ఆ పడవను దిగిన రామలక్ష్మణులు ఆ ఒడ్డున కొంత దూరము నడచి అందొక వృక్షమూలమున నిలచినారు. అప్పటికి అస్తమయమైనది. రామలక్ష్మణుల సాంధ్యకృత్యములు తీరినవి. ఆ రాత్రికి వారి నివాసమక్కడనే. ఆకులలమలతో వారు శయ్యాతలముల నేర్పరచుకొనినారు. రామునకు నిద్ర పట్టలేదు.

తండ్రిని తలచుకొనినాడు. కైకేయియు స్మృతికి వచ్చినది. భరతుడు కాత గారి యింటినుండి వచ్చినతరువాత జరుగబోవు కార్యక్రమమును ఆతడు తలచినాడు

నా తండ్రి ముదుసలి. అనాథ. నేను ఇంటలేను. కైక దుర్మార్గురాలు. తండ్రి వృద్ధుడగుటే కాదు కామాత్ముడు గూడ. కైక చేతిలోని కీలుబొమ్మ. తన కొడుకు యింటికిరాగానే కైకేయి తప్పక భర్తను చంపును. నా తల్లిని కూడ చంపును. అప్పుడు వృద్ధభూపతి నాతల్లి నెట్లు రక్షించును? నా తండ్రి అంత సమర్థుడగుచో ఆడుదానిమాటకు అనుకూలుడై వర్తించి జ్యేష్ఠపుత్రుని అరణ్యము లకు పంపునా? ఎంత మూర్ఖుడును చేయని అకార్యమును కామము నా తండ్రిచే చేయించినది. కామ మెంత గొప్పది. ధర్మార్థ కామములందు కామమునకున్న బలము ధర్మార్థములకు లేదుగదా? అన్న ఊహాతరంగములు రాముని గంభీరాంత: కరణమున ఉవ్వెత్తున లేచినవి. వెంటనే తన ఊహాప్రపంచమును లక్ష్మణున కెరింగించి లక్ష్మణా! నీవిప్పుడు అయోధ్యకేగుట చాల అవసరమని తమ్ముని ప్రేరేపించినాడు.

రామాయణ కథాభాగమునందిదియొక విచిత్రమగు ఘట్టము. సామాన్యముగ నమ్మరాని విషయము. రాముడు తన తండ్రిని ఎంతటి మూర్ఖుడును చేయరాని కార్య ముసు కామాత్ముడై చేసెనని నిందించెనా? రాము డయోధ్యనుంచి బయలుదేరు నప్పుడు దశరథుడు రామని దృష్టియందు కామాత్ముడు కాకుండ దైవతమై ఇప్పుడు దోషి అయ్యెనా? మూర్ఖుడయ్యెనా? అయ్యెను. ఇదిగో మూలము.

"కోహ్యవిద్వాన పిష్టమాన్ ప్రమదాయాః కృతేత్యజేత్
భరతానువర్తినం పుత్రం కాతోమామివ లక్ష్మణ॥"

ఇదియే రామునిలోని ప్రత్యేకత. కథలోని గాంభీర్యము. విమర్శనీయమగు విషయము.

అసలు రామదరణ్యమునకు వయనమగుట యందున్నది పితృ భక్తి కాదు. పితృవాక్య పరిపాలనము. విధి నిర్వహణము. భక్తి, విధి నిర్వహణము కాదు. భక్తియందు విమర్శకు స్థానములేదు. ఆజ్ఞా పాలనమున యజమాని ఆజ్ఞలోని దోషము తెలిసియు అతని ఆజ్ఞను పాలించిన సేవకుడు విజ్ఞుడు. "జ్ఞాత్వాకర్మాణి కుర్వీత" అన్నది గీతా శాస్త్రము. కావున రాముడు పితృవాక్య పరిపాలనా విధి నిర్వహించి దశరథుడు కామమునకు బద్ధుడగుట యను దోషమును విస్పష్టపాతముగ తెలిపినాడు. విజ్ఞుడగువాని కర్మకు జ్ఞాని కర్మయని కూడ చెప్పవలెను. కావున

రాముడిప్పుడు చేసినది పితృనింపకాదు. విషయ విమర్శనయే. ఇదికాక ప్రస్తుతమున లక్ష్మణు నేల ప్రేరేపించెను? అనునది కూడ మనము గ్రహించ వలసిన విషయము.

లక్ష్మణుని హృదయమును పరీక్షించి అతడు తనతో వచ్చుటను రాముడు నిర్ణయించదలచినాడు. కైకను నిందింపగా తనతో కలియును. దశరథుని రక్షణ తన్ను మెత్తపడవచ్చును ఇదియొక హృదయము. అంతియేకాని తనకు రాజ్యము పోయినదనుటకును, తండ్రిని నిందించుటకును కాదు. ఇదియే ఈ ఘట్టములోని ప్రత్యేకత.

లక్ష్మణుడు కదలునా? అతడు కదలలేదు. ఆ ఆలోచనకిది సమయము కాదని సమాధాన మిచ్చినాడు. ఆరాత్రి గడిచినది అక్కడనే. ఆనాటికి వనవాస దీక్షకు మూడురాత్రులు గడచినవి. మరునాడు ప్రయాణము సాగినది. వారక్కడనుండి భరద్వాజ ఆశ్రమమున కేగినారు. అక్కడ ఒక్కరాత్రి గడిపినారు. ఆమునివర్యుని ఆతిథ్యమును స్వీకరించి, అచ్చట నుండి వారి యనుమతితో చిత్రకూటమున కేగినారు. ఆ పర్వత రాజము భారతీయుల పుణ్యపుంజము. అది ప్రకృతి సుందరి కొక ప్రత్యేకమగు అలంకారము కూడ. శ్రీరామచంద్రుడక్కడ కేగునప్పటికి వాల్మీకి మహర్షి వారి ఆశ్రమమక్కడనే యున్నది. ప్రప్రథమముగ సీతా లక్ష్మణులతో ఆమహర్షి పాదపద్మములకు వందన మాచరించినారు శ్రీరామచంద్రులు. ఇక సీతారామలక్ష్మణులకొక నివాస స్థానము కావలెను.

లక్ష్మణుడొక పర్ణకుటీరమును నిర్మించినాడు. అది వాస్తుశాస్త్ర ప్రసిద్ధమగు నిర్మాణము. అప్పుడు వారికిదియే సుందరభవనము. వసతులన్నియు అందు చక్కగ చేకూర్చబడినవి. అగ్న్యాగారమునకొక ప్రత్యేక గృహము నిర్మితమైనది. అందే ఆయుధాగారము కూడ. ఆకుటీరము గాలివానలకు గురికాదు. నాటి రాజపుత్రులకు చేతగాని కార్యములు లేవు.

వాస్తు పురుషు నర్చించి గృహదేవతల పూజించి శాంతి బలుల నర్పించి రాముని కుటుంబమంతయు ప్రవేశించినది. అవతార మూర్తియగు శ్రీరామచంద్రుల పవిత్ర పాద స్పర్శకై ఎదురుచూచు ఆ పర్వత రాజునకు పుణ్యపుంజము వరిపాకము కాగా సీతాలక్ష్మణులతో రాముడక్కడ వసించినాడు. చిత్రకూటము భరద్వాజ

మున్యాశ్రమమునకు పది క్రోసుల దూరము. ఆ చిత్రకూటము చాలమంది మునులకు కూడ స్థానము. ఎందరో మునులక్కడ వసించినారు. ముందు కథకు పోదము.

అది సాయంకాల సమయము. రాముని విడిచిన సుమంత్రుని రిక్తహస్యందనము అయోధ్య కేతెంచినది సుమంత్రుడు దుఃఖ భాగుడయ్యే అయోధ్యకే తెంచినాడు. రాముని వియోగ మెవ్వరికి దుఃఖ కారణమ్ము కాదు ? ప్రజలు గుంపులు గుంపులై సుమంత్రుని, రామ వృత్తాంతమును అడగిరిగాని అతడు వారికేమియు చెప్పకయే నగరమధ్యము నుండి రథమును మాటించు కొనినాడు. రాముడు భరద్వాజాశ్రమము నకు వెళ్ళుచరకు గుహుని వలన వినెను గాపున సుమంత్రునకు రాముని వృత్తాంతము కొంత తెలిసినను దానిని ప్రజలకు వివరించలేదు.

సుమంత్రుని రథము అంతఃపురమునం దెనిమిదవ కక్ష్య యందున్న వృద్ధ భూపతి యగు దశరథేశ్వరుని మందిరము కడ నిలచినది. సుమంత్రుడు రథముదిగి లోపలి కేగినాడు. శోకసముద్రమున మునులాడు దశరథుని చూచినాడు. రాజు పాదములకు ప్రణమిల్లి రాముని వార్త నందించినాడు. పుత్రుని వార్త వినుకొన్న ఒక్క క్షణకాలమునకే దశరథునకు మతి తప్పినది. నేలకూలినాడు. దశరథున కెంత కష్టకాలము వచ్చినదో చూచితిరా ? ఇదియే సంసారాటవిలోని పాంథుని వయసము.

రాజాంతఃపురములు సంసారాటవులు కాకపోవు. చక్రవర్తియు ఒక బాట సారియే. దశరథుని వదికింపుడు.

వృద్ధాప్యము. పుత్రవియోగము. మరణకాలమాసన్నమగుట. అంతఃపురము అగ్నిశాల యగుట కంటె ఏమికావలెను ? సంసారము కర్మఫల రూపమని గుర్తెరుగుట ఈసన్ని వేశములోని సారాంశము.

కథకు పత్రము.

కౌసల్యా సుమిత్రలు దశరథుని సమీపమునకే యుండుటచే వేవేగవచ్చి, ఆతని సేదతీర్చి ఒక ఆసనముపైన కూర్చొనబెట్టినారు. దశరథుడిప్పుడు కర్తవ్యతా మూఢుడై కూర్చొనినాడు. రాముని అరణ్య ప్రయాణమును గురించి సుమంత్రుని అడుగలేదు. వారి ప్రసక్తి ఎత్తుకొనలేదు.

కౌసల్య దుఃఖము ఏరై పారినది. కైకకు భయపడెడి భర్తనే ఆమె ఎరుగును. నిర్భయముగ తన్నాదరించిన రోజులు ఉండెనో లేదో. ఇప్పుటకూడ అతడట్లే యుండెనని ఆమె నిర్ణయించుకొన్నది. దశరథుని చూచి, నాధా! కైక ఇక్కడలేదు. రాముని క్షేమ వార్తలడుగవచ్చును సుమంత్రుని అని హెచ్చరించినది కన్నీరు కార్చుచునే. ఆమాట తనకు బాధాకరమైనను కోపము తెచ్చుకొనకయే దోషదర్శియై దశరథుడు పెదవి విప్పినాడు. రామాదుల క్షేమమును అడిగినాడు.

సుమంత్రుడు వెనుకకు మరలివచ్చి, రాముడు గంగా నదిని దాటునప్పటి విశేషములు చెప్పి, తానుమరల అయోధ్యకు తిరిగి వచ్చువరకు గల సందర్భముల నన్నిటిని చక్కగ వివరించినాడు. అందు మనకు ముఖ్యములగు రెండు ఘట్టము లున్నవి. వాటిని వివరించెదను. ఒకటి లక్ష్మణుడు తన తండ్రికి చెప్పమన్నమాట. రెండు సుమంత్రుడు తాను అయోధ్యకు వచ్చినవ్పటి దృశ్యవర్ణనము.

సుమంత్రుడు ప్రప్రథమముగ రాముడు తండ్రికి అందించిన ప్రణామము లను ఆవృద్ధ దంపతులకు తాను స్వయముగ అందించి ఆతని వార్తల నందించినాడు. తరువాతది లక్ష్మణుని సందేశము. లక్ష్మణుడు కన్నుల నెరుపుచేసికొని నాకు నాతండ్రి యందు తండ్రియను భావము లేదని చెప్పినాడు. నాకు తల్లియు, తండ్రియు సోదరుడును, ప్రభువును ఆత్మబంధువు కూడ రాముడేనని గర్జించి పలికినాడని దశరథునకు తెలిపినాడు.

శ్లో॥ అహం తావన్మహారాజే పితృత్వం నోప లక్షయే.
భ్రాతా భర్తా చ బంధుశ్చ పితా చ మమ రాఘవః

ఇది లక్ష్మణుని సిద్ధాంతము. ఈ సిద్ధాంతము ధర్మలోపమా? అనునది ప్రశ్న. కాదనునది సమాధానము. ఇక్కడ లక్ష్మణుని పాత్ర సౌమ్య ధర్మము నతిక్రమించినది. విశేష ధర్మము నాశ్రయించినది శరీర సంబంధ బంధుత్వము నాతడు వదలినాడు. ఆత్మబంధుత్వము నాశ్రయించినాడు.

తనకు కలుగు దుఃఖములను భక్తులు భరింతురు. తన ప్రభువునకు కలుగు బాధలనుగాని, కల్పించు వ్యక్తులనుగాని వారు క్షమించలేరు. వారు ప్రేమించిన భగవంతుని కొరకే వారి జీవితము. ఇక్కడ దశరథుడు స్త్రీ వ్యామోహముచే

భగవంతునకు దూరమై లోక బాంధవునకు కల్పించిన దుఃఖమునాకడు ఓర్వలేక పోవుటయే ఈనింద కు తాత్పర్యము గాని ఇది పిత్రనిందకాదు. తరువాతి విషయము సుమంత్రుడు తాను వచ్చినపుడు త్రోవలోని విశేషముల తెల్పుట వినుడు.

దశరథేశ్వరా! ఇక నారథము అయోధ్యాభిముఖమైనది. కాని రథవాహకములగు గుర్రములు ముందుకు అడుగిడలేదు. దుఃఖాశ్రువులరాల్చినవి. అంతతో నేనాశ్వంగిబేరపురమును వదలక గుహుని సేవసుఖముతో రామునివర్తమానము నందుకొనిబయలుదేరినాను. అరణ్యములు నాకంట బడినవి. ఉద్యానవనములు చూచినాను. సరోవరములును నాకెదురైనవి. అరణ్యముల స్వేచ్ఛగ చరించు క్రూర మృగములను నేను చూడకపోలేదు. విషసర్పములెన్నియో నాకంట బడినవి. మహారాజా! అవన్నియు రాముని అరణ్యవాసమును తలచి శోకోపహతములై కన్పట్టినవి గాని సహజములై అవి నాకంట బడలేదు.

ఆ మహారణ్యములు వృక్షరాజములు చిరుమొగ్గలతో కూడి రామ విరహ క్లేశమును ప్రదర్శించినవి లతానికుంజములును అంతియే. ఉద్యానవనములు ప్రతి నిత్య పోషకములై అత్యంత సుకుమారములై కనుపట్టదగియు తమ కోమలత్వ మును కోల్పోయి యున్నవి. రాజా! అరణ్యముల స్వేచ్ఛా సంచారమున ఆహారముల నందుకొను మనుపుటేనుగలుకు, వ్యాఘ్రభల్లూకాదులును గూడ తమ ఆహారముసహాని స్తబ్ధములై రమలోని శోకమును ప్రదర్శించినవి. క్రూర సర్ప ములును తిరుగాడలేదు. నేనేమని వర్ణింతును? సరస్సులలోని కలకల ధ్వనులు నాచెవిని బడలేదు. నీటి కాకులు సైతమును కదులాడకయుండ ఆపద్మినులును వ్యాకులములైనవి. వేయేల? రాముని అరణ్యవాసము స్థావర జంగమాత్మక ప్రకృతినంతను కన్నీటి బిందువుల కార్పించినది. నారథము అయోధ్యయందు ప్రవేశించినది. నగరలక్ష్మియును కన్నీరు కార్చుచునే నాకు దర్శనమిచ్చినదనినాడు.

శ్రోతలారా! స్థావర జంగమాత్మక ప్రకృతి అంతయు రాముడట్లు ప్రేమించి నదని వర్ణించిన వాల్మీకి రామునెవ్వనిగ నిరూపించెను? రామదంత ప్రపంచము వకును ఆత్మకాకున్న ప్రపంచమంతయు ఏకాకారమై రామునెట్లు ప్రేమించును? వాల్మీకి అట్లు చిత్రించె భగవంతుడు. అట్టి రాముని తెలిపెననుకొనుడు ముందుకురండు.

దశరథుడేమైన ఈఘట్టమున మాటాడెనా? తన అంతరాత్మ తన తప్పు త్రోవను పట్టించుట నాతడు గుర్తెరిగి బయటకుచెప్పి ఏడ్చినాడీ ఘట్టమున. నేను నా వృద్ధమంత్రులతో ఆలోచింపక మోహపూరితుడనై చేసిన తప్పిదమిదియని వాపోయినాడు.

కైకేయ్యా వినియుక్తేన పాపాభిజనభావయా
మయా న మంత్రకుశలైర్వృద్ధైస్సహ సమర్థితం॥

న సుహృద్భిర్నచామాత్యైః మంత్రయిత్వా చ నైగమైః
మయాయమర్థస్సంమోహాత్ స్త్రీ హేతోస్సహసాకృతః

రామాయణ మహా కావ్యము దశరథుని వంటి మహారాజుల నెంత సుకుమారముగ విమర్శించినదో చూచితిరా? రాజు వృద్ధ మంత్రుల నాలోచింపక చేసిన కార్యఫలమును ప్రదర్శించినది. రామాయణ మహాకావ్యము లోకవ్యవహార ప్రబోధకము. (వ్యవహారవిదే) అనినారు అలంకారికులు.

అంతలో సుమంత్రుని సంభాషణ ముగిసినది. కౌసల్య దుఃఖమాగలేదు. సుమంత్రుడోదార్చినాడు. పుత్రవిరహదుఃఖము స్త్రీలకు భరింపరానిది. కావున సుమంత్రుని ఓదార్పుమాటలు ఆమె కన్నీటి ధారలు తుడవలేక పోయినవి.

జీవుని మరణ కాలము

మనమొక ఇంటి నుండి వేరొక ఇంటిలోనికి ప్రవేశింప బోవుట వంటిదే మరణ కాలము. నేటి జనన మరణములు పూర్వజన్మ కర్మాధీనములు. ఇది కావున రాని సిద్ధాంతము.

మరణ కాలమున జీవుడు తానొనరించిన పుణ్యపాపకర్మల గురించి విమర్శించుకొనును. తాను గావించిన పాపముల తలచి బాధపడును. పుణ్యమును చేసుకొనక పోతినని పశ్చాత్తాపము నొందును. ఈ విషయమును తైత్తిరీయోపనిషత్తు ప్పినది. "కిమహగ్ంసాధునాకరవం" "కిమహంపాపమకరవమితి"

దశరథునకు చరమసమయము ఆసన్నమైనది తనకొక కాలమున ప్రాప్తించిన మునిశాపము స్మృతికి వచ్చినది. తానిప్పుడు చేసిన తప్పుఆతనిని వెంటాడినది. మామిడి తోటను నంకి మోదుగచెట్టును పెంచితినుకొనినాడు. ఒకడు మామిడి

పూతను చూచి, మోదుగపూవును చూచి, మామిడి పూతకంటె మోదుగ పువ్వు పెద్దదనుకొని ఆపువ్వు అందించు ఫలము నాశించి మామిడి తోటను నరికి మోదుగ చెట్టును పెంచినాడట. నేపట్లు చేసితినని బాధపడినాడు మామిడి తోటను పరిపాటి యన రాముని పట్టాభిషేక విఘ్నమును కావించుట, మోదుగచెట్టును పెంపుటయన కైకకు స్థానమిచ్చుట. ఈ రెంటినితలచి బాధపడినాడు. వెంటనే కౌసల్యను పిలచి తనకు ముని ఇచ్చిన శాపమును చెప్పినాడు. ఆ శాపమిది. నీపుత్రులెవ్వరును దగ్గర లేని సమయమున హా! పుత్రా! యని తపించుచు ప్రాణమును విడుతువు అని. దశరథుడు కౌసల్యను వివాహమాడుటకు పూర్వము వచ్చిన శాపమిది.

దశరథుడు వేటకై వెళ్ళి అరణ్యమున అర్ధరాత్రియందు ఒకజంతువు అను కొని ఒకముని బాలకుని చంపినాడు ఆముని ఈశాపము నిచ్చినాడు. అత్యుత్కృష్ట ములగు పుణ్య పాపఫలములు ఈజన్మయందే ఫలించునని సిద్ధాంతము. అదియే దశరథునకు జరిగినది.

అది అర్ధరాత్రి సమయము ఇకతన ప్రాణము నిలువదని దశరథునకు నిశ్చయమైనది. దేహి దేహమునుండి వియోగమగునప్పుడు అతడే స్థితిననుభవించునో ఆయనుభవమాతనికి గోచరమైనది. తనచిత్తము నశించుటచే ఇంద్రియములు కూడ తమ తమ కార్యముల నెరవేర్చుట లేదని ఆరాజు గుర్తెరిగినాడు. ప్రక్కనున్న కౌసల్యతనకు కనబడుటలేదు. రామ వియోగాగ్ని జ్వాలలు చెలరేగినవి తనవంటి పాపాత్ము లీలోకమున లేరని నొచ్చుకొనినాడు. రామునివంటి పుత్రుడెక్కడుండు నని కుమిలినాడు. చివరకు కౌసల్యను పిలచి తనను ఒక్కమారు తాకుమనినాడు. కౌసల్యా! నీకిట్టి దుఃఖమును కల్పించితినని వాపోయినాడు. సుమిత్రకు కూడ తన పశ్చాతాపమును తెలుపుకొనినాడు. కైకను నిందించినాడు. అంతలో ఆదశరథునకు భగవంతుని పుత్రునిగా కనదగిన మహాభాగ్యము మూర్తియై ఆయనను వరించినది.

దశరథుని మనోనేత్రమునకు రాముడు గోచరించినాడు. ఆయన చిత్తము రామాయత్తమైనది. ఆ అంతఃకరణమున ఆత్మారాముడు స్వసంకల్పముచే అవతరించిన కళ్యాణ విగ్రహమును దర్శించినాడు దశరథుడు.

పరిపూర్ణ పూర్ణిమా చంద్రమండలమునలె శాంతహారియై, హాయిని చేకూర్చు రాముని ముఖ మండలము ఆయనకు ధ్యేయమైనది. శాంతరసమును చిమ్ముచు జీవుల కనుగ్రహ ప్రదాయకములగు ఆరాముని ఆకర్ణాంతనేత్ర ద్వంద్వము శాంత

రసము నందించినది. అప్పుడే ఆరాముని ముఖమండలమున తీర్చిదిద్దిన కను బొమల యందచందము గూడ కనినాకర్షించగా, ఈసుందరాంగుని ఇక నేనీ లోకమున చూడజాలను. దర్శించుకొను ధన్యులెవరో అనుకొనుచు, హా! రామా! హే! మహాభాహో! మమ ఆయాసనాశన! పితృ ప్రియ. ఎక్కడుంటివి? ఎక్కడికేగితివి? అని చూడగనే ప్రాణము లామహారాజు దేహము నుండి పయనించినవి. స్థూలదేహము ఇక్కడ నిలిచినది. సూక్ష్మశరీరము శరీరతో పువ్వలోని వాసనలను వాయువు గొంపోవునట్లు పయనించినది. చూచువారలకా సూక్ష్మదేహము కనబడదు. అదియుండు జీవుని కూడ ఎవ్వరును చూడజాలరు. పువ్వు నుండి వెడలి వచ్చు సుగంధమును మోసుకొనిపోవు గాలి నెవ్వరు గమనించగలరు?

ఇప్పుడు దశరథుడు అయోధ్యయందు లేడు. దశరథుడను పేరునొందిన శరీర మక్కడనే యున్నది. ఆ శరీరము లోపల నేను దశరథుడను రాజును, నా భార్యలు వీరు, నా బిడ్డలు వీరని గుర్తించుకొనుచుండు దేహి వయనించినాడు. తరువాతి కథకు పోదము. కాలమెవ్వరికిని సంబంధించి నడువదు. తనంతట తానై వయవించు చుండును. రాత్రి కాలము వెళ్ళిపోయినది. తెల్లవారు జాము వచ్చినది. అది జీవు లందరును నిద్రనుండి మేల్కొను సమయము. నేను మహారాజునుకొన్న జీవుడు మేల్కొనుటకు ఆతని రాజ్యమున కొన్ని మర్యాదలు జరుగుచుండును. అయోధ్యా నగరమున రాజమర్యాదలు ప్రారంభమైనవి. వందిమాగధులు మేలుకొలుపుల పాడినారు. వీణావేణు మృదంగ వాద్యముల ధ్వని తరంగములును ఆ రాజగృహమున ప్రతిధ్వనించినవి. రాజు నిద్రనుండి లేవలేదు. దశరథుని ప్రత్యేకముగదర్శించి నిద్ర పుటకై కొందరు స్త్రీలు అమున పడకటింటిలోని కేగినారు. ఆతడు కన్నులు తెరువ లేదు. అది నిద్రయేనా? అను అనుమానమునకు వారు గురికాక తప్పలేదు. మెల్లగ వారు దశరథుని శయ్యాతలము దగ్గర కేగినారు. వారి అనుమానమునకు బలము చేకూరినది. వారాతని తాకినారు. కదలికలేదు. శ్వాసగాలిని పరీక్షించినారు. అడియు మృగ్యమైనది. వారు ఆ గృహాంతర్భాగమునకే పరుగిడియున్న కౌసల్యా సుమిత్రల వద్దకేగినారు. ఆ రాత్రంతయునిద్రలేమిచే అప్పుడే కునుకుపట్టిన ఆ ఇద్దరురాణులును దశరథునివలెనే శుష్కించిన తనువులతో కన్నులలో ఓలిచిన ప్రాణములతో నుండినారు.

అంతఃపురములోని కేగిన వారి గుండెలు బ్రద్దలైనవి. అందరొక్కమారుగ ఎలుగెత్తి ఏడ్చినారు. అంతలో కౌసల్యా సుమిత్రల కన్నులు తెరువబడినవి. వారును మహారాజును పరికింపగా రాజు మృతినొందెనని అందరకు నిర్ణయమైనది. దశరథునకు మూడువందల ఏబదిమంది భార్యలు ముగ్గురు రాణులు. ఇప్పుడందరొక్కచోట కూడినారు. వారి ఏడ్పులు మిన్నుముట్టినవి. అందు కైక లేకపోలేదు. కైక పాపిష్టురాలన్న నినాదముతోడనే వారందరి ఏడ్పులును ఆకసము నంటినవి. ఆ సమయమున రాజాంతఃపురమొక్కటే శోకమయముగుటకాదు. నగరమంతయు అట్లే అయినది. నగరవాసులందరును కైకను తిట్టుచునే శోకించినారు. రాజద్రోహమునకు గురియైన కైక, భర్తృ ద్రోహమాచరించిన కైక, పుత్రద్రోహము చేసిన కైక ప్రజాద్రోహములకు కారకురాలైన కైక అను నినాదము లేనిచోటు ఆ రాజధానియందు లేదు. రాజు శవమా రోజున తైలద్రోణి యందుంచబడినది. శవము కుళ్ళకుండుటకే ఆ విధానము పుత్రులున్నవారికి వారి పుత్రులు వచ్చి దహనసంస్కారములు గావించుట సనాతన భారతీయ సంస్కృతి. ఆ రోజు గడిచినది. అవ్వటికి రాముని వనవాసము ఏడురోజులు ముగిసినవి. దశరథుని పుత్రులెవ్వరను ఇక్కడ లేరు గదా? ఆ తరువాతి విషయము రేపు.

ఈ నాటికి ఉపన్యాసము సమాప్తము —

ఓమ్ శాంతి శ్శాంతి శ్శాంతిః.

4 వ రోజు సమాప్తము.

5 వ రోజు

శ్లో॥ శ్రీరామచంద్రం ధృతచాపసాయకం
సీలోత్పలాభం నలినాయతేక్షణం
సౌమిత్రికా సేవిత పాదపంకజం
సీతా సమేతం శరణం భజేఽనిశమ్.

ఆర్యమహాశయులారా!

మన రామాయణ కథా ప్రవచనమున నిన్నటి యుపన్యాసమెక్కడ నిలిచినది? దశరథుని అస్తమయముతో నిలిచినది. రామపట్టాభిషేకమున కేగిన ఆరవనాటి రాత్రి దశరథుని మరణము ఏడవ రోజంతయు దశరథుని మృతకళేబరము తైలద్రోణి యందే నిక్షిప్తమై యున్నది. (తైలద్రోణియన నూనెపాత్ర) ఆనాటి రాత్రి గడచినది. నేడెనిమిదవ రోజు. ఈ నాటినుండి జరుగబోవు చరిత్రాంశము నేటి మన యుపన్యాసము

దశరథుడస్తమించగా, రామపట్టాభిషేకమునకేగగా, భరతుడు తాతగారింట నుండగా నాటినుండి పరిపాలకుడెవ్వడనునది ప్రశ్న. ఈ సమస్య నెవ్వరు పరిష్కరించవలెను? ఆనాడీ సమస్యను మంత్రులు పరిష్కరించలేదు. ప్రజలును పరిష్కర్తలుగ లేరు.

ఉదయభానునితోపాటు నాడు గౌతమ, మౌద్గల్య, కాత్యాయన, మార్కండేయ, జాబాలి, కాశ్యప, వామదేవులను బ్రాహ్మణ శ్రేష్ఠులందరొక్కచోట కూడినారు. మంత్రిసత్తములతో వారొక సభను ఏర్పాటు చేసినారు. రాజపురోహితులందగ్రగణ్యులు వశిష్ఠ మునీంద్రులు. ఆ వశిష్ఠ మునీంద్రులవంక తిరిగి, గౌతమ కాత్యాయనాది బ్రాహ్మణులిట్లనిరి రాజు మరణించుటచే విన్నటి దినమొక్కటే నూరేండ్లవలె గడచినది. కావున రాజపీఠమున శ్రేష్ఠుడగు రాజకుమారునొక్కని ప్రతిష్ఠించుట అవసరము. రాజ్యము అరాజకము కాగూడదు. రాష్ట్ర విప్లవములు చెలరేగును. కావున రాజునొకనిని నిర్ణయింతమనినారు. ఆ సమయమున రాజులేని రాజ్యమున జరుగు ఘోరములు మన రామాయణమున పర్ణింపబడినవి.

రాజు లేని రాజ్యము

రాజులేని రాష్ట్రి మిట్లుండునట.

మొదటి మాట సకాలమున వర్షములుండవట. రైతులు పంటలు పండించరట. కారణమేమిఁ తాము పండించిన పంటలు తమకు దక్కునన్న నమ్మకము వారి కుండదు. దొంగలవలన భయము మెండైయుండును. ఇట్లే కొన్ని ప్రతిబంధకములు వర్ణించినారు మహర్షి. మంచి మంచి వనములను నాశము చేయుదురు. మనోహరము లైన ఉద్యానవనములు పరిశుభ్రములై యుండవు. సభలు సక్రమములై సాగవు. ఉత్సవములు జరగవు. తగవులు న్యాయముగ పరిష్కారములు కావు. అధికారులు లంచము తీసుకొనుటకు వెనుకాడరు. కళలు పరిపూర్ణములై యుండవు. ఇట్లెన్నియో దోషములు రాష్ట్రిమును పాలించు సమర్థుడగు రాజు లేనప్పుడు కలుగునని మహర్షులు కొందరు వర్ణించి దేశమును పాలించుటకు రాజెంత అవసరమో చెప్పినారు చివరకు వారు సిద్ధాంతీకరించిన సిద్ధాంతమిది.

"రాజా సత్యంచ ధర్మశ్చ రాజా కులవతాం కులం
రాజా మాతా పితాచైవ రాజా హితకరో నృణాం"

సత్యధర్మములన రాజే. ప్రజలకు తల్లిదండ్రులును రాజే. వేయేల? దేశ భద్రత రాజుపైననే ఆధారపడినదనినారు. తరువాతి కథ.

కాశ్యపాది మహర్షులును మంత్రులును కూడ ఈ విషయముల చెప్పగా వశిష్ఠులు భరత శత్రుఘ్నుల కొరకై దూతలను కేకయ రాజ్యమునకు పంపినారు. నేనాదేశించితినని వారికి చెప్పి తీసుకొని రండని దూతలకు చెప్పినారు. దశరథుని మృతిని వారికి తెలుపవద్దనినారు.

అది అర్ధరాత్రి సమయము. కేకయ రాజ్యమునకు గిరివ్రజమును కూడ పేరు. అయోధ్యనుండి బయలుదేరిన దూతలు కేకయ రాజ్యమునకు వేవేగ వయనించి చేరుకొనినారు. అది రాత్రికాలమగుటచే వారు రాజభవనమునకు వెళ్ళలేదు. తెల్లవారి నది. దూతలు భరతుని దర్శించినారు. భరతుని చేతికి తాము తెచ్చిన కొంత ధనము నందించి, కేకయ రాజునకును, అతని పుత్రునకును ఆ ధనమును పంచమనగా భరతుడట్లే చేసెను.

కాని భరతుని మనస్సుత్సాహమై లేదు. దూతలు కేకయరాజ్యమున కాలు పెట్టిన ఆ రాత్రియే భరతునకు భయంకరముగ స్వప్నము వచ్చినది. అది దళ రథుడు గార్ధభములు కట్టిన రథముపై నెక్కి కొందరు స్త్రీలు పల్లనె యుండగా వచ్చని వర్ణముగల మరికొందరు స్త్రీలాతని పరిహసించుచుండ ఎర్రని పూలమాలలధరించి దక్షిణదిక్కునకు పయనించెనట. తామసమాసిన బట్టలతో కొండపై నుండి క్రింద నున్న పేడగుంటలోపడినట్లు కలగనెను. ఇట్టి కొన్ని దుష్టశకునముల నాతడు కలలో చూచి భయస్థుడై యుండెను. తన స్నేహితులతో తనభయమును చెప్పుకొనెను. అంతలో దూతలువచ్చి, భరతా! నీవేనిచ్చి తీర్చదగు ఒక కార్యముండుటచే నిన్ను శీఘ్రముగ తీసుకునిరమ్మనెనని, దూతలు చెప్పగా భరతుని గుండెలదిరినవి. అతడు త్సుకుడై లేదు.ఒక్కమాట. అతని దుష్టస్వప్నముల కేనియో ప్రతికృతులు జరుగక పోలేదు

మొదటి జామున వచ్చినకల సంవత్సరమునకు ఫలించును. రెండవ జామున వచ్చినకలకు ఎనిమిదినెలలు గడువు. మూడవ జామునకు మూడునెలలు. నాలుగవ జామునందు వచ్చిన స్వప్నము మాసములోపల ఫలించును. మంచికలలు వచ్చిన తరువాత నిద్రించరాదు. చెడ్డకలలురాగా శుద్ధుడై శాంతిని చేసుకొనవలెను. మంచి కలలను తెల్లవారగనే బ్రాహ్మణులతో చెప్పి ఆశీస్సులనొందవలెను.ఇట్టివన్నియో ధర్మములను చెప్పినవి భారతీయశాస్త్రములు.

భరతుని చిత్తవృత్తిని కలత నొందించినదీ స్వప్నమొక్కటేకాదు. మాతలు నీవేతీర్చవలసిన కార్యమునకు విన్ను వేవేగ తీసుకొనిరమ్మని చెప్పినారు గదా? కైకవలన ఏదియో అనర్థకము జరిగి యుండవచ్చునని కూడ అతడూహించినాడు. దూతలను అందరిక్షేమమడుగునప్పుడు కైకనిట్లు వర్ణించి అడిగినాడు.

"ఆత్మకామా సదా చండీ క్రోధనా ప్రాజ్ఞమానినీ
అరోగాచాపి మే మాతా" అనినాడు.

ఆమె స్వార్థపరురాలట, చండియట, నేనే వండితురాలనన్న అహంకారము కలదట. భరతుడు తొందరగనే తాతగారి వద్దను మేనమామ దగ్గరను అనుజ్ఞను గొని వారిచ్చిన సత్కారములను తప్పనిసరియగుటచే గ్రహించి, అందర ఆనుమతితో ప్రయాణమయ్యెను. మధ్యమార్గమున ఆతని వయసము కొన్ని నమిలను

వనములను వనమధ్యములందలి దేశములను దాటుచునేసాగినది. ఆతడు ఏడు రోజులు ప్రయాణించి ఎనిమిదవరోజు సూర్యోదయమునకు అయోధ్యకుచేరెను.

అయోధ్య నిశానందమై ఆతని కగపడినది. వేదపాఠములు వినవచ్చుట లేదు. వచ్చిపోవు ప్రజల సంచారము లేదు. మంగళ వాద్యధ్వనులు నగరసమీపమునకు వచ్చినను వినవచ్చుటలేదు. ఆవన్నియు అట్లుండ నందనోద్యానవనమువలె నుండు బాహ్యోద్యానవనములు రాలుమన్న ఆకులతో విరిగిపడెను కొమ్మలతో గోలపెట్టి ఏడ్చుచున్నట్లున్నవి. ఆ దృశ్యమాతని మనస్సును తొందరపెట్టగా సారధితోచెప్పి, ఆరనిమంటలు మనస్సును పరుగులెత్తింపగా ఆతడయోధ్యానగర మేదియో యొకవిపత్తునకు గురియయ్యెనని నిశ్చయించుకొనినాడు. యథార్థమాతని కెట్లు తెలియును?

భరతుని రథము దశరథేశ్వరుని ప్రాసాద ద్వారమున నిలచినది. భరతుడు తండ్రిని చూచుటకై వేవేగలోనికి వెళ్ళినాడు. అతడక్కడలేడు. సరాసరి భరతుడు కైకేయి మందిరమునకేగినాడు.

కైకకిది యొక మహోత్సవసమయము. భరతుడు తల్లిమందిరమున కేగు నప్పటికి కైక ఎత్తైన సువర్ణపీఠము నధిష్ఠించియున్నది. భరతుడామె కంటబడగనే తటాలున దూకినదా పీఠమునుండి. భరతుడును తల్లిపాదములపై ప్రాలినాడు.పుత్రుని కౌగిలించుకొన్నది శిరమును వాసన చూచినది. పుత్రస్నేహమును వలకబోసి నది. తన పుట్టింటివారి యోగక్షేమముల నన్నిటిని పేరుపేరు వరుసన అడిగినది భరతుడు తల్లి అడుగుప్రశ్నలకు చాల తొందర తొందరగ సమాధానమిచ్చినాడు. ఆతని దృష్టియాదవి ప్రధానములై లేవు. ఇప్పుడాతనికి శీఘ్రముగ తెలియదగినది తండ్రి వృత్తాంతము.

భరతుడు తల్లిశయనమందిరము వంకచూడగా ఆమెశయ్యాతలము కళావి హీనమై యున్నది. రాజబంధువుల ఏడ్పులేవియో వినబడుచున్నవి రాజకార్యముల వదలుచో దశరథుని నివాసమీ కైకమందిరమునసే యుండెడిది. అదిలేదు. తండ్రి ఎక్కడి కేగెను?

ఆతని మనస్సు అనేకవిధములుగ సంచేహించినది. తల్లిడిగినాడు. కైకకిది యొక పెద్దఘట్టముకాదు దశరథుని మరణవార్తను ఆమెచాల తేలికగనే భరతున

కందించినది ఏమని? భరతా! నీ తండ్రి, పుట్టిన భూతములన్నియు సహజముగ ఏత్రోవకుపయనించునో ఆత్రోవకే వెళ్ళెనని, తండ్రికొగలింతలోని స్వర్గసుఖము నందు కొందమని శివ్వికులూరు భరతునకీవార్త నందించినది.

భరతునకది పిడుగుపాటైనది. హా! తండ్రీయని గండ్రగొడ్డలిచే నరకబడిన వృక్షశాఖవలె నేలకూలినాడు లేచినాడు. ఆతనికదియొక ఉన్మాదావస్థయైనది. లేచును. మరల కూలును. తండ్రీ! అని పిలుచును. నేను భరతుడనని చెప్పుకొనును.....

కైక దృక్పథమున భర్తలేడు. కొడుకుండెను. భరతుని బుజ్జగించినది. కాలము భూతముల మ్రింగకుండునా? అని వేదాంతమును బోధించినది. కాని భరతుడు నేలపైబడి పొర్లుటను ఆమె ఆపలేకపోయినది. అతడనుకొనివచ్చిన ఊహా ప్రపంచము వేరు. జరిగినఘట్టమువేరు. వాటిని తలచుకొని బాధపడినాడు. భరతుని దుఃఖము రామని స్మృతికే దెచ్చినది. తండ్రి తనకందించు ఆలింగన భాగ్యమును రాముడందించుననుకొనినాడు. కైక వైపుకు తిరిగినాడు

తల్లీ! ఎవడు నాకు అన్నయో, ఎవడునాకు తండ్రికూడనో, బంధువెవ్వరో! నే నెవ్వరికింకరుడనో గుణఖనియగు ఆరామునకు కబురు పంపుమనిచెప్పి, ఆతని పాదములపై వ్రాలుటకు ఉత్సుకపడినాడు అంతలో అతనికింకొకసమస్య స్ఫురించి వది. ఆంత్యకాలముజ నా తండ్రి నాకేమైన సందేశమునందించి వెళ్ళెనా? అని తల్లిని అడిగినాడు.

కైక ఈవిషయమున అబద్ధమాడుటకు పూనుకొనలేదు.

భరతా! నీ తండ్రి ప్రాణములవదలుచు హా! రామా! హా! లక్ష్మణా! సీతా! మీరు తిరిగివచ్చుట ధన్యులు చూతురనుచు ప్రాణముల వదలెనని చెప్పినది.

భరతుని మనసు క్రుళ్ళిపడినది తండ్రి మరణసమయమున రాములక్ష్మణు లేలలేరు? సీత ఎక్కడికేగినది? అని ప్రశ్నించినాడు.

కైక రాముని అరణ్యపయనమును తెలిపినది. కారణము భరతుని ఊహ కందలేదు. దండకారణ్యములకు రాముని పంపదగిన తప్పులను రాముడేమిచేసెను?

బ్రాహ్మణధనములు నాశించెనా? నిరపరాధుల శిక్షించెనా? పరదారల పరిగ్రహించెనా? ఇట్టి శిక్ష అతడికేల విధింపబడెను? అని తల్లినడిగినాడు. కైక రాముడట్టి తప్పులను చేయలేదు. రాముడట్టి దోషముంచేయువాడు కాడు. అతడు పరదారల కన్నెత్తిచూడడు అని చెప్పినది. మరి?

కైకకొక్క మారుగలోలోన సంతోషమూ పొంగినది తన ఘనకార్యమును నివేదించగా తనవలెనే భరతుడును సంతోషించి, తన మహాప్రయత్నముచే సంపాదించిన ఈ ఇక్ష్వాకు సామ్రాజ్య లక్ష్మిని చేపట్టుననుకొన్నది భర్తను పొట్టబెట్టుకొంటినన్న బాధ ఆమెను బాధించలేదు. ప్రజల ఆర్తనినాదములున్నూ ఆమెచెవిని బడలేదు ఈ క్షణము వరకును. కైకఇట్టి ఘట్టమున కొదగ్గసౌత్ర.

పుత్రునకు రాముని దండకారణ్య పయన కారణమును సమగ్రముగ తెలిపి, రాజ్యలక్ష్మిని చేకొనమన్నది.

శ్రోతలు భరతునివైపున కొక్కమారు మరలుడు. అతడు తల్లికి బిడ్డకాలేదు. అతడు రఘువంశ ప్రతిష్ఠావకుడు ధర్మమూర్తి. ఆతని జీవితము రామునకంకితము. అతడు రాముని సోదరుడేకాదు. అతడు రాముని దాసుడు. భక్తశిఖామణి, ఆతని వినిర్మల జీవితమునకిదియొక పరీక్ష ఘట్టమైనది వచ్చెను. మహామహుల జీవితములోని సద్వాసనలు బహిర్గతములై లోకమున గుభాళించవలెనన్న వారి జీవితమునందు కొన్ని ఘట్టములు వారినెదుర్కొని వారి జీవితములు మధించవలెను భరతునకిప్పుడు వచ్చిన ఘట్టమట్టిదే. భరతుడు తల్లిమాటను వినుట తడవుగా కాలినపుండుపై బడిన కారమువలెయైనది అతని హృదయ వేదనము. అది భరింపరాని దుఃఖమైనది. క్రిందపడి మూర్ఛిల్లినాడు. లేచినాడు. కైకపై ఆతని చూపులు ప్రసరించినవి. అవి మహోగ్రరూపములైన చూపులు.భరతునకామె తల్లియెనబడలేదు. దశరథుని కామెరాణియని ఆతడు తలచలేదు. తండ్రి తన అజ్ఞానముచే నిష్పను తెచ్చుకొనెనని ఆతడు భావించినాడు. ఈ రాజవంశమును భక్షించుటకై వచ్చిన కాళియని ఆమెను చూచినాడు.

ఆమె నివ్వుడేమిచేసిన తన క్రోధము తీరును! నిశితకరవాలమున ఈ ఘాతుకి కుత్తుకను కోయవలె ననుకొనినాడు. రాముడాతని అంతఃకరణయందు సాక్షాత్కరించగా ఆగినాడు. రాముడు కైకను తల్లీ! యని పిలచును. అది భరతుని అడ్డగించినది. ఈ మహాపాపిష్ఠురాలు నాతల్లియా? ఆహా! నేనెంత దురదృష్టవంతు

డను? ఈమె ఆందించు రాజ్యమునకు నేను రాజునా? ఛీ! అని తానలంకరించు కొన్న మణి సువర్ణ భూషణముల మూడబెక్కి నేలవేసినాడు ఈ ఘాతుకికి వాగ్దండము నైన విధించుట రాజధర్మమని తలచెనేమో తాను తలచిన భావములను వాగ్రూపము నొందించి తల్లిని నిందించినాడు. మంత్రులతో ఈ రాజ్యము రామునిదేనని కంఠోక్తిగ చెప్పినాడు. అరణ్యమున తానుండుటకు నిర్ణయించుకొనినాడు. కౌసల్యా మహాసాధ్వి తలచుకొనగా ఆతని దుఃఖము పెల్లుబెరికినది. కౌసల్యా సుమిత్రలను దర్శించుట కాతడు బయలుదేరినాడు. ఏకైకపుత్రుడుకలిగిన కౌసల్య రామునికొరకై పడు బాధ నాతడనుభవించినాడు.

అది కౌసల్య గృహము. భరత శత్రుఘ్నులిద్దరును కౌసల్యామందిరమున కేగినారు. కృశించిన శరీరముతో నేల నంటియున్న ఆ దీనురాలిని చూచినారు. భరత శత్రుఘ్నులకు దుఃఖ మాగలేదు. దుఃఖితులయ్యె ఆమె పాదముల పైబడి ఆ తల్లిని కౌగలించుకొని దుఃఖింపగా, కౌసల్యయు పుత్రవియోగ దుఃఖము ఏరులై పార పెద్దపెట్టున ఏడ్చుచునే భరతుని—

భరతా! రాజ్యము కావలెనను నీ కోరిక సఫలమైనది. క్రూరురాలై కైకేయి సంపాదించినది ఇక నీవనుభవింపుమన్నది. ఆ మాట భరతున కెట్లుండును? పుండుపై సూది గ్రుచ్చుకొన్నట్లయినది. "విష్యధే భరత స్తీవ్రం వ్రణే తుద్యేవ సూచినా." భరతుని కౌసల్య వాక్యము చాల బాధించగా, మరల ఆమెపాదములపై బడి తల్లీ! నేను రాజ్యకాముడను కాను. నేనీరాజ్యమును కోరియున్నచో పాపులు వెళ్ల లోకములకు నేనును పోయెదనని ఏడ్చుచునే చెప్పినాడు. ఆ పాపము లెవ్వి? వినుడు.

ప్రేష్యం పాపీయసాం యాతు సూర్యం చ ప్రతిమేహతు
హంతు పాదేవ గాం సుప్తాం యస్యార్యోనుమతే గతః॥

తల్లీ! రాము డడవికిబోవుట నాకు సమ్మతమయ్యెనేని నీచులకు సేవ చేసిన వారును, సూర్యుని కెదురుగామూర్చుండి మూత్రపురీషముల విడుచువారును, పరుండి యున్న గోమాతను కాలదన్ను దుష్టుడును పోవు మహానరక కూపములకు నేను పోయెద ననినాడు.

బలిషడ్భాగ ముద్ధృత్య నృపస్యారక్షితః ప్రజాః
అధర్మ్యోఒస్య సోస్యాస్తు యస్యార్యోనుమతేగతః॥

ప్రజలవలన వంటలోని యారవపాలు గప్పము గొనుచు ప్రజలను సంరక్షింపక ఆ ప్రజలను అకలిదప్పులపా లోనుచేయు రాజుపోవు పాపలోకము నకు నేను బోయెద.

విశ్వాసా త్కృధితం కించిత్పరివాదం మిథః క్వచిత్
విస్రణోతు స దుష్టాత్మా యస్యార్యోనుమతే గతః॥

స్నేహితుడు తనయందుగల మిత్రభావముచే గొప్ప రహస్యమును తనకు చెప్పగా వద్దానిని వెలిబుచ్చువాడు వెడలు నరకలోకమునకు నేనును బోయెదను.

ఉభే సంధ్యే శయానస్య యత్పాపం పరికల్పతే
తచ్చ పాపం భవేత్తస్య యస్యార్యోనుమతే గతః॥

సూర్యోదయ సూర్యాస్తమయ కాలములందు విధిపూర్వకముగు సంధ్యాను ష్ఠానములు విస్మరించక, దైవప్రార్థనల సలుపక నిద్రించు దుర్మార్గుడు పొందెడు యమయాతనను నేనును పొందెదను.

ఇట్లెన్నియో శపథముల గావించినాడు భరతుడు. కౌసల్య భరతుని తత్వ మెరుగనిది కాదు. ఆమెచే పుత్రవిరహ క్లేశమట్లు పలికించినది. అంతియే. ఆ మాటనే ఆమె భరతునికి చెప్పి, ఆతనిని తనతొడపై నిడుకొని ఆదరించినది. నీకు పాప మెక్కడిది నాయనా? అని దీవించినది. ఆ రాత్రి భరతునకును, ఆతని సోదరునకును, కౌసల్యాదులకును అట్లే గడచినది.

తెల్లవారినది. వశిష్ఠమునీంద్రు లేతెంచినారు. శైలద్రోణియందుంచిన శవము నెంత కాలముంచుదురు? మునీంద్రులు భరతు నోదార్చి, ఆతనిచే దహనసంస్కా రాది క్రియలు చేయించినారు. ప్రేతకార్యములు సమంత్రకములై నెరవేరినవి పంద్రెండు రోజులు.

అది పదమూడవ రోజు. అత్యంత దుఃఖ సంతప్తుడైయున్న భరతుని శత్రుఘ్నుడు ఓదార్చు సమయము. అప్పుడే తూర్పు వాకిట కేతెంచినది మంథర. భరతుడు తన్ను గౌరవింపగా శత్రుఘ్నుడా భరతుని యనుసరింప, అందరును

తన మెడను పూలదండలతో నింపు ననుకొన్నది ఆ దాసి. భరతుడు వచ్చిన తరువాత కైకకు జరిగిన రాజమర్యాద మంథరకు తెలియలేదు కాబోలు. మంథర ఇష్టపోతించినదట.

తన ఒడలంతయు మంచిగంధము పూసుకొన్నదట. పూలను ముడుచుకొన్నదట శిఖయందు. కైక యిచ్చిన దశరథేశ్వరుని చొక్కాను చక్కగ తొడిగికొన్నదట. ఇంక ఏమైన అంగవస్త్రములున్న వల్లెవాటుల వేసుకొని, ఆ లంగాలపై, కైక యిచ్చిన బంగారునగలను, రత్నాభరణములను అలంకరించు కొన్నదట, నడుమున వడ్డాణము పెట్టుకొన్నదట. వడుమునకు తాడు కట్టివ కోతివలె వచ్చినదట. వాల్మీకి వర్ణించినారు. "రజ్జుబద్ధేవ వానరీ" అని వింటిరా? వాల్మీకి చమత్కార రచనను? తరువాతేమి జరిగినది?

మంథర వచ్చిన ద్వారముకడ నిలిచిన ద్వారపాలకులు దానిని చేతబట్టి తీసుకువచ్చి, శత్రుఘ్నునకు వప్పగించినారు. మంథర ఒక్కతయే రాలేదు. ఆ కుబ్జకున్న సఖురాండ్రందరను వచ్చినారు ఆ దాసిని చుట్టి.

రాజపుత్రా! శత్రుఘ్నా! ఇదిగో కొంపకు నిప్పు మూట్టించిన మంథర అని వదలినారు.

విజమునకు శత్రుఘ్నుడు నిత్యశత్రుఘ్నుడే. ఆయ్యనను ఆ పాపదాసిని చూచి ఉగ్రుడయ్యెను. అది మహోగ్ర క్రోధము. ఆ శత్రుఘ్నుని కోపమును చూచి దాసులందరును తలొక దారికి పారిపోయిరిగాని మంథర మాత్రము ఆ యత్నమున సఫలత నొందలేదు. పట్టుబడినది. అచ్చటి సేవకులు దానిని కదలనివ్వలేదు. పెద్దగ ఏడ్చినదిగాని మంథర గయ్యాళితనమక్కడ సాగలేదు.

శత్రుఘ్నుడొక్కతన్న తన్నగా అది నేలకూలినది. మరల తన్నగా దొర్లి వది మరల తన్నియు శత్రుఘ్నుడు శాంతించలేదు. భరతుడు నివారించినాడు స్త్రీ హత్యకు భయపడి. కైక ఆ దాసిని రక్షింప వచ్చినది. చివాట్లతో ఆమె మరలినది. శత్రుఘ్నుని చేతిలో కైకకు దెబ్బలు తప్పినవి. తప్పించుకొన్నది. అంతతో మంథర ఘట్టము ముగిసినది. కైకయు మౌనము వహించినది. భరతుని పితృకర్మ సమాప్తమైనది. ఇది పదునాల్గవ రోజు. తరువాతి కర్తవ్యమేమి?

భరతుడిక రాజు కావలెను. మంత్రులు సభామంటపము నేర్పరచినారు. సభ సిండినది. వశిష్ఠాది మునులును అందుండిరి. పురవాసులు భరతుకు రాజగుటకు ఎదురుచూచుచున్న సమయమది. భరతుడు సభాస్థలి కేతెంచినాడు. మంత్రులందరును భరతా! దేశము అరాజికమగుట దేశోపద్రవమునకు కారణము గావున ఈ రాజ సింహాసనము నధిష్ఠింపుమని ప్రార్థించినారు.

స్వార్థత్యాగమునకు భరతుని పాత్రయే ఆదర్శము. భరతుడు అభిషేక సామగ్రికంతకును ప్రదక్షిణ నమస్కారము గావించి నేను రాజును కాను ఈ సామగ్రినంతను రామునివద్దకు గొంపోయి అతనినే నేను రాజును చేతునని సమాధానమిచ్చినాడు. భరతుడు రాజుకాలేదు సరిగదా రాముని తీర్చవలసిన వనవాస దీక్ష నాదియని నిర్ణయించినాడు. ప్రజల హర్షధ్వానములు మిన్నుముట్టినవి. రామునివద్ద కేగుటకు అందరును సిద్ధముకండని మంత్రిమండలినేగాక ప్రజానీకమునంతను ఆజ్ఞాపించినాడు. రామునివద్ద కేగుటకు మార్గములు చక్కదిద్దవలెనని కూడ భరతుని ఆజ్ఞ యైనది. ఆ రాత్రి గడచినది. రెండవరోజు పుట్టము.

మరల ప్రాతఃకాలమున రాజసభ ఏర్పాటైనది. రాజసింహాసనమును ఆ సభాస్థలియందుంచబడినది. భరతుడా వరిష్ఠమధ్యమున వేరొక ఆసనమునై కూర్చొనినాడు వశిష్ఠుని సుఖాసీనులైరి మరల భరతుని రాజు గావించుట కీనాటి ప్రయత్నమును వశిష్ఠులు పరిగ్రహించి మునివర్యులే కోరినారు. భరతా! ఇదిగో నిష్కంటకమగు ఇక్ష్వాకు సామ్రాజ్యము. నీ తండ్రి దశరథుడును, తండ్రి ఆజ్ఞను పాలింపబద్ధ కంకణుడైన రాముడును నీ చేతికందించినారు. కావున శీఘ్రముగ పట్టాభిషిక్తుడవు కమ్మనినాడు. అంతేకాక నాల్గుదిక్కులనున్న సామంత రాజులందించు రత్నములను కూడ గైకొనుమని ప్రోత్సాహపరచినారు.

మనమొక్కమాటు భరతునివంక తిరుగుదము.

భరతుని ముఖమండలము దుఃఖముచే ఆవరింపబడినది. కన్నులవెంట నీరు కారినది. ఆతనికది భరింపరాని దుఃఖమైనది. గద్గదకంఠుడై సిగ్గువదలి సభామధ్యముననే ఏడ్చుచు హంసస్వరమువంటి కంఠస్వరమున వశిష్ఠునిపై గౌరవము తొలగగా ఆమహర్షిని తిరస్కరించుచు కంఠస్వరమును పెంచి సమాధానమిచ్చినాడు.

మునీంద్రా! వేదము పఠించి వేదాంగములు నధ్యసించి, తదర్థముల గ్రహించి వాని ననుష్ఠించుట కాత్మసంస్కారకు బద్ధుడైన వానివంటి వాడెవ్వడును ఈ రాజ్యము నపహరింపడు దశరథునకు పుట్టినవాడింతటి అధర్మము నాచరించునని తాము తలచితిరా? నేనును, నా రాజ్యమును గూడ రాముని యధీనము. కావున ఈ ధర్మమును రామునకు బోధించి రాముడయోధ్యకు మరల్చుమనినాడు.

శ్రోతలు భరతుని మాటలలోని ప్రత్యేకతనేమి గ్రహించితిరి? అర్థము గావించుకొనదగిన విషయములివ్వి. భరతుడు బ్రహ్మచర్యముచేసి వేదమును చదివెనట. గురువుల నీ విద్యపరిపూర్తియైన దనుమంతరమను విద్యాభ్యాసము గావించి స్నాతకుడయ్యెనట. అరణ్యమేగాక, విద్యారహస్యములు గ్రహింపగలిగిన బుద్ధిశాలియు అపన్నిధియు అట్లుండధర్మము నాచరించుటయుదే నియతమానసుడైయుండెనట. ఇన్ని అర్హతలుగల వాడెవ్వడును దుష్టి చోరత్వమునకు పూనుకొనడట. మానవున కుత్తమ సంస్కారము కావలెనన్న కేవల విద్యనభ్యసింపుటకాదు. ధర్మమును తన ముందుంచుకొనుట భారతీయ జీవనవిధానము. జ్యేష్ఠునిభాగమును కనిష్ఠుడువశ్రగహించుట చోరత్వమని భరతుడు సిద్ధాంతీకరించినాడు. అదట్లుండ పురోహితుని సభయందు నిందించకూడదు. అయ్యును భరతుడు నిందించినాడు. కారణమేమి? పురోహితులైన తాము నాకిట్టి అధర్మమును బోధించుటయా? అది యట్లుండ ప్రజలందరును విన్నపాలు కోరచుండిరి. రాజులందరును నీవు రాజగుటకు అంగీకరించినారు. వారు నీకు ప్రమాణములు కట్టుదురు. లోకులు నింపెంతురను భయమక్కరలేదు. నిర్భయముగ నీవు రాజ్యమును తీసుకొనవచ్చునని గదా? సభామధ్యమున వశిష్ఠుడు చెప్పిరి? నేను నా ప్రభుత్వమును గురువును అంగీకరింపకపు భయముచే ఈ రాజ్యమును నాకక్కర లేదంటినా? నేను ఇంతపూర్వము రాజకర్తలకు చెప్పగా మరల ఈ సభయందేల చెప్పిరి? అనుభవము భరతుని వినయుని గావించినది. కావున రహస్యముగ నిందించ దలచిన పురోహితుని సూత బహిరంగముగ సభయందే నింపించి తన నిశ్చితాభిప్రాయమును వెల్లడించినాడు. ఇంతకన్న స్వార్థత్యాగమేమున్నది?

ఒక్కమాటు దేశమును ముందుకు నడిపింపదలచిన నేటి విద్యావిధానమును మీరే యూహించుకొనుడు. తరువాతి కథ.

భరతుని మాటలకు వశిష్ఠులేమనిరి? ఏమందురు? అతని ధర్మతత్వమువ కానంద పడినారు. అంతతో ఆ సభ ముగిసినది వశిష్ఠాది మంత్రులును ప్రజా నీకమును భరతుని ఆజ్ఞను పాటించినారు. రాముని దర్శింతుమన్న పరమోత్సాహము స్త్రీ పురుషులయందు పెల్లుబీరగా అయోధ్యా పుర వాసులందరును రామదర్శనమునకై బయలుదేరినారు. వశిష్ఠ జాబాలి కాశ్యపాది మహర్షులను ప్రయాణమైరి. కౌసల్యా సుమిత్రలతో కైకేయి పయనము కాకపోలేదు భరతుడిక రాజ్యమును గైకొనడను నిశ్చయము కలుగుటచే కైకయు సంతోషముతోడనే బయలుదేరినది. వేయేల? అయోధ్యంతయు రాముని దగ్గరకు బయలుదేరినది. ఒక్కమాట.

వాల్మీకి మహర్షి వారానాటి మానస సమాజమునందేయే వృత్తులు కథాత్మక ములై యుండెడివో ఈ ఘట్టమున పర్ణించినారు.

రత్నముల సానబట్టువారు, కుమ్మరులు, కమ్మరులు, కసాలులు, కంబళ్ళ నేయువారు, సుగంధ చూర్ణముల తయారు చేయువారు, నెమలి ఈకలతో విసనకర్రల కట్టువారు, తలయాటువారు, బెస్తలు, గొల్లలు, వైద్యులు, కల్లుగీయువారు, చాకలి వారు మొదలగు ఎన్నియో జాతులవారిని వర్ణించినారు. రథగజతురగాది వాహనముల తోనేగాక ఎడ్లబండ్లుకూడ నాడు వాహనములైనవి. ఇంతకు పూర్వమునే మార్గ మంతయు చక్కజేయబడినదగుటచే వారి పయనము సునాయాసముగ సాగినది.

అది గంగాతీరము. అనాటికి భరతుని పయనమక్కడ ఆగినది. గంగానదీ పవిత్ర తోయముల ప్రుంకులిడి దశరధేశ్వరునకు తర్పణ మాచరించుటకే అక్కడ నిలచినది. శృంగిబేరపురమువకు అధిపతి గుహుడు. అతని అధీనమునందున్నవి ఎన్నియో నావలు. నావికాయూపమే శతాబ్దమున కనుగొనిరి? మనవారు? అను అమాయక చరిత్రకారులను తలచకుడు.. సృష్టి అనాది. భారతీయుల ప్రతి విజ్ఞాన సూత్రమును అనాదియే ఆను సిద్ధాంతమును మీ బుద్ధి బృత్తులనుండి తొలగనీయ కుడు వేదములయందు కూడ పడవల వర్ణనమున్నది. కథకు వత్తము.

భరతుని రాక గుహునకు తెలియగనే తన బంధు వర్గముతో గుహుడు స్వాగతమిచ్చుటకు బయలుదేరినాడు. గంగను దాటించు నావలనన్నిటిని సిద్ధము గావించుట కాజ్ఞనిచ్చినాడు. తాను బంధువులతో భరతుని కలియుట కేగినాడు. భరతునకు గుహుడు రాముని ఆప్తుడను విషయమును సుమంత్రుడు తెలుపగా భరతు

డావందించినాడు. వారిద్దరు కలసికొనుట జరిగినది. వారభయులను సుస్వాగతముల నందుకొనగా గుహుడు భరతునకును మ్రొక్కుడయ్యెను. సుమంత్రుడు గుహునకీ యరణ్య భాగమంతయు పరిచయమైనదియని తెలిపినాడు. భరతుని కోరికపై గుహుడు మిమ్ములను నేనును నా వారును బాణముల ధరించి వెంటనంటుదుమని భరతునకు ధైర్యము నొసంగినాడు.

ఆనాటి భరతుని సైన్యమునకంతకును ఆతిథ్యము గుహునిదే. అంతలో ప్రొద్దు గ్రుంకినది. ఈ రాత్రి ఇక్కడనే వసింపుడని గుహుడు భరతుని కోరగా రాముని ఆత్మస్నేహితుడు రాముడేనను భావమున గుహుని సన్మానించినాడు భరతుడు. వారిద్దరును ఆప్తమిత్రులనుకొనుట సందేహములేదు. ఆయ్యను గుహునకు భరతుని గూర్చిన సందేహము అంతర్గతమై యున్నదనుట నిస్సంశయము. రాముని యందు గుహునకు గల భక్తియే అందుకు కారణమనక తప్పదు. గుహుడు బయట పడినాడు.

భరతా! నీవయనము నాకు సందేహమును కల్పించుచున్నదనినాడు. కారణ మేమందువా? రామునితోడితెచ్చుట కింతసైన్యమొనకు? ఇదియే నా సంశయము నకు కారణమనినాడు.

ఈ భావము గుహునకు మొదటనే కలిగినది. నేను రామునకు స్నేహితుడ నగుటచే నన్ను బంధించుటకుగాని, రామునిపై దండెత్తుటకుగాని ఈతడు వయన మయ్యెనని యే భావించినాడు. కావుననే అతడు తన బంధువులనందర జాగ్రత్త పరచి నాబంధువులతో కూడ వచ్చి మీకు దాసి చూపుదుననినాడు. ఈ ఘట్టమున భరతుని సమాధానమేమి? ఈఘట్టమున భరతుని సమాధానమును, ఆతని పాత్రయు వాల్మీకి మహర్షిచే చాల చక్కగ వర్ణింపబడినవి ముందా శ్లోకమును వినుడు. భరతుని వర్ణన ఇది.

తమేవమభిభాషంతమాకాశమివ నిర్మలం
భరతశ్లక్ష్ణయా వాచా గుహ: పరుషమబ్రవీత్.

గుహుడడిగిన ప్రశ్నకు ఆకాశమువలె నిర్మలుడై మధురముగ సమాధాన మిచ్చినట భరతుడు. ఇచ్చట భరతుని ఆకాశమునకు పోల్చినారు కవి ఆకాశము అతిస్వచ్ఛము. దానికి సంగదోషములేదు. అది ఎన్నడును మలిన

సహితముకాదు. చూచువారలకు మాత్రమది మేఘములచే కప్పబడినట్లు కనబడును. అది చూచువారి అజ్ఞానము. ఇక్కడ గుహునికి భరతునిపై కలిగిన అనుమానము నకు కారణము గుహుని అజ్ఞానమని సూచించినారు. ఇక భరతుని సమాధానమును వినుడు.

"మాభూత్సకాలో యత్కష్టం న మాం శంకితుమర్హసి

గుహా! నీవు శంకించదగు శంకకు అవకాశమిచ్చునది ఈ యుగము కాదని నాడు. కలిదోషము నన్నావరింపలేదనినాడు. తన భ్రాతృభక్తిని వెల్లడించి తన నిజ హృదయమును గుహునకు తెలిపినాడు. గుహుడు తన సంతోషమును గూడ వెలిబుచ్చినాడు. కాని అంతతో వారి సంభాషణ ముగియలేదు. తనకు రాముని యందుగల భక్తి ప్రపత్తులను లక్ష్మణునకు రాముని యందలి ప్రేమాతిశయములను వర్ణించుచు గుహుడు కొంత కాలమును గడపినాడు. అంతలో సూర్యుడస్తాద్రి కేగినాడు. రాత్రియపుడెంచినది. సామాన్యమగు భూతజాతమంతయు నిద్రజెందినది.

భరతునకు నిద్రపట్టలేదు. అతని హృదయక్షేత్రమున రాముని కఠిన కాంతార క్లేశములు పరివర్తనలగుచుండ అతడెట్లు నిద్రపోవును?

భరతుని చిత్తమిప్పుడొక అగ్నికుండమైనది. సంకల్పము లాతని వదలుట లేదు. మానసిక తాపమును చల్లార్చునది ఆత్మప్రియమును గూర్చువారి గుణకథనము. ఇప్పుడు భరతుడు దానినే కోరి గుహుని దగ్గర కేగినాడు.

గుహుడు రామభక్తాగ్రేసరుడు. రాముని గుణవర్ణనము నాతడు చేయగలడు. భక్తశేఖరుల ముఖమునుండి వెలువడి వచ్చునవి అమృతసూక్తులు. అవి భగవద్గుణాను వర్ణన లగుటయే ఆసూక్తులకాపేరు వచ్చినది

గుహుడు భరతునకు రామలక్ష్మణుల ప్రయాణ విశేషముల వర్ణించుట ప్రారంభించినాడు. అందు లక్ష్మణుని భక్తి తత్పరత వర్ణితమైనది. రాముని ప్రభావమును రాకపోలేదు.

భరతుని చిత్తమొక ఘన పదార్థముకాదు. ద్రవీభూతమగు చిత్తము. తన ప్రభువుయొక్క సౌకుమార్యమాతని కనులకు కట్టినట్లుండగా ఆసుకుమార గాత్రుని కఠిన కాంతార క్లేశములు అతని చిత్తమునందు నిలచినవి. ఆదృశ్యమాతడు భరింపరానిది అంతతో భరతుడు క్రిందకూలినాడు. అదియొక విధమగు మూర్ఛ.

దానినొక విధముగ సమాధిస్థితి యనుట కథా ప్రపంచమును అడ్డగించు మాటకాదు. రామకథా శ్రవణమొక ధ్యాన యోగమనుట సార్థక నామము. కావున భరతుని వర్ణనము మూర్ఛయు, భక్తి సమాధియు గూడనైనది. మనము కథా భాగమును తలచుచో కౌసల్యకు భరతుని మూర్ఛ దుఃఖకారణమైనది. ఆమె విలపించినది. పుత్రవియోగమునకిది తీసిపోకయే భరతునిమూర్ఛ ఆమెను శోకసముద్రమున ముంచినది. అంతనొక్క ముహూర్తకాలము గడచినది. భరతుడు లేచినాడు. కౌసల్య నోదార్చినాడు.

భరతునకు అన్నగారెక్కడ వసుండిరో ఆహారములనెక్కడ స్వీకరించిరో తెలుసుకొనుమను యూహ పొడమినది. గుహుని అడిగినాడు. గుహుడు నాడు రాముడు తాను సమర్పించిన సరసపదార్థముల గ్రహించుక లక్ష్మణుడిచ్చిన జల పానముచే గావించుటను తెలిపి రాముడు సీతతో కూడ శయనించిన స్థలమును చూపించినాడు. అదికరుకునేల. ఆనేలపైన దర్భశయనము. ఆకరుకు దర్భలపై హంస తూలికా తల్పముల సౌధాగ్ర భాగముల పరుండదగు సుకుమారగాత్రుని శయ్యాతలము. భరతుని హృదయమేమగును? ఎట్లుండును? ఆయన భవనము భరతునిదే. కాని భరతునివంటి వారిది కూడ కావచ్చును. భరతునకు దుఃఖ మాగలేదు. రాముని శయ్యాతలమునకు ప్రక్కనే యున్న జానకీరమణి నిర్దించిన స్థలమును అతడు చూచినాడు. సీతాకాంత ధరించిన పట్టుపుట్టము నందలి దారము లాతని కంటబడగా, పొంగి పొరలి వచ్చు దుఃఖము నారాజపుత్రుడు ప్రింగతేక పోవుట అతని అసామర్థ్యము కాదు. ఆశోక వేగమాతని మెత్తని మనసును కోసి వైచినది. అంతలో సీతాసాధ్వి ధరించిన ఆభరణములందలి సూక్ష్మ ఖండములామె ఆతనికంట బడినవి. అట్లా ఘట్టమంతయు తనకు భరింపరానిదై భరతునకు ఘనవాస దీక్షనొసంగినది. ఆక్షణమునకే భరతుడు నేవిప్పుడు రాజపుత్రుడనుకాను. ఆరణ్యక వ్రతదీక్షితుడననుకొనినాడు. నారచీరలుధరించి జడ దారి యగుట కాతని చిత్తము గట్టిదైనది. అది మానసికి కాత్కాలిక వైరాగ్యముకాదు. ఆక్షణమునసే అతడు నారచీరెలు ధరించినాడు. చేతులెత్తి దేవతలకు మ్రొక్కినాడు. నేను రాముని పట్టాభిషిక్తుని గావించెద. అరణ్యజీవితమును నేను గడపెద. ఓ దేవతలారా! నా సంకల్పమును సఫలము గావింపుడు అన్నది ఆతని దీక్ష.

నైసీషణము మొదలు భూమిపైననే పరుండెడ. లేక దర్భలపైన పరుండెడ. కందమూలములే నాకాహారములు-వనవాసమున రామునకు గడిచిన రోజులుగాక మిగిలినరోజులు నావి కాగా శత్రుఘ్నుడు నన్నమసరింపను.లక్ష్మణుడు రాముపితోరాగా అయోధ్యయందలి బ్రాహ్మణోత్తములా రామునితో రాజ్యాభిషేకము గావింపవలెను. దేవతలారా నాకోర్కెను సఫలముగావింపుడని, రాముడు పరున్న ప్రదేశమున పరుండినాడు. ఆరాత్రి గంగ ఒడ్డుననే గడచినది. మరునటి దినము కథ రేపే. ఈనాటికి మన ఉపన్యాసము సమాప్తము—

ఓం శాంతి శాంతి శ్శాంతి శ్శాంతిః

6వ రోజు

శ్లో॥ యత్పాద పంకజ రజ శ్శ్రుతిభిర్విమృగ్యం
యన్నాభి పంకజ భవః కమలాసనశ్చ.
యన్నామసార రసికో భగవాన్ పురారిః
తం రామచంద్ర మనిశం హృది భావయామి.

ఆర్యమహాశయులారా!

మన భారతీయ వాఙ్మయమొక మహాసముద్రము. ఈ మహాసముద్రమే ఈ విశాల విశ్వంభరావలయమున వ్యాపించి ఖండ ఖండాంతర వాసులకును విజ్ఞాన విశేషములు నందించినది. సృష్టి ఖండమునందలి సమస్త విజ్ఞాన ప్రపంచములును ఈమహోదధిలోని అంశాంశము లేనసుట అత్యుక్తికాదు.

వాగ్దేవియొక్క తొలి యవతారమును గుర్తెరిగించినది మన వాఙ్మయమే అదియే శబ్దబ్రహ్మము సృష్టికి పూర్వము నందున్నదేదో నిర్వచించినది మన వాఙ్మయమే అదియే ఉపనిషద్వాఙ్మయము. ఇది వేదములలోని భాగము. భారతీయ వాఙ్మయము ఆదిమానవునితో ప్రారంభమైనదని భావించుట విజ్ఞాన ప్రపంచమున తప్పటడుగులువేయు శైశవావస్థ.

జన్మ జరామృత్యువుల నెదుర్కొని స్థిరతనొందిన ఆత్మానందము ననుభవించుటకు మానవుడు సమర్థుడని చాటినది భారతీయ వాఙ్మయమే.

శ్రోతలారా! వేదశాస్త్రములు సమాజనిర్మితమునకు బాలకుల వాదములలో ప్రౌఢత్వమున్నదని భ్రాంతి నొందకుడు. అంధకార బంధురమగు మహా సంసార రణ్యమున భయనించు బాటసారికి త్రోవనుచూపునవి. వేదశాస్త్రములలోని విజ్ఞాన కరదీపికయే. ఈ కరదీపిక ఆరిపోవునదికాదు. కృత్రిమ సృష్టిలోనిది కాదు.

తడకు పత్తము

మనము భరతునితో పయనించుచుంటిమి. ఆతడు తనకెదురై వచ్చిన నిష్కంటక సామ్రాజ్యలక్ష్మిని త్యాగము గావించి రాముని పాదారవిందముల సమర్పించుటకై బయలుదేరి విస్మృతిశాంతి గంగానదియొడ్డున ఇంగుదీవృక్షము క్రింద నిలచినాడు నిన్నమనమును అక్కడనే నిలచితిమి. ఈనాడు అక్కడనుండి ఆతడు రాముని వద్దకు బయలుదేరును. మనమును పయనింతము

రాత్రి గడచినది. ఇక భరతుని పయనము సాగవలెను. భానుడును ఉదయాద్రి నెక్కినాడు.

గంగానదియంతి అగాధమగు మహానది. కావున దానిని దాటుటకు గుహుని నావలు బారులుతీరినవి. అవి అయిదువందల నావలు. నావికులు గుహునిబంధువులే.

తన వారితోడను తన బలగముతోడను బ్రాహ్మణ ప్రవరుల తోడను ఆ నావల నధిరోహించినాడు భరతుడు. ఎక్కువారి అర్హతల ననుసరించియే ఆ నావల మర్చబడినవి. క్రిక్కిరిసిన జనమును క్రమబద్ధముచేసి పడవల నెక్కించుటకు రక్షకభటులక్కడ లేకపోలేదు ముందు వశిష్టాది మునులను తరువాత బ్రాహ్మణ ప్రవరులను ఆతరువాత మహారాజ కుటుంబములను ఎక్కినారు. సైన్యమును ఇతర వర్గమునను, ధనధాన్య సంచయమును ఆ పడవల ఆధారముననే దాటవలెను. ఆ నావలన్నియు స్వస్తిక చిహ్నములతో పతాకాలంకృతములైనవి. పడవలకు తెరచాపలెత్తబడినవి. నావికులత్యుత్సాహముతో నడుప నారంభించినారు. నాటికి నావికాయానము లేదనకుడు.

నావలన్నియు సునాయాసముగనే గంగకు అవ్వలి ఒడ్డును చేరుకొన్నవి. అప్పటికి మైత్ర ముహూర్తము వచ్చినది. నదిని దాటుటకు ఆరుఘడియల కాలము

పట్టినది. మైత్ర ముహూర్తమనే ప్రాతఃకాలమునుండి మూడవ ముహూర్తము. గంగకు అవ్వలి ఒడ్డుననే ప్రయాగవనము. భరద్వాదులు ఆవనమునే నివాసముగ చేసుకొనినారు. ఆవవమునకొక క్రోసెడు దూరమున్నది భరద్వాజ ముసీంద్రుల ఆశ్రమము.

భరద్వాజముసీంద్రులు చాల తపఃప్రభావ సంపన్నులు. మూడు వందల సంవత్సరములు బ్రహ్మచర్యదీక్షితులై వేదాధ్యయనము గావించిన వేదివిదులు. ఆ మహర్షి వారిని దర్శించి వారి ఆశీస్సులతో భరతుడు రామదర్శనమును గావించుకొన వలెను. మహారాజులు ధనుర్ధరులై మహర్షుల ఆశ్రమములకు వెళ్ళకూడదు రథ ములు నెక్కియు, అశ్వవాహకులయ్యును వెళ్ళరాదు. సైన్యముల నక్కడ దింప కూడదు. పాదచారులై పవిత్రమూర్తులై వారిని దర్శించవలెను. భరతుడట్లే తన సైన్యమును ప్రయాగవనమునందే యుంచి తాను పాదచారియై వశిష్ఠుల ముందిడు కొని పురోహితునితో ముసీంద్రుల దర్శింపవెళ్ళినాడు. భరతుని కిది యొక పరీక్షా కేంద్రము.

భరద్వాజులు వశిష్ఠుల కెదురేగి తోడితెచ్చి అర్ఘ్యపాద్యాది విధులనర్చించి భరతుసగూడ అతిథి సత్కారములు గావించినారు. కాని ఆ మహాముని అంతతో తృప్తి నొందలేదు. భరతుని ప్రయాణరహస్యమును తెలుసుకొనదలచినారు.

భరద్వాజుడు భరతునిట్లు సూటిగ ప్రశ్నించినారు. ఏమని?

భరతా! నీచేతి కందిన మహారాజ్యము నీకు తృప్తిని కలిగించక సైన్యముతో రాముపైకి యుద్ధమున కేగుదెంచితివా? అని. ఇప్పుడు భరతుని స్థితిఏమి? అతని హృదయము మొక్కమాడుగ అగ్నిమండలమున పడినది. సువర్ణమువలె తాపతప్త మైనది. మెరసిపోవు ఆతని హృదయాంతరాలు బహిర్గతములైనవి. హతోస్మి! హతోస్మి! మునికర్మా! తమవంటి మహనీయులే నన్నిట్లు సంశయింపగా నేనెట్లు బ్రతుకగలను? నేను రాముపైకి యుద్ధమునకు పోవుటలేదు. ఈ ప్రజానీకముతో ఈ సైన్యముతో రామపాదారవిందముల దర్శించి నా అంజలిఘటించి రాముని అయోధ్యకు తీసుకొనివచ్చుట కేగుచుంటిననినాడు.

భరద్వాజునకు భరతుని హృదయము తెలియనిది కాదు. ఆభరతరామ్మణిని సాసబట్టినాడు. రత్నము శాణనిఘృష్టముగాక మెరయునా? కావుననే భరతా! నిన్ను

వేనెరుగని వాడనుకాను. నీభక్తిని మెరుగుపెట్టుటకై ఇట్లంటినని సమాధానమిచ్చినారు. భరతుని మనసును గట్టివరచినారు.

భరతుడు రాముని పద్దకేగుటకు మార్గమును తెలుపుడని మునివి అడుగగా రాముని నివాసము చిత్రకూటమునంచని తెలిపి, ఆమార్గమునుకూడ విశదీకరించి వేటికి నీవయస్సమాపి సైన్యముకోగూడ మా పరిపూర్ణ ఆతిథ్యమును స్వీకరించి వెళ్ళుమనినారు.

భరతుడు ఋషి అందించిన కందమూలములకు తృప్తిని ప్రకటించియు వారి ఆజ్ఞను శిరసావహించి భరద్వాజాశ్రమమునే ఆరాత్రి నిలచినాడు.

భరద్వాజుని ఆతిథ్యము

ఇది ఒక అపూర్వమగు ఆతిథ్యము. భౌతికవిజ్ఞానమును మాత్రమే చూడగలిగి యాంత్రిక జీవితమునకు మాత్రమే విస్మయము నొందుచు, ఇంద్రియములచే గ్రహింపరాని విషయముల నెరుగని కూపస్థమండూకములై యుండువారు నమ్మజాలని ఆతిథ్యము.

గ్రుడ్లగూబ పగటికాలము నెరుగదు. సూర్యుడుండెనని నమ్మదు. అంతియే భౌతిక విజ్ఞానమాత్ర పండిత ప్రకాండుల బుద్ధి వైభవమని గ్రహించి మహర్షివారి తపఃప్రభావ సంపన్నత్వమును గ్రహింపుడు.

శక్తులు రెండు విధములు. బాహ్యశక్తి, అంతరశక్తి అని. అంతరశక్తి ఒక మహాసముద్రము. బాహ్యశక్తి అందలి తరంగములు. సృష్టిఖండమంతయు దీనిని ఆవరించియే యున్నది. శబ్దము స్థూలము, ధ్వనితరంగములు సూక్ష్మములు. మానవీయ తపఃప్రభావ సంపన్నత్వము సూక్ష్మాతిసూక్ష్మము. కథలోనికి పోదము.

భారద్వాజమునీంద్రులు భరతునకివ్వదలచిన ఆతిథ్య ద్రవ్యమును చేకూర్చుటకై వారి వర్ణశాల యందొకభాగమున నిర్మితమైయున్న అగ్నిహోత్ర గృహము లోనికేగినారు. ఆచమనము చేసినారు. కన్నులు నరమోడ్చినారు. అర్ధవిమీలిత నేత్రులై ఆపోపుషేయము అలౌకికమనగు వేదమంత్రములతో దేవలోకములలోని దేవతల నాహ్వానించినారు. ఆదేవతలను పిలుచుటకు వారు వలికినపలుకులు క్రమబద్ధములు. దీనినే వాల్మీకిమునులు శిక్షాస్వర సమాయుక్తములని వర్ణించినారు.

ప్రకృతిలోని సృష్టి విశేషముల కన్నిటికిని యజమానులగు వారు కొంద రుందురు. వారిని నియమించినవాడు భగవంతుడు. మన లోకమున జీవులకు భోగ్య ములగు పదార్థములన్నియు లోకాంతరములలోని ఆయజమానుల స్వాధీనము నందుండును. వారికే అధిష్టాన దేవతలనిపేరు. వారి శరీరములు తేజోమయములు. వారి సంకల్పములు సత్యసంకల్పములు. వారి సంకల్ప మాత్రముననే స్థూలమగు భౌతికసృష్టి ఆకృతినొందును. ఒక్కొక్క కళయందారి తేరిన పుణ్యాత్ములకే ఆయా అధికారము లివ్వబడును. వారందర పిలిచి ఈ యీ కార్యముల మీరు చేయు డని కోరుటకే భరద్వాజుడు అగ్నిహోత్ర గృహములోని కేగినారు.

విశ్వకర్మ దేవశిల్పి. అతనిని గృహనిర్మాణముల కాహ్వానించినారు. అత నితో అత్యంత వైభవోపేతములగు భవనములు నిర్మితములైనవి.

అవి కేవల రాజభవనములే కావు. గజాశ్వబృందములకు ప్రత్యేక ప్రత్యేక శాలలు నిర్మితములైనవి. స్నాన భోజన పానశాలలు నిర్మితములైనవి. భోజన పదార్థముల సృష్టికై ఓషధీ నాయకుడగు చంద్రుని ఆహ్వానించగా అతడు భక్ష్య భోజ్య చోష్య లేహ్యాది పదార్థములనేగాక మాంసవిశేషములతో అనేక వంటకముల సృష్టించినాడు. ప్రాగుట కింపైన పుష్పాసవ మధ్వాసవములు కూడ సృష్టింప బడి నవి. భూలోకవాసులు కెరుకలేని పుష్ప గుచ్ఛములతో ప్రతి ఒక్కరును తమ కంఠసీమల నలంకరించుకొనదగు పూలమాలలు వేనకువేలు కుప్పలు తయారైనవి.

భూమిపై కన్నుట్టదగు సుందరదృశ్యముల సృష్టించుటకు భూదేవిని కోరగా భూకాంత సుందర సుకుమార వనసుందరుల నెందరనో పంపి, మెట్టవల్లములులేని సమతల ప్రదేశముల వారినందర నిలపినది. అది భూదేవి వినూత్నాలంకారములతో అలంకరించుకొని ప్రత్యక్షమైనట్లున్నది. విశ్వకర్మ నిర్మితములైన నాట్యకళా ప్రదర్శన మండపములలో ప్రదర్శనల నిచ్చుటకు గంధర్వాద్యప్సరోగణమును, నారద తుంబురులును ఆహ్వానితులై వచ్చినారు. మలయ పర్వతాదులు శాశ్వతము లై చల్లని పిల్లగాడ్పులతో అందరకును విశ్రాంతి సుఖము నొసంగినవి. ఇన్ని మాటలెందుకు? నాడు భరద్వాజ ముసీంద్రుని ఆశ్రమము స్వర్గధామమైనది.

అందొక రాజసభామంటపము నిర్మితమైనది. రాజాసన సచివాసనములు ఆ సభామంటపమున ముఖ్యస్థానములైనవి. భరతుని ఆ సభామంటప ప్రవేశమున కాహ్వానించి ఆ యాసనముల చూపగా భరతుడు రాజాసనమున కూర్చుండ లేదు. అది రామునిదని సచివాసనమున కూర్చొనినాడు.

బ్రహ్మాది దేవలోకముల నుండి వచ్చిన సుందరాంగనల చేతను నారదాది సంగీత విద్వాంసులచేతను ఆ సభయందు లయతాళ బద్ధములగు నృత్య గీతము లారంభమైనవి.

మూడుచెట్లు మద్దెలల వాయించినవి. రావిచెట్లు నృత్యముల చేసినవి. లతా వికుంజములు స్త్రీ రూపముల ధరించి, ప్రజలను స్నానభోజనాదికముల కాహ్వానించి నారు. తలంట్లు పోయుటకు ఒక్కొక్క మగవానికి ఎనమండుగురు స్త్రీలు మెరుపు తీగెలవలె మెరయుచు నలుగు పెట్టి జలకముల నాడించినారు.

తెల్లవారినది. ముని ఏర్పరచిన విందు పూర్తియైనది. ప్రాతఃకాలమున భరతుడు భరద్వాజుని దర్శించుట జరిగినది. కౌసల్యా సుమిత్ర కైకేయీలతో. మునివర్యులు వీ తల్లుల ముగ్గుర తెలుపు మనగా భరతుడు తనతల్లిని కౌసల్యా సుమిత్రలతో కలపలేదు. రామలక్ష్మణులను కన్న భాగ్యవంతురాండ్రవివారిద్దర పరిచయము గావించినాడు.

ఎవ్వతె గావించిన పాపముచే రామలక్ష్మణులు ప్రతికియు చచ్చినవారివలె అరణ్యములపాలై యుండిరో, ఏ పాపాత్మురాలి పాపముచే దశరథుడు మృతి నొందెనో ఆ కనబడు చండియే ఈ మురదృష్టవంతుని కన్నతల్లి యవి కైకను ప్రత్యేకించి తన బాధను వెళ్ళగక్కినాడు. మునీంద్రులు కైకను భరతుడు నిందించుటకు సమ్మతించలేదు. అరణ్యములలోని దేవదానవాది శాపగ్రస్తుల శాప విమోచనమగుటకు రాముని దండకారణ్యములకువంపిన పుణ్యాత్మురాలీ కైకయేనని భరతునకు సమాధాన మిచ్చినారు. మునీంద్రులీ సమాధానమును భరతున కందించు టకే సీతల్లులను పరిచయము చేయుమని కోరినారు. "నదోషేణావగంతవ్యా కైకేయి భరతత్వయా". ఇంతతో భరతుని భరద్వాజాశ్రమ కార్యక్రమము ముగిసినది. భరద్వాజ మునీంద్రుల అనుజ్ఞతో వారు తెలిపిన బాటను ననుసరించి భరతుని చిత్ర కూటాద్రి పయనము సాగినది, ఆతని మహా సైన్యముతోకూడ.

అది ప్రాతఃకాలము. చిత్రకూటమున సీతారాముల విహార యాత్రానందము ముగియగా సీతారాము లొక్కచో కూర్చొని పక్వమాంసముల భుజించుచున్న సమయము. వారు మాంసముల పక్వము గావించుటకై ఏర్పరచుకొన్న అగ్ని మండలము నుండి ఆకసమున కెగయు ధూమము చిత్రకూటాద్రి యంచున్న రాముని దర్శించుటకై వచ్చు భరతుని సైన్యమునకు మార్గదర్శకమైనది.

చిత్రకూట పర్వతప్రాంతము సైన్యాక్రాంత మైనది. పర్వత సానువుల యందు తిరుగాడు పశుపక్ష్యాది గణము చిందరవందర యైనవి. ఆకసమున ధూళి కమ్మినది. రాముడు ఈ సంచలనమునకు కారణ మరయగోరి లక్ష్మణుని ఆజ్ఞా పించినాడు.

లక్ష్మణుడు చెట్ల నెక్కుటయందు నేర్పరి. అతడొక సాలవృక్షము నెక్కి నాడు. రథ గజ తురగ పదాతులు వెల్లువయైవచ్చుట ఆతని దృక్పథమున పడినది అది భరతుని సైన్యమని ఆతడు నిశ్చయించుకొనినాడు.

లక్ష్మణుని రక్తము పొంగిపొరలినది. క్రోధము మూర్తీభవించినది. ఆతని అంతరంగమున రణరంగము ప్రత్యక్షమైనది. రాముని కవచధారణము గావింపుమని, సీతను గుహాభ్యంతరమున దాచి, పై కెగయు పొగను రాకుండ చేయుటకు నిప్పును చల్లార్పుమని హెచ్చరించినాడు. అతడు చెట్టు నుండి దిగలేదు.

లక్ష్మణుని క్రోధదీప్తి రామునకు క్రొత్తకాదు. కారణ మడిగినాడు. లక్ష్మ ణుడు కన్నుల నెర్రజేసికొని భరతుని రాకను తెలిపి, ఆ వచ్చు భరతుని, భరతుని సైన్యమును కూడ నే నొక్కడనే వధించి చిత్రకూటమును రక్తసిక్తము గావింతు నని సమాధాన మిచ్చినాడు. భరతుని వధించుట దేనికట? ఇక్ష్వాకు సామ్రాజ్య లక్ష్మిని రామపాదారవిందమున కర్పించుటకేనట. ఇప్పుడు రాముని కర్తవ్యమేమి? భగ్నుమని మండిన లక్ష్మణుని భ్రాంతిని తొలిగించవలెను.

జీవుడు రజోగుణ ప్రధానుడైనప్పుడు భగవంతు నెట్లు పరిపూర్ణముగ కను గొనజాలడో అట్లే భగవద్భక్తులను కూడ కనుగొనజాలడు. భ్రాంతిసహిత చైత న్యము జీవచైతన్యము. భ్రాంతిరహిత చైతన్యము బ్రహ్మచైతన్యము. రాముడు ఆత్మారాముడు. భగవంతుడు. అతడు తన భక్తకుటుంబములోని వారి పరస్పర భ్రాంతులను తొలగించి అందర కృతార్థుల గావించును. లక్ష్మణుని భ్రాంతిని చక్కగ తొలగించినాడు.

లక్ష్మణా! నేను తండ్రిని చంపి, సోదరుల చంపి, ఆ రక్తాన్నమును తిని ఆనందించువాడను కాను. నాకు రాజ్యకాంక్ష లేదు. భరతుడు సోదరఘాతకుడు కాడు. అతడు నీవనుకొన్నట్లు మనల చంప వచ్చుటలేదు. ఆతడు గృహమునకు వచ్చుటతోడనే నా అరణ్యవాసము చెనిని బడగా క్రైకమాటను కాదని నన్ను

పట్టాభిషిక్తుని చేయుటకే ఆత డేతెంచుచుండెను. లక్ష్మణా! నాకీ సంపదలే కావలసి వచ్చుచో ఈ అఖండ మహీమండలము నంతను నే నొక్కడనే సంపాదింప సమర్థుడను. నీకు రాజ్యము కావలెనన్న భరతుడు వచ్చుట తడవుగా ఆతనికిచెప్పి నీకు ఇప్పించెదను. నీవును, భరత శత్రుఘ్నులును లేని రాజ్యము నాకెందుకు? అని చెట్టుపైనున్న లక్ష్మణునకు సమాధాన మిచ్చినాడు.

లక్ష్మణుడు సిగ్గు పడినాడు. మనల గొనిపోవ తండ్రి వచ్చుచుండెనేమోనని సమాధానమివ్వగా రాముడు కావచ్చునని లక్ష్మణునితో ఏకీభవించి చెట్టునుండి ఆతనిని తన మాటలతో దింపినాడు రాముని సత్యప్రబోధము లక్ష్మణునిభ్రాంతిని తొలగించినది. చెట్టు దిగినాడు.

భగవంతుని అనుగ్రహమిట్లేయుండును. నీతిని బోధించును. నిష్ఠురము లాడును. ధర్మము నెరిగించును. ఆదరించి అనుగ్రహించును. అవియే శాస్త్రములు వేదములును.

లక్ష్మణునకు భరతుని భక్తిని తెలిపినాడు. సోదరప్రేమను కలిగించినాడు. నిష్ఠురముగ మాట్లాడి సిగ్గునొందిన వానిని దగ్గరకుతీసి ఆదరించినాడు.

మనమొక్కమారు భరతుని వయనము వైపుకు తిరుగుదము.

భరతుని సైన్యము ఈ చిత్రకూటమునకు కొంతదూరమున నిలిచినది. భరద్వాజాశ్రమము నుండి అంతవరకు వారు వాహనములమీదనే వయసించుట జరిగినది. ఇక్కడనుండి పాదచారులయ్యే వారు రామాశ్రమమును కనుగొనదలచినారు. భరతుని హృదయమది. వశిష్ఠులందుకు సమ్మతించగా భరతుడందుకు సిద్ధపయించుకొనినాడు. వెంటనే శత్రుఘ్నుని పిలిచినాడు. శత్రుఘ్నా! నీవును ఈ సమస్త జనులును బోయలును కలిసి ఒకప్రక్క వెతుకుడని ఆతని ఆజ్ఞాపించినాడు. తనతో ఆతని బంధువర్గముతో కూడిన గుహుడును మంత్రిముఖ్యులును వశిష్ఠ మునీంద్రులును పురజనులును వత్తురని తెలిపినాడు.

మన మిక్కడనుండి భరతుని ఒక రాజకుమారునిగ చూచుటకాదు. ఆతడు రామునితమ్ముడుకాడు. దశరథుని పుత్రుడు కాడు. ఆతనిని అవయవములతో అందమొందిన భక్తిసమష్టి మూర్తీభవించినదను కొనవలెను. ఆ మూర్తి స్థైర్యమును చూడవలెను.

రామాశ్రమమును వెతకుటకై వారందరకట్లా జ్ఞాపించిన క్షణముననే ఆతని హృదయాకాశమున రామబ్రహ్మము సగుణమూర్తియై సాక్షాత్కరించినాడు. రాము డొక్కడే కాదు. సీతాకాంతయు ఎదురనిలచినది. వారిద్దరేకాదు. వారిద్దర సేవించు భాగ్యవంతుడగు లక్ష్మణుడును సాక్షాత్కరించినాడు. అప్పుడే భరింపరానివేదనయు అతనికి పొడసూపినది. అప్పుడాతడు శత్రుఘ్నునివైపు తిరిగి చెప్పినమాటలివి.

శత్రుఘ్నా! రామునివెతుకబోదము. నా మనస్సు చాలా అలజడి నొందు చున్నది ఆ సీతారామలక్ష్మణుల దర్శింపునంతవరకును నా అలజాడి చల్లారదు. వేయేల? ఆ పద్మనేత్రుడగు రామచంద్రుని దర్శించవలెను. రాజలక్షణ లక్షితము లగు ఆతని పాదముల నాశిరమును మోపవలెను. నా ఆత్మశాంతించవలెను. అంతే కాదు. ఆతడీ ఇక్ష్వాకు రాజ్యపీఠమున పట్టాభిషిక్తుడు కావలెను. అదియే నా శాంతికి పూర్ణరూపము. పోదము. రామాశ్రమమును వెదకుదము.

అవి చిత్రకూటమునందలి తాపసాశ్రమములు. రాముని పర్ణకుటీర మా శ్ర మముల మధ్యభాగమునన్.

శత్రుఘ్నుడును సుమంత్రుడును ఒకవంక బయలుదేరగా భరతుడు వశిష్ఠ ముసీంద్రులతో వేరొకవంక వెదకనారంభించినాడు.

భరతుని భాగ్యరేఖ ఉదయించినది. భరతుడే పొగయొక్కకొనను ఆధార ముగా గొని రామాశ్రమమును వెతకబండెనో పైకిపోవు ఆపొగకు అడుగుభాగ మాతని కంటబడినది. భరతునకు సముద్రమును వాటి అవ్వలఒడ్డుకు చేరినట్లని పించినది. ఆభాగ్యరేఖను బలపరచినది అక్కడి ఆశ్రమవాసులదర్శనము. ఆ తాపసులు రామాశ్రమమిక్కడనేనని తెలిపినారు. ఆప్పుడే ఆతనికి శత్రుఘ్న సుమంత్రులును వశిష్ఠులును కలసినారు. వశిష్ఠుని తనతల్లులవెంట నిడుకొనిరండని వంపి, తాను శత్రుఘ్నునితో రామదర్శన కాంక్షియై వరుగు వరుగున నడువ నారం భించి నాడు.

తాపసుల పర్ణకుటీరములు కాసులుతీరి యుండవు. త్రోవలును అంతియే. కావుననే వారాయణ్యసీమల నడువదగు మార్గములకు కొన్నిగురుతుల నేర్పరచు కొందురు. భరతున కాయాశ్రమాభ్యంతరముల గురుతులు కన్పట్టినవి. ఎత్తైన చెట్ల కొమ్మలపై నారచీరల పీలికలును ధర్భలును కట్టబడియుండుట నాతడు గమ

నించినాడు. శత్రుఘ్నా! ఇదియే మనము రామాశ్రమమునకు పోవుత్రోవ లక్ష్మ ణుడీ గురుతుల కట్టియుండవచ్చునని ఆతనికి చూపుచు భరతుడు సరాసరి త్రోవను నడచినాడు. అంతలో ఆతనికి అందమై ప్రవహించు మందాకిని కనబడినది. భర తుని మనసు కదలజారినది. కన్నులు చెమ్మగిల్లినవి. చెమ్మగిల్లుటకాదు అంతలో కన్నులనుండి ధారలు ప్రవహించినవి.

వైదేహీ సహితుడై రాజ్యపీఠమున వీరాసనమలంకరింపదగిన రాముడు ఈ కాఁడవులపాలుచుయా? ఆహా! నాజీవితమిందుకుదయించినదా! అని తలచివెక్కి-వెక్కి ఏడ్చినాడు. తన ఆవేదనను శత్రుఘ్ననకు చెప్పుకొనినాడు. అప్పటి ఆకనిఅడుగులు ముందుకు సాగినవి. ధనుర్బాణశరాసనాలంకృతమైయున్న రాముని పర్ణకుటీరము కానుపించినది. అందేయున్నది ఈరాన్యభాగమునందగ్నివేదిక. అది రాముడు నిత్యమును ఆరాధించుకొను వైదికాగ్నియే. మరి రాముడెక్కడ? భరతుని మనసు పరుగులెత్తినది. చూపులును ఆతని మనస్సునను సరించినవి అంతలో రాముని విగ్రహము సాక్షాత్కరించినది అది అయోధ్యలోని రామ విగ్రహముకాదు. శాశ్వత బ్రహ్మవలె వెలుగొందు తాపస విగ్రహము. ఆతని శిరము జటామండల మండితము కాగా ఆతని నేత్రములు వికసితపుండరీకములైయున్నవి. ఆతడు ధరించినవి నారచీరలెలుగాగా ఆతనిపైనున్న ఉత్తరీయము జింకచర్మము. ఆతడధిష్ఠించి నది దర్భాసనము. ఆతని ముఖమండలమున ధైర్యోత్సాహములు ప్రదర్శించబడగా ఆతని విశాల వక్షమును ఆజానుబాహువులును సింహమధ్యమును రాజలక్షణ లక్షిత మలైయుండ ఆధర్మమూర్తి ఈ విశాల విశ్వంభరావలయ సామ్రాజ్యలక్ష్మికి ఆటపట్టైవది. మేనికాంతి అగ్నితేజమువలె వెలుగొందగా ఈతడు నా అన్నయేనా? అని పరికించినాడు భరతుడు. ఆ మూర్తికి ఇరు ప్రక్కలనున్న సీతాలక్ష్మణులు భరతునకు గోచరించినారు. ఈతడు రాముడేనని నిశ్చయించుకొనినాడు

భరతునకు దుఃఖమాగలేదు. సకలరాజగణ సేవ్యుడై యలరారవలసిన రాఘ వుడు నేడు వన్యమృగసేవితుడైయుండ, దుకూలములు దాల్చి నూత్నకాంతుల వెలుగదగు సుకుమారమూర్తి వల్కలములు దాల్చి అరణ్యసీమనుండ, వివిధ కుసుమ సుగంధ శోభితుడై విరాజిల్లెడు శోభనాంగుడు జడలను దాల్చి చరించుచుండ, చంద నాదుల పలదగిన దేహమున భస్మములది తాపసునివలె కన్నట్టి ప్రియసహోదరుడును భక్తశిఖామణియునగు భరతుని దుఃఖమునకు మేరయెక్కడ? దుఃఖభాగుడయ్యె ఎట్టకేలకు ధర్మాత్ముడగు భరతుడు పరుగుపరుగున వచ్చి, శ్రీరామచంద్రుని పాద సీమకు చేరినాడు. తందృష్ట్వా భరతశ్రీమాన్ దుఃఖశోక పరిప్లుతః.

భరతుని నోట మాటవచ్చుటలేదు. అన్నా! అనిపిలచినాడు గద్గదకంఠము పడే. అంతలో మళ్ల నేలకూలినాడు. అప్పుడే శత్రుఘ్నుడును రాముని పాదసమీపమును చేరగా భరతశత్రుఘ్నుల నిద్దరబట్టిఎత్తి కన్నీళ్ళుతుడిచి రాముడు చారిద్దరకౌగలించుకొని తాపమార్చినాడు. అంతలోనసే వచ్చినారు సుమంత్రుడును గుహుడునుగూడ. దీనితరువాత ఘట్టము (అనగా భరతశత్రుఘ్నుల లేవనెత్తి ఆచరించిన తరువాత) రాముడు భరతుని కుశలప్రశ్నల వేడుగుట.

ప్రశ్నలివ్వి.

రాము=భరతా! నీవిట్లు వచ్చితివిగదా? తండ్రి ఏమయ్యెను? తండ్రి జీవించియుండ ఆయనను దుఃఖపెట్టి ఇటకరుదెంచితివా? పితృమూర్తిని గౌరవించుచుంటివా? జ్ఞానసంపన్నులగు వశిష్ఠులు పూజనీయులైయుండెనా? కౌసల్యాసుమిత్ర కైకేయీలు పూజ్యురాండ్రై అనందించుచుండిరా? నీతిశాస్త్ర విశారదుడును ధనుర్వేదమున కుపాధ్యాయుడును అగు సుధన్వుని గౌరవించుచుంటివా? నీపురోహితుడు ధనాశచే నీచ కార్యములాచరించుట లేదుకదా? తగియెడుశేళల నిడించుచుంటివా? అర్ధరాత్రి సమయమునసే ఆర్థికమును గూర్చిన ఆలోచన సేయవలెను. రాజకార్యములను ఒక్కరితోగాని చాలమందితోగాని చేయకూడదు. వేయిమంది మూర్ఖులకంటె ఒక్కపండితుడు ఆలోచనలయందు ముఖ్యుడైయుండవలెను. అట్లుండెనా? ఉత్తమకార్యములందు ఉత్తములనే నీచుల నియమించుటయు, అధమకార్యములందు అధములనే నియోగించుటయు వినాశకారణము. ఉత్తమ మధ్యమ, అధమకార్యముల ఉత్తమ మధ్యమ అధములనియోగించుచుంటివా? ఉగ్రదండమును విధించురాజును ప్రజలు నిందింతురు. నీవు నిందార్హుడవుకావుగదా? వేగులవాండ్ర వలన సకలవిషయముల నెరుగుచుంటివా? లోకాయతులగు బ్రాహ్మణుల పూజించుటలేదుగదా? (లోకాయతిక బ్రాహ్మణులన నాస్తికులు. వేదప్రమాణములేనివారు) వర్ణాశ్రమ ధర్మములు రక్షించబడుచున్నవా? అయోధ్యయను పేరు సార్థకనామమైయుండెనా?(అయోధ్యయన ఇతరులచే జయింపబడనిదని అర్థము) నియతకాలముల సేవకులకు జీతభత్తెములనిచ్చుచుంటివా? దేవద్విజగురువుల పూజించు చుంటివా? అక్కరలేని కాలమున కోపించుట, ఏమరుపాటు, సోమరితనము మదద్రవ్యముల సేవించుట, ఇంద్రియములకు వశుడవగుట, కీడు చేయదలచిన వారితో ఆలోచనసల్పుట, మంగళకార్యముల చేయకుండుట, మంత్రి సహాయములేక తానొక్కడే కార్యనిర్ణయముచేయుట, అనుదోషములకు నీవు గురి

యగుట లేదుకదా? దేశకళ్యాణ సూచకములగు వ్యవసాయ వ్యాపారములను చక్కగా పాలించు చుంటివా? ధర్మార్థకామములను ఉచితకాలములు సేవించుచుంటివా? ధర్మమును ప్రాతఃకాలమునను, మధ్యాహ్నకాలమున ధనచింతయు, సాయంత్రమున కామమును, అనుభవించవలెను. ప్రాతఃకాల మధ్యాహ్నకాలములు నొకప్పుడు ధర్మార్థములను మార్చుకొన్నను కామమును మాత్రము వ్యత్యాసము చేయరాదు. అయోధ్యా పురమున స్త్రీ పురుషులెల్లరును రోగాదులు లేక సంతోషాయత్తచిత్తులై యుండిరా? ప్రజాపరిషత్తులు నిర్విఘ్నముగా జరుగుచుండెనా? నదీమాతృకయగు అయోధ్యా నగరము సస్యశ్యామలయై సింహశార్దూలాది క్రూరమృగములచే బాధనొందక యున్నదా? (వదీమాతృకయన మాగాణిపంటలు గల దేశము, దేవ మాతృకయన వర్షము మీద ఆధారపడిన దేశము).

వితస్యమును సభాంతరమున ప్రజలకు దర్శన మిచ్చుచుంటివా? శత్రురాజుల రాజ్యముల యందారాజులపై పదునెనమండ్రు తీర్థులను వినియోగించితివా? తీర్థులనగా మంత్రి (Minister) పురోహితుడు (Private Secretary) యువరాజు (Prince) సేనాపతి (Commander in chief) ద్వారపాలకుడు (Gate-keeper) అంతర్వంశికుడు (Palace controller) కారాగారాధిపతి (Superintendent of jails) అర్థసంచయకరుడు (ధనమును రాబట్టువాడు) (Revenue officer) కార్యనియోజకుడు (రాజకార్యములను వెల్లడించువాడు) ప్రాడ్వివాకుడు (న్యాయ విచారణకర్త) (judge) సేనానాయకుడు (సేవయందలి భటులకు జీతభత్తెముల విచారించువాడు నగరాధ్యక్షకుడు (రాత్రికాలమున పట్టణమును రక్షించు శాఖకు అధికారి) కర్మాంతికుడు (ఉద్యోగులకు జీతములనిచ్చువాడు. (A/c general) సభ్యుడు (సభను నిరుపద్రవముగ నడుపువాడు) ధర్మాధ్యక్షుడు (ఆస్తిపాస్తులందు వచ్చు తగాదాల తీర్చు న్యాయశాఖాధికారి) దండపాలుడు (జారచోరాదులను దండించువాడు) (Migistrate) దుర్గపాలుడు కోటనుకాపాడువారికి పై అధికారి రాష్ట్రాంతపాలుడు (సరిహద్దులను కాపాడువాడు.)

ఈ పదునెనమండ్రు తీర్థులలో మువ్వురైన మంత్రి పురోహితయువ రాజులను పిడచి తక్కినసేనాపతి మొదలగువారివిషయమున గూఢచారులనుప్రయోగింతువామంత్రి,పురోహితములరాజులపై గూఢచారులక్కరలేదు.మిగిలినవదునైదు మంది పైవను గూఢచారులుండవలెను. కాని ఆగూఢచారులొకరినొకరు ఎరిగియుండ కూడదు. అట్లుంచితివా? రాజులకు కన్నులు గూఢచారులు. రాజానశ్చారచక్షుషాః

రాబడిఎట్లున్నది?ఖర్చు ఆదాయమును మించియుండెనా? దేశకాలములగు తైరుగకయే శత్రురాజ్యములపై ఒక్కమారుగా దండెత్తుచుంటివా? నీ రాజ్యమునందున్న బుద్ధిమంతులపై నీసేనకుడు నేరాకోవణ గావింపగా నీవు వారి చరిత్రల పరిశీలింపకయే శిక్షించు చుంటివా? భరతా! నీరాజ్యమెట్లు నడచు చున్నది? ధర్మాత్ముడగు రాజునకు స్వర్గము కరతలామలకము. ఆనిరాముడు భరతునిపై ప్రశ్నల వర్షమును కురిపించినాడు. నిజమునకీ వర్షము నాడు భరతునిపైనే కురిపిన వర్షముకాదు. ఈ ధర్మమేఘము ప్రపంచ కళ్యాణమునకై కురియు వర్షము. ఈ వర్షము కురియనినాడు ప్రపంచమున దుర్భిక్షము తాండవమాడును.

దీనికి రామాయణమున కచ్చితస్వర్గయని పేరు. నేనిప్పుడు చెప్పినది ఆ వర్షఋతువునందలి వర్షబిందువులను మాత్రమే. సంపూర్ణముగ ఈ సర్గను వివరించుచో ఇదియొక గ్రంధమగును. రామాయణములోని ఈ రాజ్యాంగ విధానమును అర్ధము చేసికొని నేటి మన ప్రజాస్వామ్యమును పరిశీలించుకొనుట దొడ్డబుద్ధి. ముందు కథకు పోదము. భరతుని సమాధానము.

అన్నా! నాకు రాజధర్మమా? ధర్మయుతమగు రాజ్యములేని నాకు రాజధర్మము స్వర్గము నిచ్చునా? రఘువంశమున సమర్థుడగు జ్యేష్ఠుండ కవిష్ఠుడు రాజెప్పుడయ్యెను? ధర్మము నాపట్ల విపరీతమైనది. నేడు నీవు అయోధ్య కేతెంచి పట్టాభిషిక్తుడవగుచో నీవు చెప్పినది నిజమగునని కంట తడిబెట్టి, తండ్రిగారు లోకాంతరగతులయ్యెనని తెలిపినాడు. తండ్రి లోకాంతర గమనమొక చిత్రముగ నడచినదవి నాడు. తండ్రి ప్రాణములు వదలునప్పుడు చివ్వరి శ్వాసయు నిన్నే స్మరించుచు, నీ మూర్తిపైననే చూపులు నిలువగా ఆయన బుద్ధి వృత్తియు ఇటునటు జనలేక నీవు దగ్గరలేని లోపమును తలచితలచి కుంగిపోవుచు పితృపాదుల భౌతిక కాయమును వదలినది. ఆర్యా! తండ్రికి దహన సంస్కారములు మాచే నడుపబడియు అవి పితృమూర్తికి తృప్తి హేతువుకాదు. ప్రియుడివ్వని పిండదానముల పితరులు గ్రహింపరని పెద్దల వాక్యము కావున నీవు తండ్రికి ఉదకదానాదికముల జరిపి ఋణవిముక్తుడవు కమ్మనినాడు.

ప్రియేణఖలుదత్తం హి పితృలోకేషురాఘవ
అక్షయ్యంభవతీత్యాహుః భవాంశ్చైవ పితృప్రియః.

భరతుడిచ్చిన సమాధానమిది.

మనమొక్కమారు రామునివైపునకు తిరుగుదము.

పితృపాదుల మరణవార్త రామునకు గొడ్డలి పెట్టయినది. ఆతడు మూర్ఛిల్లి నాడు. మరల ఆతడు మూర్ఛనుండి లేవవలెనన్న శైత్యోపచారములవసరములైనవి. సీతా లక్ష్మణులు గావించిన శైత్యోపచారములచే రాముడు తెలివినొందినాడు తన దురదృష్టమునకాతడు చింతించి, చింతించి, పెద్దపెట్టువ ఏడ్చినాడు. తనను కన్న తండ్రి అంత్యక్రియలను నెరవేర్చ నోచుకొనని పుత్రుడనైతినన్నదే ఆతని బాధకు కారణము. రాముని మనసునుండి ఇక అయోధ్య తొలగినది. తన వ్రతదీక్షసమాప్తియైన తరువాతకూడ తానిక అయోధ్యకు వెళ్లుటలేదని తలచినాడు. రాజకార్యములనిట్లు చేయుమని తన్ను శాసించు తండ్రి మరణించగా ఆ మహాకార్యమున తన్ను శాసించి నడుపువాడెవ్వడు? కావున నేనిక రాజ్యమును గైకొనను అను నిశ్చయమును బహిర్గతము గావించి శోకించినాడు. అదియే భరతుడు తన్ను అయోధ్యకు వచ్చి వట్టము గట్టుకొమ్మన్న కోర్కెకు సమాధానమైనది. అది భరతుడు భరింపలేని మాట. భరతునకా రాముని నమాధానము గోరుచుట్టుపై రోకలిపోటు కాగా ఆతడును బాధనొందెను. అంతలో రాముని చూపులు సీతపై బడినవి. సీతా! నీవు మామగారు లేనిదానివైతివని దురపిల్లినాడు. అటునుండి, లక్ష్మణునివైపుకు తిరిగి హా! లక్ష్మణా! నీవు తండ్రిలేనివాడవైతివని తలచి తలచి ఏడ్వగా సీతా లక్ష్మణులను ఆపుకొనలేని దుఃఖముతో రామునితో కలసినారు. కొద్దికాలము గడచినది. వారి దుఃఖము కొంచెము వెనుకకు తొలగినగాని ముందు చేయదగు కర్తవ్యములు నెరవేరవు. రాము డిప్పుడు తండ్రికి పిండదానము గావించవలెను. తర్పణ చేయవలెను. అక్కడ రామునకు రాజాన్నములు లేవు. తాననుభవించునదే పితృదేవతల కర్పించుట. కావున రామచంద్రులు లక్ష్మణునిచే గారపిండిని తెప్పించి, మందాకినియందు స్నానమాచరించి ఉదకాంజలుల నర్పించి, ఆ గారపిండికోడనే పిండ దానము గావించినాడు. అంతతో మందాకినీ నదీతీరమునందలి కృత్యము నెరవేరినవి. తాత్కాలికమగు కర్మ కాండ ముగిసినది. పితృవియోగ దుఃఖము ప్రవాహమై మరల పొంగినది. భరత లక్ష్మణులున్న తన ఆశ్రమమున కేతెంచినాడు. తన బాహుద్వంద్వ మధ్యమున వారినిరికొంచుకొని ఏడ్వనారంభించినాడు. రాముడును వారును కలసి ఏడ్చు ధ్వని తరంగములు పర్వతమునంతను వ్యాపించగా భరతుడు రాముడికసుగొనెనని దూరము నందు సేనకు అర్థమైనవి. అంతలో వారి వాహనములనక్కడనే యుంచి సేనయు, ప్రజానీకము గూడ చిత్రకూటాశ్రమమును చేరుకొనగా, వశిష్ఠమునీంద్రులతో కాలి నడకను వచ్చుచున్న కౌసల్యా సుమిత్ర కైకేయీలు కొంచెము వెనుక చిక్కి వచ్చినారు.

అందరకును రాముని దర్శనమబ్బినది. రాముడును తల్లులను గురువులను కూడ దర్శించినాడు. సీతారామలక్ష్మణులు ముగ్గురను భూజ్యులకు వందనములు నర్పింపగా వారును ఆ మువ్వుర కాశీస్సుల నందించినారు. మిగిలినవారి ఆదరాభిమానములను కూడ రాముడు చూరగొనకపోలేదు. అంతతో ఆ ఘట్టము ముగిసినది. తరువాతది భరతుడు రామునకందించిన విన్నపమును అతని విన్నపమునకు రాముడిచ్చిన సమాధానమును. ఇదియొక విలక్షణమగు ఘట్టము. సునందవన్నమగు పైతృక రాజ్యలక్ష్మి తన్ను వరించగా భరతుడు కాదనును. భరతుడే తన పాదములపైబడి ఈ సామ్రాజ్యము నీది అని వప్పచెప్పగా రాముడు కాదనును. వారి సౌదర్యము లోకవిలక్షణమై ధర్మబద్ధమై నాటికిని నేటికిని లోకాదర్శమై నడచును. ఈ ఘట్టమును మీరెట్లు వినవలెనో మీరే యూహించుకొనుడు.

నాటి రాముని వర్ణశాలాభ్యంతరమిట్లున్నది.

వశిష్ఠ జాబాలాది మునులందరొకవంక కూర్చొనినారు. సుమంత్రాది మంత్రిసత్తములందరొకవంక యుండిరి. ప్రజానీకమంతయు అక్కడనే యుండి రాముని ముఖచంద్రమండల దర్శనమున కాహ్లాదము నొందుచుండిరి అక్కడనే యుండిరి కౌసల్యా సుమిత్ర కైకేయీలు కూడ. అప్పుడట్లు ప్రకృతి మండలము చూపులు రామునిపై నిలుపగా రాముని చూపులు భరతునివైపుకు తిరిగినవి. భరతుని హృదయము రాముడెరుగనిదికాదు. ఆతడెందుకు జడదారియై నారచీరెల ధరించి వనవాసి పలెనుండెనో రాముడూహించనిది కాదు. రాముడు దీక్షాదక్షి. రాముడింగితజ్ఞుడు. కాని భరతుని హృదయము బహిర్గతముకాక ఆతడెట్లు నిర్ణయించును? అంతే కాదు. లక్ష్మణుని అనుమానమును కూడ రాముడు తీర్చదలచెనేమో? భరతుని ముఖముననే అతని రాకను చెప్పి చకలచినాడు రామచంద్రుడు. ఇట్లు ప్రశ్నించినాడు లక్ష్మణుని ఎదుటనే.

భరతా! నీవు వేయు రాజ్యమును వదలి జడదారివై ఇక్కడికేల వచ్చితివి? అని.

రాముని ప్రశ్నకు భరతుడు వెంటనే సమాధానమివ్వ సమర్థుడు కాలేదు. కొంచెము తల వంచినాడు సిగ్గునొందినాడు. రాముడు మరల తమ్ముని కౌగిలించుకొని బుజ్జగించి అడిగినాడు. భరతుడు సరాసరి సమాధానమివ్వలేదు. ఆతడు దోసిలియొగ్గి విన్నముడై దాసుడయ్యి తన బాధను విన్నవించుకొనుచు సమాధానమిచ్చినాడు.

భరతుని విన్నపములోని సారమిది.

భరతుని దృక్పథమున దశరథుడు దోషి. కైకయు దోషియే. వారిద్దరి దోషములను తన కనుబంధమై తాను దేశాంతరమునందున్న సమయమున తన్నంటినవి. ఇప్పుడా బురదను తాను కడుగుకొని శుద్ధుడు కావలెను. ఇది భరతునకు పరేచ్ఛా ప్రారబ్ధమైనది. పాపమాతడు కోరుకొన్నది కాదు. ఇప్పుడు తానాచరించిన పాపము కాదు. ఒకరివలన సంక్రమించిన దోషము. దానిని భగవదనుగ్రహమను విశుద్ధ జలములచే కడుగుకొనదలచినాడు. జీవుడు శరణాగతినిచ్చే చేయవలెను. కొందరు పాపోహం, పాపకర్మాహం, ఆనట తగదని, పుణ్యోహం, పుణ్య కర్మాహం అని చెప్పుకొనవలెనందురు. అది చెప్పువారి అజ్ఞానము, లేక అహంకారము, జీవుడు శరణాగతినిచ్చే చెప్పుకొనవలెను పాపములతి సూక్ష్మములు. జీవుని స్థూలదృష్టి తాను చేసిన పాపములను కనుగొనజాలదు. కావున భగవంతునివద్ద, "పాపోహం" అని చెప్పుకొని, "త్రాహిమాం కృపయాదేవ" అనవలెను. కథకు పత్రము.

రామా! నేను లేని సమయమున తండ్రి స్త్రీ వాక్య ప్రేరితుడై నిన్ను అరణ్యములకు పంపి, ఆ దుష్కృత్య ఫలమునే ఆకడన అనుభవించినాడు. నా తల్లియు ఆమె కోరిన ఫలముననుభవింపక వైధవ్య ఫలమునందుకొన్నది. ఆమెకిది చాలదు. ఆమెకు లోకాంతరమున ఘోరాతి ఘోర నరకపాతమున్నది తప్పదు. కావున నీవు దేవేంద్రునివలె ఇక్ష్వాకు సామ్రాజ్య పీఠము నలంకరింపుమని ప్రార్థించుచు ఈ సోదరుని, ఈ శిష్యుని, ఈ దాసుని కరుణింపుమని కన్నీటి ధారల కార్చుచు రాముని పాదారవిందములపై శిరమును మోపినాడు ఇది భరతుని అభ్యర్థనము.

భ్రాతుశ్శిష్యస్య దాసస్య ప్రసాదం కర్తుమర్హసి.

ఇక రాముని వైపు తిరుగుదము.

రాముడు భరతునకు సమాధానమందించుటయందు పురుషోత్తముడై రెండు గుణముల ప్రదర్శించినాడు. ఒకటి ఔదార్యము రెండు వ్రతదీక్ష. అతని వ్రతదీక్ష లోనిదే త్యాగశీలత. ఆతని సమాధాన సంగ్రహమిది.

రాముడు భరతుడాలోపించిన మొగ్గరను దోషము కారని నిరూపించినాడు. అందు మొట్టమొదటగనే భరతా! నీ యణుమాత్రమైన దోషముకూడ లేదని ఆతని విశుద్ధహృదయమును తెలుపుచు తన హృదయమును స్పష్టపరచినాడు. తరువాత దశరథుడు దోషి కాడని నిరూపించి, తానిపుడు రాజ్యాభిషిక్తుడగుటకు

శాసనాతిక్రమమని నిరూపించినాడు. అట్టి పాపమును నేను చేయనని తేల్చినాడు. భరతుని గురించి రాముడు చెప్పినదాని ప్రమాణ వాక్యమిది.

"నదోషం త్వయివక్ష్యామి సూక్ష్మమప్యరిసూదన."

భరతా! నీయందు సూక్ష్మాతిసూక్ష్మమగు దోషము కూడ లేదని విశ్వాసముగ ఉద్ఘాటించినాడు. ఈ కార్యమున నీపుకూడ కర్తవ్యయుంటివేమో నను అనుమానము నాకావంతయు లేదని చెప్పి భరతుని హృదయమున గుచ్చుకొని యున్న సంశయ కంటకమును తొలగించినాడు. తరువాతి విషయమేమి? దశరథుడు దోషి యనియు, కైక దోషురాలనియు, భరతు డుద్ఘాటించిన ఉద్ఘాటనము. దానిని గురించి రాముడు విప్పిచెప్పుచు భరతుని సంస్కరించినాడు. ముందు కైక నిర్దోషురాలనినాడు. భరతా! నీవజ్ఞానముచే తల్లిని నిందించుచుంటివిగాని జ్ఞానము కలిగి కాదనినాడు. ఇక్కడ రాముని వాక్యమిది.

"తచాపి జననీం బాల్యా త్వం విగర్హితు మర్హసి॥"

ఈ ఘట్టమువ గీత నొక్కమారు స్మరింపుడు. అర్జునుడు ఈ జ్ఞాతుల నందరిని చంపిన పాపమును నేను చేయననెను. అప్పుడు శ్రీకృష్ణులు అర్జునా! నీవు ప్రాజ్ఞునివలె మాట్లాడుచుంటివే గాని, నీవు ప్రాజ్ఞుడవు కావనెను. "ప్రజ్ఞా వాదాంశ్చ భాషసే" అతడీతడే. అనగా ఆ కృష్ణుడీ రాముడే.

భరతుని రాముడిక్కడ బాల్యముచే కైకను నిందించు చుంటివని స్పష్టముగ చెప్పి, నీవింత అజ్ఞానయుతముగ మాట్లాడతగవని శాసించినాడు. ఇదియే రాముని లోని ఔదార్యము. తనను అరణ్యమునకు పంపిన కైకయందాతడు దోషమును చూడలేదు. ఆమెను నిందించుట కాతడు ఇష్టపడలేదు. తరువాతది దశరథుని విషయము. ఆత డెట్లు దోషి కాలేదో చెప్పి, తనకు పట్టము కట్టుకొనుటకును, భరతుడు కట్టుటకును అధికారము లేకపోవుటను నిరూపించినాడు. దశరథు డెట్లు దోషి కాడు? అను ప్రశ్నకు సమాధాన మిది.

కామకారో మహాప్రాజ్ఞ గురూణాం సర్వదానఘ
ఉపపన్నేషు దారేషు పుత్రేషు చ విధీయతే,
వయమస్య యథాలోకే సంఖ్యాతాస్సామ్య సాధుభిః
భార్యాః పుత్రాశ్చ శిష్యాశ్చత్వ మను జ్ఞాతు మర్హసి॥

భరతా! దశరథుడు ఆచరించిన ఈ కార్యము లోకమున పెద్ద లెవ్వరును ఆచరించనది కాదు. తనకు అనుగుణ్యముగ చరించు భార్యాపుత్రులయెడ తాము స్వతంత్రించి ప్రవర్తించ వచ్చును. భార్యాపుత్రులను శిష్యులను పురుషు ననుసరించుటను బుద్ధిమంతులు మన్నించుదురు. కావున మన తండ్రి నన్నరణ్యము నంపుండుమనియు, నిన్ను రాజ్యము చేయుమనియు శాసించగా ఆ శాసనమును మన మనుసరించవలెనేగాని కాదనుటెట్లు? తండ్రి నెదిరించ వలెను. తండ్రివంటిదే తల్లి గూడ. భరతా! తల్లిని నిందించక తండ్రి అధికారమును కాదనక నీవు రాజ్యమును చేయుము. నేను వనవాసమును చేయుదు ననినాడు. మాతాపితరుల ఆజ్ఞను కాదని మాట్లాడుటకు నీకును నాకును అధికారము లేదనినాడు. ఆజ్ఞాపించిన తండ్రి స్వర్గమునకేగగా ఆయన శాసనమును తిరస్కరించుటకు నీకును నాకును అధికారము లేదని రాముడు స్పష్టపరచినాడు. దశరథుని విబుధాధిపోపమం దేవేంద్రునివంటివాడని ఆయన నిర్దోషి యని భరతునకు తెలిపినాడు. ఇది కాదన్న పర్వ లోకేశ్వరత్వము కూడ నాకక్కరలేదనినాడు.

"పిత్రాదత్తం యథాభాగం ఉపభోక్తుంత్వ మర్హసి
చతుర్దశ సమాస్సౌమ్య దండకారణ్య మాశ్రితః
ఉపభోక్ష్యత్వహం దత్తం భాగం పిత్రా మహాత్మనా
"యదబ్రవీన్మాం వరలోక సత్కృతః
పితామహోత్మా విబుధాధిపోపమః"
తదేవ మద్యే వరమాత్మనోహితం
నసర్వలోకేశ్వర భావమవ్యహం॥

భరతునకు తేలిన తర్యవసానమేమి? రాముడు అయోధ్యకు రానంటి తేలినది. వీవే రాజ్యమును చేకొనుమనుట తేలినది. అంతతో ఆనాటి సంభాషణము ముగిసినది. ఆ రాత్రి యంతయు శోకమయమై గడచినది.

ఆది ప్రాతఃకాలము. రామాదులు మందాకినీ నదియందు స్నాన మాచరించి, సంధ్యాద్యనుష్ఠానముల నిర్వర్తించినారు. వశిష్ఠాది మునీంద్రులును, సుమంత్రాది మంత్రిపుత్రములును ప్రజానీకము గూడ రాముని ప్రక్కన చేరినది. ఆ సభాస్థలి ప్రశాంతమై యున్నది. ఎవ్వరును ఎవ్వరితో గూడ పలుకక కూర్చొనినారు. రాముని కిక మాట్లాడవలసిన పని ఏమియును లేదు. అతడు భరతున కివ్వదగిన సమాధానము

లేక సందేశము సమాప్తమైనది. కాని భరతుని సమస్య భరతుని దృక్పథమున పరిష్కరింపబడలేదు. కావున ఇప్పుడు వెడవి విప్పదగినవాడు భరతుడే. రెండవ రోజున భరతుడే మాటాడ ప్రారంభించినాడు.

భరతుని సంభాషణమీ ఘట్టమున మృదుమధుర వాణితో శాస్త్రీయసిద్ధాంతముతో తర్కయుక్తులతో చక్కగ నడచినది.

ఒక్కమారు మనము విన్న రాముడు చెప్పిన దానియందలి సారమును స్మరించి, భరతుడెట్లు ఆయన విషయము ననుసరించెనో చూతము. విన్న రాముని నిర్ణయమేమి? తన కిష్టమగు దారాపుత్రాదుల కోర్కెల తీర్పుట మహనీయులగు సాధులు ఒప్పుకొన్న మాట కావున భరతుడు బిడ్డలమైన మనల పాసించుట యుక్తము కాకపోవని తేల్చి, ఆయన శాసనమును మన మనుసరించవలె ననినాడు.

రాముడు చెప్పినది యుక్తము కాకపోదు. శాస్త్ర సమ్మతము కూడ. కాని అందొక సూక్ష్మమగు లోపము భరతుడెఱుగనిది కాదు. "రాముడు" ఉపవన్నేమి దారేమి ఎనిగడా ఎనెను? అనగా తనకిష్టమగు భార్యలని అర్థము. ప్రస్తుత సందర్భమదికాదు. కైక ఇష్టురాలై లేదు దశరథునకు. దశరథుడిష్టముతో రాము వరణ్యమున కంపి భరతునకు రాజ్యమివ్వలేదు. కైకేయి నిర్బంధముచే విభాగించిన విభాగమిది. కావున రాముడు చెప్పినట్లు పితృశాసనము ననుసరించి తీరవలెనని ఎక్కడున్నది? దానిని మార్పుట కవకాశమున్నది. ఈ విషయము నాధారముగా గొని భరతుడు మాట్లాడ ప్రారంభించినాడు.

రామా! నా తల్లి నాకిచ్చిన ఈ రాజ్యమును నా తల్లిని ఒప్పించి నీకివ్వ వచ్చిన నన్ను గ్రహింపుమని కోరినాడు.

"సాంత్వితా మామికా మాతా దత్తం రాజ్య మిదం మమ
తద్దదామి తవైవాహం భుంక్ష్వ రాజ్యమ కంటకం॥"

ఇప్పుడు భరతుడు తేల్చినదేమి? ఈ రాజ్యమును నీవే నీది యని నిర్ణయించితివి గావున నేను నీకివ్వదలచి యిచ్చుచుంటిని గావున నీవీ రాజ్యమును పరిగ్రహింపు మనినాడు. చక్కగ చెప్పినాడు భరతుడు. తాను పాలింపక తానెందుకీ రాజ్యమును ఇచ్చుచుండెనో రామునకు కారణమును ప్రతిపాదించవలెను గదా? ప్రతిపాదించినాడు.

మహతేవాంబువేగేన భిన్నాస్సేతుర్జలాగమే
దురావారం త్వదన్యేన రాజ్యఖండ మిదంమహత్.

తానీ రాజ్యమును భరించలేడట. ఎట్లు ? పొరలివచ్చు ప్రవాహవేగమునకు కట్టతెగగా ఆ ప్రవాహ వేగమును ఆపలేనట్లు తానీ రాజ్యమును భరింపజాలడట. ఈ రాజ్యపాలనకు తాను సమర్థుడు కాడట. అశ్వవేగమును గార్దభమనుసరించలే నట్లట. రాముడు గుర్రమట. తాను గార్దభమట. గరుత్మంతుని ఇతర పక్షులనుసరిం చుట పంటిదట తానీ రాజ్యమును భరించుట. రామా! నీవు గరుత్మంతుడవు నేనొక సామాన్యజాతి పక్షిని. నీవు రాజ్యమును పాలించుటకును, నేను రాజ్య మును పాలించుటకును సంబంధమేమున్నది? అనినాడు కాని రాముని ముఖ మండలమున మార్పు రాలేదు. చివ్వరకు ప్రజలుకూడ నిన్నే కోరుచుండిరి రామా! యని ప్రార్థించినాడు. ప్రజలును రాముని ప్రత్యేకముగ కోరినాడు రాముడు మార లేదు. భరతుని శోకవేగ మరికట్టుటకు తత్త్వోపదేశము చేసినాడు. ఆ ఉపదేశ సారమిది.

భరతా జీవుడు అస్వతంత్రుడు. దైవప్రేరితుడై వడువవలెను ఈ జగత్తు నకు రాకపోకలు స్వభావము. మానవుడెప్పుడైనను అనిత్యతయే స్వభావమగు ఈ జగత్తును స్థిరమనుకొనరాదు. అదియే దుఃఖకారణము.

అజ్ఞానయుతమగు అంతరాత్మ విషయ సుఖములకు గురియై రాత్రికాలము వందనుభవింపదగు భోగములను దలచి సూర్యుని అస్తమయమున కావందించును. పగటి సుఖములను తలచుకొని సూర్యోదయమునకు సంతసించును. కాల పురుషుడు తన ఆయుర్దాయమును సూర్యోదయ సూర్యాస్తమయములతో అపహరించుచుండె నని ఎరుగడు. జీవుడు తన మనస్సును తత్త్వశాస్త్రము వైపుకు త్రిప్పుకొని ఆలో చించుట చాల అవసరము. తనను గురించిన ఆలోచనయే మానవుని కృతార్థుని గావించును. బాహ్యములగు సుఖదుఃఖములకు నిత్యత్వము లేదు. వేదాంతముల వైపు తిరుగుటకు మనకింకను వార్ధక్యము రాలేదని అనుకొనకూడదు. ఆయుర్వా గ్యము క్షణక్షణమునకు క్షీణించుచుండును. దైవప్రేరితములై వచ్చిన సుఖదుఃఖ ములను ధీరుడై అనుభవించవలెను. నేనరణ్యమున నిట్లుంటిననిగాని నీ నెత్తిన రాజ్యభారము పడినది దీనిని నేనెట్లు మోయుదుననిగాని విచారించవద్దు. ఇదంతయు కాలతంత్రము. నన్ను గురించిన దుఃఖమును వీడి, నీకు రాదగిన ధీరత్వమును

గురించి నాకీ శోకమేలనచ్చినదని శోకించి, శోకకారణమును గుర్తెరిగి నీవాత్మోద్ధరణమును గావించుకొనుమనినాడు

"ఆత్మానమనుశోచత్వం కిమన్యమనుశోచసి
ఆయుస్తే హీయతే యస్య స్థితస్యచ గతస్యచ."

ఇది మనకు రాముడందించిన దివ్యసందేశము. అవతారములిందుకే. కృష్ణావతారమునందిచ్చిన గీతాశాస్త్ర సందేశమిదియే.

"ఉద్ధరేతాత్మనాత్మానం ఆత్మాన మవసాదయేత్
ఆత్మైవహ్యాత్మనో బంధు రాత్మైవ విపురాత్మనః"

ఇక్కడ ఆత్మను ఉద్ధరించుకొనుటకు ఆత్మనే వాడుకొనవలెనని చెప్పినారు. అనగా మనస్సునే ఇక్కడ ఆత్మపదముతో చెప్పినారు మనస్సు మనకు బంధువు. మనస్సే శత్రువు. మన మనస్సును మోక్ష పురుషార్థమువైపుకు త్రిప్పుచో అది మనకు బంధువగును. ప్రపంచాభిముఖమును గావించుచో అది మనకు శత్రువై సుఖదుఃఖరూప సంసారగర్తమున పడవేయును. మోక్ష పురుషార్థ విచారణకు శాస్త్ర మాధారము కావలెను. అనగా వేదములను ప్రమాణముగా గ్రహించిన మతాచార్యులనే అనుసరించుట ముఖ్యము. ఇది రాముని ఉపదేశ సారము. ముందుకు పోదము.

ధర్మాత్ముడగు భరతుడు ధర్మమూర్తియగు రాముని తత్వబోధనంతను విని నాడు. భరతున కిప్పుడు కావలసినది రాముడయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడగుట గాని రాముడు చెప్పు వేదాంతము కాదు. భరతుడు చక్కని సమాధానమిచ్చినాడు.

రామా! నీవలె తత్వవేత్త లెందరుందురు? నీకు నీవే సాటియని రాముని గుణవర్ణనము చేసి తన విన్నపమును మాత్రము తాను వదలక, రాముని తత్వోపదేశమును గురించి చక్కని సమాధానమిచ్చినాడు. భరతుని సమాధానము కేవల తర్కయుతము కాదు. వేద సమ్మతము. తర్కము వేదశాస్త్ర బద్ధమై యుండవలెనని బోధించుచే సనాతన వైదికాచార్యుల ఉపదేశము. జగద్గురువులగు ఆదిశంకరులు, శ్రుతి మత స్థ్కాపకును సంధీయతాం అని శాసించినారు.

భరతుని సమాధాన సంగ్రహమిది.

వేదము రెండువిధములగు ధర్మములనుపదేశించినది. ఒకటి ప్రవృత్తిధర్మము, రెండు నివృత్తిధర్మము. ప్రవృత్తి ధర్మమన బ్రహ్మచర్య గృహస్థ, వానప్రస్థాశ్రమములందు నడువదగు ధర్మము. నివృత్తి ధర్మమన సన్యాసధర్మము. బ్రహ్మచర్యమున ఆయాశ్రమధర్మముల పాటించి, గురుకులమునందుండి వేదవేదాంగములనభ్యసింపవలెను. గార్హస్థ్యమున తన వర్ణమునకు తగిన కన్యను పెండ్లియాడి గార్హస్థ్య ధర్మమును నెరపవలెను. అంతతో విషయ సుఖభోగముల నిత్యములని వైరాగ్యముదయించగా ఆ వైరాగ్యము నాధారముగా గొని వనమునకేగి వానప్రస్థుడు కావలెను. ఆదికేవల మోక్షైకసాధనము. గార్హస్థ్యము ధర్మార్థ కామములనుత్రికర్మములకు నిలయము. మోక్షమునుగూడ ఈగార్హస్థ్యము నందుండి సామాన్య ధర్మమునగాక విశేషధర్మము నాశ్రయించి సంపాదించ వచ్చును. అప్పుడీ గృహమునే వనము గావించుకొని వనమునందువలె చరింపదగు సామర్థ్యమును సంపాదించుకొనవలెను. ఈచతుర్విధ పురుషార్థములను శ్రుతిస్మృతులు ప్రతిపాదించినవి. వీటిని ఆధారముగా గొనియే రాముడు భరతునితో మాట్లాడుటయు, భరతుడు రాముడితో మాట్లాడుటయు జరుగుచున్నది. ఇది నాయభిప్రాయము. ఇది నాఅభిప్రాయమనువది మాత్రము ఇద్దరును పరిశీలించరు. ముఖ్యముగ మీరు గమనించవలసినదీ విషయమే. ఇప్పుడు భరతుడు చెప్పిన సమాధానమును వినుడు. ఇందు సమాధానమును శరణాగతియుకూడ ఇమిడియున్నవి.

రామా! శాస్త్రములు చెప్పిన ఆశ్రమధర్మములు ననుసరించుచో గార్హస్థ్యము అత్యంత శ్రేష్ఠము. ఇది ధర్మశాస్త్రవేత్తల సమయము (ప్రతిజ్ఞ). ధర్మజ్ఞుడవగు నీవెట్లు ఈధర్మమును వదులుదువు?

"చతుర్ణా మాశ్రమాణాంహి గార్హస్థ్యం శ్రేష్ఠమాశ్రమం
ప్రాహుర్ధర్మజ్ఞధర్మజ్ఞాః తంకథం త్యక్తుమర్హసి?

అని ముందు వనవాస జీవికమిప్పుడు మీరు చరించుట ధర్మశాస్త్ర సిద్ధము కాదనినాడు. కాక క్షత్రియుని ముఖ్యధర్మము రాజ్యపాలనము. జడదారివై అరణ్యమునందుండుట ధర్మముకాదుగదా? గార్హస్థ్యము నందుండి, సుఖభోగము లననుభవించుచు పుణ్యసంపాదనము చేయదగు కర్మమును వదలి, ప్రజలను పునీతుల గావింపదగు బాధ్యత రాజుయందుండగా మీరీ ధర్మము నాశ్రయించుట యుక్తము కాదు రామచంద్రా!

ఇది ఇట్లుండ పుత్రశబ్దమునకు పున్నామమను నరకమునుండి పితరుల నుద్ధరించుటయని అర్థము. అట్టి నీవు తండ్రి ఆచరించిన ఈదోషము నుండి తండ్రి నుద్ధరించక యుండుట ధర్మశాస్త్ర సిద్ధముకూడ కాదుగదా? తల్లి దండ్రులిద్దరును కలసిచేసిన శాపమును వారిక తొలగించి, ప్రజలను రక్షించు పుణ్యమును కట్టుకొని నన్నును ఉద్ధరించుటకై అయోధ్యకు రావలసి యుంటివని సమాధానపూర్వక ముగ రాముని అర్థించినాడు.

"శరసాత్వ భియాచే హంకురుష్వ కరుణాం మయి.
బాంధవేషుచ సర్వేషు భూతేష్వివ మహేశ్వరః"

నాయందు కరుణ చూపుమనినాడు. బాంధవులందరి యందును కరుణనుచూపు మని మహేశ్వరునకు పోల్చినాడు. రాముని మనసు కరగలేదు. ఆతని ప్రతిజ్ఞ నాతడు వదలలేదు. ప్రజల కన్నులనుండి అశ్రుకణములు రాలినవి. అందు సంతోషమొక భాగముకాగా దుఃఖమొకభాగమును పంచుకొన్నది. ఆరాముని ప్రతదీక్షకు వారాశ్చర్య చకితులై ఆనంద భాష్పములు రాల్చిరి రాముడయోధ్యకు రానందుకు దుఃఖభాగులు కాక తప్పలేదు. వారంతరును తల్లులను కూడ భరతుని ప్రశంసించి రాముని రమ్మని యాచించినారు. మరి భరతుని మాటలకు సమాధానమేమని ఇచ్చెను? రాముడు కైకేయీ దశరథుల కార్యమును తప్పని ఒప్పుకొనడు. కావున ఒక చక్కని సమాధానము విచ్చినాడు.

భరతా! ఈరాజ్యము నీకు తల్లి ఇప్పుడు ఇచ్చినదికాదు. నీకు జన్మహక్కై యున్నది. నీతల్లిని వివాహమాడునప్పుడే తండ్రిగారు ఆమెయందు జన్మించు పుత్రు నకు రాజ్యము విచ్చెదనని నీ మాతామహునితో ప్రతిజ్ఞచేసి, వివాహమాడినాడు. కావున రాజ్యము నీదికాని నాదికాదనినాడు. అది యట్లుండ కైకేయి దేవాసుర సంగ్రామమున మన తండ్రిని రక్షించి ఆయన సంతోషముతోడ యిచ్చిన రెండు వరములనే ఇప్పుడు కోరుకొనక ఇప్పుడు నా అరణ్యవాసమును, నీరాజ్యప్రాప్తియు కోరినది. ఆవరములు రెంటిని రాజు దశరథుడిచ్చి, నన్నరణ్యమున కేగుమని ఆజ్ఞాపించగా వచ్చితినిగాని నేను గార్హస్థ్యమును చరింపక వనవాసినగుటకు రాలేదు. తండ్రి సత్యనాయె వరముల నివ్వగా అతని సత్యమును ప్రతిష్ఠచేయుట పుత్ర ధర్మముకావున నీవును నేనును ఆయన సత్యవ్రతమును భంగపరచ కూడదు. భరతా! నీవయోధ్యకు పోయి, రాజ్యపత్రము గ్రహించి, ప్రజలను పాలించి,

తండ్రిగారిని ధన్యులగావింపగా నేను ఈ యరణ్యమున వసింపచి, చెల్లసీడల ననుభవించుచు మృగరాజులకు రాజునై చరించి తండ్రిగారి సత్యప్రతిజ్ఞను సార్థకము కావించెదను. నీకు శత్రుఘ్నుడు సహాయముగాగా నాకు లక్ష్మణుని సాయమువ్వది. కావున విషాదమును వదలి మన కర్తవ్యమిదియని నీవయోధ్యకేగుము. నేను అరణ్యముల ప్రవేశించెదననినాడు.

రాముడిప్పు డేమని తేల్చెను? కైకేయీ దశరథులు దోషులని భరతుని వాదమును రాముడొప్పుకొనలేదు. కాను గార్హస్థ్య ధర్మమును వదలుటను భరతుడు నిషేధించగా నేను గార్హస్థ్యమును వదలి వనస్థుడను కాలేదని తేల్చి, తండ్రి సత్యపాశబద్ధుడై కైకేయికిచ్చిన వరములను నేనును నీవును గూడ ఒప్పుకొనవలసిన దేనని స్పష్టపరచినాడు. పర్యవసానముగ మనము నలుగురముకలసి తండ్రిని సత్యప్రతుని గావించుట పుత్రధర్మమని ఖండితముగా చెప్పినాడు. భరతుని కోరిక నెర వేరలేదు. వచ్చినవారితో జాబాలిమహర్షి చక్కనివక్త. రాముడయోధ్యకు వచ్చుటకు అతడొక మహాప్రయత్నమును చేసినాడు.

రాముడింతవరకు చెప్పినదేమి? తండ్రికి స్వర్గమును కల్పించవలెనన్న అతని సత్యవ్రతుని చేయకలెనని. ఇదివేదవాదము ఇది విశ్వాసముపై ఆధారపడియున్న సిద్ధాంతము.

జాబాలి ఒక వాదమునుచెప్పి, రాముని రాజ్యమును గ్రహింపమనినాడు. జాబాలి చెప్పిన ప్రబోధమిది.

సృష్టి ఖండమున తెలివిగల వర్గమొకటియు, తెలివితక్కువవర్గ మొకటియు మానవ సమాజమునందున్నదని జాబాలివాదము. ఆ తెలివితక్కువ మానవసమాజమును తెలివిగల సమాజము స్వర్గమున్నదని ఈలోకమున చచ్చినవారు స్వర్గలోకము నరకలోకముల కేగుదురనియు, తెలివితక్కువ వారిని నమ్మించుటకు గ్రంథములను వ్రాసి వీరివలన జీవనము చేయుదురనియు అతడు విన్నయించినాడు.

వేదశాస్త్రము లనునవి మానవకల్పితములుగాగా అవి స్వయంభునములు బ్రహ్మ ముఖమునుండి వెడలివచ్చినవని అమాయకులను నమ్మించగా పాపము అమాయకులు కంటికి కనబడని స్వర్గ నరకములనువమ్మి దాన ధర్మములను పేరను, పితృ శ్రాద్ధములను పేరను ధనవ్యయమును చేసుకొనుచుండిరేగాని అంతకంటే

వేరేమియులేదనినాడు. మానవ సమాజయంతయు ఒక్కటైయుండ కొందరగ్ర వర్ణమున పుట్టిరనియు మరికొందరు నిమ్నజాతులై పుట్టిరనియు, నిమ్నజాతులు అగ్రవర్ణములకాళ్ళు పట్టుకొని వారిసేవ చేసినగాని వారికి స్వర్గము రాదనియు నమ్మించి తమ గౌరవములను పెంచుకొనిరేగాని వర్ణములనునవి సృష్టిలోవివికావని నిర్ణయించినాడు. తండ్రి సత్యవ్రతమును కొడుకు నిలబెట్టుటయను సిద్ధాంతము అమాయక సిద్ధాంతముగాని తెలివిగల సిద్ధాంతము కాదనినాడు. తండ్రియను పేరు గలవాడెప్పుడో భస్మమయ్యెనుగదా? ఇంక ఆత్మ ఎక్కడున్నది. నాలుగుభూతముల సమ్మేళనమే సృష్టి. భూతములు భూతములలో కలవగా ఆత్మ ఎక్కడున్నది? దేహమే ఆత్మ. దేహమునకంటె వేరుగ ఆత్మ ఉన్నచో మనకెందుకు కనబడదు? కావున పురుషుని శుక్లమును, స్త్రీయొక్క శోణితమును కలవగా సంతానము కలుగుట స్వభావమైయుండ కర్మను ఈశ్వరుని కల్పించి పుణ్యపాపములున్నవని ఆమేధావులు అల్పవ్రజ్ఞ కలవారలని నమ్మించుచుండగా తెలివిగలవాడవైన నీవుకూడ ఇట్లు తండ్రిని సత్యవ్రతుని చేయుటకు రాజ్యమును వదలుట యుక్తముకాదని ప్రబోధించినాడు. ఇది జాబాలి ప్రబోధము. దీనినే నాస్తిక వాదమందురు. లేక బౌద్ధవాదమందురు. చార్వాకమునికూడ దీనికిపేరు.

ఈవాదము లీనాటివేకావు. ఏనాడునుకలవాదములే. జాబాలి క్రొత్తవాదమును చెప్పలేదు. బృహస్పతి ఒకప్పుడు రాక్షసులను నాశము చేయుటకీ వాదమును చెప్పినాడు. దీనికి విరోచన సిద్ధాంతమని కూడ పేరు. చార్వాకబౌద్ధములు కొద్ది తారతమ్యములు గల వాదములు. ఆయిద్దరును వేదములనొప్పుకొనరు. వినుటకు సుందరముగనుండు వాదమునకు చార్వాకవాదమువిపేరు. విజ్ఞానమే ఆత్మయను వాదమునకు బౌద్ధమునిపేరు. చార్వాకమువకు ప్రత్యక్షమొక్కటే ప్రమాణముకాగా బౌద్ధము అనుమానప్రమాణమును కూడ తీసికొన్నది. రాముడిప్పుడే సిద్ధాంతములోని వాదనునది ప్రశ్న. ఇక్కడ రాముడు కన్నుల నెర్రచేసి, జాబాలివి నిన్ను నాతండ్రి ఈరాజ్యము నందుంచినందుకు తండ్రిని విందించుచున్నాను గాని విన్ను విందించుటలేదని జాబాలివాదమును ఖండించినాడుగాని ఆతనిని అనుసరించలేదు. అంతతో రాముడూరుకొనలేదు. వేదములను ప్రమాణము గావించి కర్మను సిద్ధాంతీకరించి, ఈసూర్యచంద్ర గ్రహాది మండలములన్నియు కర్మ విశేషముచేతనే నిలిచియుండగా నాకీనాస్తికవాదమును చెప్పుచుంటివా? అని జాబాలిని ఖండించినాడు. పితృలోకములున్నవని నమ్మవలెననినాడు. పూర్వకర్మలేకున్న ఈసృష్టి

భిన్నత్వమునకు సమాధానమేమున్నది? ఒకేతల్లిదండ్రులకు సంతానములోని భిన్నత్వమెట్లు వచ్చుచున్నది? ఒకడు రూపసియగుట వేరొడు కురూపియగుట ఎట్లు కలుగుచున్నది? శుక్లశోణిత సంయోగమొక్కటే సంతానము పుట్టుటకు కారణమగుచో ఆవిరెండును కలసినప్పుడెల్ల ఎందుకు సంతానము కలుగుటలేదు? కన్నులకు కనబడినదానినే నమ్ముచో ఈతడు వీనిపుత్రుడని నిర్ణయమెట్లు కుదురును? ఇట్టివెన్నియో అసంబద్ధములు బౌద్ధ చార్వాకసిద్ధాంతము లందుండుటచే "యథాహి చోరస్తథాహిబుద్ధ" అని జాబాలిని చివాట్లు పెట్టినాడు. తల్లిదండ్రులనువారు కన్నమైపోగా ఈరాజ్యము పైతృకమెట్లైనది? కావున చార్వాక బౌద్ధములు రాజ్యములోనివికావు. రామరాజ్యము వాటికి వ్యతిరేకము. తరువాత కథ ఏమి?

చివరకు జాబాలి నాసిద్ధాంతమదికాదు రామచంద్రా! నేనెట్లైనను నిన్ను అయోధ్యకు మరలించవలెనని చెప్పితినని చెప్పుకొనగా వశిష్ఠ ముసీంద్రులును జాబాలి నాస్తికుడు కాదని వాక్రువ్వగా రాముడు శాంతించినాడు. ఇంతతో జాబాలి భాగము ముగిసినది. భరతునికి జాబాలి వాదము సహాయము కాలేదు. వశిష్ఠముసీంద్రులు గురువుగారి మాటను వినుమని రామునికి చెప్పినారు. రాముడు ఒప్పలేదు. భరతుడు రామునెట్లు ఒప్పించుట? అని ఆలోచించినాడు. ఆకవి అంతరాత్మ భరతునకొక మాటచెప్పినది. ఇది బాగున్నదనుకొనినాడు. ఏమది? రాముడు అయోధ్యకు వచ్చువరకును ఆహారమును వర్జించి బ్రాహ్మణునివలె ఒకవైపు తిరిగి దర్భలపై పడుకొనుట ఆట్టి నిర్ణయమునకు వచ్చినాడు. సుమంత్రుని పిలిచి దర్భాసనమును వరచమనినాడు రాముని పర్ణశాల ముంగటనే. సుమంత్రుడుపేక్ష చేయగా భరతుడు తానే స్వయముగ దర్భాసనమును వరచినాడు.

రాముడు రాజర్షి. రాజర్షియేకాడు. వారియందగ్రగణ్యుడు. వాల్మీకి ఇక్కడ "రాజర్షి సత్తమః అని రామునికి వేడినారు. రాముడు భరతునివంక తిరిగి, భరతా! అప్పుపెచ్చిన బ్రాహ్మణుడు తన అప్పును రాబట్టు కొనుటకై అప్పుతీసికొనిన వాని వాకిట ఒకప్రక్కటే పరుండి, ఇటునటు పొరలక పండుకొనును. నీకు నేనేమి అపకారము చేసితినవి నీవిపని చేయతలపెట్టితివి? ఈకార్యము బ్రాహ్మణునకు తగునుగాని కిరీటమును ధరించు క్షత్రియునకు ధర్మముకాదు. లేలెమ్మనిచెప్పి, నీవు స్వధర్మమును వదలి పరధర్మము నాశ్రయించితివి గావున ఆచమించి, నన్ను రమ్ము అనినాడు. ఏంటిరా? రాముని వర్ణధర్మ నిర్వహణను గురించి? భరతు డేచేసి నిర్దోషియయ్యే రామునితో మాట్లాడినాడు.

ధర్మశాస్త్రములలో ఒకరు ఆచరింపవలసిన వ్రతదీక్షను వారికి బదులు మరియొక రాచరింపవచ్చునని యున్నది. దానిని ఆధారముగా గొని భరతుడు రామునికి బదులు నేనరణ్యవాసము చేసెదననినాడు. కాని ఈ ధర్మము ఆపద్ధర్మము. దీనికి రాముడు నేనీయరణ్యవాస ధర్మము నాచరింపలేని వాడనుకాను. నాకు ఆపత్తు రాలేదు. కావున నీవు నాకు బదులుగ ఉండుటకు నేను ఒప్పుననినాడు. పర్యవసానమున భరతుడు రాజ్య స్వీకరణమున కంగీకరించలేదు. రాముడును అంతియే. దేవతల కార్యమిప్పుడు బలవత్తర మైనది. రామునకిప్పుడు రావణ సంహారము ముఖ్యముగాని రాజ్యము ముఖ్యము కాదు. కావున దేవతలు రామునే యనుసరించినారు. భరతుడేమి చేయును? రాముని కాళ్ళమీదపడి పలుల ఏడ్చెను. చివరకు రాముడు అరణ్యవాసానంతరము అయోధ్యకు వచ్చుట కొప్పుకొనినాడు. ఇప్పుడు మాత్రము నేను చంద్రునిలోని లక్ష్మి తొలుగుగాక, హిమవంతునినుండి మంచు పోవుగాక, సముద్రము చెలియలి కట్టను దాటుగాక నేను మాత్రము నా ప్రతిజ్ఞను వదలననినాడు.

"లక్ష్మీశ్చంద్రాదపే యాద్యా
హిమవాన్వా హిమంత్యజేత్
అతీయా త్సాగరోవేలాం
నప్రతిజ్ఞా మహంపితుః.

మంత్రులుగాని ఋషులుగాని మరెవ్వరైనను రాముని ప్రతినను తొలగించ లేకపోవుటచే భరతుడు దీనుడై సువర్ణ పాదుకలను రామునకిచ్చి ఈ పాదుకలపై రాముని పాదములనుంచమని కోరి, ఆ పాదములు శిరమునందుంచుకొని ఈ పాదుకలే రాజ్యము చేయునని భరతుడు నిర్ణయించుకొనినాడు. రాముడట్లే చేసినాడు. అప్పుడు భరతుని ప్రతిజ్ఞ ఇది.

రామా! నేనీ పాదుకలకే పట్టము గట్టెద. రాజ్యతంత్ర మీ పాదుకలకే విన్న వించెద. నేను పట్టణమునందుండను. నగరమున కవ్వలనొక గ్రామమునందుందెద.

జడదారినై నారచీరలు ధరించియే యుండెద. నీవు వదియైదవ సంవత్సరము వచ్చిన రోజుననే దర్శనమివ్వకున్న అగ్నియందు ప్రవేశించెదననినాడు. అమూల్యమగు ఆ భరతుని ప్రతిజ్ఞను రాముడంగీకరించినాడు. భరతుడు తన సైన్యముతో అయోధ్యకు మరలినాడు.

అవి భగవత్పాదారవిందములు. జీవరాశి కభయంకరములు. సమస్త లోక పూజ్యములు. నేడు భరతుని శిరము నధిరోహించిన ఆ సువర్ణ పాదుకలు రామునకు ప్రతీకలై అయోధ్యా నగరమున ప్రతిష్ఠితములు కాలేను. భరతుడయోధ్యకు చేర లేను. ఆతడు చేరినది నందిగ్రామమునకు. అదియే భరతుని రాజధాని. రాముని పాదుకలక్కడే ప్రతిష్ఠింపబడినవి. భరతునివే రామరాజ్యము నడుపబడుచున్నది. చిత్రకూటమునకు వృత్తము. రాముని వృత్తాంతమరయుదము.

రాముడా చిత్రకూటము నందడుగిడినది మొదలు అక్కడి మహర్షులకు రాక్షస బాధలు పెరిగినవి. వారక్కడనుండి వయనము కావలసి వచ్చినది. ఈ విషయమును వారు రామునకు తెలుపక తప్పలేదు, తెలిపి వారక్కడనుండి వయనము కాగా రాముడును ఆ ప్రదేశమును వదలినాడు.

అది అత్రి మహర్షి ఆశ్రమము. ఆయన భార్య అనసూయా మహాసాధ్వి. ఈ సాధ్వీమణియే బ్రహ్మవిష్ణుమహేశ్వరుల ముగ్గుర బాలుర గావించి బిడ్డలగావించు కొని చన్నిచ్చిన పెద్ద తాపసి. అత్రి అనసూయలకు జన్మించిన మహనీయులు దత్తాత్రేయులు. ఇదియొక విచిత్రమగు అవతారము. ఇది దివ్యమూర్తి. అత్రి మహర్షికి అత్రియను పేరెందుకు వచ్చెనో కూడ చెప్పెదను. మహాభారతమున ఆ మహర్షియే తన నామ నిర్వచనమిట్లు గావించినారు.

"అరాత్రిరత్రి సారాత్రి ర్యాంనాధీతే త్రిరత్రయై.
అనాత్రిరత్రిత్యేవ నామమే విద్ధిశోభనే. అను.142.అ.

అత్రి మహర్షి ఒకప్పుడు ఒకేరోజున వేదములన్నిటిని ముమ్మారు వరించి రాత్రులను పగళ్ళను గావించెనట. కావున ఆతడత్రియని పిలువబడెనట. కాక కాను వేదాధ్యయనమును చేయని రాత్రి లేకట. అందుచే ఆతడత్రియట. అంతే కాదట. అతడు పాపమునుండి లోకమును రక్షించునట. కావున ఆతడత్రియట. ఈ శ్లోకమున కర్థము మహాభారత వ్యాఖ్యత నీలకంఠులనుసరించి చెప్పినాను.

రాఘవేశ్వరులొకరాత్రి అత్రిమహర్షివారి ఆశ్రమమున వసించినారు. వృద్ధ తపస్విని అనసూయ. ఆమె ప్రభావము వర్ణనాతీతము. ఆమె ఒకప్పుడు పదిరాత్రుల నొక్క రాత్రియగునట్లు సూర్యచంద్రులు శాసించగలిగిన మహారాజ్ఞి. మరియొకప్పుడు లోకమున వర్షములు లేక దుర్భిక్షము రాగా గంగాదినదుల ప్రవహింపచేసి భూతముల కన్నమిడిన అన్నపూర్ణావతారము కూడ. ఆ మహర్షియే తన పత్నియొక్క ప్రభావ మును రామునకెరింగించి ఆమెకు సీతచే వందనము చేయించమనగా అట్లే చేసినాడు రాముడు. ఆ అనసూయా మహాసాధ్వి సీతతో చాలాసేపు మాట్లాడి సీత తన భర్తతో అరణ్యముల కేతెంచుటను ప్రశంసించి సీతాకాంత ముఖముగ సీతాకళ్యాణ కథను విని, ఆమెకు దివ్యాంగరాగముల నొసగి, అలంకరించి, సాయంకాలమునకు రామునొద్దకు పంపగా రాముడానందించుచు ఆ విప్రపత్నిని ప్రశంసించి, ఆ రాత్రి అక్కడనే వసించినారు. తరువాత అత్రి మహర్షివారి ఆజ్ఞను గైకొని దండకారణ్య ముల ప్రవేశించుట జరిగినది. ఇంతవరకిది అయోధ్యకాండ.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

ఓమ్

శ్రీ మహాగణాధి పతయే నమః

అరణ్యకాండము

శ్లో॥ ఏకేన బాణ మపరేణ కరే చ చాపం
హర్షాద్వహంతమసమాన జటా శిరస్కం
సీతా సహాయ మనుజేన సమం చరంతం
శ్రీరామచంద్ర మనిశం కలయామి చిత్తే॥

- దండకారణ్యముల చరిత్ర -

ఆర్యమహాశయులారా!

మన మిప్పటికి మన రామాయణ మహాకావ్య కథా కథనము నందెక్కడ నిలచితిమి?

అత్రిమహర్షివారి ఆశ్రమమున నిలచితిమి. సీతారాములకు మహర్షివారందించిన ఆతిధ్యము ముగిసినది. అంతతో అయోధ్యకాండ ముగిసినది. ఇక రాఘవేశ్వరుని దండకారణ్యప్రయాణము సాగవలెను. అదియే అరణ్యకాండమునకు ప్రారంభము. వేటి ప్రవచనమదియే.

దండకారణ్యము లోకనాడు ఇక్ష్వాకు మహారాజు పరిపాలించిన మహా సామ్రాజ్యము. అదిలక్ష్మికి నివాసస్థానము. నేడవి మహారణ్యములైనవి.

సూర్య వంశమునకు మనువు మొదటివాడు. ఆమనువున కుత్పన్నమైన ఇక్ష్వాకువు. రెండవవాడు. ఆ ఇక్ష్వాకువునకు నూర్వురు పుత్రులు. అందు దండకుడు చివరివాడు. ఆ దండకుని చేతికందిన సామ్రాజ్యప్రదేశమే నేడు అరణ్యసీమలైనవి.

దండకుని చిన్ననాటి దుండగములనుచూచి ఈతడెప్పటికైన ఒక మహా నీయుని చేత దండితుడు కాక తప్పదని తన పుత్రునకు దండుడను నామకరణము గావించినాడు ఇక్ష్వాకువు.

దండకుడు యువకుడై సామ్రాజ్యమునేలు సమయమది. భృగ్వాచార్యులు దండకుని పురోహితుడు. దండకుని రాజధానిలోనిదే భృగ్వాచార్యుని ఆశ్రమము అరజ అను కన్యకామణి భృగ్వాచార్యుని పుత్రిక. ఆకన్యక లోకైకసుందరి.

దండు దొకనాడు భృగ్వాచార్యుని ఆశ్రమప్రాంతమునకు రాగా ఆవనమున విహరించు "అరజ" దండుని కంటబడినది. కామము గ్రుడ్డిది.

దండుడు అరజను సమీపించి కోరినాడు కామోపభోగమునకు. అరజ తన తండ్రి భృగ్వాచార్యుడని తెలిపి, ఆతని ప్రభావమునుకూడ వర్ణించినదిగాని ఆతడు కన్యక వాక్యములను లెక్కసేయక ఆమెను బలాత్కారముగ అనుభవించినాడు. నాటి మహర్షులకు శిక్షాదండములు వారి వాగ్వ్రజములు.

ధూళిధూసరితయై కంటనీరుకార్చు పుత్రిక ఆబ్రహ్మణ్యుని కంటవడగా భృగ్వాచార్యులు ఆశ్రమ బాలురవలన దండుని దుర్మార్గమును తెలసికొని ఈనాటికి ఏడవరోజుకు ఈసామ్రాజ్యము మట్టివానతో నాశమై పోవుగాకయని శపించినాడు. ఆనాటికి తన ఆశ్రమమున వసించు ఆశ్రమవాసులెందరో యుండిరికాని వారందర కును తనశాపమును తెలిపి వారినా ప్రదేశమునుండి తరలించినాడు. తన పుత్రికనేమి చేసెను?

అరజను తపస్సున కాజ్ఞాపించి ఆప్రదేశమునకొక ఆమడదూరమున సరస్సు నొకదానిని చూచి పుత్రికకు స్థానమును కల్పించినాడు. ఆమె తపస్సు చేసుకొను ప్రదేశమున మట్టివాన కురవదు. తాను వేరొక ప్రదేశమున కేగినాడు

దైవికములై వచ్చు పాప ప్రారబ్ధములను క్షయింపజేయునది తపస్సు. కావున అరజను తపస్సుచేసి ముద్దురాలవు కమ్మని తాను వెళ్ళిపోయెను

భారతీయ శాస్త్రములు నిత్య, నైమిత్తిక, ప్రాయశ్చిత కర్మలను వాటివి మానవజీవితమును పవిత్రము గావించుటకు విధించినవి. ప్రస్తుతము అరజ తపస్సు ప్రాయశ్చిత్త భాగములోనిది.

అది దండకుని సామ్రాజ్యలక్ష్మికి అస్తమయకాలము. భార్గవుడు శపించిన నాటికది ఏడవరోజు. దేవేంద్రుడు మేఘముల కాజ్ఞాపింపగా అవి దండకుని రాజ్యమున ధారాపాతములై మృత్యువర్షమును వర్షించినవి. అక్కడి చరాచరములు నశించగా అది మహారణ్యమైనది. దానికి ఆమడదూరమునందున్న ప్రదేశము మాత్రము

శుక్రాచార్యుని అనుగ్రహమునకు పాత్రమగుటచే అది మునులకు ఆశ్రయమైనది. మునులకు ఆశ్రయమైన ప్రదేశమునకు జనస్థానమనిపేరు. ఆ దండకారణ్యము ఇతర మానవులకు చొరరానిదౌటు. అప్రమేయ పరాక్రమ శాలియైన రాముడు సీతాలక్ష్మణులతో ఈనాడు ప్రవేశించిన ఆ మహారణ్యములోనికే.

శ్రోతలారా! ప్రప్రథమముగ రామునకు దర్శనమిచ్చినవి ఆ తాపసాశ్రమ మండలములే.

భారతీయ మహర్షుల ఆశ్రమములు చతుర్దశ భువనాత్మికమగు సృష్టి ఖండము లోని విజ్ఞానమునకు నిలయములు.

నాలుగు వేదములును ఆరుశాస్త్రములును మూర్తులై ఆ తాపస మూర్తుల సేవించుచుండును. నాడా తాపసాశ్రముల వశన పాశనములందు లేని కళలు లేవు. ఆధ్యాత్మిక సాధనలవేవు. అవి బ్రహ్మ విద్యాస్థానములు. భూమండలమునను స్వర్గధామము గావించినవి ఆమహర్షుల పుణ్యపుంజములు. ప్రస్తుతమున వాల్మీకి మహర్షి ఆ తాపసాశ్రమములను వర్ణించుచు స్వర్గములోని అప్సరమిన్నలు నిత్య మును ఆఆశ్రమముల వసించుచుండుడని వర్ణించినారు.

రాముని మున్యాశ్రమ ప్రవేశము

రాముడు తారకరాముడు. నాటి మునుల దృష్టియందు రాముడు మానవ మాత్రుడైన ఒక రాజు మాత్రమేకాడు. అతడు ఉపనిషత్ప్రతిపాద్యమగు బ్రహ్మము. ఓంకారములోని అకార ఉకార మకార, అర్ధమాత్రలు రామలక్ష్మణ భరత శత్రుఘ్నులని రామోత్తరతాపి న్యుపనిషత్తు వర్ణించినది.

ఓంకారములోని అకార ఉకారములచే లక్ష్మణ శత్రుఘ్నులు చెప్పబడగా కారముచే భరతుడు చెప్పబడినాడు. ప్రణవములోని చివ్వరిదగు అర్ధమాత్రయే ాముడు. ఈదృష్టితోడనే దండకారణ్యములకేగిన కోదండరాముని ఆ మునులు దర్శించిరని వాల్మీకి తెలపినారు. కావున ఆమునులను వాల్మీకి "దివ్య జ్ఞానోప సంపన్నాః" అని వర్ణించినారు.

రాముడు తాపసాశ్రమముల ప్రవేశించినాడు. సతీ సోదరులతో వెంటనే మునుల దర్శించినాడు. మునులును రాముని దర్శించినారు. అప్పుడు ఆ మహర్షులు

రామునెట్లు చూచిరి? వారికి రాముడప్పుడు నెలకొడుపునాటి చంద్రునివలె కన్పట్టెనట. "తంసోమ మివోదయంతం" అనినారు మహర్షి రాముడిప్పుడు ఉదయచంద్రుడు కాగా తరువాత ఆయుహర్షులకాతడు షోడశ కళాత్మక పూర్ణచంద్రుడు కాగలదు. ఇది కవి భావము.

భగవత్తత్వము రెండు విధములు. ఒకటి సగుణము, రెండు నిర్గుణము. ప్రస్తుత రామబ్రహ్మము సగుణము. మానవుల కన్నులపండువు గొలిపించు సౌందర్యరాశి. సతీసోదర సమేతముగ కోదండమును చేతబట్టి వనమున కేతెంచిన ఆ రాముని సౌభాగ్యగరిమ ఆవనవాసుల కెల్లరకును ఆశ్చర్యమును కలిగించినది.

శ్లో॥ రూప సంహననం లక్ష్మ్యా సౌకుమార్యైర్బలం సుమేషతాం
దదృశుర్వి స్మితాకారాః రామస్య వనవాసినః॥

ఎల్లజీవులకును మోహమును కల్పించునది రూపముగదా? కావున రాముని అప్రాకృత దివ్యసౌందర్యము అతనిని దర్శించిన వారందరకును ఉపాస్యమై ఆశ్చర్యమును గొలిపినది.

తన సంకల్పముచే కల్పించుకొన్న ఆ పరబ్రహ్మముయొక్క కనుముక్కుల తీరు, ముఖమండలమునకు శోభను కూర్చగా ఆ మూర్తియొక్క విశాల వక్షమును, ఆజానుబాహువులను, సింహమధ్యమును ఆ మూర్తియొక్క దేహమధ్య భాగమున కొక ప్రత్యేక సౌందర్యము నొసంగినవి. అట్లే ఊరు జాను పదద్వంద్వములును పాదముల పూపులు నాకట్టుకొన్నవి. ఇది రూప సౌభాగ్యము తనువాతది దేహ కాంతి. అది ఏ ఇతర జీవునియందును కనుపట్టని కాంతి. అది విసీలాకాశములోని నీలిమ. అది భగవానుని దివ్యదేహమున మాత్రమే చూడబడును. రాముని దివ్య దేహమును చూడదగిన కన్ను కలిగి చూడగా ఏ జీవి చక్షురింద్రియమును ఆశ్చర్యము మొలకెత్తదు? ఏ జీవుని హృదయము కదలబారదు? కావున ఆ వనములోని చేతనము లన్నియు ఆశ్చర్యముగ చూచినవి. రామునొక్కనే చూచినవా? కాదుకాదు. వై దేహీ లక్ష్మణుల చూడ చూచినారు. కనురెప్పల వాల్చక చూచినారు. తాత్కాలికముగ వారు దేవతలై చూచినారు.

ఇదియే భగవంతుని చూడదగిన చూపు. రెప్పలు ఆవరణము. ఆవరణను తొలగించుకొని భగవంతుని చూడవలెను.

"వైదేహీం లక్ష్మణం రామం నేత్రైరనిమిషైరివ
ఆశ్చర్యభూతాన్ దదృశుః సర్వే తే వనచారిణః"

ఋషుల శరణాగతి

ఒక చోపున రాముడు సర్వజగద్రక్షకుడు. వేరొక చోపున దశరథ పుత్రుడగు రాజు. కావ్యమిట్లే నడచినది. మునులిట్లే చూచినారు.

ధర్మపాలో జనస్యాస్య శరణ్యస్త్వం మహాయశాః.

రామా! నీవు ధర్మసంస్థాపనకై అవతరించిన జగద్రక్షకుడవు. కాపున నీవే ఈ జనులకు శరణ్యము అనినారు. సామాన్య జనులందరును వడు రాక్షస బాధల తొలగించి రక్షింపుమని సామాన్య జీవుల పక్షమున రాముని శరణాగతులైరి. తరువాత తమ శరణాగతి. అది ప్రత్యేకము.

మహర్షులు నాటి రాక్షస బాధలను తమ తమ తపఃప్రభావమున రక్షించుకొనగలరు. కాని వారట్లు చేయలేదు. చేయదలచకయే చేయలేదు. అట్టి తమ అభిప్రాయమును రామునకు తెలిపి ఋషులు శరణాగతిని పొందినారు.

కామక్రోధముల జయించి భౌతిక బాధలకు ఓర్చినగాని భక్తులుకారు. భక్తుల స్థితి ఇది.

అద్వేష్టా సర్వభూతానాం మైత్రీః కరుణఏవ చ
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖక్షమీ. భగ.త.

ఇదియే ఋషుల శరణాగతిలోని ప్రత్యేకత.

న్యస్తదండా వయం రాజన్ జితక్రోధా జితేంద్రియాః
రక్షితవ్యాస్త్వయాశక్యత్ గర్హయంతా స్తపోధనాః"

శరణాగతియన, నా భారమంతయు వానిపై ననే యుంచితినని మాటల చెప్పుచు ఆయన నొసంగిన వేదశాస్త్ర కానవములను ధిక్కరించుచు వాడే నాచేత చేయించుచుండెనని చేతలతో అభినయించుట శరణాగతి కాదు. వీరు వంచకులు.

ఋషులు: రామా! మా తపోధనమును మేము కోల్పోవకుండ మా తపోధనమును కామక్రోధాది రాక్షసులు హరించకుండ రక్షింపుమనినారు. మేము వ్రస్తు

తమున రాక్షస బాధల నోర్చుకొనుట తపోధనమును హరించు కామక్రోధముల జయించుటేనని విన్నవించుకొనినారు. మేము నీ గర్భములోని వారము. నీవే మా హృదయమున ఆరాధింపబడుచుండవు కూడదని విన్నవించుకొని రాముని కాతిథ్యముల నొసంగినారు.

రాముని అరణ్య ప్రవేశమగుటతోడనే శరభంగాదులైన ఈ మునులొక తెగ వారు. వీరు పారమార్థిక జీవితమును గడుపుటకే ఈ శరీరమును ధరించిన జ్ఞానులు. లేక భక్తులు, ప్రపన్నులు. జ్ఞానయోగ భక్తియోగములలో కర్మయోగము ఉండక పోదు. కాని వారి కర్మ లోక సంగ్రహము కొరకే. దండకారణ్యముల ప్రవేశించ గనే ఈ జ్ఞానుల ఆతిథ్యమందినది రామునకు. ఆ రాత్రి అక్కడ గడచినది.

తెల్లవారినది. సీతారామలక్ష్మణుల ప్రయాణము సాగినది. వారు శరభంగాశ్రమములనుండి గహనారణ్యముల ప్రవేశించినారు.

విరాధుడను రక్కసుడొక శాపగ్రస్తుడు. ఇంతకు పూర్వమితడు తుంబురు డను గంధర్వుడు. ఇతడు కామార్తుడై రంభతో కూడగా కుబేరుడీతనిని రాక్షసుడవు కమ్మని శపించినాడు. ఆ కుబేరుడే రామలక్ష్మణులచేత నీకు నా శాపమోక్షము కలుగునని వరమిచ్చినాడు. విరాధుని తండ్రి జయుడు. తల్లి శతహ్రద. ఇతడు తపస్సుచేసి బ్రహ్మవలన శస్త్రాస్త్రములచేత చావులేకుండ వరములను తీసికొని నాడు. ఆ వరబలముచే వాడు వీరను భేదము లేకుండ రాక్షసులను కూడ పీడించగా వారే ఈతనిని విరాధుడని పిలిచినారు. విరాధుడన లోకకంటకుడని భావము. ఆ రాక్షసునకిప్పుడు శాపమోక్షకాలము రాగా, సీతారామలక్ష్మణుల దర్శనమైనది. వీరు నాకు శాపమోక్షమును కల్పించువారని ఆతడెరుగడు. రాక్షసత్వముచే సీతనెత్తుకొని పోవగా రామలక్ష్మణులాతని వెంటబడినారు. ఆతడు సీతను వదలి రామలక్ష్మణులనే భుజములపై నెక్కించుకొని పోవగా వారిద్దరును ఆ రాక్షసుని భుజములు నరికి, ఆతనిని గోతియందు పాతిపెట్ట యత్నించినారు. అప్పుడాతనికి పూర్వస్మృతి కలిగి వది రాముడు భగవంతుడని గ్రహించి రాముని స్తుతించినాడు. అంతతో ఆతని రాక్షస తనువు తొలగగా రాముడు పోదగిన చోటును ఆతడే చెప్పి పంపినాడు. ఆతని గంధర్వ శరీరము ఆతనికి వచ్చినది.

విరాధుడు చెప్పిన విధముగా రాముడు భార్యా సోదరులతో శరభంగ మునుల ఆశ్రమమున కేగినాడు.

శరభంగ మహర్షి చాల వృద్ధుడు. అతనికెప్పుడో బ్రహ్మాది లోకములనుండి ఆహ్వానములు వచ్చినను రామదర్శనమునకయ్యే అతడు వేచియుండెను. ఇప్పుడు రాముని దర్శనమబ్బినది. మహర్షి రాముని కాతిథ్యమొసంగి రాముని సుతీక్ష్ణాశ్రమమున కేగుమని శెలవిచ్చి, ఒక్క రెండు ఘడియల కాలము రాముని తనముందు నిలిపికొని చితియందు తన శరీరమునుంచి తనయండియే యోగాగ్నిని రగిల్చి స్థూలశరీరమును ఆహుతి గావించి తేజోమయ శరీరముతో బ్రహ్మలోకమున కేగినాడు. అయన బ్రహ్మలోకమున చతుర్ముఖునిచే స్వాగతము నందుకొనుటను రాముడు దర్శించినట్లు వాల్మీకి చెప్పినారు.

ఇక రాముడు సుతీక్ష్ణాశ్రమమున కేగవలెను. అంతలో కొందరు మహర్షులు శరభంగాశ్రమముననే రాముని శరణుజొచ్చుట జరిగినది. వారు వైఘానసాది మహర్షులు. వారితోపాటు కొందరు గృహస్థులగు బ్రాహ్మణులు కూడ వానప్రస్థాశ్రమమున చరించువారుండిరి. అందులో కొందరు మహర్షులును రాక్షసులచే భక్షితులు కాగా రాక్షసుల కలవిగాని వారు మాత్రము బ్రతికి యుండిరి.

వీరు కేవలముగ రాక్షసుల బాధలనుండి మమ్ము రక్షింపుమని శరణుగోరిన మువిబ్బందము.

"పరిపాలయ నో సర్వాన్ రాక్షసేభ్యో నృపాత్మజ॥

రాముడు వీరి శరణాగతిని పరిగ్రహించి వీరు చూపిన మహర్షుల శవములు కుప్పలు కుప్పలుగా పడివుండుటను కూడ చూచి ఆ తపోధనుల కభయప్రదానము గావించినాడు. మహర్షులారా! చచ్చినవారు చావగా మిగిలిన వారిని బాధపెట్టు రాక్షసానీకము నాశము గావించెద. సోదర సమేతుడనై నా ప్రభావము చూపెద చూడుడని శపథము గావించినాడు.

"పశ్యం తు వీర్యమృషయస్త్వభాతుర్మే తపోధనాః॥

ఇది శరభంగాశ్రమములోని విషయము. తరువాతది సుతీక్ష్ణాశ్రమప్రవేశము. సుతీక్ష్ణాశ్రమము శరభంగాశ్రమమునకు చాల దూరమునందున్నది. కొన్ని నదులను దాటవలెను. గహనారణ్యములు కూడ కొన్నిటిని గడవ వలెను.

కొందరు బ్రహ్మర్షులు వెంటరాగా సీతాలక్ష్మణులతో కూడ సుతీక్ష్ణాశ్రమమున కేగి నారు శ్రీరామచంద్రులు.

శరభంగుని వలెనే సుతీక్ష్ణమహర్షి కూడ రాముని రాకకై ఎదురుచూచుచున్న యోగిపుంగవుడు. రాముడు మహర్షుల ఆజ్ఞ ననుసరించి తన మజిలీలను నిర్ణయించుకొనినాడు వారును రాక్షస సంహారమునకై రాముని ఎక్కడ నిలుపవలెనో ముందుగనే నిర్ణయించుకొన్న వారగుటచేత సుతీక్ష్ణ మహర్షివారును ఆనాటికక్కడనే రాముని నిలుపుకొని మరునాటి ప్రాతఃకాలమున సాత్వికములగు తాపస భోజ్యములచే సీతారామలక్ష్మణుల కాతిథ్యము నొసంగి మరికొన్ని ప్రదేశములకేగి తిరిగి మరల తన ఆశ్రమమునకు రావలసినదిగ కోరినారు రాముడట్లే సీతాలక్ష్మణులతో మునిబృందము కూడ తనవెంటరాగా మరికొన్ని ఆశ్రమప్రదేశముల దర్శించి అక్కడక్కడ చూపట్టెడు ప్రకృతి సౌందర్యమును తిలకించుచు ధర్మభృతుడను మహర్షి రామున కక్కడక్కడ ఆశ్రమవాసుల నిశేషముల తెలుపుచుండ పంచాప్సరోవరమును చూచి మాండకర్ణి తపఃప్రభావమున కచ్చెరువందినాడు.

మాండకర్ణి యను మహర్షి పదివేల సంవత్సరములు తపము గావించి తన తపఃప్రభావ సంపన్నత్వమున యోజన ప్రమాణముగల ఒక సరోవరమును నిర్మించుకొని ఆ సరోవరము క్రింద అయిదుగురు అచ్చరమిన్నలతో విషయసుఖము ననుభవించు చుండెను. అది పంచాప్సరోవరము. ఆ తటాకమున కడుగు భాగమున వారాలపించెడు మధురగానములు బయటకు వినిపించు చుండును.

రాముడట్లు ఋషిమండలముల చరించుచు పది సంవత్సరముల గడిపినాడు. తిరిగి సుతీక్ష్ణాశ్రమమునకు చేరుకొనినాడు. ఆ మహర్షి వారి ఆజ్ఞానుసారముగ వారి ఆశ్రమముననే మరికొంత కాలము గడచినది బ్రహ్మర్షులతో.

అవ్వటికి పాపభూయిష్ఠుల పాపకర్మల ఫలములను పుణ్యమూర్తులైన భక్త శేఖరుల పుణ్యఫలములను ఫలించు కాలము ఆసన్నమైనది. రామునకు అగస్త్య ముసీంద్రుల ఆశ్రమము స్మృతికి వచ్చినది. సుతీక్ష్ణమహర్షియు రాముని ఆ మహా తపస్వి దగ్గరకు పంప సంకల్పించినాడా నాడే. అంబరీష్మఖుల సంకల్పములట్లే యుండును.

రాముడు మహర్షి వారిని అగస్త్యాశ్రమ మెచ్చట యుండెనని అడుగగా సుతీక్ష్ణమహర్షి ఆ యాశ్రమమును గురించి రామునకు వివరించినాడు.

సుతీక్ష్ణాశ్రమమునకు దక్షిణ దిశయందున్నది అగస్త్యాశ్రమము. అగస్త్య భ్రాతాశ్రమమును అన్నగారి ఆశ్రమమునకు ముందే యున్నది. ప్రోవ మధ్యము నందున్నది పిప్పలీవనము. ఆ వనసీమల మధ్యనుండి రాముడు సీతాలక్ష్మణులతో అగస్త్యభ్రాతాశ్రమమునకు చేరుకొనినాడు. వనసీమలలోని ప్రకృతి సౌందర్యమును తిలకించుచు, ఆ రాత్రి వారు అగస్త్యభ్రాతాశ్రమమువనే వసించినారు.

ఉదయమైనది. అగస్త్యాశ్రమమునకు సీతాలక్ష్మణులతో కూడ రాముని పయనము సాగినది

ఆది అగస్త్యాశ్రమ ముఖద్వారము. రాముడక్కడనే నిలచి శిష్యునిముఖముగ తన రాకను మునివర్యులకు తెలిపినాడు.

అఖండ బ్రహ్మచైతన్యము భక్తానుగ్రహముచే ఇట్లు మూడు భాగములై వచ్చి చక్షుర్గోచరమగుట అగస్త్యులెరుగని విషయము కాదు.

మునిచంద్రుని రామచంద్రుడు కెదురుగ నిలచి, ఆశ్రమాభ్యంతరమునకు తోడ్కొని వెళ్ళినారు.

అగస్త్యుని ఆశ్రమాభ్యంతరమునం దెందరో దేవతలు వసింతురు. సిద్ధులెందరో అందుండి తమ నారాధించిన వారికి వరములిత్తురు. చతుర్ముఖేంద్రాది దేవతాస్థానములును అష్టదిక్పాలకులును గాయత్ర్యాది ఉపాస్య మూర్తులును అగస్త్యాశ్రమమున సాక్షాత్కరించగా రాముడా మూర్తుల దర్శించి, ఆ యాశ్రమాభ్యంతరమందలి క్రూరమృగముల మైత్రికి అచ్చెరు వందినాడు. అచ్చటి క్రూర మృగముల మైత్రిని శ్రీనాథుడు చక్కగ వర్ణించినాడు కాశీఖండమున ఆ వర్ణనను వినిపింతును వినుడు.

"కండూయనము సేయు గవటి భుండాదండ
పుష్కరమ్మున సింహపోతకంబు
వాలారుణకముల వదన మించుక ఎత్తి
ముద్దాడు పులి లేటి ముద్దరాలి
విండుకొగిట జేర్చి నెమ్మనై దోదేలు
కొదమచింబోతును గుస్తరించు
గుంజమంటప కుటీక్రోడ మధ్యంబున
నాఖుతో చెరలాడు నడవిపిల్లి

ఎండ దాకకయుండంగ నెత్తిపట్టు
బగల ముంగికి భుజగంబు పడగ గొడుగు
కోతితో మైత్రి వాటించు కొండగొరియ
యౌర్వశేయుని పుణ్యాశ్రమాంతరమున."

అంతలో ముసీంద్రుల అగ్నిహోత్రగృహము రామునకు దృగ్గోచరమైనది. పూజ్యపాదుల చరణసన్నిధి కేగినారు రాఘవేశ్వరులు. రాము డిప్పు డగస్త్యుని కతిథి. కావున ముసివర్యులు రామునకు ఆర్ఘ్యపాద్యాదివిధుల నర్పించినారు.

ఇంతతో అగస్త్యముసీంద్రులు రామునకందించదగు ఆతిథ్యము సమాప్తము కాలేదు. వేరొక ఆతిథ్యమున్నది. అది దేవరహస్యము. ఖరదూషణ త్రిశిరసాదులను రాముడు వధించవలెను. వారు సామాన్యములగు బాణములచే చచ్చువారు కారు.

రాము డొకనాడు తన బాల్యమునసే వరుడురాముని జయించి ఆయన వద్ద నున్న వైష్ణవాస్త్రమును తనస్వాధీనము గావించుకొని అది వరుణదేవుని కిచ్చినాడు. అది దేవేంద్రుని దగ్గరకు చేరినది. అది కేవల రాక్షస సంహారమునకై బ్రహ్మచే నిర్మించబడిన మహాస్త్రము. దేవేంద్రుడా యస్త్రము నిప్పుడు అగస్త్యముసీంద్రుల దగ్గరకు చేర్చినాడు రామున కిచ్చుటకే. ఆ యస్త్రమునే కాదు అక్షయతూణీరమును రెండు ఖడ్గములను కూడ సహస్రాక్షు డందించి వెళ్ళినాడు ముసీంద్రునకు. ముసీంద్రులు తాము చ్చిన ఆతిథ్యము పరిపూర్ణముకాగా ఈ ధనుర్బాణ ఖడ్గశరాసనములను కూడ రామున కొసంగినారు ఇవి దివేంద్ర దత్తములని చెప్పి. రాముడు వాటిని మునివర్యుల ఆశీస్సులతో అందుకొనినాడు. అంతతో వారి సంభాషణము ముగియ లేదు. అతిథిసత్కారము మాత్రమే ముగిసినది.

అగస్త్యముసీంద్రులు రామలక్ష్మణులు తనఆశ్రమమున కేతెంచుటచే తనకు కలిగిన ఆనందమును ప్రకటించి సీతతోకూడ మా యాశ్రమమున వసించి మార్గాయాసమును తీర్చుకొమ్మని ఆదర వాక్యముల పలికినారు. కాని రాముని కార్యక్రమము ఇది కాదు. ఆతడు వేరొక మహాకార్యమును స్వీకరించి, తాను వేరొక ప్రదేశమున నుండ నిర్ణయింపుమని మహర్షిని కోరినాడు.

రాముని సంకల్పము అగస్త్యు డెరుగనిది కాదు. "సాధులహృదయము నాయది, సాధుల హృదయంబు నేను" అన్న భగవదుక్తి త్రికాల సత్యముగదా,

అగస్త్యమునీంద్రు లొక్క ముహూర్త మాత్రము కన్నులమూసి ధ్యానించి వారు. వరమ పావనమై దేవతల కష్టముల నీడేర్చదగు పంచవటీ క్షేత్రము మునీంద్రుల కన్నులయెదుట నిలిచినది. ఇప్పుడు సీతారామ లక్ష్మణులను వడపదగిన దక్కడకే. ఆ ప్రదేశమునే రామునకు అగస్త్యమునీంద్రులు నిర్ణయించినారు. ఇక్కడ వాల్మీకిమహర్షి అగస్త్యులు రామునకు నిర్ణయించిన ప్రదేశ నిర్ణయము నిట్లు వర్ణించినాడు.

ధ్యాత్వా ముహూర్తం ధర్మాత్మా ధీరో ధీరతరం వచః॥

ధీరుడును ధర్మాత్ముడునగు అగస్త్యమహర్షి రెండు ఘడియల కాలము ధ్యానించి ధీరతర వాక్యమును పలికెనట. ఈ వర్ణనలోని అంతరార్థమేమి ?

"తస్యధీరాః పరిజానంతి యోనిం" అని శ్రుతి. ధీరులగువారే భగవత్తత్వము నెరుగుదు. కావున ధీరుడును ధర్మాత్ముడును అయిన ముని సీతాపహరణ కథాఘట్టమునే గాక రావణవధాంతము వరకును దర్శించి, రాముని భవిష్కార్య కలాపమును కూడ తన తపోనేత్రమున దర్శించియే ధీరతరముగ రాముని పంచవటీ క్షేత్రమున కేగుమని పలికె ననిరి కాకున్న భార్యాసోదరులతో వచ్చిన రాముని రాక్షసుల నోటి కందించునా ? సీత, లోకవిలక్షణ యని అగస్త్యులెరుగక పోలేదు. ఆమె మహా తపస్విని యని ఆత డెరుగును. "శ్లాఘ్యా చ వ్యవదేశ్యా చ యథా దేవీ హ్యరుంధతీ॥ అని సీతను ప్రశంసించినారు మునీంద్రులు. కావున సీతారాముల దివ్యత్వము నెరుగుటను అగస్త్యమునీంద్రులకు వాడిన విశేషణములతో వాల్మీకి మనకు తెలిపినారు. కావుననే అగస్త్యులు రాముని రాఘవా! నీవు నీ పితృవాక్య పరిపాలననునెరవేర్చి మరల అయోధ్యకేగుదువని భవిష్యత్తును పచించి నీవెందుకు మా ఆశ్రమము నుండి పయనమగుచుంటివో నాకు నా తపస్సుచే ముందుగనే తెలుసు ననినారు అగస్త్యులు.

హృదయస్థశ్చ తే ఛందో విజ్ఞాతస్తపసా మయా.

అంతేకాదు. రామునితో నీవు నీ భార్యను రక్షించుకొనగల శక్తుడవు కూడ వని వ్యంగ్యముగ అక్కడి రాక్షల బాధలను రామునకు తెలిపినారు మహర్షి. అక్కడ ఉండి తాపసులను రక్షించదగు బాధ్యత నీకు కలదని రాముని అవతార రహస్యమును వెల్లడించినారు కూడ. ఆ శ్లోకమును వినుడు.

"భవానపి సదారశ్చ శక్తశ్చ పరిరక్షణే
అపిచాత్రవసన్ రామ తాపసాన్నాలయిష్యసి॥"

విషయము నెంత నిగూఢముగ తెలిపిరో చూచితిరా? ఖరరాక్షస వధానంతర కథావస్తువు నంతను రాముని సామర్థ్య ప్రకటనలో ఇమిడ్చి, ఆ యవతారచరిత్రను వర్ణించినారు మునీంద్రులు. కథకు పోదము.

అగస్త్యాశ్రమమునకు పంచవటీక్షేత్రము రెండు యోజనముల దూరమునందున్నది? అది యొక మహాపవిత్ర క్షేత్రము. అందైదు మర్రిచెట్లు ఎంత కాలము నుండియో ఉండగా దానికా పేరు వచ్చినది. పవిత్ర గోదావరీమతల్లి ఆ క్షేత్రమునకు సమీపముననే ప్రవహించు చుండును. అగస్త్యాశ్రమము నుండి చూడగా కనుచూపు మేరలో యున్నది మధూకవనము. ఆ వనమునకు ఉత్తరముగ నున్నది ఒక మర్రి. ఆ చెట్టునకు ఉత్తరముగ పోవుచో ఆ ప్రదేశము లోంచెము మిట్ట యగుటచే ఆ మిట్టను ఎక్కగా పర్వతమువలె యున్నది. ఆ పర్వతమున కతి దగ్గరనె యున్నది పంచవటి, కావున అగస్త్యమునీంద్రులా మధూక వనమును చూపి, క్రోవను చక్కగ చెప్పి రాముని పయనము గావించినారు.

ఈనాటి యుపన్యాసము సమాప్తము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

శ్లో॥ సీతాయా దక్షిణే పార్శ్వే లక్ష్మణస్యచ పార్శ్వతః
తస్మాద్యే రాఘవం వందే ధనుర్బాణధరం హరిమ్

పంచవటీక్షేత్రము

మహాశయులారా !

మన అరణ్యకాండము నందిది రెండవరోజు. నిన్న రామచంద్రుడగస్త్యాశ్రమము నుండి బయలుదేరినాడు. ఈనాటి యుపన్యాసము ఆ పురుషోత్తముని పంచవటీ ప్రవేశమును, తూర్పునకా వృత్తాంతమును, పురాతనములగు అయిదు వట వృక్షముల వనికిచే దానికి పంచవటియని పేరు వచ్చినది. ఈ రామాయణ మహాకావ్యమున దేవమానవరాక్షస పాత్రలతోపాటు రెండు పక్షులు కూడ ముఖ్య పాత్రలై నిలచినవి. అందొకటి జటాయువు రెండవది సంపాతి. జటాయువు మన అరణ్యకాండమునందొక ముఖ్యపాత్ర కాగా సంపాతి కిష్కింధకాండయందు మన కగపడును.

రాఘవేశ్వరులు సీతాలక్ష్మణులతో అగస్త్యాశ్రమము నుండి పంచవటికి వచ్చుచుండగా రాముని కంటబడినది. చూచినక్షణమున రాముడా పక్షిరాజును రాక్షసుడనియే భావించినాడు. కాని దగ్గరకేగి, కోభవాన్ నీవెవరవని అడుగగా ఆ పక్షిరాజు నేను ప్రజాపతిసంతతిలోని దానను, నీ తండ్రియగు దశరథుని కాప్తమిత్రుడ నన్నది. రామున కాశ్చర్య సంభ్రమములు కలిగినవి. దానిని కౌగలించుకొనినాడు. అది రామునకప్పుడే ఆప్తమిత్రుడు కాగా దానితోకూడ పంచవటి కేగినాడు.

రాముని పంచవటీ క్షేత్ర ప్రవేశముతోడనే మహారాక్షసవధకథా ఘట్టమునకు మొదలు.

ఆ మహారణ్య మధ్యభాగమునసే రామాజ్ఞతో లక్ష్మణుడొక సుందరభవనము వంటి పర్ణశాలను నిర్మించినాడు. అది వాస్తుశాస్త్ర ప్రసిద్ధము. దానిని లక్ష్మణుడు కానారాధించు దైవమునకు నిర్మించుకున్న ఆలయమని కూడ మనము భావించ వచ్చును.

నూతన మందిరమునందు ప్రవేశించదగు శాంతి కలాపముల నిర్వర్తించియే వారందు ప్రవేశించినారు. శీతవాతాతపములు వారిని బాధించుటలేదనినారు వాల్మీకి. అది వారికి స్వర్గధామముకాగా వారందు దేవతలై వసించిరని కూడ వర్ణించినారు. తృప్తులగు వారికి సుందరభవనములును పర్ణశాలలును ఒక్కచేననుటకీ వర్ణన మొక ఉపదేశము.

అది హేమంతము. సీతారామలక్ష్మణులకు గోదావరీస్నానము తప్పలేదు. ద్వంద్వములగు శీతోష్ణముల సహించుచే వనమున వసించు ముని జీవితమునకు లక్ష్యము.

ప్రకృతికది వన్నెచిన్నెల ఋతువు. ధాన్యలక్ష్మికది నివాసమందిరము. వాల్మీకిమహర్షి సంవత్సరకాలమునకంతకును శుభమును కూర్చు ఋతువిదియనుచు భూదేవికీ ఋతువు శోభను కూర్చుచున్నదని వర్ణించినారు.

"అలంకృత ఇవాభాతి యేన సంవత్సర శుభః"

ఈ ఋతువునందు పండెడు పంటలను కూడ వర్ణించినారు కవి. ఋతు స్వభావము వంతను తీర్చిదిద్దినాడు. అదియొక గ్రంథమగును. కథకు వస్తువు.

ఒకనాటి ఘట్టము.

మధ్యగా సుఖాసీనుడైయున్న రామదర్శన మబ్బిన్నది అది శాపగ్రస్తులకు మోక్ష కాలము.

శూర్పనఖ ఇంతకు ముందెన్నడును ఈ దండకారణ్యమున దర్శించిన విగ్రహము కాదిది. దండకారణ్యమున కాదు,మరెక్కడనుకూడ ఆరాక్షసికంట బడ లేదిట్టి విగ్రహము.

ఒక్కమారుగ శూర్పణఖకి కామసుందరునిపై కామము ద్రేకించినది. ఆ రాక్షసి తన వికృతరూపమును మార్చుకొన్నది. సుందరాంగియైనది. రాక్షసులు కామ రూపధరులుగదా! సరాసరి రామునివద్దకేగినది. ఆ రాముని రాకకు కారణ మడిగినది సరాసరిగ.

రాముడ బద్ధమాడువాడుకాడు. అందును ఆశ్రమవాసము. తత్రాపిని స్త్రీ సమీ పము. ఆతడు తన చరిత్రనేల మరగు పరచును? తన యసార్థచరిత్రనే చెప్పినాడు. నీవెవ్వరెవను వది తరువాతి ప్రశ్నయేకదా?

రాముడు సౌందర్యవతియై వచ్చిన శూర్పనఖను రాక్షస స్త్రీయని గుర్తుపట్టి నాడు. సూటిగ శూర్పనఖను నీవు రాక్షసస్త్రీవని నాకు తోచుచున్నది. నీవిక్కడి కేల వచ్చితివో చెప్పుమనినాడు.

ఆ రాక్షసి ఆబద్ధమాడలేదు. రావణకుంభకర్ణ విభీషణులకు నేను సోదరి వన్నది. మా తండ్రి విశ్రవోనోబ్రహ్మయన్నది. నా ముగ్గురు సోదరులలో విభీష ణుడు ధర్మాత్ముడని చెప్పినది. కుంభకర్ణుని నిద్రమోతు తనమును వర్ణించి, రావ ణుని ప్రభావమును, ఖరదూషణాదుల బలమును కూడ చెప్పి, నేను నీ సౌందర్య మును చూచి నిన్నుకామించి వచ్చితినన్నది నన్ను నీవు భార్యనుగా పరి గ్రహించమన్నది. నీ భార్యా సోదరులు మన దాంపత్య జీవితమున కడ్డమగుచో పీరిద్దరను ప్రమింగుదువన్నది ఈ కన్యాకారణ్యభూముల స్వేచ్ఛగ చరింతమన్నది.

జనస్థాన వినాశమునకీ శూర్పనఖ కామోద్దీపనము బీజమనక తప్పదు. ఆ రాక్షసి వటుకులకు రాముని ముఖమండలమున చిరునవ్వు మొలకెత్తినది. రాముడు లక్ష్మణుని వద్దకు పంపినాడు ఏమనిచెప్పి పంపినాడు? అతడు "అకృతదారుడు, అనురూపశ్చతే భర్తా" అని చెప్పుచు మేరువునకు సూర్యకాంతివలె ఆతనికి నీవు తగుదువని చెప్పి పంపినాడు.

ఆ రాక్షసి రాముని వదలినది లక్ష్మణుని సమీపించినది లక్ష్మణా! నీవునాకు భర్తవు కమ్మన్నది. నేను నీకు తగిన భార్యనన్నది. లక్ష్మణుడు నవ్వినాడు. ఆ రాక్షసి పిచ్చితన మాతనికి కోపమును తెప్పించలేదు. కాని సమాధానమిట్లిచ్చినాడు.

కథం దాసస్య మే దాసీ భార్యా భవితుమిచ్ఛసి?

నేనొకరికి దాసుడను. నీవు నాకు భార్యవై దాసివగుటకు ఏమి బాగుండును? అని అంతతో ఆగక నాకు నాధుడైయున్న ఆ రామునే పెండ్లియాడుమని సలహా నిచ్చి, సీత సౌందర్యమును వర్ణించుచు ఆసీతను విడిచి నిన్నే అతడు పెండ్లి యాడునని కూడ చెప్పినాడు. అతడు పూర్వనఖతో మాట్లాడినది చమత్కార భాషణము. రాక్షసికి చమత్కారము తెలియలేదు. మరల రామునిదగ్గర కేగినది. పర్ణశాల లోపలికి వచ్చినది. అతి తీవ్ర రూపమున సీతను భ్రమింగుట కుద్యమించినది. కాని రాముని హుంకారమారాక్షసిని అడ్డగించినది. వెంటనే రాముడు లక్ష్మణుని పిలచి ఈరాక్షసిని వికృత రూపను గావింపుమని ఆజ్ఞాపించినాడు. లక్ష్మణుడు వెంటనే ఆరాక్షసి ముక్కుచెవులు కోసి శిక్షించినాడు. ఇది ఈనాటిపుట్టము.

ఒక్కమాట.

కొందరు ఒకస్త్రీ వచ్చి తన్నుకామించగా తనకు ఇష్టములేకున్న పొమ్మన వలెనుగాని ముక్కుచెవుల కోయుట రామునిదేమి న్యాయము? అని అందురు. నేటి విజ్ఞానవంతుల విమర్శనాజ్ఞాన పాటవము భారతీయ గ్రంథములయందలి రంధ్రాన్వేషణకే పనికి వచ్చుచున్నదిగాని భారతీయ విజ్ఞాన భాండారములలోని విజ్ఞాన రత్నముల నేకరింప సమర్థమగుటలేదు. విమర్శింతము.

నిన్ను పెండ్లి చేసుకొనదలచినాను. ఇప్పుడున్న నీభార్యను భ్రమింగుదును. తమ్మునికూడ భ్రమింగుదువని సతీసోదరుల భ్రమింగజూచిన రాక్షసి నేమిచేయవలెనట? దాని నోటికి వీరినందించ వలెనా? అక్కడికిని రాముడు మొదటిసారి దాని దృష్టిని మార్చుటకు మాత్రమే లక్ష్మణుని వద్దకు పంపినాడు. లక్ష్మణుడు కాదనగా మరల వచ్చి సీతను భ్రమింగబోయినది. హుంకారమున దాని ఉద్యమమును నివారించి, లక్ష్మణునిచే శిక్షింపజేసినాడు. అతడు శిక్షింపజేసినది తనను పెండ్లి చేసికొమ్మందుకు కాదు. సీతను భ్రమింగబోయినందుకు. అది యట్లుండ పూర్వనఖయే రామలక్ష్మణు లను "తాపసౌ ధర్మచారిణౌ" అని తమ్మునితో చెప్పినదిగదా! విమర్శకులకీ సత్యములు కనబడవు.

కథకు పోదము.

ముక్కుచెవులు తెగిన ఆరక్కసి వర్షాకాల మేఘమువలె గర్జించుచు, ఖర్ష ధారలవలె కారుచున్న రక్తధారలతోనే ఖరునివద్దకు వెళ్ళి స్మృతి తప్పి నేలకూలినది. ఆదృశ్యమును చూచిన ఖరునకు నాసోదరిక్షిట్టి అవమానమును కల్పించినవాడెవ్వడన్న రాక్షసాహంకారమొక్కమారుగ విజృంభించినది. కన్నులెర్రబడినవి. మతి తప్పినపడియున్న శూర్పనఖను లేపగా ఎట్టకేలకు కళ్ళను తెరచినది ఆమహా రాక్షసి. దానివే వృత్తాంతమడిగినాడు.

శూర్పనఖ ఏమని చెప్పును? సరాసరిగ తన వృత్తమును బయటపెట్టక రామ లక్ష్మణుల వర్ణించినది. ఆవర్ణన మపూర్వము.

రక్కసి కెక్కడనో వెనుకవక్క దాగియున్న భాగ్యరేఖ నేడుదయించి వది. కాకున్న రాముని రూపురేఖా విలాసములు దాని హృదయమున హత్తుకొనునా? కామరూపమున హత్తుకొన్నవి. శూర్పనఖ వర్ణనలోని ప్రధానాంశమేమి? రామ లక్ష్మణుల రూపురేఖావిలాసముల వర్ణించి తన కామమును రాముని వర్ణించుటతో అనుభవించుచు ఒకవంక వారు దశరథపుత్రులనియు మహాబల పరాక్రమములు కల వారనియుచెప్పి, నిజమునకు వారు దేవతలా? మానవులా? అని ఊహించుటకు అలవి కాదన్నది.

"దేవౌ వా మానుషౌ వా తౌ న తర్కయితు ముత్సహే"

వారిచరిత్ర ఊహకు అందరాని అతర్క్యమగు చరిత్రయన్నది. మహర్షి రాక్షసి ముఖముగకూడ వెలువడిన బ్రహ్మవస్తువు మనకందించినారు. ప్రకృతియే సీతయని చాటినారు రాక్షసి ముఖముగనే.

తరుణీ రూపసంపన్నా సర్వాభరణభూషితా
దృష్ట్వా తత్ర మయా నారీ తయోర్మధ్యే సుమధ్యమా॥ అని.

తరువాతది రాముడు జనస్థానమున ప్రదర్శించిన మహాబల పరాక్రమ వర్ణనము. అక్కడనే దేవతలకు కూడ భయభ్రాంతులు కలుగునట్లు తనలోని అనిర్వచనీయ పరాక్రమమును చూపినారు. అది క్రోధమయ విశ్వరూపము.

యు ద్ధ ము

అది రాక్షసుల కంతకాలము. శూర్పనఖ సీతను వర్ణించి నాకీవిక్కృతరూప పరాభవమువకు మూలకారణము ఆ స్త్రీమదయేనని ఖరుని యుద్ధమునకు పురి గొలిపినది.

వెంటనే ఖరుడు కదలలేదు. సీతారామ లక్ష్మణులను చంపి తీసుకొని వచ్చు టకు మహాబల పరాక్రమ శాలుర పదునాలుగువేలమంది రక్కసుల పంపినాడు, శూర్ప నఖయు వారికి దారిచూపు నెపమున బయలుదేరినది. వారి యుద్ధము మొదటిది.

శ్రోతలారా!

ఇక మీరిప్పుడు దశరథరాముని చూచుటకాదు ధర్మదేవత తనచేతనొక బాణమును ధరించి దుష్టరాక్షస సంహారమున కేతెంచినదని రామునిపై చూపుల నిలుపుడు. రాముడే ధర్మదేవత, ధర్మదేవతయే రాముడు

రాముడా పదునాల్గువేలమంది రక్కసుల చూచినాడు. సువర్ణమయమగు మహా చాపమును చేతబట్టినాడు ధనుష్టంకారము మారుమ్రోత మోగినది. ముందుగనే సీతను రక్షించుటకు లక్ష్మణుని ఆజ్ఞాపించినాడు. ఇక వారిని పరిమార్చవలెను. కారణమును ప్రతిపాదింపక మరణశిక్ష నెట్లు విధించును? రాక్షసుల కెదురై నిలచి తన వృత్తాంతమును తెలిపి, ఆదండకారణ్యమువసించు మహర్షులు తన్ను అభ్య ర్థించిరని చెప్పి, వారి పాపనిరూపణతో వారిపై యుద్ధమును ప్రకటించినాడు. వారితో రణరంగము సాగినది. శూర్పనఖ చూచుచుండగనే వారు భూమిపై ప్రాలి ప్రాణముల కోల్పోయినారు. వారొక విధముగ పుణ్యజీవులు. కాకున్న రామున కభిముఖులై ప్రాణములనెట్లు విడుతురు?

దండకారణ్య రాక్షస వధాఘట్టము పీఠికతో ప్రారంభమైనది. ఇక ఖరునితో కలసి మహాసైన్యము కదలవలెను.

ఆమహాసైన్యమును కదిలించి ఖరాది రాక్షసులను సంహరించుటకు నిమి త్తము శూర్పనఖయే కావలెను.

శూర్పనఖ సరాసరి ఖరునివద్ద కేగినది. సోదరుని రామునితో యుద్ధము నకు పురిగొల్పి ది. పదునాలుగు వేలమంది రాక్షసులతో చతురంగబలములతో ఖరుడు రామునిపై దండెత్తినాడు రాముడెవ్వడని ఖరుడూహించెను! రామలక్ష్మ

ఱులు సామాన్యమానవులని అడడూహించుచో ఇంక సైన్యమెందుకు? ఆ రాక్ష సుల దృష్టిలో రాముడు అమానుష పరాక్రముడు. నేటి అధునాతన వైజ్ఞానికుల దృష్టిలో మనుష్యమాత్రుడయ్యెను. కారణమును నేనూహింపలేను.

ఖరుని యుద్ధయాత్రసాగినది. రథ గజ తురగ పదాతి సైన్యము భూభాగము నాక్రమించినది. వారి శంఖధ్వానములు దిక్కుల పిక్కటిల్ల జేసినవి. ఆరక్కసుల వీరాలాపములు మిన్నుముట్టినవి. అప్పుడా సైన్యము కదలగా భూభాగము కదులు చున్నట్లున్నది. అయ్యెను ఖగోళ భూగోళములు రెండును ఖరా! నీకు జయము చేకూరదని శకునరూపమున జోస్యము చెప్పినవి. అహంకారులకీ శకున శాస్త్ర మెందుకు? అకాలమృత్యువుకు బలియగువారికి శాస్త్ర విశ్వాసముండదు.

ఖరుడు వెనుకకు తిరుగలేదు. ఇదియొక విచిత్రమగు యుద్ధదృశ్యము. ఇది ధర్మాధర్మముల పోరాటము. మహర్షిబృందమును దేవతాసమూహమును ఈ యుద్ధమున సైనికులుకారు, సైనికులు కాకపోరు. సంకల్పములకొక సత్యశక్తిని చేకూర్చుకొన్న సైనికులు. వీరు మాకెందుకు? అనుకొనలేదు. ఈచతుర్దశసహస్ర రాక్షసులతో పోరాడనున్న రాముని, పోరాటమునుకూడ చూచుటకు ప్రేక్షకులై నిలిచి ఆశీస్సులను అక్షతములతో రామునకు సాయము చేసినారు క్రిందమహర్షులు, పైన దేవతలు.

"స్వస్తి గోబ్రాహ్మణేభ్యస్తు లోకానాం యేభిసంగతాః
జయతాం రాఘవస్సంఖ్యే పౌలస్త్యాన్ రజనీచరాన్
చక్రహస్తో యథా యుద్ధే సర్వా నసురపుంగవాన్"

ఇది నేలపై ఋషుల జయధ్వానములు. వీరికంఠములతో ఆకసమున నిలిచిన దేవతల కంఠరవములు కలసినవి. రాముడు మాతము శకునముల పరికించినాడు. తనజయమునునిశ్చయించుకొనినాడు. సీతలక్ష్మణునిచే ఒక పర్వత గుహయందు రక్షింపబడుచున్నది. రాముడు యుద్ధమునకు సన్నద్ధుడై విలిచినాడు.

రాక్షస సైన్యమంతయు తమ తమ ఘోరవర్మ ఆయుధ ధ్వజ విశేషములతో రథములు నధిరోహించి కొందరును, పదాతులై కొందరును సింహనాదములు గావించుచు రాముసకభిముఖులై నిలిచినారు. ఆ రాక్షసానీకమయొక్క శంఖదుందుభి నినాదములతో ఆవనమంతయు నిండి కోలాహలముగా నున్నది. ఆఘట్టమున

రాముని చూపులొక్కమారుగ ఆరాక్షసానీకముపైకి వెళ్ళినవి. నలుమూలల తిరిగినవి. ఆరణ మండితుని దృష్టులుమరల రాముని వద్దకురాగా రాముడగ్నిమూర్తియై ప్రళయ కాలమందలి అగ్నిహోత్రునివలె వెలిగినాడు ఆరుద్రమూర్తిని వనదేవతలు చూడ జాలక పరుగులెత్తినవి. ఆరాక్షసానీకముతో రాముని యుద్ధము కొనసాగినది.

రాముడా రాక్షస మండల మధ్యమున కేగినాడు. ఖరుడు రథస్థుడై రాముని ఎదిరించగా రాక్షసులందరును రాముని మీదుమిట్టగా ఖరరాక్షసుని బాణ సహస్ర ములు రాముని ముంచివేయగా, రాముడారాక్షసులు పదలు బాణసహస్రములను సముద్రుడు తనలోనికి వేవేగమచ్చు నదీనదములు గ్రహించినట్లు గ్రహించినాడేగాని కొంచెమైనను వ్యధనొందలేదట. అనగానేమి? రాక్షసులందరును ఒక్కరూపులై రాముపైబాణవర్షములు కురిపించగా రాముడవలీలగ ఆబాణముల ఖండించుచుండెనేగాని ఆబాణముల తాకిడికాతడు గరికాలేదు. మరి రాముడు ప్రయోగించు బాణములో? అవి రాక్షసుల లోపలికివెళ్ళి వారిప్రాణములను తోడుకొని వచ్చుచున్నవేగాని అవి వ్యర్థమగుటలేదు. ఇక సైన్యము బ్రతుకు చేమున్నది? కన్నుమూసి కన్ను తెరచినంత కాలమునకే రాముడారణ రంగమున పదునాలుగువేల రాక్షసులను హతము గావింపగా ఖర దూషణ త్రిశిరసులను వారుమగ్గురు మాత్రమే మిగిలినారు. వీరిమగ్గురతోటియే రాముని ద్వంద్వ యుద్ధము మిగిలినది.

చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణాం
హతాన్యేకేన రామేణ మానుషేణ పదాతినా.

బలవంతులగు పదునాలుగువేల రక్కసులతో ధర్మమూర్తియగు రాముడొక్కడెట్లు యుద్ధము చేయునో భూతమని వారందరును కుతూహల పడినారు. మనమొక్క మారు వాల్మీకిమహర్షి నారద మునీంద్రులను ప్రశ్నించిన ప్రశ్నల దగ్గరకేగుదము. మునీంద్రా! "కస్యబిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే". ఎవడు క్రోధ మూర్తియై రణరంగమున నిలుచుచో దేవతలుకూడ భయచకితులగుదురో అట్టి పురుషుని చెప్పుమనినాము. అతడే ఇతడు. రౌద్ర రాక్షస హంతయై నిలిచినాడు. అట్లత్యుగ్రమూర్తియైయున్న రామచంద్రునిచూచి భూతములన్నియు గజగజ లాడినవట.

"ఆవిష్టం తేజసా రామం సంగ్రామ శిరసిస్థితం
దృష్ట్వా సర్వాణి భూతాని భయాద్విత్వ్యధిరే తదా.

అప్పుడు రామమూర్తియందు ప్రవేశించిన తేజము రుద్రతేజమనినారు వాల్మీకి.
"బభూవరూపం క్రుద్ధస్య రుద్రస్యేవ పినాకినః"

రాముడిప్పుడు పినాకపాణియైన రుద్రమూర్తియేకాదు. అగ్నిమూర్తి కూడ నట. "విధూమోగ్నిరి వోత్థితః" పొగలేక జాజ్వల్యమానమై వెలుగొందు అగ్ని మండలమువలె వెలుగొందెనట రాముని తేజము. ఇదిరాముని వీరరస ప్రధానమగు మూర్తి. విజయుడకు రామావతారమున రామ రావణ యుద్ధమువకంటె రాముని వరి పూర్ణ రసము రసవాహినియై ప్రవహించినది ఈరణరంగమువనే. రాముని వీరరస ప్రధాన కళ్యాణ విగ్రహమును దేవతలీ రణరంగమున దర్శించుట జరిగినది. ముప్పది మూడుకోట్ల దేవతలును తమ విమానములనెక్కి ఈ మూర్తిని చూత మనియే వచ్చినారు వధ్నాలుగు వేలమంది రాక్షసులు, రాముడొక్కడు యుద్ధమెట్లు జరుగును? అన్నది దేవతల ప్రశ్న.

చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణాం
ఏకశ్చ రామో ధర్మాత్మా కథం యుద్ధం భవిష్యతి?

పైనికులు నాశము కాగా మిగిలివవారు ఖర దూషణ త్రిశిరసులు ముగ్గురు. అందు దూషణ త్రిశిరులను వారిద్దరును చావగా ఖరుడొక్కడే మిగిలినాడు. ఖరుడును విరధుడు కాక తప్పలేదు. కాని ఖరుని చేతనొక గద మిగిలినది. గదను చేతధరించి ఆతడు భూమిపై విలిచినాడు. ఖరుడే ఇక్కడ ప్రధాన నాయకుడీ రాక్షస గణమునకు. ఆతనికి కొన్ని నిర్ణయముల చెప్పి, ఆతనితో యుద్ధమును చేసి, ఆతనిని అంతమొందించదలచినాడు రాముడు, రాముడు ఖరునకీ సమయమున చెప్పినవి మాటలుకాదు. శాస్త్ర సిద్ధాంతము.

ఇప్పుడు చేసిన కర్మ జన్మాంతరమున ఫలమునిచ్చునా? ఈలోకమునకూడ ఇచ్చునా? అన్నవి ప్రశ్నలు. రాముడీ రెంటికిని సమాధానమిచ్చి లోకకంటకుడగు వాడెంత బలవంతుడైనను ఆతనిని మృత్యువుబలిగొనక తప్పదని నదుపదేశమిచ్చి చంపినాడు. అందొక ఉపదేశమిది.

"ఉద్వేజనీయోభూతానాం నృశంసః పాపకర్మకృత్
క్రయూణానుపిలోకానాం ఈశ్వరోపి న తిష్ఠతి.

ఎవ్వడు లోక కంటకుడై ఘాతుక కృత్యములకు పాల్పడునో ఆతడు మూడు లోకముల ప్రభువయ్యును జీవింపజాలడట. ఆతీక్షణస్వభావుడగు వాని చావును సర్వ

జనులను కోరుచుందురట. అందుకు విష సర్పము నుదహరించినాడు. తీక్ష్ణం సర్వజనోహంతి సర్పం దుష్టమివాగతం" అని.

రెండవది.

"అవశ్యం లభతే జంతుః ఫలం పాపస్య కర్మణః
ఘోరం పర్యాగతే కాలే ద్రుమాః పుష్ప మివాంతరం.

ఏ జంతువైనను పాపకర్మఫలమును అవశ్యమనుభవించును. కాని కాలము రావలెను. పుష్పఫలాదికము ఎట్లు ఋతుకాలమున నను సరించునో కర్మఫలము జీవుల నట్లనుసరించునట.

ఈ మాటలను చెప్పి ఖరునితో యుద్ధము నారంభించినాడు. ఖరుని చిత్తమే మైన మానునేమోయని ఉపదేశించినాడు. మారలేదు ఆ దుర్మార్గుని చిత్తము యుద్ధము తప్పలేదు. ఖరుడు సామాన్యుడు. ఖరుని యుద్ధము రాముని వెనుకడుగు వేయించినది. నిమిత్త మాత్రముగ రాముడు వెనుకడుగు వైచి ఒక మహోగ్ర బాణమును తీసినాడు. అది దేవేంద్ర దత్తము. దేవేంద్రుడు పంపినది. బ్రహ్మదండ సమానము. అదియే ఖరుని కూల్చినది. ఖరుడు చచ్చినాడు. యుద్ధము సమాప్తమైనది. దేవర్షి బ్రహ్మర్షి రాజర్షుల కోర్కెలు తీరినవి. లోక కల్యాణము చేకూరినది. వారందరును రాముని సమీపించి తమ హర్షమును తెలిపినారు. ఒక్క విషయము.

రామువిక్కడకు చేర్చిన వారెవరు? ఋషులందరును కలిసి మేమే విన్నిక్కడకు చేర్చితిమని చెప్పినారు. శరభంగాశ్రమమునకు దేవేంద్రుడు వచ్చుటను చెప్పినారు. యుద్ధరంగము శాంతమైనది. మహర్షులతో ధనుర్ధారియైన రాముడు పర్ణశాల కేగినాడు.

అది సీతారాముల పర్ణశాల. మహర్షులందరితో ధనుర్ధారియై రాముడు రాగా సీతాకాంతయు లక్ష్మణుడును గిరి గుహలుండి ఆశ్రమమున కేతెంచినారు. సీతాకాంత చూపులొక్కమారుగ తన ప్రాణనాథునిపై బడినవి. అలయక సొలయక ఒక్క అర్ధాధిక ముహూర్తకాలమున పదునాలుగువేల రాక్షససైనికమును వధించి వచ్చిన ఆ మనోహర మూర్తిని చూచిన సీతాకాంత హృదయ మొక్కమారుగ ఉప్పొంగినది. ఆమె విదేహరాజతనయ. రాముని చుట్టియున్న మహర్షులందరును

ఆమెకు బిడ్డలై కన్పట్టగా ధనుర్బాణముల ధరించి మనోహర మూర్తియై తన ఎదుట నిలిచిన ప్రాణనాథుని చూచి ఎట్లూరకుండగలదు? అశోకైకజనని తన బిడ్డలకంవర కును ఆనందమును చేకూర్చిన ప్రాణనాథునకు తన సంతోషమును తెలువ రామని గాఢాలింగనము గావించినది. ఈ సన్నివేశమునే మనోహరముగ వాల్మీకి వర్ణించి నారు తగిన పదజాలమున. శ్లోకమిది.

"తందృష్ట్వా శత్రుహంతారం మహర్షీణాం సుఖావహం
బభూవ హృష్టా వైదేహీ భర్తారం పరిషస్వజే"

శత్రువుల సంహరించి మహర్షులకు సుఖమును కల్పించి వచ్చిన భర్తను చూచినదట సీతాకాంత. సీతాకాంత కాదు, వైదేహియట. వాల్మీకి ఇక్కడ సీతయన లేదు వైదేహియనినారు. చూడటతోడనే ఆమె మనస్సొమైపదట, సంతోషమున నిండినదట. కావుననే ఆమె వైదేహియైనది. విదేహరాజతనయ సార్థకనామధేయము గలదైనది ఒదలు మరచినది. ఆమె శరీరమును మరచి భర్తను కౌగలించినది. సామాన్యముగ కౌగలించుటకు ఆలింగన పదమును వాడక పరిషస్వజే అనినారు. ఈ పదమొక్క ప్రత్యేకత ఏమి? కౌగలింత సామాన్యముగు ప్రేమను సూచించగా పరిష్వంగము గాఢముగు ప్రేమను చెప్పును. తన ఉన్నత కుచమండలములతో నాథునికి యుద్ధమునందు కలిగిన శరీర వ్రణముల మాన్చినదా? యనునట్లు కౌగి లించినదను భావమును కవి సూచించినారు. అనగా ఆమె శరీరమునందలి ఒక భాగ మునేగాక ఆ శృంగార మూర్తియొక్క వెనుక ముందడలను పార్శ్వ భాగములను కూడ గాఢానురాగమున కౌగలించి, స్పర్శ సౌఖ్యమును కల్పించినదని భావము. మరి వర్ణించక శృంగారమునేల వర్ణించిరి? అని మీరనుకొనవచ్చును. మీరనుకొనుట కాదు, వాల్మీకి మిత్రుడు అడిగినాడు కూడ. మీకీ ఘట్టమునందలి సంభాషణను వినిపించెదను.

మిత్రుడు: శాస్త్రిగారు! కోపించకండి. నాకొక సందేహమును తీర్చుకొనుటకయ్యో మిమ్మొకటడుగుదమంటిని.

నేను: తప్పక అడుగవలసినదే.

మిత్రుడు: ఆర్షగ్రంథములు చాల ధర్మయుక్తములుగదా?

నేను: అవును.

మిత్రు : మరి ఆ గ్రంథములయందు దేవుడు పేరు చెప్పి పచ్చి శృంగారమును వర్ణించుట సభ్యతయేసందురా?

నేను : వారు వర్ణించునది పచ్చిశృంగారము కాదు. వరివశ్యముగ వండిన శృంగారము.

మిత్రు : అంటే?

నేను : నీవనుకొన్న పచ్చిశృంగారము మోహములోనిది. వండినశృంగారము ప్రేమ మూర్తులలోనిది. మోహముచే అనుభవించు శృంగారమున దుఃఖమిమిడి యుండగా ప్రేమ శృంగారమున జన్మరాహిత్యమునకు తావు కలుగును. సీతారాములు ప్రేమమూర్తులు. పార్వతీ పరమేశ్వరులు ప్రేమమూర్తులు. రాధాకృష్ణులు ప్రేమమూర్తులు. పార్వతీ పరమేశ్వరులకే కామేశ్వరీ కామేశ్వరులని పేరు. రాధాకృష్ణులును, సీతారాములునుకూడ కామేశ్వరీ కామేశ్వరులే. పరిపూర్ణానందము నొసంగునది ప్రేమ. క్షణికానందము నొసంగి, మరుక్షణమున దుఃఖరూపముగ పరిణమింప చేయునది మోహము. ప్రేమమూర్తుల శృంగారము అఖండము. ఆ శృంగారమున ఖండత్వములేదు. పూర్ణమస్వారము విసర్గలైనట్లు (ఆరమున్నలైనట్లు) పరిపూర్ణ శృంగారము, లేక పరిపూర్ణ ప్రేమ రెండు ఉపాధులైనది. అంతియే. అఖండాత్మ ఖండాత్మయగు జీవుని కాశ్రయమైనది. స్త్రీత్వము ఖండాత్మయగు జీవుడు కాగా, పూర్ణాత్మ పురుష ఉపాధితో జీవుని కాశ్రయమైనది. రాముడు పూర్ణానంద విగ్రహము. సీత జీవుడు (లేక) క్షేత్రము, మాతృమూర్తి. సీతారాముల పవిత్ర ప్రేమామృత స్వరూపముగ దర్శించినవారు మహర్షులు. వారా సీతారాముల పరిపూర్ణ శృంగారమును వర్ణించి కృతార్థులై మనల కూడ కృతార్థుల గావింపమున ఇతిహాస పురాణకావ్యములందు ఆపవిత్ర శృంగారమును వర్ణించినారు. పర బ్రహ్మము రస స్వరూపము. "రసోవైసః" అని శ్రుతి. కామేశ్వరుని ప్రేమ రత్నమువలె ప్రతిఫలమై యున్నది కామేశ్వరీ మహాదేవి కుచ ద్వంద్వము. "కామేశ్వర ప్రేమరత్నమణి ప్రతిపణస్తనీ" అని లలితా సహస్రము. ఆ వరమేశ్వరి కుచద్వంద్వము ప్రణవము. (ఓంకారము) మిమ్ములను మిత్రులుగనే గ్రహించి నేనొక సలహాను చెప్పదలచినాను. మీరెప్పుడును ప్రస్తుత కాలమున నేపీన పండితుల పాండిత్య విమర్శల నాధారముగా గొని మన గ్రంథములను చూడ వద్దని. మీకేమైన కోపమా?

మిత్రుడు : నా సందేహము తీరినది

నేను : ఏ నిర్ణయముపై తీరినది?

మిత్రుడు : పరిపూర్ణాత్మకీష్టులై స్వార్థపరులుగాక, విషయ భోగముల వదలిన మహర్షులకు సభ్యత తెలియనిచో అల్పప్రాణులను, అల్పాయుష్కులను అయిన వీరికి సభ్యత తెలియుటేమిటి? అని నా మనస్సునకు నిర్ణయమైనది ఇప్పుడు. ఇట్లే మిమ్మలను మీ ఉపన్యాసములలో కలుగు సందేహముల నక్కడక్కడ అడుగుచుండెదను. క్షమించి చెప్ప ప్రార్థన.

నేను : ఇంతకంటె నాకు మహాభాగ్యమేమున్నది? తప్పక చెప్పెదను. ఉపన్యాస మధ్యమున కాక ఒంటరిగా వచ్చి అడిగినందుకు చాల సంతోషమని చెప్పి, మిత్రుని పంపినాను. ఈ ఘట్టమున రాముని సీత కౌగలించినదన్న వర్ణన లోని రెండవ శ్లోకమిది.

"తతస్తు తం రాక్షస సంఘమర్దినం
సభాజ్యమానం ముదితైర్మహర్షిభిః
పునః పరిష్వజ్య కపిప్రభావనా
బభూవ హృష్టా జనకాత్మజా తదా.

రాక్షస సంఘమును మర్దించి ఆనందాతిరేకము ననుభవించు మహర్షులచే పూజింపబడు ఆ రఘురాముని ఆ జనకాత్మజ పరమానందమున చంద్రమండల సదృశ ముఖమండలముతో మరల మరల కౌగలించి ఆనందించినట ఆ సమయమున.

ఇంతటితో ఈనాటి ఉపన్యాసమును ముగింతము తరువాతి కథాభాగమురేపు. లేవకండి. ఈనాటి కథాశ్రవణమున కలుగు ఫలమును స్కాందపురాణము ఇట్లు చెప్పినది.

"కృత్వా శ్రీరామ చరితం పాపబంధాత్ప్రముచ్యతే
తదైవ కృంఖలాబంధాత్ ఋణబంధాద్విముచ్యతే.
కృత్వా పుష్పవతీ నారీ తనయం వంశవర్ధనం
లభతే రాఘవేంద్రస్య ప్రసాదా త్కీర్తివర్ధనం.

ఈ ఖరదూషణాదుల వధించిన శ్రీరామ విజయమును వినుటచే పాపము తొలంగునట. కారాగృహబంధము విముక్తమగునట. ఋణవిముక్తుడగునట. రజస్వలయైన అయిదవ రోజునుండి ఈ కథాశ్రవణము చేసినస్త్రీకి రామానుగ్రహముచే సత్సంతానము కలుగునట గూడ.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

3 వ రోజు

శ్లో॥ జయతు విజయకారీ జానకీ మోదకారీ
తపన కుల విహారీ దండకారణ్య చారీ
దశవదన కుఠారీ దైత్య విచ్ఛేదకారీ
మణి మకుట ధారీ చండ కోదండధారీ

మహాశయులారా !

అరణ్య కాండము నందీనాటి ఉపన్యాసము మూడవది. రాఘవేశ్వరుని జ్యావల్లీ వినాదము జనస్థానమున శాంతించినది. ఇక లంకాద్వీపమున మారు మ్రోగవలెను. సీతాపహరణము దాని కథా బీజము.

అకంపనుడు జనస్థానమున మిగిలిన రాక్షసుడు. రావణుని హితుడు. జనస్థాన వినాశము రావణునకు తెలుపుటకై ఆతడు లంకకేగినాడు. అప్పుడే ప్రహస్తాది మంత్రి వర్గముతో తీర్చిదిద్దిన సభాస్థలి నలంకరించి కూర్చొనినాడు రాక్షసరాజగు రావణుడు.

అకంపనుడు రావణునకు జోహారుల నర్పించి జనస్థాన వృత్తాంతమును తెలిపినాడు. కాని రాముని పరాక్రమమును మాత్రము విశదీకరింపలేదు. తాను చెప్పుదానిని క్షమించి రక్షించుటకు దశగ్రీవుడభయప్రదానము చేసిన గాని చెప్ప

పిలుచేదు. రావణుని ఆజ్ఞయైనది. అకంపనుడు రాముని చరిత్ర సంక్షేపమును సంగ్రహముగ చెప్పి, అతని స్వరూప స్వభావ సౌందర్యములు వర్ణించి ఆతడొక్కడే మూడు ఘడియల కాలమున జనస్థానమును హతమార్చినాడని తెలిపినాడు.

రావణుడు తన పరాక్రమమునకు దీటగు పరాక్రమ మీముల్లోకములందును లేదని ఆత్మనిశ్చయము కలిగియున్న వ్యక్తి. రాముడొక్కడే ఆరాక్షసుల చంపె నన్న వార్తను ఎట్లు నమ్మును? "ససురేంద్రేణ సంయుక్తో రామస్సర్వామరై స్సహ" రామునకేమైన దేవతలతో వచ్చి దేవేంద్రుడు సాయము చేసెనా? అని ప్రశ్నించినాడు. ఆ ప్రశ్నకు అకంపనుడు సమాధానము చెప్పవలెను. ఆతని ఒళ్లు వణకినది. ప్రభూ చెప్పమందురా? అని సవినయముగ ప్రశ్నించి రాముని అద్భుత పరాక్రమములో కూడిన యుద్ధము వర్ణించినాడు.

ఆ రాముడు జ్యావల్లీ నినాదమును గావించి, వారిని ఆకర్ణాంతముగ లాగి విశిఖ వ్రాతముల వదలునప్పుడు ఆబాణసహస్రములు అయిదు తలల సర్ప రాజములై రాక్షస సమూహమును భక్షించుట గాక అప్పుడు వారే యేదిక్కులకు వరుగులెత్తి తప్పించుకొన జూతురో ఆయా దిక్కులకెల్ల ఈబాణ సహస్రములు వరుగులెత్తి వారిని చంపినవని చెప్పినాడు.

శత్రువులకు దుర్నిరీక్ష్యుడై లోకమునెల్ల గజగజలాడించిన రావణుడు అకంపనుని మాటల వినగనే ఆరాముని సంహరింతునని ఉగ్రమూర్తియై లేచినాడు.

అకంపనుడు రావణుని బలా బలముల నెరుగనివాడుకాదు. నిజమునకు రావణుని సచివుల కందరకును రావణుని నిరంకుశత్వము నెట్లు మరల్చవలెనో తెలిసియే వారాతనివద్ద మెలగుచుండి. రామునితో యుద్ధమున మీరు గెలువలేరన్నచో అప్పుడే ఆతడు తనను చంపును. అందుకు అకంపనుడు రాముని యుద్ధరంగమున గెల్చుట సాధ్యము కానిపనియని రావణునకు చెప్పుచునే రాముని చంపదగు వేరొక ఉపాయమును గూడ చెప్పినాడు.

అకంపనుడొకమారు రాముని భార్యయగు సీతను వర్ణించి, రాముడు కాము కుడవి చెప్పి, ఆ సీతను మీరెత్తుకొని వచ్చుచో ఆ ప్రియురాలి వియోగమును సహించలేని ఆతీముడు తనంతట తానే కృశించి చచ్చునని సలహా నిచ్చినాడు.

రావణునకు అకంపనుని వాక్యము చాల నచ్చినది. తలను పంకించినాడు రావణుని వంటివారి దగ్గర ప్రతుక తలచిన వారట్లే మాటలనేర్చి ప్రతుకవలెనేమో.

రావణుడు సీతాపహరణమునకు పయనమయ్యెను. సారథి రథమును గూడ ఆయత్తపరచినాడు.

రావణుని రథము దివ్యము. అదిభూమిపై నడచుటదికాదు. ఆ రథవాహకములు గుఱ్ఱములు కావు. గార్దభములు. ఆ దివ్యస్యందనము మేఘ మండలములను గూడ చాటుగావించుకొని మహావేగముగ పయనించును. ఇప్పుడట్లే పయనించినది.

మారీచుడు రావణుని ముఖ్యస్నేహితుడు. సచివుడు కూడ. అతడిప్పుడు ఒక ఆశ్రమమును నిర్మించుకొని ఈ దండకారణ్యములందే వసించుచుండెను. ఇది ఋషి జీవితము కాదు. రావణునిరథము మారీచాశ్రమము వద్ద నిలిచినది. మారీచుడు మనకు క్రొత్తవాడు కాడు. ఇతడు తాటకి కొడుకు. తాటకియు మారీచుడును కూడ మనకు బాలకాండ యందు పరిచితులు. తాటకి చావగా మారీచుడు క్రుతికియుండెను.

రావణుడు రథము దిగి ఆశ్రమమున కాలుబెట్టినాడు. మారీచుడు లేచి పాద్యార్ఘ్యములనిచ్చి గౌరవించుట జరిగినది. తరువాతి కుశలప్రశ్నలలో రావణుడు ఔపస్థాన వృత్తాంతమును మారీచునకు తెలిపినాడు. ఇక ప్రస్తుతమగు తన అవసరమును చెప్పవలెను. చెప్పినాడు. తానిప్పుడు చేయదలచిన సీతాపహరణ మహాకార్యమునకు నీసహాయము లేక నెరవేరదని.

నేటి మారీచుడు ఒకనాడు రావణుడెరిగిన మారీచుడుకాడు. రాముని బాణపు దెబ్బలలోని రుచిని కనుగొన్న మారీచుడు. ప్రస్తుతమున రావణుని హితమును కోరిన మారీచుడు. రావణుడు తలబెట్టిన ఈ నీచకార్యము రావణుని స్వబుద్ధి కాదని ఆతడు గ్రహించినాడు. పరోపదేశమని నిర్ణయించుకొనినాడు. వినయ పూర్వకముగనే రావణుని సూటిగ ప్రశ్నించినాడు.

ఆఖ్యాతాకేన సీతాసామిత్రరూపేణ శత్రుణా

మహారాజా! నీకీ ఉపాయమును చెప్పిన మిత్రరూప శత్రువెవ్వడవి. అంతతో ఊరుకొనలేదు. నీవు తలబెట్టిన ఈకార్యము నీవినాశనమునకేగాక సర్వ రాక్షసవినాశనమునకు గూడ కారణము కాగలదని ఉద్ఘాటించినాడు. మనకు పర్యవసానమేమితేలినది? అకంపనుని ఉపాయము రావణుని చంపుటకేనని తేలినది. ఇట్టి వారెందరో రావణుని దగ్గర ఉండిరి. మిత్రరూప శత్రువు లిట్లుందురని కావ్యవాణి పలవ మనము గ్రహించవలెను.

తరువాతి కథ.

రావణునకు మారీచుడు రాముని పరాక్రమమును వర్ణించిచెప్పి, రాక్షసేంద్రా! నీవు నీలంకకేగి నీభార్యలతో క్రీడించి తృప్తినొందుట మంచిదని చెప్పి, రాముడు ఆతని ఏకైక పత్నితో అరణ్యముల వసించునని హితబోధను చేసినాడు. సామదాన భేద దండోపాయములతో రావణుని ఈకార్యము నుండి మరల్చినాడు. ఈఘట్టమున రాముడను సింహము, రాక్షస మృగముల చంపి ప్రస్తుతము నిద్రనొంది యున్నది. ఆ సింహము నెందుకు లేపెదవని భయపెట్టగా రావణుడు తిరిగి లంకకేగినాడు. ప్రస్తుతమున రావణుడీ కార్యమునుండి విరమించినాడు. వచ్చిన దారిని లంకకేగినాడు. తన విశాల భవనమున ప్రవేశించినాడు.

మృత్యువు జీవులను బలిగొన దలచినప్పుడు వారి కర్మాను గుణ్యముగ ఆ ఫలమునందించ దలచి తన దగ్గరకు పంపించదగు ప్రేరకులను ఆజీవుల దగ్గరకు పంపును. అప్పుడా ఫల పరిపాకము గావించు దేశకాలములు మృత్యువున కధీన ములై యుండును.

రావణ వినాశనమునకును లంకాపురీ విధ్వంసమునకును హేతుభూతమగు పాత్ర శూర్పణఖ యనక తప్పదు.

మారీచాశ్రమము నుండి సీతావహరణ కార్యమును విరమించుకొన్న రావణుడు తన పుష్పకవిమానాగ్రభాగమున సూర్యమండల కాంతివలె వెలుగొందు కాంచన సింహాసనము నధిష్ఠించియున్న సమయమది. ఆతని మంత్రిమండలి అంతయు ఆతనివి చుట్టియున్నది. దానిని మరుద్గణములతో కూడిన దేవేంద్ర సభ యనుట అతిశయోక్తి కాదు.

నేడే మహాభాగ్యవంతుని భాగ్యమును కూలద్రోయ తలచుకొన్నది శూర్పణఖ. అందుకు కారణము లేకపోలేదు. ఉన్నను అది అంతర్గతము. శూర్పనఖకు వైధవ్యమును చేతబెట్టినవాడు రావణుడే. శూర్పణఖ భర్త రావణుని చేతిలోనే చచ్చెను. కావున రావణుని నాశనము గావింపదగు సమయమిదియేనని శూర్పనఖ యూహించెనేమో ? శూర్పనఖకు రాజనీతి లేదని మనమనుకొనకూడదు.

శూర్పణఖ సరాసరి లంక కేతెంచినది. సభాసీనుడైన రావణుని చూచినది. రావణుని ఉనికిని విమర్శించినది. జనస్థానమట్లు రామునిచే నాశనము కాగా రాక్షస

రాజువైన నీవిట్లు కూర్చుని శత్రువు నుపేక్షించుట రాజనీతి కాదని రాజనీతిని ఉపన్యసించి సోదరుని చివాట్లుపెట్టి రావణుని చిత్తమును ఉద్రేకింప జేసినది. అకంపనుని వలన రాముని బలపరాక్రమములను విన్న రావణుడు శూర్పనఖను మరల ప్రశ్నించి యుద్ధవిశేషముల నన్నిటిని అడిగి తెలుసుకొనినాడు. ఇంతవరకు అకంపనువకును శూర్పనఖకును తేడాలేదు. కాని శూర్పనఖ సీతాపహరణ కార్యము నందు రావణుని విమర్శని కావించినది. అది శూర్పణఖలోని నైర్పరితనము. శూర్పనఖ తన వికృతాకారమునకు కారణమును చెప్పుచు రామలక్ష్మణుల దగ్గరకు తాను వెళ్ళినది రావణుని కొరకేనని రావణుని ఆళగొలిపినది. నీ కొరకు వెళ్ళియే నేనిట్టి అవస్థపాలైతిసన్నది. నాకొరకేల వెళ్ళితివి ? అందువేమో. రాముని భార్య యగు సీత త్రిలోకసుందరి యగుటచే ఆ సీతను నీకు పెండ్లాముగ చేయుటకు యత్నింప వెళ్ళితినన్నది. ఆమెలోని సౌందర్యమున కుపమానము దొరకదన్నది. ఆమె ఎవరిని సంతోషమున కొగలించుకొనునో వానికిక కొరతలేదన్నది. ఆమె కొగలించిన పురుషుడు దేవేంద్రుని కంటె గొప్పవాడన్నది.

యస్య సీతా భవేద్భార్యా యం చ హృష్టా పరిష్వజేత్
అతిజీవేత్సర్వేషు లోకేష్వపి పురందరాత్.

ఈవిధముగ చెప్పుట అకంపనునకు కుదరలేదు. రావణుని హృదయమున సీతా సౌందర్యమునేగాక ఆసుందరి ప్రత్యేకతను ముద్రించినది. రావణుని ఎవ్వరు కాదన్నను ఆ సీతాపహరణ కార్యమునుండి వెనుదీయకుండునట్లు తయారుచేసినది. శూర్పనఖ ఉపన్యాసములోని ప్రత్యేకత ఏమి? నీమీదనున్న ప్రేమచేతనే నాకీ గతి పట్టినదని తేల్చినది. కాని ధర్మాత్ముడగు రాముడు నన్ను చంపక వదలెనన్నది. నీకు చెప్పితినని కాదు, ఆసీతను చూచిన నీకే తెలియునని రావణుని గట్టిపరచినది.

రావణుని హృదయమున సీత దివ్యసౌందర్యము ముద్రితమైనది. మన్మథుడును తన బాణమును రావణునిమీనికి అనుసంధించినాడు. మారీచుడు వర్ణించిన రాముని వీరత్వమును రావణుడు తలచలేదు. రాముని వలన భయము తీరినది. ఏదియో తనకో నిశ్చయించుకొనినాడు.

రావణుడు సభనుండి లేచినాడు తానెక్కడికి పోవుచుండెనో ఎవ్వరికిని చెప్పలేదు. వాహనశాల కేగినాడు. రథమునెక్కినాడు. అది రావణుని సంకల్పము ననుసరించి వెళ్ళదగు రథము. (కామగము)

అతడు పదిశిరములతో ఇరువది బాహువులతో తన తేజమును విరజిమ్ము చునే బయలుదేరినాడు. మరల తన ఆప్తమిత్రుడగు మారీచుని ఆశ్రమమునకే వెళ్ళినాడు మారీచునితో పాతపాటనే పాడినాడు. నా సీతావహరణమునకు నీ సాహాయ్యము తప్పదనినాడు

మారీచుని గుండె బ్రద్దలైనది. ఒడలు వణకినది పెదవులెండినవి ముఖము శుష్కించినది. మృత్యువాతని కెదురై నిలచెనను భావముదయించినది. ఇప్పుడు రామరావణులిద్దరును అతనికి మృత్యువులయ్యే యుండిరి. రావణుడు చెప్పినది కాదన్నచో ఇతడు మృత్యువు. అవునన్నచో రాముడు మృత్యువు. ఎట్లయినను తన చావు తప్పదనుకొనినాడు.

వాల్మీకి మహర్షివారి దృక్పథమున మారీచుడిప్పుడు మహాప్రాజ్ఞుడయ్యెను.

"ప్రత్యువాచ మహాప్రాజ్ఞః మారీచో రాక్షసేశ్వరం॥"

అనినారు మహర్షి.

రాముడెవ్వడో రావణున కాతడు తన అనుభవమును ఆధారముగాగొని బోధించినాడు.

ఆతని బోధామృత ముఖ్యసూత్రమిది.

"రామో విగ్రహవాన్ ధర్మః సాధుస్సత్య పరాక్రమః
రాజా సర్వస్య లోకస్య దేవానాం మఘవానివ."

రాముడు విగ్రహరూపము ధరించియున్న ధర్మమట. సాధుమూర్తి యట. ఆతని పరాక్రమము త్రికాల సత్యమట. రాముడీ భూలోకమునందలి అయోధ్యా రాజ్యమునకే రాజుకాడట. సర్వలోకములకును ఆతడు ప్రభువట. మువ్వదిమూడు కోట్ల దేవతలకెల్లు ఇంద్రుడు ప్రభువో అట్టివాడట రాముడు. ఇది మారీచుని నిర్ణయము. ఈ నిర్ణయమును చెప్పి, ప్రస్తుత పరిస్థితిని చెప్పినాడు.

రావణా! రాముడు దండకారణ్యమున ప్రవేశించిన తరువాత నాజీవితము మారినది, నేనొకనాడు దీప్తజిహ్వా తీక్షణ దంష్ట్రలతోకలసి ఋషుల మాంసభక్షణము నను వారి రక్తపానమునను కాలముగడపుచు, రాముడు తాపసవేషమున చరించుటచే ఆతడిష్ట దహింసావ్రతమును పాటించుచుండెనని భ్రాంతినొంది, మృగవేషమున ఆ యిద్దరితో రాముని మీదికి పోయితిని. నిజమునకు నేను రాముడు బాల్యమున విశ్వామిత్రయాగ రక్షణ సందర్భముగ నా మీద ప్రయోగించిన బాణపుదెబ్బను మరువలేను. అయ్యను ఆతనిమీదికి ఉరికినాను. రామునిమీదనున్న పూర్వ వైరము వన్నువదలలేదు. కాపున ఆవైరమును తీర్చుకొనుటకై వెళ్ళినాను. రాముని పరాక్రమ మసామాన్యము. మృగశరీరధారులమైన మాముగ్గురనకడు గ్రహించి మా ముగ్గురపైన నొక్కమారుగ మూడు బాణముల నొదలినాడు. ఎట్టకేలకు నేనా బాణపాతమునుండి విముక్తుడనైతినిగాని దీప్తజిహ్వా తీక్షణదంష్ట్రలు మాత్రము ప్రాణముల కోల్పోయినారు. అంతటితో రాముని పైనున్న క్రోధము నా తనసున శాంతించినది. రాముని నేను జయించలేనను భావము నాకు స్థిరమైనది. నా అంతరాత్మయే నాకు సన్యాసమిచ్చినది. అంతతో నాలోవలదాగియున్న దుష్కృత్య వాసనలన్నియు ఉపశమించినవి. రాముడు కోదండపాణియై దండపాణివలె నాఅంతరాత్మయందు నిలిచినాడు. ఈ దండకారణ్య మధ్యభాగమునందున్న ప్రతి వృక్షమునందును రాముడు నాకు సాక్షాత్కరించుచుండెను. కాదుకాదు. వృక్షాగ్రములందు రాముడు. ఆకు ఆకునరాముడు. పువ్వు పువ్వునను రాముడు. లతాపుష్ప వికుంజములన్నియు నాకిప్పుడు రాముడయ్యే కన్పట్టుచున్నవి. రాముని జ్యావల్లీనినాద తరంగములు నా శ్రవణరంధ్రములనిండి వన్నాక్రమించగా ఆతని బాణపుదెబ్బను గ్రహించిన నా చిత్తము రామమయమైనది. రకారము ఆద్యక్షరమైన ఏ ఒక్క శబ్దమును విన్నను నాచిత్తము భీతిల్లుచున్నది. రత్నరథ శబ్దముల నుచ్చరింప నావాక్కు భయపడుచున్నది. నిన్ను రావణా! యని సంబోధించుటకు భయము నొందుచున్నది నా చిత్తము. నారచీరలధరించి, చేతనున్న తీక్షణ కోదండముతో రాముడు నాకీ ప్రదేశమునంటకను సాక్షాత్కరింపగా నేనీ జాగ్రదవస్థనుండి తొలగి నిద్రింప నారంభించినాను. స్వప్నమున గూడ నిన్ను రాముడచంపుననన్న భయము వదలలేదు. స్వప్నమునందును రాముడే నాకన్నులెదుట నిలబడుచుండెను. వేయేల? రావణా! జాగ్రత్స్వప్నముల రెంటియందును రామునే చూచుచుంటిని గాని వేరొక వస్తువు నాకంటికి కనబడుట లేదనినాడు. రావణునకిట్లు బోధించి మారీచుడు రాముని తో యుద్ధమువకుదిగి వీరుడవై తనువును చాలించుటగాని, ఓరిమి వహించి కీర్తి

నొందుటగాని నీకు మంచిదని చెప్పి, నిన్ను అనుసరించుట నాకిష్టములేదనినాడు. నీవు రామునిచేత తప్పక చత్తువనినాడు. నిన్ను బంధువుగ భావించి హితమును చెప్పితిననినాడు.

రామునిపై నిందలు మోపువారికిది బుద్ధిచెప్పిడీ ఘట్టమని నా ఊహ. కథను తిలకింపుడు.

మారీచుని బోధలు రావణునకు రుచించలేదు. నేను నిన్ను సలహా వడుగుటకు రాలేదనినాడు. నా చేతిలో చచ్చెదవా? నాకు సాయముచేతువా? అని నరాసరిగ అడిగినాడు. మారీచుని సమాధానమిది. రావణా! ముందు నాచావును, తరువాత సబాంధవముగ నీ చావుననినాడు. రావణుడప్పుడు మాటలేదు. తన సీతావహరణ కార్యమునకు మారీచుని కర్తవ్యమును నిర్ణయించినాడు. ఉపాయము రావణునిది, ఆచరణ మారీచునిది.

మారీచుడు బంగారులేడియై సీతను లోభపెట్టవలెను. ఆ లేడిని ఆమె కోరి, తెచ్చుటకు భర్తనువంపును. ఆ లేడి రామునిచాలదూరము గొనిపోవలెను. అక్కడ హా! సీతా! లక్ష్మణా! అని ఆర్తస్వరమున వలుకవలెను. అందుకు భయపడి లక్ష్మణుడు కూడ వెళ్ళగా సీత ఒంటరికావలెను. అప్పుడు తానెత్తుకొని పోవలెను. ఇది రావణుని ఊహ. దీనినే మారీచునకు తెలిపినాడు.

కాలము కలసివచ్చినది. మారీచుడు తల ఊపినాడు. నీవిప్పుడు మారీచుడవనిపించుకొంటివని ప్రస్తుతించి తనరథముపై నెక్కించుకొనినాడు. వారి రథము ఆకసమున కెగసినది.

మా య లే డి

అది జానకీరామ పర్ణశాల. ఆ పర్ణశాలాభ్యంతరముననే లక్ష్మణార్యుడును కలడు.

రాముని పర్ణశాలకు చుట్టును కదళీవనము, అశోకములును ఉన్నవి. కన్నుల కింపులై కెంపువలె కన్పట్టు కొండగోగు పూగుంపులక్కడ లేకపోలేదు. అది ఒక విధముగ విహారస్థలమైయున్నది. కావుననే సీతాకాంత ఆవన శోభల తీర్చిదిద్దుచున్నది. పుష్పావచయమును కూడ చేయుచున్నది.

సృష్టిఖండమునందెన్ని చిత్రములున్నవో ఎవ్వరెరుగుదురు? రాబోవు కాల ప్రభావములు కూడి అట్టివే. శంకరులీ సృష్టినిగురించి దేశకాల కలనా వైచిత్ర్య చిత్రీకృత మనినారు. దీని ప్రభావము అనిర్వచనీయము.

అక్కడనే చరించుచున్నదొక బంగారులేడి. దాని ముఖము తెలుపుపసుపు కలయికగలిగి ముఖమునకు పై భాగమున ఎర్రదనురవలె భాసింప, క్రిందిభాగము వెల్లకలువరేకుల నీలపుదనము కలిగియున్నది. దాని శృంగాగ్రములు నీలమణి ప్రభాభాసురములు. దాని ప్రక్కభాగములు వెండికు పుప్పరంపు దగిలి సువర్ణ నిర్మితములట్లుండును.

దాని శరీరముపైనున్న చుక్కలు తెల్లని తెలుపులై యుండుటచే ఆచుక్కలు చెక్కిన వెండి పూవులవలె కాన్పించును. దాని యుదరము చూచువారలకు చంద్ర జ్యోత్స్నయై తెల్లగ కానుపింపగా దాని పుచ్ఛము ఆకాశమున చూపట్టు ఇంద్ర ధనస్సువలె నానావర్ణ విరాజితముగ యుండి చూపరుల కాశ్చర్యమును గొలుపు చుండును. దాని గిట్టల చూచిన అవి వైడూర్యమణులని భ్రాంతి పడ పోరు.. ఆ మృగమునకుపై అవయవ నిర్మాణమట్లుండ జదియొకప్పుడాలింపగా దాని నాలుక మేఘమధ్యమందలి మెరుపుతీగవలె తళుక్కుమనుచు అగ్నిజ్వాలలవలె వెలుగు చుండును. దాని రోమరాజి బంగారు తీగెలని తప్పక నమ్ముదుము. వేయేల? దానిని రత్నసారముల నిర్మించ బడినదనుట యుక్తము.

వన్యమృగములు దానిని సమీపించును గాని ఆమృగమును వాసన చూడగనే పారిపోవును. అందుచే అది మృగజాతికి చెందిన సామాన్యమృగము కాదని బోధ పడుచున్నను కాలమునకే శక్తి సంపన్నత్వ మెక్కువ యగుటచే సీతాకాంత దానిని మృగమనియే భావించినది. ఆ ముద్దురాలి భావమూ వింత మృగము గ్రహించ కుండునా? మారీచమృగము సీతాకాంత ముంగట తన చాకచక్యమును చూపుచు గంతులిడ నారంభించినది. సీతకిది క్రీడామృగమైనది. తన చెల్లెండ్రకు దీనిని ఆట వస్తువుగ చూపుదమనుకొన్నది. రామలక్ష్మణులం పిలచి ఆమృగమును చూపి దానిని తన కందింపుమని రాముని కోరినది.

రామునకా మృగముయొక్క స్వరూపము తెలియునో తెలియదో మనకు స్థూలముగ తెలుసుకొనుట కవకాశము లేదు. రాముడు సీత కోర్కెను మన్నించి లక్ష్మణునకు ఆమృగమును తెచ్చి మీ వదినకిత్తునని ఎరింగించినాడు. లక్ష్మణుడు

యధార్థవాది. ఆకార్యమునకండి రాముని మరలించయత్నించినాడు. ఇదిమృగముకాదని స్పష్టముగ చెప్పినాడు. అచ్చటి రాజుల నెందరనో భ్రాంతులగావించి వారి నీరాక్షస మృగము పొట్టను పెట్టుకొనుచున్నదని తెలిపినాడు. ఇతడు మారీచుడు కావచ్చునని కూడ వాక్రుచ్చినాడు సీతకాతని మాటలు నచ్చలేదు. రాముని గట్టిగ కోరినది. రాముడాహరిణ సౌందర్యమును చంద్రమండలములోని మృగము వంటిదని దాని దివ్యత్వమును వర్ణించి ఎట్లైన దానిని వెంటనంటి ఆమృగమును హరించుటకు కొన్ని కారణముల ప్రతిపాదించినాడు.

ఆ కారణము లివ్వి.

ఒకటి అది మృగరత్నమగుట. రెండు మాంసమువలకై వేటాడుట. మూడు అది రాక్షస మృగమగుచో బుషులకిచ్చిన శరణాగతికి దానిని వధించుట. ఇందే కారణమును పురస్కరించుకొన్నను దాని వెంటవెళ్ళి దాని సంపాదనకు యత్నించుట అవసరమనినాడు. కాని మూడవకారణమున అతడు రాక్షసుడగుచో ఒంటరిగ పోవుట ప్రమాదము కాదా? అనుప్రశ్న లక్ష్మణున కుదయించవచ్చును గావున అగస్త్యముసీంద్రుని గర్భమున వాతాపి దగ్ధమైనట్లు నాధర్మతేజమున రాక్షసుడు దగ్ధమగునని ముందుగనే సమాధానమిచ్చినాడు. కావున మారీచమృగము ముందును రాముడు వెనుకను బయలుదేరినారు. రామునిప్పుడే మనవలెను? దేశకాలజ్ఞుడగు రాముని అజ్ఞుడనవలెనా? లేక సర్వజ్ఞుడై భావికాలమును గుర్తెరిగి మృగము వెంట వెళ్ళెననవలెనా? ఎట్టి ప్రజ్ఞావంతులైనను కొన్ని సమయముల మందప్రజ్ఞులగుదురని మానవులకుచాటి ఆదర్శమూర్తి యయ్యెననవలెనా? రామునే మనవలెను? రాముడజ్ఞుడను కొమ అజ్ఞులకు మన సమాధానమక్కరలేదు. రాముడాదర్శమూర్తి యగుటకే అవతరించెనను వాదమున అన్ని సమాధానములును కుదురును. చంద్ర మండలములోని మృగమును భూమండలములోని ఈమృగమును దివ్యమృగములని నిర్ణయించిన రాముడు అజ్ఞుడగునా? మృగలాంఛనుడు చంద్రుడు. చంద్రమండలము లోని మృగమెట్లు చిహ్నమో అట్లే ఇదియు నామమాత్ర మృగమని చాటినరాముడు అజ్ఞుడెట్లగును? రామావతారమును గురించి మనము ప్రధానముగ గ్రహించదగినది మర్త్యత్వ ప్రకటనకు ప్రాధాన్యతనిచ్చుట తన సర్వజ్ఞత్వమును అవసరమగుచోట వ్యంగ్యముగా చూపుచుండునను విషయము. కథకు రండు. మాయలేడి రాముని చిత్తవికారము గనిపోయినది ఆశయమును లేడి మానవుని తన వెంట గొంపోయి అట్లే చరించినది.

దాని అంత్యకాలము రాముడెరుగనిదికాదు. మాయకు వశీకరుడైన వానివలెనే రాముడా మారీచునితో చాల దూరము పోయి బ్రహ్మనిర్మితమైన దివ్యాస్త్రమును తీసినాడు. ఆది మృగమే యనుకొన్న రాముడు బ్రహ్మనిర్మితమగు అస్త్రమును తీయునా? రాక్షస సంహారకమగు దివ్యాస్త్రమును తీసి బాణమునందునుసంధానము గావించి మారీచుని మరణకాలమును గుర్తెరిగి జ్యావల్లిని ఆకర్ణాంతముగ లాగి బాణమును వదలినాడు. హా! సీతా! లక్ష్మణా! యని ఆర్తుడై శ్రీరామచంద్రుని కంఠస్వరమునే అనుసరించి పెద్దచు ప్రాణ కూలినాడు మారీచుడు. మారీచుని భయంకర రూపము బయటపడినది. కామరూప రాక్షస స్వస్వరూపము మరణకాలమున బయటపడును. రాముని కర్తవ్యము నెరవేరినది. మనమొక్కమారు రాముని పర్ణశాల కడకు వత్తము.

సీతాపహరణము

రావణుడు సీతాపహరణమునకై పన్నిన పన్నాగము ఫలించినది. సీతను ఒంటరి దానిని గావించుట రావణుని ఆశయము. దొంగతనమునకు కావలసిన ప్రథమ కర్తవ్యమేమి? తానపహరింపదలచిన వస్తువును నిస్సహాయత కలదానిని గావించి ఆ వస్తువును గ్రహింపవలెను.

సీతకు రాముని కంఠస్వరము దీనమై వినబడినది విజనమునకు భర్త దీనుడై రక్షింపుమన్న స్వరమును వినిపింపగా భార్య ఏమనుకొనును? భర్తృ సంరక్షణమే స్త్రీకి ముఖ్య లక్ష్యము. భర్త బ్రతికివ తాను బ్రతికినట్టని భావించు స్త్రీయే పతివ్రతాంత. భర్తృ జీవితము తరువాతి జీవితమును ఏ స్త్రీయైనను కోరదు. మాంగళ్య అమాంగళ్య జీవితములు రెండున్నవని తలచిన ఆడువారి విషయమును నేను చెప్పినాను.

తనకు వినిబడిన కంఠస్వరము సీతను కదలించినది. పతివ్రత హృదయము కంపించినది. భయభ్రాంతయైనది. అప్పుడామె కర్తవ్యము తన రక్షణకై నిలిచియున్న లక్ష్మణుని రాముని సహాయమునకు పంపుటయే. కావున సీత లక్ష్మణుని రాముని వద్దకు పంప ప్రయత్నించి, లక్ష్మణుని ప్రేరేపించినది.

లక్ష్మణుడు రాముని పరాక్రమము నెరిగిన వీరశిరోమణి. సీత కూడ రాముని పరాక్రమము నెరుగనిదికాదు. కాని సీత అబల. ఉపాధిధర్మము ఉపాధిని వదలి

ఉండదు. ఒక కాలమున అది కనబడకున్నను సూక్ష్మవాసనారూపమున అంతఃకరణ మున దాగియే యుండును. సీత లక్ష్మణుని రామునివద్దకు ఆతనికి సహాయకువిగ వంపుటయే లక్ష్యముగ అతని ప్రేరేపించినది. లక్ష్మణుడు తాను రాముని దగ్గరకు వెళ్ళనక్కరలేని కారణములనన్నిటిని ప్రతిపాదించినాడు. అందు ముఖ్యకారణము రఘువంశీకులు తమకు వచ్చిన మరణభయమును గురించి దీనవాక్యమున పలుకరము మాటను గ్రుద్ది చెప్పినాడు.

భర్తకేదియో ఆపద వచ్చినదని తలచిన సీతకు లక్ష్మణుని హేతువులు నచ్చ లేదు. తన్ను పాలింపుట ప్రధానముగా గలిగి మాటాడిన లక్ష్మణుని, సీత అపార్థము చేసుకొన్నది. లక్ష్మణుడు తన్ను కాపుంచి సోదరుని ఆపత్తు వెనుకకు నెట్టెనను కొన్నది మనోబుద్ధి చిత్తాహంకారములతో కూడిన అంతఃకరణకు సత్యమునే ఊహింపగల శక్తి ఉన్నదనుట పరమ సిద్ధాంతము కాదు. రాగద్వేషములకు అవ కాశమునిచ్చు అంతఃకరణకు భ్రమ ప్రమాదములున్నవను వైదిక సిద్ధాంతమును కాదనువారికే నాస్తికులని పేరు. ప్రకృతమున సీత నాస్తికురాలు కాదు. కాని భర్త కేదియో ఆపత్తు కలిగినదని నమ్మిన ఆపన్నురాలు. కావున సత్యమూహించలేక పోయినది. లక్ష్మణుని అపార్థము చేసుకొన్నది. లక్ష్మణునిపై కోపపూరితయైనది. క్రోధము రాబోవు అనర్థకమును చూడజాలదుగదా? తన ఒంటరితనము వలన తనకు రానున్న అనర్థకమును ఆమె ఆలోచించలేకపోయినది.

లక్ష్మణా! నీవు నన్ను పరిగ్రహించకోరి రాముని రక్షించుటకు పోననుచుంటి వన్నది. అది లక్ష్మణున్నకు భరింపరాని మాట. కన్నీరు కార్చుచు సీత ఈ మాటను మాట్లాడినను లక్ష్మణుడు చలించకయే రాముని వీరత్వమునుతెలిపి ఆమె భయమును విచారింప యత్నించినాడు. ఆమెను రాముని గూర్చిన భయము వదలలేదు. దీనికే కాలగతియని పేరు. ఆ సీతాకాంతకు కోపము పెరిగినది. లక్ష్మణుని రాముని జ్ఞాతిగ పేర్కొన్నది. నీవిప్పుడు చూపునది జ్ఞాతి కర్తృత్వమన్నది. లక్ష్మణా నీవు వరమ పాపివై ఇట్లు మాట్లాడుచుంటివని ఘాటుగ పలికినది. భరతుడు నిన్ను పంపగా వచ్చితివన్నది. అది జరగదన్నది

ఒక్కమాటు మనము లక్ష్మణునివైపు తిరుగుదము. సీత కఠినోక్తులు రామాజ్ఞను పాలింపదగు లక్ష్మణుని సేవా ధర్మమును ఆక్రమించినవి. లక్ష్మణుడు చలించినాడు. సీత కఠినోక్తులు శూలములై లక్ష్మణుని హృదయమున గుచ్చు

కొన్నవి. బాధ భరింపరానిదైనది. సీతకు రానున్న ఆపదకూడ ఆతడెరుగకున్నను లక్ష్మణుని మనసునందొక విధముగ గోచరించుచునే యున్నది. రెండు ఘట్టముల మధ్యభాగమున లక్ష్మణుడు నిలిచినాడు. కాని భావికాలభూతని అవ్వలకు తరిమినది. పోవుటకు కాలాడకున్నను ఆతని పయనమునకే కాలము బలమును చేకూర్చినది. ఆతడిక సీతకు అడ్డు చెప్పలేదు. రాముని దగ్గరకు పోవుటకే నిశ్చయించుకొనినాడు.

సీత కఠినోక్తులకు సమాధానమును కఠినముగ చెప్పలేదు. నా అంతరాత్మయొక్క పారిశుధ్యమును తెలుపువారు దేవతలేనని వాక్రుచ్చి, సీతాకాంతను ఓదార్చినాడు. తల్లీ! నన్ను నీవు శంకించుట స్త్రీ స్వభావము చేతనేనని మాత్రము తెలిపినాడు. కాని ఎంతటి క్షమావంతులనైన వాత్సల్యములు పీడించకపోవు. లక్ష్మణుడు పయనించునప్పుడు సీతకు అభివాదన గావించియు చేసీ చేయని నమస్కారముచే తన బాధను ప్రకటించి, సీతకు మంగళాశీస్సుల నొసంగుచు మరల మరల వెనుకకు తిరిగి చూచుచు పయనించినాడు. ఒక్కమాట.

లక్ష్మణుడు పోవునప్పుడు ఏడు గీతల గీసి సీతనీ గీతల దాటవద్దని చెప్పినట్లు చెప్పుదురుగాని అది రామాయణమునందున్న కథకాదు

తరువాత జరిగిన కథ ఏమి?

పవిత్రములును పవిత్రతమములును అగు వేషములను కొందరు దుర్మార్గులు తమ దుర్మార్గ కార్యములకు వినియోగించుట సృష్టియందు క్రొత్త విషయము కాదు.

సన్యాసాశ్రమము పరమ పవిత్రమైనదనుట కెట్టి సంశయమును లేదు. దీనిని కొందరు కపట కార్యములకు వినియోగించుట కూడ కలదు.

పంచవటీ క్షేత్రమున సీతయున్న పర్ణశాలనుండి లక్ష్మణుడు వెళ్ళగనే ఒక సన్యాసి సాక్షాత్కరించినాడు. ఆతని ముఖమునుండి వేదఘోష వెలువడుచున్నది. చంకన యోగదండమున్నది. ఆతని మేనిపైనున్న జందెమును, రుద్రాక్షమాలికలును ఆతనినొక మహానుభావునిగనే తెలుపుచున్నవి. ఆతడు ధరించిన పాదుకలును, చేతనున్న కమండలమును, పైనున్న గొడుగును అతడు త్రిదండి సన్యాసియని తెలుపుచున్నవి. పయోముఖ విషకుంభముల చూడగనే తెలుసుకొనుట చాల కష్టము. కార్య

రూపము నొందినగాని దుర్మార్గుల హృదయమును గుర్తెరుగలేము. త్రిలోక సుందరి యగు సీతను దర్శించిన ఆ పరివ్రాజకుడు పూర్తిగా భావములకు గురి యయ్యెను. సీత సౌందర్యమాకడొకప్పుడు వినియున్న వాడగుటచే నాటి సంస్కారమిప్పుడు సన్యాసిని సన్నాసిని గావించినది.

ఆతడప్పుడు మధ్యాహ్న శరాగ్నిష్టుడయ్యె సీతను వలకరించినాడు. అతడే మన కథానాయకుడు రావణుడు. ఆ డెవ్వడో సీత ఎయగకున్నను అచ్చటి వన దేవతలును, గోదావరీనదియు, ఆ కఠోరహృదయుని ఎరుగనివారు కారు. ఆ ప్రదేశమునందున్న భూతములన్నియు ఆ చండశాసనుని కాసవములు ననుభవించనివి కావు. కావున ఆ కపటసన్యాసి రాగనే వారందరును మౌనము వహించినారు. సీతను వలకరించిన వలకరింపులలో తేనెలుట్టివడు నట్లుండెను గాని కఠినములై లేవు ఆ వలకరింపులు. సీత ఆ కఠిన కాంతారమున ఒంటరిగ యుండుట కాతడెంతయో వెతచెందినట్లు వలుకరించినాడు. కళ్యాణీ! అని సంబోధించి, దేవ గంధర్వులు కూడ చరింపని ప్రదేశమున. ఇది రాక్షసావాసము. నీవేల యిందు ఒంటరిగ చరించు చుంటివని కూలిబడి పట్టడిగినాడు. సౌధాంతర్భాగములు చరించ దగు సుకుమారగాత్రిని నీవడినాడు వీన్ను చూడచూడ నా మనసుకు పిచ్చెత్తు చున్నదనినాడు. నీవు దేవతాస్త్రీలలోని దానవని భావించుచుంటి ననినాడు. చివరకు రతీదేవివలె యుంటివని వాపోయి నీవా? ఈ క్రూరమృగ నిషేవిత వనవాసమని, ఆమె జన్మకథను, అత్తవారింటి చరిత్రను కూడ సౌలభ్యముగ ప్రశ్నించినాడు.

సీత ఆ జిడదారి ప్రశ్నలకు వెంటనే జవాబు లివ్వలేదు. ఆతడు నిలచి యుండెనుగదా! అతనిని గౌరవించక మాట్లాడుట ధర్మముకాదని ఆమె నిర్ణయము. భారతీయ ధర్మము వచ్చినవారికి ఆసనమిడి పాద్యార్ఘ్యములు నిచ్చి, క్షేమసమాచ ములు వడిగి వారి ప్రశ్నలకు జవాబు మివ్వవలెను. ఆ ధర్మమునే సీత అనుస రించినది. అతిథి సత్కారములు గావించినది. కందమూలములు సక్కడుంచినది. స్వస్థచిత్తమున భుజింపుమన్నది.

"కాషాయ దండమాత్రేణ యతిః పూజ్యో న సంశయః" అను ఆర్యోక్తిని పాటించినది. సన్యాసివేషమునమున్న రావణుని మనస్సు సీతాపహరణమునకు తొందరపెట్టినది .ఆ రాజపత్నిని అపహరింప నిశ్చయించినాడు. తన చావునకే సీతా పహరణమునకు పూనుకొనినాడు.

సీతాకాంత తన కర్తవ్యమును కాయిక వ్యాపారము నిర్వర్తించుచునే రామ లక్ష్మణుల రాకకై మనసున తొందరపడు చున్నది.

ఇక సీత కర్తవ్యము ఆ కపటసన్యాసి ప్రశ్నలకు ఉత్తరమిచ్చుటే. బ్రాహ్మణు డేమైన శాపము నివ్వవచ్చును. పెద్దలగువారికి కోపము రాకుండ కాపాడుకొనుట చాల అవసరము. కావున సమాధానమిస్వ దలచినది. తానీ యరణ్యములకు వచ్చుటకు కారణమును, తన జన్మస్థలమును, తన భర్తయొక్క ప్రభావమును చక్కగ సంగ్రహరూపమున వ్యాఖ్యానించినది. ఆ సమాధానముననే రాముడన మర్థుడై అరణ్యములకు రాలేదని తేల్చి, ధర్మప్రభావుడై పితృవాక్య పరిపాలనకై ఏతెంచినాడన్నది. సతీమణుల కర్తవ్యము భర్త ననుసరించుటను కూడ తెలిపినది. తానుభవించిన భాగ్యభోగ్యములు వర్ణించినది తాను తన భర్తయు ధర్మ పరిపాలనకై ఆ భాగ్యభోగ్యముల వర్జింతిమని చెప్పినది. ఒక్క మాటలో రాముని ప్రతిభను చెప్పి, రామునితోగల అన్యోన్య దాంపత్యమును తెలిపినది.

తన భర్త మహాతేజము కలవాడనుటతోడనే ఆపక ఆతని యౌవనమును కూడ చెప్పి, తన వయోవిశేషమును కూడ తెలిపినది. ఇట్లు తెలిపి, నీవెవ్వరవు? నీ గోత్రమేమి? నీ నివాసమీ అరణ్యమెట్లైనది? అని తిరిగి ప్రశ్నించినది. ఆ కపటసన్యాసి ఇక తానెవ్వరో చెప్పి సీత నెత్తుకపోవలెను.

నేను లంకాధీశ్వరుడను. నా పేరు రావణుడు. నేను పౌలస్త్య వంశము నకు చెందినవాడను. నేను నిన్ను పట్టమహిషిగ కావించుకొనదలచి వచ్చితినని చెప్పి, అయిదు వేలమంది దాసీస్త్రీలు నీకు పరిచర్యలగావింతురని ఆశను గొలిపి రావణుడు సమాధాన మిచ్చినాడు. సామాన్యునుగనే ఆమె వశ మగునని ఊహించి నాడు రావణుడు.

సీత భారత నారీమణులకు మహారాణి. కర్తవ్యాకర్తవ్యముల నెరిగిన రాజ పుత్రిక. వీరవనిత. ఆమె రావణునివంటి నీచుల శిక్షించజేయుట కేతెంచిన మహా రాణి. కావున ఈ సమయమున ఆమె భయభ్రాంత కాలేదు. రావణునకు బుద్ధి చెప్పుటకు వెనుదీయలేదు. రావణుడు వర్ణించుకొన్న ప్రతిభావిశేషములలోని ప్రతిభను చక్కగ ఖండించినది. రామరావణుల తారతమ్యమును తూచి, పాతి వ్రత్య ప్రభావము సహజాలంకారమైయున్న సతీమణులదృక్పథమున నీవు వీరుడవు కావు సరిగదా? జంతువులయందు కూడ నీచజంతువైన వక్కవని రావణుని

తేల్చినది ప్రపంచమున సహజతేజః ప్రభావ సంపన్నములగు వస్తువుల నొక్కచో చేర్చి, వాటితో పోల్చుటకు వీలుగాని నీచవస్తువుల రావణునిముందుంచి వీవు ఆ నీచపదార్థములలో చేరిన వాడవని తేల్చి, రాముని సహజ వైశిష్ట్యమును ప్రకటించినది.

సీత రామ రావణుల పోల్చిన పోలిక లివ్వి.

బంగారము, సీసము, చందనగంధము, బురద, అడవిపిల్లి, అను వాటిని రావణుని ముందుంచినది. రామునకు నీకును ఆ పదార్థములకున్న అంతరమున్న దన్నది.

"యదంతరం కాంచన సీస లోహయోః
యదంతరం చందన వారి పంకయోః
యదంతరం హస్తి బిడాలయోర్వనే
తదంతరం దాశరథే స్తథైవచ॥

లోహసామ్యమున్నను జన్మసామ్యము లేదు బంగారమునకును, సీసమునకును. సహజతేజము కలిగి జన్మశుద్ధత్వము కలది బంగారము. సీసము లోహములము. ద్రవద్రవ్యములే చందనమును బురదయు, కాని సద్వాసనా వాసితము చందన గంధము. బురద మట్టము. చందనము నలంకరించుకొనువారు రసికులగువారు. బురదను వాడుకొనునవి జంతువులు. ఆ జంతువులయందును వందికి బురదయన్న చాల ఇష్టము వండు లయముకొని పుచ్చుకొను బురద ద్రవమున చందనమువలెనున్నను నీచపదార్థులకు మాత్రమే భోగ్యము. ఏనుగయు, పిల్లియు రెండును అడవియందే పుట్టి ఆ అడవియందే చరించుట సమానము కావచ్చును కాని జన్మయందా రెంటికిని సంబంధము లేదు. గుణభేదమును కలదు. జన్మస్థల ప్రధానము కాదు. కావున రాముడు బంగారముకాగా నీవు సీసమవు. రాముడు చందనముకాగా నీవు బురదవు రాముడు అడవిఏనుగవంటి వాడు కాగా నీవు పిల్లివి అన్నది.

రావణుడు సీత సామదానభేదములకు వశురాలు కాదని నిశ్చయించు కొనినాడు. దండమునే ప్రధానము గావించుకొనినాడు.

రావణా! నీ ప్రతాపము నిక కట్టిపెట్టమన్నది.

దేవేంద్రుని భార్యను ఎత్తుకొనిపోయి సీవు బ్రతికిన బ్రతుక వచ్చును. కాని నన్ను దూషించి అమృతపానము చేసి కూడ సీవు బ్రతుకవన్నది.

ఇంతవరకు రావణుడు పరివ్రాజిక వేషము తోడనే సీతతో మాట్లాడినాడు. ప్రయత్నము ఫలించలేదు. కపటరూపమును వదలినాడు. తన భయంకర రూపమును చూపినాడు. ఆరూపముతో తనను కామించమని కోరినాడు అడియు సిద్ధించలేదు. ఆరూపముతోడనే సీతను ఎత్తుకొనిపోవ నిశ్చయించినాడు. తన ఎడమ చేతితో సీత తల వెంట్రుకలను పట్టుకొని కుడిచేత తొడలనుపట్టి ఒడిలోని కెత్తుకొనునట్లు సీతను ఎత్తి మాయామయమగు తన రథమునందుంచినాడు.

ఇప్పుడెత్తుకొని పోవు సీత మాయ సీతయని వాల్మీకమున లేదు. సీతను చేతితో ముట్టలేదు, గడ్డ పెళ్ళగించెనని కూడ వాల్మీకి చెప్పలేదు.

వాల్మీకి సిద్ధాంతము ననుసరించి రావణుని తపస్సు గొప్పదగుటచే సీతను ముట్టకున్నను రావణుకు నాశము కాలేదని సుందరకాండయందు హనుమంతుడు వానరులతో చెప్పినాడు. కావున మాయాసీత వాదమక్కరలేదు. మరొక వాదమున్నది రావణుడు సీతను తల్లిగ భావించి తీసుకు పోయెననుసది కూడ. అది ఒక వ్యాఖ్యాత అభిప్రాయము. దానికి వారు సీతను రావణుడు బుధుడు రోహిణీ నక్షత్రమును గ్రహించినట్లు అన్న ఉపమానమును చూపెదరు. అది సరిపోదు. వాల్మీకి జ్యోతిశ్శాస్త్ర ప్రసిద్ధములగు ఉపమానములను చాలచోట్ల వాడినారు. యుద్ధ కాండమున రామరావణ యుద్ధమునందు దేశా ష్టకములైన కొన్ని ఖగోళ దృశ్యములలో బుధగ్రహము రోహిణిని ఆక్రమించుట కూడ ఒకటిగా వర్ణింపబడినది. తల్లినిగా సీతను రావణుడు భావించి తీసికొనిపోవుచో సీత రావణుని మాట్లాడిన కఠినోక్తులకు అర్థము కుదరదు. కథాంతయు అడ్డము తిరుగును. కావున ఆ అర్థ మక్కరలేదు. రావణుడు కామకుడయ్యె సీతను ఎత్తుకొని పోగా రాముడాతని వధించుటయుక్తము. ఒక విధముగ అన్వయించవచ్చును. సీత లోకమాత ఆమెను వరిగ్రహించె ననవచ్చును. కథకు వత్తము.

సీత రావణుని రథము నందుంచబడినది. రక్షకులు లేరు. ఎలుగెత్తి ఏడ్చినది. సీత విలాపము అరణ్యరోదనమైనది. దుఃఖభాగినియగు సీత మొక్కని దేవతయు లేరు దేవతలు స్వార్థపరులై యూరకుండిరి.

చతుర్ముఖ బ్రహ్మగారు మాత్రము రావణుడు చేయదగిన పనినే చేసినాడని సంతసించినాడు. రామునిచేత రావణుడు చావగలడని ఆతని అభిప్రాయము. అనమయమున సిద్ధులగువారు రావణుని నాశమునుకోరి మౌనమును ధరించినారు. హా! రామా! లక్ష్మణా! అన్న సీత రోదనధ్వనిని ఎవరును వినిపించుకొనలేదు. నన్ను రావణుడెత్తుకు పోయెనని రామునకు తెలుపుడని వనదేవతలకు జింకజాలము వకు మృగ పక్షి గణములకు సైతము నెప్పివిడ్చినది. కైకకోరిక నెరవేరినదని విలపించినది. అంతలో జటాయుపక్షి ఆమెకంటబడినది. ఆపక్షిని శరణు వేడినది. శరణార్థులకు వారు వీరనునడేమున్నది? కనుపడిన వారినెల్ల న్యాయమడను తొలగింపుడని అర్థింతురు. అదే అర్థించినది సీతామ తల్లికూడ. నన్ను రక్షింపకున్నను రామునకు వృత్తాంతమును తెలుపుమన్నది.

సృష్టి యందందరును స్వార్థపరులుండరు. దేవతలుసైతము మూగనోము పట్టి ఊరకుండగా అనాథయై ఆర్తస్వరమున ఎలుగెత్తి తనను అర్థించిన సీతను రక్షింప జటాయువు పూనుకొన్నది.

ఆ పక్షిరాజు అరువదివేల సంవత్సరముల నాటి వృద్ధ గృధ్రము. అయ్యును ధీకొన్నది. తన యథాశక్తిగా పోరాడినది. రావణా! నాకన్నుల ఎదుట నీవుసీతను బలాత్కారముగ గొనిపోవ సమర్థుడవు కావన్నది.

తమంతట తామై ఆవిర్భవించిన వేదములను కేవల తర్కముతో అందలి సిద్ధాంతములను కాదని వాదించువారిని వేదధర్మ కోవిదులెట్లు ఎదుర్కొందురో అట్లు నిన్ను నేను ఎదుర్కొందునని యుద్ధమునకు తలపడినది.

"పశ్యతస్త్వం బలాద్ధర్తుం వైదేహీం మమ పశ్యతః
హేతుభిర్న్యాయసంయుక్తైః ధృవాం వేదశ్రుతీమివ"

వేదములకును సీతకును పోల్చినది. వేదములు ఒకరిచే సృష్టించబడిన వాఙ్మయముకాదు. సీతయు అయోనిజ. రావణుడు ధర్మవాదికాదు. హేతువాది వేద ధర్మములు హేతువాదుల చేతబడినప్పుడు ఆవేదవిదులు పోరాడి ధర్మస్థాపనకెట్లు ప్రయత్నింతురో అట్లునేను ప్రయత్నింతునన్నది. జటాయువు రావణునితో యుద్ధమునకు పూనుకొన్నది. రెండు ఘడియలకాలము పోరాడినది. రావణుని చేతి ఖడ్గముచే రెక్కలు కొట్టబడి నేలకూలినది. దురదృష్టము పెద్దది. సీతకు జటాయు సాయము అక్కరకు రాలేదు.

అది అయువదివేల సంవత్సరములనాటి వృద్ధగృధ్రము. అయ్యను రావణు వితో ఢీకొని సీతనురక్షింప యత్నించినది. అట్లే ఈ కలిపురుషుడు వేదసిద్ధాంత ములను హేతువాదములతో ఖండింపయత్నింపగా వేదధర్మముల నుద్ధరింప యత్నించుట సనాతనుల బాధ్యత యనక తప్పదు. నేను అందులోని వాడపయ్యే రామాయణము వ్రాయదలచినాను నాయధాశక్తిగ.

ఇక కథాభాగము నందుకొనుము.

రావణుని రథము జటాయువుచేత కూల్చబడినది. సారథియు చచ్చినాడు. సీతను చంకనెత్తుకొనియే రావణుడు లంకకు పయనించినాడు. ఆతని పయనము ఋష్యమూక పర్వతము మీదుగ సాగినది. సీత ఆపర్వతములపైన తన ఆభరణముల కొన్నిటిని ఉత్తరీయమున మూటగట్టి పడవైచినది. అది రావణునకు తెలియను. అక్కడ అయిదుగురు వానరులుండుట గమనించియే ఆమె నగలనక్కడ వైచినది.

సీతాకాంత రావణునిచే లంకానగరమునకు చేర్చబడినది. అదొక రహస్య స్థలమందుంచబడినది. రావణుడు కొందరు రాక్షసులను రాముని చంపుడని నియమించినాడు. మన మొక్కమారు కథాభాగమున వెనుకకు వత్తము. రాముని వృత్తాంతము తెలియును.

రాముడు మారీచుని హతమార్చినాడు. ఆతనికేదియో కొన్ని అపశకునములు సీతాపహరణమును చెప్పుచున్నవి. శంకితుడయ్యే రాముడు ముందుకు సాగినాడు. లక్ష్మణుడు కంటబడినాడు. రాముని హృదయము కలతబారినది. సీత ఏమైనదో?....

లక్ష్మణుని కలసినాడు. చిన్నబోయిన ముఖముతో లక్ష్మణుడు తనరాకకు కారణముల తెలిపినాడు. రాముడు లక్ష్మణుడు చెప్పిన కారణములకు తృప్తి పడ లేదు. ఆడువారి కోపమును లెక్కచేసి నాఆజ్ఞను ఉల్లంఘించితివని లక్ష్మణుని దోషమును స్పష్టపరచినాడు.

శత్రునకు (లేక) సేవకునకు ఆజ్ఞాపాలనమే ప్రధానముగాని తన ఆత్మగౌరవము ముఖ్యముకాదని ఈ ఘట్టము తేల్చివది రాముని ముఖముగ. తరువాత? సంశయాత్మడయ్యే రాముడు వర్ణాలకు సోదరునితో వెళ్ళినాడు.

మన మిప్పుడు చూడబోవు రాముడు ఉన్మత్తుడు. మీరు వినబోవు కథా భాగము కావ్యాత్మయగు సీతారాముల వియోగ శృంగారము. ఇది నాయికా నాయికల వియోగము. లేక జీవేశ్వరుల వియోగము. రాముడు వియోగి.

అది రాముని పర్ణశాలాభ్యంతరము. పర్ణశాలయందు సీతలేదు. ఒక దర్భాసనము వేయబడియున్నది. కమండలమున్నది. ఆశ్రమాభ్యంతరము నందున్న పుష్పలతా నికుంజ వృక్షరాజములన్నియు వాడుచూపియున్నవి. ఆవనము శూన్యాగారమై యున్నది రాముని దుఃఖము పొంగినది. సీతఏమయ్యెను? సమాధానమిచ్చువారెవరు? ఆవనమందున్నవి చెట్లును, పుట్టలును, జంతుప్రులును. రాముడు పిచ్చివాడై వాటినే పీకను మీరేమైన చూచితిరా? తెలుపగలరా? అని ఏడ్చుచు అరిగినాడు. రామడిప్పుడెవడు? సామాన్యజీవుల కంటెకూడ దుఃఖభాగుడు కన్నీరు మున్నీరుగా ఏడ్చు వీరుడు.

రాముడు వీరుడగుచో ఇట్లేలఏడ్చును? దేవుడు రాముడగుచో ఇట్లేడుచునా? సర్వవ్యాపకుడైన దేవుని కన్నులకు సీతకనుపడదా? రాముడెవ్వడో నేనిప్పుడు చెప్పను. చెప్పలేను. రామునితోకలసి వాల్మీకి ఏడ్చుచుండెనా? వాల్మీకియే ఏడ్చుచుండి రాముడేడ్చెనని తన కవితాప్రభావమును చాటుచుండెనా? ఇవన్నియు నా సందేహములు. ఈ సందేహములను తరువాత చూచుకొందము. రాముని శోకము ఇంకకొంత గ్రహింతము.

తనలో తాను క్రుంగి కృశించుట శోకము. కన్నీరుకార్చుచు బయటకు ఏడ్చుచు మరొకరితో చెప్పుకొని బాధపడుట దుఃఖము. రామునికిప్పుడు దుఃఖ శోకములు రెండును ఏకమైనవి. లక్ష్మణునివైపు తిరిగి, సీత ఏమైయుండునని ఎలుగెత్తి రాముడేడ్వగా లక్ష్మణుడు ఓదార్చినాడు. ఈవనమధ్యమునందేమైన విహరించుచుండెనేమో? పువ్వులకోయబోయెనేమో? గోదావరికి స్నానముకేగినదేమో? కవ్వలితటకేమైన చనినదేమో. ఎన్నాళ్ళెతుకుదము శోకింపకుము. ఏడ్చువారికి ఆదరించువారి అవసరము చాలయున్నది లక్ష్మణుని ఆదరవాక్యములు రామునకు కొంత ఆశను గొలిపినవి. రామలక్ష్మణు లిద్దరును కలసి వెతికినారు. సీత కనిపించలేదు. లక్ష్మణుడు కూడ బాధపడినాడు. అయ్యను ధైర్యమునే అవలంబించి రామునకు ధైర్యమును చెప్పినాడు. శ్రీ మహావిష్ణువు బలిని బంధించి భూమిని సంపాదించినట్లు సీతాపహర్తను బంధించుదమనినాడు. ఆ మాట రామునకుధైర్యము

నొసగలేదు. హా! ప్రియే! అని ఎలుగెత్తి బిగ్గరగఏడ్చినాడు. కొద్దిసేపు మాటలేదు. స్తంభించిన దుఃఖము. అంతరమునలేచిన అగ్నిజ్వాల. అంతలో ఆ అగ్నిబహిర్గత మగుట. మరలమరల ఏడ్చుట. అంతలో సీత రామునకెదురైనది. సీతను రాముడు కన్నులార చూచినాడు. హా! సీతా! అనినాడు. అంతలో సీత అంతర్ధానమైనది. దాగితివా? హాసీతా! అనిపిలిచినాడు. ఎదుటలేకయే ఉన్నటుల కనుపించిన సీతనే రాముడు చూచినది. ఇది మన్మధా వస్థలోని ఒక అవస్థా విశేషము. మదనార్పితు డైన రాముని చిత్తవికారమున సీత కనుపించినది. సీత అవయవశోభలు రాముని స్మృతికి వచ్చినవి. అవిస్మృతిరూపములు. అంతలో రాముని శోకము అందలి మృగసమూహము మనసును కరిగించినది. అవి రామునకు తెలుపుదమను తున్నను సీతపోయిన మార్గమును నోటచెప్పలేకపోవుట ఒక దురదృష్టము కావచ్చును. కాని ఆవి కన్నులసీరుగార్చి రామునకేదియో చెప్పినవి. రాముడుగ్రహించి సీతఇకలేదని నిశ్చయించుకొనినాడు. రాముని ప్రస్తుత సీతా వియోగదుఃఖము మరికొన్ని తన దురదృష్టములను జ్ఞాపకమునకు తెచ్చినది.

రాజ్యమును కోల్పోవుట. బంధువియోగము. తండ్రిని కోల్పోవుట. తల్లి దూరమగుట. ఇవన్ని తలపునకురాగా శోకాగ్నిమరింత ప్రజ్వలించినది. లక్ష్మణు నితో ఈమాట చెప్పుకొని ఏడ్చినాడు.

"రాజ్య ప్రణాశస్వజనైర్వియోగః పితుర్వినాశో జనసీ వియోగః.
ఏతాని మే లక్ష్మణ శోకవేగం ఆపూరయంతి ప్రవిచింతితాని"

ఇప్పుడు రాముడు తనదురదృష్టము నొకవిధముగ కొలచు కొనదలచినాడు. కొలతబద్ద లేకపోయినది. ఇంతదుఃఖమును కల్పించినదెవరు? తన పూర్వకర్మయే. ఒకనాటి నాదుష్కృతమేనని నిశ్చయించుకొని ఏడ్చినాడు. రామువి ఏడుపులోని విశేషమిదియే. అంతలో రాముడొక శిలాతలమును చూచినాడు అది సీతతో అప్పు డప్పుడు కూర్చొని మాటాడు ప్రదేశము. ఆ ప్రదేశముననే కూర్చొని మరదివి హాస్యమాడుట రామునకు జ్ఞప్తికి వచ్చినది. లక్ష్మణునకది జ్ఞాపకమునుచేసి బాధ పడినాడు. అంతలో గోదావరీనదియు,ఆనదిలోనికేగి సీత పువ్వులకోయదలచుటయు జ్ఞాపకమురాగా అదికాదని ఆతడే నిశ్చయించుకొనినాడు. తానులేక గోదావరికి విలాసముగపోవునది కాదనియే ఆతని నిశ్చయము. కావున గోదావరికేగి వెతకుట

మానినాడు. ఇపి రాముని అంతరంగమున పొగలెగసిన మన్మథాగ్ని. శ్రోతలారా! ఆ రాముని అంతరంగమున సీతావియోగానలము జ్వాలాభీలము కాగా తనకిప్పుడు సీత ఏమైనదో జాడనుచెప్పువారెవ్వరను నది రామునకు ప్రశ్నయైనది. అంతలో ఆతని చూపొక్కమారు గగన మండలమున కేగినది.

ఈ సృష్టి ఖండమున జీవులు మనోవాక్కాయములచే చేయు ప్రతికర్మ కును సాక్షియై మాచుబాడు సూర్యుడు. అతడు తనకీ విషయమును తెలువవలసి యుండగా ఇంతవరకాతడు తన బాధ్యతపి నిర్వర్తించలేదు. కావున సూర్యుని సంబోధించినాడు తెలుపుమని. వాయువును కూడ సంబోధించినాడు. అంతలో లక్ష్మ ణుడు ఆశ్వాసించగా రాముని మోము ప్రకాశమగుచ్చినది. అప్పుడే కొన్నిమృగములు రామునివంక చూచుచు ఆకాశమునకు తమ ముఖములను చూపుచు కన్నీటిధారల కార్చి దక్షిణదిశకు పయనించినవి. సీతపోయిన మార్గమదియేనని రాముడూహించి నాడు. రామ లక్ష్మణుల పయనమటు సాగినది. కొంతదూరముపోగా అక్కడొక పూలమాల క్రింపడియున్నది. అది వాడు మాపలేదు. ఆ పువ్వులు రాముకు సీత కొరకై తెచ్చిన పూవులే. రాముడు గుర్తుపట్టినాడు. కాని ఆమాల ఎందకు ఎందుకు వాడలేదు? క్రిందపడి ఎందుకు వలగలేదు? గాలికి ఎందుకు దూరముకొట్టుకొని పోలేదు? సీత ఇటు పోయినదని చెప్పుటకే ఆమాల అట్లున్నది. సూర్యుడును, వాయువును, భూమియు ఆమాలనట్లుంచినారు. ఈ విషయమును రాముడూహించి నాడు.

అక్కడ ప్రసవణ పర్వతమున్నది. ఆ పర్వతమేమైన సీత పోయిన మార్గమును చెప్పునేమోయని రాముడు వెళ్ళినాడు. కామార్తులకు చేతనా చేతన వ్యవహారముండునా? అయ్యను రాముడాపర్వతరాజును పలకరించి, సీతవార్తను చెప్పెదవా? లేవా? లేకున్న నిన్ను హతమార్చెదనని పర్వతరాజును భయపెట్టినాడు. ఆ పర్వత శ్రేష్ఠము రాముడాపనిని చేయుటకున్నదేమో సమాధానమిచ్చినది. నీచేత విడువబడిన సీత నాచేత చూడబడినదని. పర్వతమెట్లు చెప్పినదని మీరు భావించుచుంటిరా? పర్వతగుహలనుండి వచ్చిన ప్రతిధ్వనియే సమాధానమైనది. ఇక్కడ వాల్మీకి మహర్షివారి కవితను వినుడు.

"కచ్చిత్ క్షితిభృతాం నాథ దృష్టా సర్వాంగసుందరీ
రామా రమ్యవనోద్దేశే మయా విరహితా త్వయా

క్షితిభృత్‌లన పర్వతములు. క్షితిభృతవరాజు.ఓపర్వతరాజమా! అని రాముడు సంబోధించగా ప్రతిధ్వని ఓ రాజా! అని వచ్చినది. నాచేవిరహితమైన సీతనీచే చూడబడినవా! అన్న మాటకు ప్రతిధ్వని నీవిరహితమైన సీత నాచే చూడబడిన దని అర్థము వచ్చినది. ఈ సందర్భమున రాముడు మృగమువెంట పోవుటను ఆపలేదు. వెళ్లుచునేయుండును. అంతలో రామునకొక దృశ్యము కన్పట్టినది.

జటాయు మోక్షము

అది యుద్ధభూమి. విరిగిపడిన రథము.తెగినతలలు. భగ్నములైనధనుస్సులు. బాణసంచయము. అక్కడనే ఒక మహోన్నతమై కూలిన తరువు. రక్తసిక్తమగు నా ప్రదేశమును రాముడు కొంచెముదూరము నుంచే చూచినాడు. రథసారథికూడ అక్కడకూలియుండెను. రాముడిట్లూహించినాడు. రాక్షసులెవ్వరో ఇద్దరు కలసి కొట్లాడుకుని సీతను భక్షించియుండవచ్చునని ఊహించినాడు. రాముడు మారినాడు. రాముడిప్పుడు దశరథరాముడుకాడు. కాముకుడైన దీనుడుకాడు. తానెవ్వరై యుండెనో ఈ ఘట్టమున రాముడు చెప్పినాడు వినుడు. ధర్మము సీతను రక్షింపని పక్షమున నేను ఊరుకొనెను. లక్ష్మణా! నేనెవ్వరనై సీతకొరకిక్కడ చరించు చుంటినో దేవతలకు తెలియకేను. పెద్దపాము పకోల్పోయిఏడ్చుచున్న మానవునిగ దేవతలు తలచుచుండిరి. నేను సృష్టికర్తనై జగమును సృష్టించి దేవతల రక్షించుట కై ఇట్లువచ్చితినన్న మాటను దేవతలు మరచినారు. నా మెత్తనిమనసును దేవతలు పరిగ అర్థము చేసికొనలేను. నా పరాక్రమమును వారు మరచినారు. అవి తన దైవత్వమును తెలిపినాడు.

వింటిరా? శ్రోతలు? రాముడు దుఃఖించిన మాత్రమున మనము రాముడు మనుష్యమాత్రుడను కొనుట తప్పు. నాటకరంగమున ధృతరాష్ట్రుని వేషమువేసిన నటకుడు కన్నులమూయవలెను గాని తెరుపకూడదు. అట్లే రాముడును తనపాత్రకు తగినట్లు వటించినాడు మనుష్య ధర్మముగ.

నేను సృష్టికర్తనే కాదు. లయకర్తనుకూడ. ఒక్క క్షణకాలముననే నేనీ దేవదానవ కిన్నెరకింపురుషాది గణమునంతను నాశము చేయగలను. నేను బాణము లెక్కపెట్టి విడుచుచో అది ఎవ్వనిని వ్యర్థముకాదు. ప్రకృతి సిద్ధములగు జరా జన్మ మృత్యువు లెట్టివో నా శరపాతమట్టిది. లక్ష్మణా! దేవతలందరును కలసి నా సీతను నాకివ్వనిచో ఈ మూడు లోకముల దగ్ధము గావింతుననినాడు. ఈ

మాటలు నా మాటలుగావు. రామాయణములోని శ్లోకములే. అందొక్క శ్లోకమును మీకు వినిపింతును.

"కర్తారమపి లోకానాం శూరం కరుణ వేదినం
అజ్ఞానాదవమన్యేరన్ సర్వభూతాని లక్ష్మణ.

విజ్ఞులెందరో రాముడు తాను దేవుడనని ఎక్కడను చెప్పలేదందురు. వాల్మీకమున లేదందురు. సీత కొరకై దుఃఖించిన దుఃఖములోని భాగమే నేను సృష్టికర్తను ఈ నిర్వచనము. దీనినేమనవలెను? రాముడొక విధముగతన నిజ స్వరూపమునే చెప్పెను. భారతీయ గ్రంధము లందలి చరిత్రాంశములయందు భగవత్తత్వమిట్లే మెరుపు తీగెవలె మెరయును. కధతురందు. రాముని మహోగ్ర క్రోధమును లక్ష్మణుడు చూచినాడు. నిజమునకు ఇట్టి కోపమును లక్ష్మణుడెన్నడును చూచి ఎరుగడు. "అదృష్ట పూర్వం సంక్రుద్ధం దృష్ట్వా రామంతు లక్ష్మణ:" అనినారు వాల్మీకి. అప్పుడు లక్ష్మణుడు లేకున్న రాముని కోపము ఎటు పయనించెదియో? వెంటనే రామునికి లక్ష్మణుడు దోసిలి యొగ్గినాడు. ఎవడో ఒక్కని అపరాధమును ఆధారముగా గొని లోకమును నాశము గావింప నీకు తగదని వినమ్రుడై వలికి సీతను వెతకవలసిన ప్రదేశములన్నిటిని వెతకి దేనతలు దారి చూపనిచో ఈకృత్యమును అప్పుడు నెరవేర్తువుగానియని ప్రణామ మాచరించినాడు. అంతేకాదు ఒకవిధముగ "త్వద్విధాహినశోచంతి" అని ఊరడించినాడు. రాముడు శాంతించినాడు. ఆంతతో ఆఘట్టము ముగిసినది. రాముని క్రోధము మాత్రము చల్లారలేదు. మోపెట్టి యున్న రాముని ధనుర్బాణములలోడనే ఆ గిరిసర్గముల వెతుకదలచినారు. అన్న దమ్ములు.

అంతలో రాముని కంటబడినది వడియున్న ఒక పెద్ద శరీరము. అదియే జటాయువు. రాముడు దానిని చూచి సీతను భక్షించిన దిదియేనని భ్రాంతినొందినాడు. అంతలో ఆపక్షిరాజు ముఖమునుండి దీనస్వరము వినబడినది.

హే ఆయుష్మన్ నీవీ యరణ్యమున ఓషధిని వెదకువానివలె ఏ సీతను వెతకుచుంటివో ఆ సీతను, నా ప్రాణముల గూడ రావణు డపహరించినాడు. నీవులేని సమయమున సీతను రావణు డపహరించుటను చూచి నేనాతని అడ్డుకొనగా నన్నిక్కడ కూలవైచి తనరథ సాధనులు భగ్నము కాగా సీతను ఎత్తుకొని ఆకాశ మార్గమునవయనించినాడు. నారెక్కలు కూలి ఇక్కడ వడినానన్నది. నీబాణముచే నన్ను కొట్టవద్దన్నది. రాముడు మారినాడు. దుఃఖము రెట్టించినది. రాముని దుర్ధ

దృష్టమివ్వడు మిన్నుముట్టినది. తన దురదృష్టము అగ్నిని కూడ తగలబెట్టు నను కొన్న రాముని మాట రూపొందినది. మొదటిది రాజ్య భ్రష్టము. రెండవది వనవాసము. మూడవది సీతా వియోగము. నాల్గవది పక్షిరాజు కూలుట. ఒకదానివెంట నొకటి ఇట్లు వరుసకాగా నా దురదృష్టము అగ్నిని తగలబెట్టుననినాడు రాముడు. మానవ జీవితమున దుఃఖము లిట్లరాగా రామునివంటి ధీరుడే బ్రతుక గలడు. "ఈ దృశీయం మమా లక్ష్మీర్నిర్దహేదపిపావకం" అంతేకాదట. తన దురదృష్టమొక బడ బానలమట. ఇదినముద్రుని శుష్కింప జేయునట. ఆహా! రామా! ఏమి! నీ మానవత్వ ప్రదర్శనము! వేవేగ వచ్చి ఆపక్షిరాజును కౌగలించుకొనినాడు. రక్తసిక్తమగు ఆపక్షి శరీర మాతనికి నింద్యము కాలేదు. పక్షిరాజు ఈ ఘట్టమున రామునకు దశరథువివలె కన్పట్టినాడు. సీతను రావణుడెత్తుకొని పోవుటను విపులముగ తెలుపుమనినాడు. జటాయువు రావణుడు సీతనెత్తుకొని దక్షిణదిశ కేగెనను వంతవరకు తెలిపి, ఇక నాప్రాణముచు నిలువవని చెప్పుచునే రావణుడు విందముహూర్తమున సీత నపహరించెను. ఆమెవానికి దక్కదు. ఆ ముహూర్తము నందెవ్వడు దొంగ తనమును చేయునో ఆవస్తువు యజమానికే దక్కుమగాని, చోరునకు దక్కదని ప్రశ్నభాగమును చెప్పుచునే ఆ జటాయువు అత్యంత దుర్లభములగు తన ప్రాణములను వదలినది. రాముని దుఃఖమునకు మేరలేదు. ఇక్కడ రాముడొక దివ్యసందేశము విచ్చినాడు.

లక్ష్మణా! ధర్మమూర్తులగు సాధువులు మానవ మాత్రులయందే ఉందువను నియమములేదు. తిర్యగ్జంతువుల యందున కలరనుటకు ఈ పక్షిరాజే సాక్ష్యమువి నాడు. శరణాగత రక్షణమున కంటె ధర్మమొక్కడున్నదని ఆ పక్షిరాజు యొక్క శౌర్యమును శరణాగత రక్షణమును ప్రశంసించి దహన సంస్కారముల గావించి నాడు. ఆసంస్కారము మంత్ర పూతమగు సంస్కారము. ఇదియే చిత్రము. అరువది వేల సంవత్సరములుగా సంతతిలేక పుత్రకామేష్టివి చేసిన దశరథునకు రాముని చేతిమీదుగ దహన సంస్కారము జరుగలేదు. అరణ్యమునందు పక్షికి ఆ అదృష్టము పట్టినది. అదియట్లుండ రాముని ప్రత్యేకత ఇక్కడ చూపబడినది. ఏమది? రాముడు సాక్షాన్నారాయణుడనుమాట. అతడు లోకనాథుడను విషయము.

రాముడిప్పుడు జటాయువును చితియందుంచి అన్నమాట ఇది

యాగతి ర్యజ్ఞశీలానాం ఆహితాగ్నేశ్చ యా గతిః
అవరావర్తినాం యా చ యా చ భూమి ప్రదాయినాం
మయాత్వం సమనుజ్ఞాతో గచ్ఛలోకా నను త్తమాన్
గృధ్రరాజ మహాసత్వ సంస్కృతశ్చ మయా వ్రజ.

వైదికములగు యజ్ఞములను చేసిన చారే పుణ్యలోకములకేగుదురో, యుద్ధ రంగమునుండి తిరిగి రాక వెన్నుచూపని వీరులే వీరస్వర్గముల నలంకరింతురో, భూదానము నొసంగిన దాతలే పుణ్యలోకములకేగుదురో ఆలోకములకు నా అనుజ్ఞచే నీవు వెళ్ళుమని పలికినారు ఆపులుగును చితియందుంచి. ఈవలుకు నెవ్వరు వలుకుదురు? నా అనుజ్ఞయను పదమిక్కడ గమనింపదగు పదము. ఆతరువాత రామలక్ష్మణులు స్నానము నాచరించి ఉదక దానములు గావించి పిండ దానమును గూడ చేసినారు. ఇప్పుడు రాముడెవరు? నారాయణుడును మర్యాదా పురుషోత్తముడుకూడ.

అక్కడ నుండి బయలుదేరినారా రామ లక్ష్మణులు. మరికొందరను కడ తేర్చదగు అవసరమున్నది. కబంధుని కృతార్థుని కావింపవలెను. శబరికి పుణ్య లోకముల ప్రసాదింపవలెను.

జనస్థానమునకు మూడుక్రోసుల దూరమునందున్నది క్రౌంచారణ్యము. ఆ క్రౌంచారణ్యమును సమీపించినదే వేరొక అరణ్యము మతంగాశ్రమము కూడ. ఆ క్రౌంచారణ్య మతంగాశ్రమముల మధ్యనున్న ఆ అరణ్యము చాల గంభీరమును గహనము కూడ. కాగా నందొక మహా రాక్షసి యున్నది. ఆరాక్షసికి అయోముఖి యని పేరు. ఆ రాక్షసికి లక్ష్మణునితోటి కామానుభవము కావలెనని పించి, లక్ష్మణునివట్టుకొన్నది. లక్ష్మణుడా రాక్షసిని వికృతరూపిని గావించగా ఆరక్కసి పరుగెత్తినది. తరువాత వాడు కబంధుడు. ఆ రక్కసునకు పొట్టనీదనే నోరువ్వది. ఆ రాక్షసుని బాహువులు మాత్రము ఒక యోజనమందును. ఆతని చేతికందిన జంతువులను గాని, మనుజులను గాని ఆతడాహారముగ తీసుకొనును. రామలక్ష్మణులాతని చేతికి చిక్కినారు.

కబంధున కది శాపవిమోక్షకాలము. అకడొకప్పుడు సుందర విగ్రహుడే, స్థూలశిరుదనుఋషిని అవమానపరచి వికృత రూపుడయ్యెను. తనవికృత రూపమునకు విముక్తిని ఆఋషిని కోరగా రామునిచే నీబాహువులు ఛేదించబడి నీవు ముక్తుతవు కాగలవని అనుగ్రహించినాడు. ఇంతలో ఆతడు తపస్సును చేసి దీర్ఘాయుర్దాయమును సంపాదించుకొని దేవేంద్రునిమీదికి యుద్ధమునకు పోగా ఆదేవరాజు వజ్రాయుధమున చే శిరమును ఖండించి ఊరుభాగమును కూడ లోపలికి త్రోసినాడు. కాని బ్రహ్మయిచ్చిన వరవిశేషముచే ఆతడు చావలేదు. ఆకలిబాధ పీడించగా

ఇంద్రుని అనుగ్రహమున పొట్టమీదనే ముఖము నుండుట జరిగినది. అతడు దనువు యొక్క కొడుకు. అతని బాహాయుగ్మమున చిక్కిన రామ లక్ష్మణులాతని బాహా వులను నరికివేయగా ఆతనికి పూర్వ స్మృతికలిగి తన చరిత్రను వారికి చెప్పుకొని తన్ను దహనము చేయుమని కోరినాడు. రామ లక్ష్మణులట్లే చేయగా ఆ రాక్షస దేహము పోయి ఆతనికి దివ్యదేహము వచ్చినది. అంతతో ఆతడు రామునకు రాబోవు శుభసంతను చెప్పి, రాముని ఋష్యమూకమున కేగుమనియు, సుగ్రీవుని మిత్రునిగా గ్రహింపుమనియు ఆలోపలనే మతంగాశ్రమమున నీ కొరకై శబరియను మహా భక్తురాలు కనిపెట్టుకొని యున్నది గావున ఆమె అందించు ఆతిథ్యమును గ్రహించుమనియు చెప్పి ఆతడంతర్ధాన మొందినాడు.

రాముని పయనము అక్కడనుండి ఋష్యమూక పర్వత ప్రాంతమునకు సాగినది. మతంగ మహర్షుల ఆశ్రమమక్కడనే. శబరి ఆశ్రమమును అదియే. రాముడు శబరి ఆతిథ్యమునందు కొనినాడు. భారత క్షేత్రమున శబరి మహనీయుల సేవచేసి కృతార్థురాలైన పుణ్యస్త్రీ యవక తప్పదు. ఆమె ఋషుల వంశమునకు చెందినదికాదు. వేద వేదాంగముల చదువలేదు. కాని ఆమె బ్రహ్మణ్యులైన మతంగ మహామునుల పాదములు నాశ్రయించి, కామక్రోధముల జయించి, గురు కటాక్షము లకు పాత్రురాలై రామ పాదారవిందముల తాకి ఆ బ్రహ్మణ్యునకు ఫలహారముల నందించి మహర్షి లందరును వెళ్ళదగు పుణ్యలోకములకు వెళ్ళిన ఆటవికస్త్రీ ఆమె రామునకు వన్యఫలములతో ఆతిథ్యము నొసంగి, ఆ రాముని ఎదుటనే ఒక చితిని ఏర్పరచుకొని, యోగ మార్గమున తన జీర్ణదేహమును దగ్ధము గావించుకొన్న యోగిని.

భారతీయ శాస్త్రములు గిరిజనులు మొదలగువారి మోక్షమును గురించి కన్నెత్తి చూడలేదనియు, ఒకనాటి ధార్మిక వర్గము వారిని దూరముగ త్రోసివేసి రనియు చెప్పువారినేమనవలెనో ?

శబరి ఆశ్రమ ప్రవేశముతో అరణ్యకాండ ముగిసినది. మహర్షుల ఆశ్రమ ప్రవేశముతో రామానుగ్రహము ప్రారంభమై శబరి జీవిత విమోక్షముతో అంత మైనది ఈకాండము. గీతాశాస్త్రములోని భక్తియోగసారమే ఈకాండము.

ఓమ్

కిష్కింధ కాండము

శ్లో॥ రామం రాక్షసమర్దనం రఘువరం దైతేయ విధ్వంసనం
సుగ్రీవేప్సితరాజ్యదం సురపతేర్భృత్యంతరం శార్ఙిణం
భక్తానామభయప్రదం భయహరం పాపౌఘ విధ్వం
సకం
సామీరిస్తుత పాదపద్మయుగళం సీతాసమేతం భజే॥

- రామ సుగ్రీవ మైత్రి -

అర్య మహాశయులారా !

మన మీనాటికి మన రామాయణమహా కావ్యమున మూడు కాండల గడచి నాము. నాల్గవది కిష్కింధకాండము. ఈకాండమునందతి ప్రాధాన్యములైన పాత్రలు వానరములు. ఈకావ్యమున మహానాయకుడగు రామునకును ఈ వానరములకును గల ప్రత్యేక సంబంధ మొక చరిత్రయై విలసిల్లినది. ఒక విధముగ విచారించుచో ఈవానరులకును రామునకును గల సంబంధము తాత్కాలిక మనుట రామాయణ మున కుదరదు. రాముడు మానవమాత్రుడేకాదు. దైవము మానుషరూపము నొంది నదన్నచే రామాయణకథ కుదురును. అట్లే ఈకిష్కింధ కాండయందలి వానరములు ప్రాకృత సృష్టిలోని వనుట యు కుదరదు. ప్రాకృత వానరశరీరములతో అప్రాకృత శక్తులు తన్నిమగుట రామాయణ మహాకావ్య కథాభాగములోని ప్రత్యేకత. కాకున్న హనుమంతుని పాత్రను మనమెట్లు సమన్వయింతుము? హనుమంతుని తోటివారలే మిగిలిన వానరులుకూడ. రావణ సంహారమునకు శ్రీమహావిష్ణువు మనుష్యశరీరమును ధరించగా దేవతలును, దేవతాయోని విశేషులును వానరరూపములతో భూమిపై కేతెంచినారు. ఇంద్రుడు వాలియైరాగా, సూర్యుడు సుగ్రీవుడయ్యెను. ఇట్లే అగ్ని నీలుడయ్యెను. వాయువు హనుమంతుడయ్యెను. దేవతాస్త్రీలను ఈవానర వత్నులై జన్మించినారు. వీరు కామరూపధరులు. ఎప్పుడేరూపము

కావలెనన్న ఆహూపములు ధరింతురు. ఈ భూఖండము నందెన్నియో పర్వతరాజము లున్నవి. అందొకటి ఋష్యమూకము. భూఖండము నందవతరించిన వానరమూల దేవతలకందరకును ఇదియే ప్రత్యేకమగు రాజధాని. ఈ ఋష్యమూక పర్వతాంతర్భాగమునందే కిష్కింధానగర సామ్రాజ్యము. భూఖండమునగల పర్వతరాజము లెన్నియో వానరశరీరధారులగు దేవతలచే ఆక్రమించబడినవి. మలయము, దర్దురము మొదలగు పేర్లుగల పర్వతములు ఈ కాండమున వర్ణించబడినవి.

ఆ పర్వతము లిప్పుడెక్కడయుండెనో నిర్ణయించుట కావివని. ఈ పర్వతములేకాదు. ఈకాండ యందెన్నియో భూగోళ విశేషములు వర్ణింపబడినవి. వాటిని నేను ఈప్రదేశమిది, ఈప్రదేశమిది అని నిర్ణయించుట కేవల ఊహా ప్రపంచము కాగలదు. రామాయణచరిత్ర ఇరువది ఎనిమిదవ మహాయుగమునందలి వైవస్వత మన్వంతరములోనిది. అయ్యాను కొన్ని పర్వత ప్రదేశములును, నదులును, సాగరములును సూత్రప్రాయములుగా నేడు కన్పట్టవచ్చును. ఒక విధముగ ఋష్యమూక పర్వతము దగ్గరనున్న పంపా సరోవరము నేటి హంపీక్షేత్రమని వాడుక యున్నది. కావచ్చును. లంకయెక్కడ? మహేంద్ర పర్వతమెక్కడ? అను ప్రశ్నలకు ఆనాటి ఆప్రదేశములను నేటి చరిత్రకారులు చెప్పెదరు. కాని వారు వారము కున్న ప్రదేశముల ననుసరించి, రామాయణకాలమును, ఆనాటి ఆచారములను తెలుపుచు ఆర్యనాగరికతను బయటకు లాగితిమను కొనుచుందురు ఆనాటి రామాయణము ఆర్యద్రావిడ చరిత్ర కావచ్చునని నీటిమీద గీతలనలె నిర్ధారణ గావింతురు కూడ. అది నావనికాదు. పాశ్చాత్య చరిత్రల నాధారముగాగొని వ్రాయు ఆపండిత ప్రవరులతో నాకు వివాదములేదు. భారతీయాధ్యాత్మిక తత్వజిజ్ఞాసువుల కందించదగు విజ్ఞాన సూత్రములు వ్యాఖ్యానించిన వాల్మీకి సారస్వతమును మీ ముందుంచుట నాప్రయత్నము. కథాభాగమున ప్రవేశికము. ఈనాటి ఉపన్యాసము రామసుగ్రీవ మైత్రి.

అది ఋష్యమూకమను పర్వతరాజము. అక్కడనే పంపాసరోవరము. ఆ పర్వతమునకు సంబంధించినదే మతంగమహర్షివారి ఆశ్రమము. భూ సుందరికా పంపాసరోవర ప్రాంతమొక అమూల్యాభరణ మనకతప్పదు. ఆ సరోవరమును తిలకించు శ్రీరామచంద్రుడు లక్ష్మణునితో....

లక్ష్మణా! ఒక విధముగ భరతుని వియోగదుఃఖము నన్ను క్రుంగదీయు చుండగా సీతావిరహము దానికి తోడైనది. ఈయిద్దరి విరహ వేదనమును కూడ భరింపజాలక తాపతప్తడనై యుండగా అట్టినాతను ఈపంపాసరోవర భాగ్యలక్ష్మి శోభనుకూర్చుచున్నది. చూచితివా? అనినాడు. ఇక్కడ వాల్మీకిమహర్షివారు కావ్య సుందరికెంతయో సొగసును కూర్చుచు అందున్న వృక్షలతా నికుంజములను, అందుచరించు తుమ్మెదల రొదలను, పింఛముల విప్పియాడు నెమళ్లను వర్ణించి ప్రకృతి సుందరిని తీర్చిదిద్దినారు. ఇదియొక అపూర్వవర్ణనము. దీనినిట్లుంచుదము సమయము చాలదు.

రాముని విరహవర్ణనముకూడ చాల విస్తృతమైయున్నది. రాముడు పంపాసరస్తీరమున సీతావిరహ కాతరుడై శోకించుటను వాల్మీకి చాల వర్ణించినారు. కావ్య నిర్మాతలు కవితావిశేషమును చూపుటకు వియోగవర్ణనము విహారస్థలము. ప్రకృతమున మనమిప్పుడా రంగస్థలమును వదలి కథకు వత్తము.

రాముని విరహశోకము లక్ష్మణుని వైరాగ్యబోధచే ఉపశమించినది. నష్ట వస్తు సంపాదనము శోకమువలన ప్రాప్తించదు. అన్నా! ప్రయత్నము అవసరము. స్వస్థచిత్తుడవగు మనినాడు లక్ష్మణుడు. వెంటనే ధైర్యసాహసములా రఘుపీరుని ముందు విలిచినవి. రామలక్ష్మణులు సీతాన్వేషణ కార్యక్రమమున ప్రవేశించినారు.

వాలి సుగ్రీవులిద్దరును సోదరులు. వారిప్పుడు బద్ధశత్రువులు. వాలి చాల బలవంతుడు. సుగ్రీవుడును బలవంతుడే. కాని వాలి సుగ్రీవున కంటె మిక్కిలి బలవంతుడు. వాలిచే సుగ్రీవుడు రాజధానినుండి వెడలగొట్టబడినాడు. సుగ్రీవుని భార్యపేరు రుమ. రుమను వాలి తన స్వాధీనమునందుంచుకొని తమ్ముని తరిమి వేయగా సుగ్రీవుడిప్పుడు ముఖ్యమూక పర్వతమున దాగినాడు వాలిచేత చత్తునన్న భయముతో. వాలి ఆపర్వత ప్రాంతమున అడుగిడడు. అదియే సుగ్రీవునిధైర్యము. వాలికి మతంగాది మహర్షుల శాపమున్నది. కావుననే వాలి ఆప్రాంతమునకు రాడు. కాలము గడచుచున్నది.

ఒకనాటి ఘట్టము.

రామలక్ష్మణులా పంపాసరస్తీరమునకే సీతాన్వేషణ గావించు సమయమది.

తీక్ష్ణకోదండముల చేతబూని ఆపంపాసరస్తీర వృక్షాంతర్భాగములందెక్కడైన రావణుడు సీతను దాచెనేయోయని రామలక్ష్మణులు వెతుకుచుండిరి. ఆకాను

బాహువులతో శత్రువులకు కన్నెత్తి చూడనలవికాని ఆపీరశిఖామణులను సుగ్రీవుడు చూచినాడు. సుగ్రీవుడా ఋశ్యమూక పర్వతసానువుల అటునిటు తిరుగుచున్న సమయమది. సుగ్రీవుని గుండెబిద్దలైనది. వాలి తన్నుచంపుటకు పంపిన గూఢచారులు వీరు కావచ్చునని సుగ్రీవుడూహించినాడు. గూఢచారులవలన శత్రువుల నిర్మూలించుటకూడ రాజనీతిలోని ఒకభాగముగదా?

సుగ్రీవుడొక్కడే ఋష్యమూకమున లేడు. ఆతని సచివులను కొందరుండిరి. ఆ సచివులం దొకడు హనుమంతుడు. ఇతడు మహానుభావుడు, వేదవేత్త, ఈశ్వరాంశ సంభూతుడు. కేసరియను వానరోత్తమునకు క్షేత్రజుడు. వాయుదేవునకు ఔరసుడు. అసగా కేసరి భార్యయగు అంజన యందు వాయువునకు జనించినవాడు. కావున వాయుపుత్రకు ఔరసుడును కేసరికి క్షేత్రజుడును అయ్యెను. తల్లిపేరు అంజనాదేవి కావున ఈయనకు ఆంజనేయుడని పేరు వచ్చినది. ఈతని ప్రభావమీ కిష్కింధ కాండమున ప్రారంభమై సుందరకాండ యందు విస్తరించును.

రామలక్ష్మణులను చూచి వాలిచే పంపబడు హంతకులు వీరని భయపడిన సుగ్రీవుడు వరుగు వరుగున ఆ పర్వత పైభాగమున కెగబ్రాకి అటునిటు తిరిగి ఒక్కచో కూర్చొనగా ఆతని సచివులను కొందరాతనినే అనుసరించి ఒక్కచో కూడిరి దోసిళ్ళనొగ్గి.

ప్రస్తుతమున సుగ్రీవుని సమస్య నేనిక్కడ వసించుటయా? మరెక్కడికైన వెళ్ళి ప్రాణముల నిలుపుకొనుటయా? అనునదే. ఆతని దరిజేరిన కపులను సార్థకనాములై యుండిరేగాని సలహాదారుడెవ్వడును కాలేదు.

హనుమంతుడు ఒక్కడే భయభ్రాంతుడై కూర్చొన్న మహారాజునకు ఏమాటలు చెప్పి భయమును తీర్చవలెనో ఏ సాయమునుచేసి ఆ రాజును కృతార్థుని గావింపవలెనో గుర్తెరిగిన సచివుడు. హనుమంతుడు సుగ్రీవుని మొదట "సంభ్రమస్త్యజ్యతాం" భయమును వీడమని వాక్రుచ్చి ఆతడు భయపడకుండుటకు ప్రధాన కారణమును ప్రతిపాదించినాడు. మహారాజా! వాలి ఇక్కడకు రాడుగదా? నీకేల భయము? అని సుగ్రీవుని మనస్సున చోటుచేసుకొన్న మృత్యుభయమును అవ్వలకు నెట్టినాడు. సుగ్రీవునిలోని చపలత్వమును తొలగించి, ముందు ధీరుడవై ఆలోచింపుమని, ఇది రాజధర్మమనినాడు. మరి సుగ్రీవుని సమాధానమేమి?

రామలక్ష్మణుల భయంకర ధనస్సులను వారి ఆకారములను కనుగొన్న ఎవరికి భయము కలుగదు ? ముందు వారెవ్వరో తెలియుట మనకవసరము గావున వారెవ్వరో తెలుసుకొని వారిని నా ఎదుటకు గొనిరమ్మని ఆంజనేయుని కోరినాడు.

ఇక్కడనుండి హనుమంతుని పాత్ర గూఢచారియై సత్యాన్వేషణమును గావించునదైనది. సత్యాన్వేషణ సామగ్రి ఆతనికి కొరతలేదు.

హనుమంతుడు కామరూపధరుడగుటచే సన్యాసివేషమును స్మరించినాడు. ఆతని కపిరూపము తొలగినది. సన్యాసిరూపము వచ్చినది. హనుమంతుడా పర్వతాగ్రము నుండి క్రింద కొక్కడూకు దూకినాడు. విచిత్రవేషములతో వచ్చు ధనుర్ధారులగు రామలక్ష్మణుల కెదురై నిలిచినాడు. హనుమంతుని హృదయము రామలక్ష్మణుల నిజస్వరూపమును చక్కగ తెలిపినది. కాని హనుమంతుడు వేషమును మార్చుకొనలేదు. సన్యాసి వేషధారియయ్యే యుండెను. తాను అధ్యయనము గావించిన వేదవేదాంగములసారమే ఈమూర్తులిద్దరునని నిశ్చయించుకొనినాడు.గగన మండలము నుండి దిగివచ్చిన సూర్యచంద్రులు కాకున్న వీరి రూపము లిట్లైందు కుండునని ఊహించినాడు.

వారిద్దరి విశాల వక్షములును వారి ఎగుభుజములును, ఆజానుబాహువులును వారి ఆకర్ణాంత నేత్రములును, ఈ మూర్తుల దేహచ్ఛాయలును ఆతనికి ఆశ్చర్యమును గొలిపినవి. అందొక్కని దేహము వినీలవర్ణమున భాసించుచు మరొక్కని దేహకాంతి సువర్ణవర్ణమున వెలుగొందుచు దేహకాంతులు భిన్నములై యున్నను ఈ రెండు వర్ణములును లోకవిలక్షణములై అనిర్వచనీయములై యున్నవనియే ఆతడు భావించినాడు.

అంతలో హనుమంతుని చూపులు వారి ఆజానుబాహువులతో ధరించిన మహాప్రమాణ విస్తీర్ణములగు ధనస్సులపై బడగా, ఈ ధనస్సులు మానవమాత్రులు ధరించునవి కావని ఆతనికి నిశ్చయమై ది ఇక వారి చూపులను గమనించినాడు. వారి చూపులు ఏదో ఒక ముఖ్యమగు వస్తువును కోల్పోయినవారు ఆవస్తువుకొరకై వెతుకులాడుచున్నట్లున్నవి.

వీరు రాజ వంశీకులు జడవాడలై ఈ అరణ్యముల కేతెంచుట కేదియో యొక బలవత్కారణ ముండకపోదు. శత్రువు లెవ్వరును వీరిని అరణ్యములకు

పారద్రోలలేను. మణి సువర్ణ భూషణాంబరముల ధరించదగు ఈ మంగళ విగ్రహ ముల చూడజాలని దురదృష్టవంతులెవ్వరో ! వీరి చేతనున్న ఆయుధము దేవరాజు చేతనుండు ఆయుధము. వీరు చతుస్సముద్ర ముద్రితమగు నీధరామండలమును ఏకచ్ఛత్రాధిపత్యముగ నేలదగు వీరులు సుమా! అని నిశ్చయించుకొని, తానూహిం చిన భావములనే వ్యక్తపరచుచు ఆ రామలక్ష్మణుల ప్రశ్నించినాడు. ఇది హను మంతునిలోని ప్రత్యేకత.

రామలక్ష్మణుల నుండి సమాధానము హనుమంతునకు రాలేదు.

తానెవ్వడై వచ్చి అడుగుచుండెనో తన చరిత్రను చెప్పకయే వాని సమా ధానమిత్తురా? ఆ విషయమును గ్రహించిన హనుమంతుడు తన చరిత్రను చక్కగ విశదీకరించి తాను వచ్చిన పనినిగూడ రామలక్ష్మణులకు తెలిపినాడు.

రామునకు హనుమంతుని సంభాషణలోని ప్రత్యేకత అర్థమైనది. విష యమును ప్రతిపాదించునప్పుడు శబ్దార్థమును, ఆ అర్థమునకు తగిన తాత్పర్య నిర్ణయ మును భిన్నములై లేకుండుట. ఉచ్చరించు ఉచ్చారణ యందు భావనిర్ణయము స్పష్టమై వినువానికి వ్యక్తమగుచుండుట. (స్పష్టమగు పలుకుబడి కలిగియుండుట) శబ్దోచ్చారణ కనుగుణ్యముగ అంగాభినయ ముండుట ఇవి వక్త కుండదగిన ప్రత్యేకతలు. ఇవి వేదశాస్త్రాధ్యయనములవల్ల గాని రావు. వ్యాకరణముచేత శబ్ద వ్యుత్పత్తియు, తర్కముచే పదార్థజ్ఞానమును, మీమాంసచే వాక్యాన్వయ జ్ఞానమును కలుగును. ఇది భారతీయ విజ్ఞానము.

రాముడు హనుమంతుని యందీ విషయములు పరిపూర్ణములై యుండుటను గ్రహించి, హనుమంతుని విద్యావిజ్ఞానమును కొనియాడి, తమ అవసరమును తెలుపుటకు లక్ష్మణుని ఆజ్ఞాపించినాడు.

లక్ష్మణుడు సుగ్రీవుని మైత్రి కోరియే యిచ్చటకు వచ్చెనని తేల్చినాడు. ఆ తేల్చటయందే రాముడు సాక్షాన్నారాయణుడన్న భావమును నిగూఢముగ వ్యక్తము చేయుటను వాల్మీకి తెలిపినాడు.

"లోకనాథః పురాభూత్వా సుగ్రీవం నాథమిచ్ఛతి"

ఒకప్పుడు లోకనాథుడైన రాముడిప్పుడు సుగ్రీవుని నాథుని గావించుకొను టకు వచ్చెసనినాడు. ఇందలి లోకనాథ పదము భగవంతుని వ్యక్తీకరించు ప్రస్తు

తమున రాముడు చక్రవర్తియై కూడ మిత్రలాభమునకై ఇట్లుపచ్చెననికూడ తెలియ వచ్చినది. వాల్మీకి కవిత్వములోని ప్రత్యేకత ఇదియే.

అది సుగ్రీవుడు వసించియున్న ఋష్యమూక పర్వత భాగము. హనుమ రామలక్ష్మణులను తన భుజస్కంధమున నిడుకొని సుగ్రీవుని వద్దకు తీసుకొని వెళ్ళినాడు సుగ్రీవుని భయము తీరినది. సుగ్రీవుడు వానర రూపమును వదలి మనుష్యరూపము ధరించినాడు. రామునకు మిత్రలాభము కలిగినది. ఇక వారి మైత్రి స్థిరము కావలెను. రామ సుగ్రీవులిద్దరును ఒకరిచేతి నొకరు కలుపుకొని మిత్రులము మనమిద్దర మనుకొనినారు.

ఇక వారిద్దరిమిత్రత్వమును తాత్కాలికముగాకుండ శాశ్వతము కావలెను. వారిద్దరిమధ్య నొక సాక్షి మధ్యవర్తికావలెను. అతడును శాశ్వతుడు కావలెను. భార్యాభర్తలమైత్రి కూడ ఇట్టిదే.

భారతీయ సిద్ధాంతమున అగ్నిసాక్షికము ముఖ్యము. కావున రామసుగ్రీవుల మైత్రి అగ్నిసాక్షికమైనది.

హనుమంతుడు భిక్షురూపమును వదలి కట్టెలుతెచ్చి అగ్నిని రగిల్చినాడు. వారిద్దరును ఆ అగ్నికి ప్రదక్షిణమాచరించి, ఒకరిపై నొకరు స్నేహభావమును ప్రకటించు చూపుల బరపుకొనుచు తమ స్నేహభావమును స్థిరీకరించు కొనినారు అదొకరికి శుభకారణముకాగా వేరొకరికి అశుభకారణమైనది. సీతకు రామసుగ్రీవుల మైత్రి కాలమున ఎడమకన్ను అదరినది. వాలికిని రావణునకును కూడ ఎడమకన్నే అదరినది. ఈ భాగము వారిద్దరిచావును సీత బంధవిమోక్షమును సూచించినది. తదుపరిది రామ సుగ్రీవుల మిత్రభాషణము.

సమాన స్కంధమునసే మిత్రత్వముండును. ఉండవలెను. ఉన్ననే ఆమైత్రి చెడదు. రామసుగ్రీవుల దుఃఖము లొక్కటే. సామర్థ్యములును అట్టివే. ఒకరి కొకరు తీసిపోని ధర్మమూర్తులు.

వ్యధ తెలియనివానితో తనవ్యధను చెప్పికొనగా ఆతడు దానిని కథగ వినును.

రామసుగ్రీవుల కిక్కడ కలిగిన దుఃఖము ఒకేరూపము. రామ సుగ్రీవు లిద్దరును తమ భార్యలను కోల్పోయిన వ్యక్తులు. వారిద్దరును తమ భార్యలను

సంపాదించుకొనవలెను. కావున ఒకరొకరు సత్యభావమున చెప్పుకొనినారు. సుగ్రీవుడు వాలి తన భార్యనపహరించెనని చెప్పగా రాముడు తన భార్యను రావణుడెత్తుకొని పోయెనని చెప్పినాడు ఈ ఘట్టమున రాముకు సుగ్రీవుకు సాయము గావింపగా రామునకు సుగ్రీవుడు సాయముచేయును. దీనినే వారిద్దరును నిశ్చయము గావించుకొనినారు. వాలిని వధించి నీ భార్యను నీకిత్తునని రాముడు ప్రతిజ్ఞను చేయగా వేదప్రతిని తెచ్చినట్లు సీతను తెచ్చి నీకిత్తునని సుగ్రీవుడు ప్రతిజ్ఞ చేసినాడు.

తదువాత ఒక సన్నివేశము జరిగినది.

రావణుడు సీతనెత్తుకు పోవునప్పుడు సీత తన ఆభరణముల మూటనీ ఋష్యమూకమున పడవైచినది. దానిని సుగ్రీవుడు జాగ్రత్తపరచినాడు. రావణు డెత్తుకొని పోవునపుడు హా! రామా! లక్ష్మణా! అన్నిఆక్రోసించిన స్త్రీ సీతయే అయి వుండునని ఊహించిన సుగ్రీవుడు, ఆ విషయమును రామునకు చెప్పి, తాను భద్ర పరచిన నగలమూటను రామునిముందుంచినాడు. అయిదుగురు వానరులతో కలసి రావణుడు సీతనెత్తుకుపోవుట నేను చూచితినని చెప్పుచు ఈ మూటను ముందుం చగా రాముడప్పుడెట్లుండును?

రాముని ముఖమండలమున దుఃఖముపయించగా ఆతని ముఖము మంచుచే ఆవరించబడిన చంద్రమండలమైనది. సీత ఆభరణములు రాముడెరుగనివికావు. ఆ పట్టు పుట్టము సీతదే. రాముని ధైర్యము కుంగినది. కన్నులవెంట నీరుకారినది ఆతడు మూర్ఛిల్లినాడు....

కొద్దికాలము గడచినది. తేరుకొనినాడు. లక్ష్మణుని వంకతిరిగి లక్ష్మణా! మీ వదినె ఆభరణములను గుర్తింపుమనినాడు.

ఆమె ధరించు ఆభరణములెవ్వియో లక్ష్మణుడేమి ఎరుగును! ఆతడెన్నడును సీతామాత ముఖమండలమును చూచి ఎరుగడు. ప్రతినిత్యమును లక్ష్మణుడా మాతృమూర్తి పాదపద్మములయందు దృష్టిని నిలిపి వందన మాచరించును కావున ఆమెకాలి అందియలను మాత్ర మాతడెరుగును. ఆ మాటనే అన్నగారికి చెప్పి అందెలు మాత్రము వదినవేననినాడు.

"నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే
నూపురేత్వ భిజానామి నిత్యం పాదాభివందనాత్.

చెవికమ్మల నాతడెరుగడుట. కేయూరముల నాకడెరుగడఱి. (దండకడియ ములు) వరదారల యందు దృష్టివి నిల్పగూడని ప్రశ్నము లివ్వి, ముఖము, వక్ష స్థలము.

రాముడొక్కమాఱుగ సుగ్రీవునివైపు తిరిగి సుగ్రీవా! రావణుడున్న ప్రదేశమెక్కడ? అని అడిగినాడు. సుగ్రీవుడు నేనెరుగనని సమాధానమిచ్చినాడు. నిజమునకు సుగ్రీవుడు రావణుని ఎరుగనివాడుకాడు. ఇది మిత్రద్రోహమా? అబద్ధమా! రెండునుకాదు. ఇది సుగ్రీవుని దూరదృష్టి. సుగ్రీవుడప్పుడు రాముని కన్నీటి బిందువులతుడిచి ఆచరించగా వారిద్దరును మరల తమ తమ కర్తవ్యముల నెరవేర్పుని గురించి ప్రతిజ్ఞలకావించుకొనినారు. రాముడు ముందు వాలిని వధించి సుగ్రీవునికార్యము నెరవేర్చవలెను. అవిరేపు—

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

స్వస్తి ప్రజాభ్యః

2 వ రోజు

శ్లో॥ రామం రాక్షసమర్దనం రఘుపతిం శక్రారి విధ్వంసినం
సుగ్రీవేప్సిత రాజ్యదం సురపతేః పుత్రాంతకం
శార్ఙ్గిణమ్
భక్తానామభయప్రదం భయహరం పాపౌఘ
విధ్వంసనం
సీతా సేవిత పాదపద్మయుగళం రామంభజేశ్యామలం

వాలి వధ–అందలి సంశయ నివారణము

ఆర్య మహాశయులారా !

నేటిది కిష్కింధ కాండయందలి రెండవ ఉపన్యాసము. చెట్టుచాటునుండి వాలిని వధించుట రాముని పరాక్రమమునకు కళంకము కాదా? అన్న ప్రశ్నకు సమాధానము నేటి ఉపన్యాసములోని ముఖ్యాంశము.

కథా భాగము.

వాలి సుగ్రీవుల మైత్రి విన్నటి కథాభాగము. నేడు దాని తరువాతి కథాంశము. రామసుగ్రీవు లొక ఏకాంత ప్రదేశమున చేరినారు. రామునకక్కడనే సుగ్రీవుడొక ఆసనమును కల్పించగా రాముడు సుఖాసీనుడయ్యెను. అప్పుడే సుగ్రీవుడు తన కష్టమును రామునకు విన్నవించుకొని భయార్తుడనైన నాకు అభయ ప్రదానమివ్వమని అర్థించగా రాముడభయదానమును గావించినాడు. అంతట సుగ్రీవుడు నా కష్టమును తీర్చు విధానమునకు కూడ నీకే స్వతంత్రము నిచ్చు చుంటినని సుగ్రీవుడు ఒప్పుదలకాగా రాముడు నీభార్యనపహరించిన వాలిని సంహరించి నీభయమును తీర్తునని సమాధానమిచ్చి తన బల సామర్థ్యములను కూడ తెలిపినాడు. ఆతరువాత రాముడు మీ ఇద్దరి వైరకారణమును చెప్పుమనినాడు మిత్రుని. సుగ్రీవుడు తనకును తన అన్నకును వచ్చిన విరోధకారణమును ప్రతిపాదించినాడు.

నేనిప్పుడు వాలి సుగ్రీవుల సంబంధమును, వారిద్దరి వైరకారణమును ప్రతిపాదించెదను. మొదటిది వాలి సుగ్రీవుల సంబంధము.

ఋక్ష రజసుడు బ్రహ్మమానసపుత్రుడు. ఆకడొకప్పుడు పార్వతిచే శపింపబడిన ఒక కొలనిలో దూకగా ఆతనికి ఆక్షణముననే స్త్రీత్వము వచ్చినది. అప్పుడామె వానరియే. కాని ఆమెది లోకోత్తర సౌందర్యము. ఆ వానరి సౌందర్యమునకు ఇంద్రుడును సూర్యుడును గూడ మోహించి ఆమెను కూడగా ఇంద్రుని వీర్యము ఆవానరి తోకయందును సూర్యుని వీర్యము ఆవానరి మెడయందును పడగా వాలముపై బడిన ఇంద్రుని వీర్యమువకు వాలియు మెడపైబడిన సూర్యుని వీర్యమువకు సుగ్రీవుడును పుట్టిరి. ఆ ఋక్షరజసుని శాపము తాత్కాలికము. వెంటనే ఆతడు పురుషుడయ్యెను. పురుషత్వము వచ్చిన వెంటనే ఋక్షరజసుడు జేష్ఠుడైన వాలికే కిష్కింధా రాజ్యము ఇచ్చెను. కావున కిష్కింధారాజ్యము వాలిది. ఇది వాలి సుగ్రీవుల సంబంధము. తల్లి ఒక్కతి, తండ్రు లిద్దరు. ఈ సోదరులిద్దరును కిష్కింధా రాజ్యమునందే యుండిరి. వీరిదింత వరకు విరోధములేవి సౌదర్యము.

మాయావియను వాడొక రాక్షసుడు. ఆతడు చాల బలవంతుడు. మాయావికిని వాలికిని ఒక స్త్రీసంబంధముగ తగాదా వచ్చినది. అది వారిద్దరికిని యుద్ధకారణమైనది. ఆయుద్ధమొక కొండగుహలో జరిగినది. ఆ సమయమున సుగ్రీవుడు వాలిననుసరించినాడు. అప్పుడు వాలి సుగ్రీవుని వారిద్దరి యుద్ధము సాగుచున్న కొండగుహకు వెలుపలి ద్వార రక్షకుని గావించుట జరిగినది. ఆయుద్ధము వారిద్దరికిని సంవత్సరకాలము జరిగినది. సుగ్రీవుడు ఆలోచనలో పడినాడు. ఇంతకాలమా? నా అన్న యుద్ధము? అని. అంతలో ఆగుహ లోపలనుండి నెత్తురు కాలవలుగా పారుటయు, దీనాలాపములు వినబడుటయు సుగ్రీవుని ఆలోచనకు బలము వచ్చినది. సుగ్రీవుని ఆలోచనలో అన్నగారికే ప్రమాదము జరిగి యుండవచ్చునని నిర్ణయమైనది. శత్రువులతోటి యుద్ధము ఇంతకాల మక్కరలేదు. నేడది విపరీతమైనది. అదియే సుగ్రీవుని అనుమానమునకు కారణమైనది. సుగ్రీవుడు భ్రాంతుడై రాక్షసుడు బయటకు రాకుండ ఆగుహకు ఒక రాయిని అడ్డముపేసి కిష్కింధ కేగినాడు. వాలి చచ్చినట్లు మాత్రమెవ్వరికి తెలుపలేదు. అయ్యును మంత్రులు తెలుసుకొని సుగ్రీవుని రాజునుచేసినారు.

వాలి యుద్ధము ముగిసినది. మాయావిని చంపి ఆతడు బయటకురాగా రాయి అడ్డమున్నది. సుగ్రీవుని పిలిచినాడు. అతడు వలుకలేదు. అబండను కాలితో తన్ని

బయటకు వచ్చినాఁడువాలి. అటునిటు చూచి కిష్కింధ కేగినాడు. వెంటనే సుగ్రీవుడు సింహాసనమును దిగి వాలికి తన భ్రాంతిని తెలిపి, దోసిలియొగ్గి రాజ్యమును వప్ప చెప్పినాడు.

వాలి సమ్మతించక సుగ్రీవునియందు దోషారోపణగావించి అతని భార్యను లాక్కొని సుగ్రీవుని వైగుద్దకూడ లాక్కొని తరిమి చంపుటకు రాగా సుగ్రీవుడా సమయమున వాలిని నిగ్రహించగల సమర్థుడయ్యును అన్నగదాయని వదలి ఋష్యమూకమున దాగినాడు. సుగ్రీవుడు రామునకు తమ వైరకారణము విట్లు వ్రతిపాదించినాడు. రాముడు విని వాలిని చంపుటకే నిశ్చయించుకొని వాలివి తప్పక ఁధింతునని సుగ్రీవునకు గట్టిమాటను ఇచ్చినాడు.

తరువాతి కథ.

సుగ్రీవుడు వాలిబలము తెలిసినవాడు. రాముడు చంపునన్న నమ్మకమాతనికి ఎట్లు కలుగును? సుగ్రీవుని ముఖమున ధైర్యచిహ్నము వెలువడలేదు. వాలిబలమును వర్ణించి చెప్పినాడు రామునకు.

ఒకప్పుడు వాలి వేయిఏనుగుల బలము కలిగిన దుందుభియను రాక్షసుని చంపి పైకి విసరెనట. వాలి సంధ్యావార్చుటకై ప్రొద్దునలేచి నాల్గుసముద్రముల చుట్టివచ్చునట ప్రతినిత్యమును. ఆతడొకప్పుడు ఉత్సాహముగా పర్వతములతో బంతులాడునట. ఇంతేగాక ఆపర్వతముపైగల సాలవృక్షములను చేతితో ఊపగా ఆచెట్లు ఆకులు జలజల రాలునట ఇంతటి బలవంతుడు వాలియని రామునకు తెలిపినాడు. రాముడు పరీక్ష ఇచ్చి తన బలమును సుగ్రీవునకు విరూపించుకొనినాడు.

వాలి చంపి పడవైచిన దుందుభి శరీరమును కాలిబొటనవ్రేలితో తొలగించగా అది పదియోజనముల దూరమున పడినది. సుగ్రీవునకు ఆ ఘట్టము నమ్మకమును కలిగించలేదు. ఆపర్వతమునందున్న సాలవృక్షము నొకదానిని బాణముతో భేదింపుమని రామునికోరగా అట్లేబాణమును వదలినాడు. ఒక్క సాలవృక్షమునకై వదలిన బాణముయొక్క వేగము ఏడు సాలముల భేదించి భూమిలోనికి చొచ్చుకొనిపోయి మరలరాముని అమ్ములపొదియందు దూరినది.

సుగ్రీవునకు భయము తీరినది. వాలి పీతడు చంపగలడన్న ధైర్యము వచ్చినది. దృఢముగ విశ్వసించి రాముని మాటతో సుగ్రీవుడు వాలిని యుద్ధమున

కాహ్వానించి యుద్ధమొనర్చినాడు. కాని రాముడు వాలిని కొట్టలేదు. సుగ్రీవుడు వాలితో బాహాబాహి యుద్ధమొనర్చియు గెలువలేక ఎట్లో ప్రాణములను దక్కించుకొని బయటపడి ఋశ్యమూకమున కేతెంచి ప్రాణములను నిలుపుకొనినాడు. సుగ్రీవుడిక రాముని కలవలేదు. అతడేకాంతముగ కూర్చొనినాడు. రాముడే హనుమంతుని తీసికొని లక్ష్మణునితోకూడ సుగ్రీవుని దగ్గరకేగి, మిత్రుని పలకరించి తానెందుకు వాలిపై బాణమును వదలలేదో చెప్పినాడు. నీవును నీఅన్నయు ఒక్కపోలికయంచుండి ఒకే విధముగ యుద్ధము చేయుటచే నా అమోఘబాణము నిన్నే చంపుచో నేను మిత్రఘాతకుడ నయ్యెడు వాడనని సత్యముచెప్పి, సుగ్రీవుని గుర్తుపట్టుటకు వీలుగ గజపుష్ప మాలాలంకృతుని గావించి రెండవసారి యుద్ధమున కాహ్వానింప జేసినాడు.

రెండవసారి సుగ్రీవుడు వాలిని యుద్ధమున కాహ్వానించినప్పుడు వాలిభార్య తార వాలిని యుద్ధమునకు వెళ్ళవద్దన్నది. అందుకు తగిన కారణములను ప్రతిపాదించినది. రామాయణమున వాలిభార్య తార పాత్ర చాల చిత్రమైనది. నాటి స్త్రీల ప్రజ్ఞా విశేషములు మీకీనాడు తెలియుట చాల అవసరము.

ముందు సుగ్రీవుడు ఇంతకు పూర్వమునవే ఓడి మరల ఆహ్వానించుటను మొదటి కారణముగ చూపి నాథా! యుద్ధమునకిప్పుడు సమయము కాదన్నది. సుగ్రీవుని కంఠధ్వానమును రెండవ కారణముగ నిరూపించి ఆతడు ప్రత్యేక బలమును చేకూర్చుకొని నిన్నాహ్వానించుచుండెనని నిరూపించినది. ఇది నేను అనుమాన ప్రమాణమువే చెప్పుట కాదన్నది. అంగదుడు గూఢచారుల వలన విని నాకందించిన సమాచారమన్నది. అంతతో ఊరుకొనక సుగ్రీవునకెవ్వరు సహాయముగ నించెనో ఆరాముని వర్ణించినది.

ఇవి తార రాముని గురించి చెప్పినమాటలు.

నాథా! అని భర్తను తన కభిముఖుని గావించుకొనుటకై కొగిలించి లాలనతో చెప్పిన మాటలివ్వి.

రాముని కోపము ప్రళయాగ్ని సదృశ్యమన్నది. అందుకని ఆతడు దుర్మార్గుడు కాదన్నది. సాధుపులగు వారికి అతడు నివాసవృక్షమన్నది. అవన్నులగు జీవులకాతడే గతి యన్నది. ఆర్తులకాతడు ఆశ్రయ మన్నది. దిగంతములయందు

వ్యాపించదగు యఖిలయంత్రికల కాశిదొక్కడే ఆధారమని రాముని ప్రత్యేకతను తెలిపినది. జ్ఞానవిజ్ఞానములను ఐశ్వర్యమాతని వరించినదగ్గది. తండ్రిఆజ్ఞను పాలింపగా ఆతడడవులకు వచ్చిన ధర్మాత్ముడని ఆతని ధర్మమును నిరూపించినది. హిమవత్పర్వతము రత్నములకు స్థానమైనట్లు మహోన్నతములగు సుగుణముల కాతడు స్థానమన్నది. అతనితోటి విరోధము కూడదన్నది. మహానుభావుడగు రాముని బల హీనుడని భావించకుమని యుద్ధకర్మలయందాతడు అరితేరిన ధీశాలియన్నది.

ఇక్కడ తార రాముని సాధువులకు నివానవృక్షమన్నది. నివాస గృహమని ఏలఅనలేదు? గృహము ఒకయాజమానియొక్క ఆధీనమునందుండును. వృక్షము సర్వులకును స్వతంత్రము. కావున రాముడు వీరిదని వారికనికాక సమస్త భూతములకును ఆశ్రయమునిచ్చువాడని చెప్పినది.

దేవుడు అందరకును సమానుడుగదా? కొందరనే ఏల రక్షించుచుండెను? అనుచో చెట్టు నిష్పక్షపాతముగనే నీడను యిచ్చినను తనదగ్గరకు వచ్చువారికే ఇచ్చును. కావున భగవంతుడుకూడ తన్నాశ్రయించిన వారికే సాయముచేయును. అంతేకాదు. చెట్టు ముందు తాపమునుతీర్చి పిమ్మ ఫలాదులచే ఇంద్రియ ప్రీతినిగూడ కల్పించును. భగవంతుడట్టివాడే. భగవంతుడు కూడ తన్నాశ్రయించిన వారికే సాయము చేయును. అందును ఆ భగవంతుని ఆశ్రయించు వారెవ్వరు? అన్నచో సాధుపుంగవులే ఆతనిని ఆశ్రయింతురుగావున సాధువులకు నివాస వృక్షమన్నది. ఇందొక ప్రత్యేకత కూడ యున్నది. ఆతనిని ఆశ్రయించుటచే సాధువగునా? సాధువయ్యే ఆశ్రయించవలెనా? రెండును కలవు. సాధువై ఆశ్రయించువాడు ఉత్తమోత్తముడు. ఆర్తుడైగాని లేక అర్థార్థియైగాని ఆశ్రయించియు సాధువగును. ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి,జ్ఞాని, వీరు నలుగురును పుణ్యాత్ములేనినారు గీతలో. తరువాత ఆవన్నులకు పరాగతియనియు ఆర్తులకు ఆశ్రయమనియు చెప్పినది. ఆర్తులన భౌతికైశ్వర్యమున భ్రష్టులై దానిని కోరువారు. ఆవన్నులన పరమార్థైశ్వర్యమును కోరువారు. అట్లే జ్ఞాన విజ్ఞాన సంపన్నుడని చెప్పినది. జ్ఞానమన ఆత్మజ్ఞానము. విజ్ఞానమన శిల్పవిశాస్త్రము (కళలు) ధర్మమును అడుగు దాటడనుటకు తండ్రి ఆజ్ఞచే ఇక్కడ కేతెంచెనని చెప్పినది. అడయ్లుండ సమస్తగుణములకును ఆతడే అధిష్ఠాతయని నిర్ణయించినది. ఆతని ఐశ్వర్యము అపారవారమన్నది. యుద్ధవిశారదుడనికూడ తేల్చి నిన్నెట్లు చంపవలెనో ఆతడెఱుగునన్నది. కావున ఆతనితో విరోధము వద్దన్నది. అంతేకాదు. సుగ్రీవునితెచ్చి

పురమునందుంచి సౌదర్యమును నిలబెట్టి కొనమన్నది. విలిరా? తార అమృత బోధను? మాటకు బోధము. వాలి తారమాటను తిరస్కరించి అతడు ధర్మాత్ముడగుచో ధర్మము తెలిసినవాడు నాతోయుద్ధమును ప్రకటించకయే వన్నెందుకు చంపును? ఆతడు నీవు అనుకొన్నంత ధర్మాత్ముడుకాడని అధునాతన పండితులవలెనే రాముని ప్రోసిపైచి యుద్ధమున కేతెంచినాడు. తారలోలోపల బాధపడుచు భర్తను పంపినది. వాలిసుగ్రీవులకు యుద్ధము ప్రారంభమైనది వారియుద్ధము బాహాబాహీయే కాదు. ముష్టాముష్టియేకాదు. ఆ పర్వత శిఖరాగ్రములు కలంకారములై యున్న వృక్షములను వృక్షశాఖలను గూడ వారికి ఆయుధములు కాగా సాగినది వారి యుద్ధము. కొంతవేపు సాగగా సుగ్రీవుని బలము మందగించినది. సుగ్రీవుని చూపులు రాముని వైపుకు తిరిగినవి. రాముడు గ్రహించినాడు. జీవుని బలము క్షీణించినగాని భగవంతుడనుగ్రహించడు కాబోలు.

సుగ్రీవుడు తనకై ఎసరుచూపుటను రాముడెరిగి విల్లును వెక్కుబెట్టి అల్లెత్రాటిని మ్రోగించగా ఆధ్వని ప్రళయకాల ధ్వనియై దిక్కుల పిక్కటిల్లజేసినది. ఆ ప్రళయధ్వని తరంగములు తోడనే రాముని బాణమును వలయించి, వాలి వక్ష స్థలమునను యున్నది. అప్పుడు సువర్ణకంఠాభరణములోని కాంతియు బాణతేజమును కంఠమాలలోని దివ్యతేజమును వాలి యంసన్న సహజ తేజమును కలసి ఒక వినూత్నతేజము కాగా వాలి భూతలమున వెలుగొందుచు పడియుండెను. ఇంతవర కిది కథాంశము. తదుపరి మనకు కావలసినది సందేహనివారణాంశము.

ఈ ఘట్టమున మామిత్రుడొకడు వాలి వధను గురించి నన్నడిగిన ప్రశ్న లను నేను చెప్పిన సమాధానములను వినిపింతును. మీకు సందేహనివారణ మగును.

మామిత్రుడు : శాస్త్రిగారు! నిన్న మీ వాలి వధను గూర్చిన ఉపన్యాసమును కోల్పోయినాను. కొద్ది సమయమును నాకిచ్చి నా సందేహముల తీర్చ నా మనవి. అనినాడు. నేను ఒప్పుకొని అడుగుమనినాను. ఆతని మొదటి ప్రశ్న ఇది.

పీరశిఖామణియగు రాముడు వాలిని చాటునుండి ఏలకొట్టెను! అది యుద్ధ ధర్మమేనా?

నాప్రశ్న : మీ అభిప్రాయమేమి?

మిత్రు : అది అధర్మమనియే నా నిశ్చయము.

నేను : అది ధర్మమేకాని అధర్మముకాదు. ధర్మాధర్మములు శాస్త్రాధీనములు.

మిత్రు : ఎట్లు?

నేను : ధర్మమే విగ్రహరూపము నొందిన రాముడధర్మము నెందుకుచేయును? ధర్మమునే ఆచరించును.

మిత్రు : యుద్ధమున శత్రువును చాటునుండి కొట్టుట ధర్మమేనంటారా?

నేను : కాదు.

మిత్రు : మరి....

నేను : వాలివధ యుద్ధము కాదు. వానితో రాముడు యుద్ధమును చేయలేదు. వాలి ఆచరించిన అధర్మమునకు శిక్ష విధించినాడు.

మిత్రు : ఆ శిక్ష వాలికి ఎదురుగ నిండియే విధించుట ధర్మము గదా?

నేను : మృగములు శిక్షించుటకు ఎదురుగ వచ్చి చంపవలెనని గాని ఎదురుగ వచ్చియే కొట్టవలెనని గాని నియమములేదు. వరుగెత్తు మృగమును కొట్టవచ్చును. భయసంభితమైన మృగమును కొట్టవచ్చును. ఒక మృగము మరియొక మృగముతో యుద్ధము చేయుచున్నప్పుడు కొట్టవచ్చును. కావున రాముడు దానిని చాటునుండి కొట్టుట అధర్మము కాదు.

మిత్రు : వాలి మృగమగుచో నీవు ధర్మమునతిక్రమించితివి గావున నిన్ను శిక్షించితిని రాముడు సమాధాన మిచ్చెగదా? మృగములకు మనుష్యుల ధర్మశాస్త్రము లెట్లు వర్తించును?

నేను : వాలి ధర్మశాస్త్రముల నెరిగి రాముని ప్రశ్నించిన మృగము కావున వానిని మానవుల శిక్షాస్మృతుల ననుసరించి శిక్షించి, మృగధర్మమువనుసరించి చాటునుండి కొట్టినాడు. వానిపైన రామునకు రెండధికారములున్నవి.

మిత్రు : వాలి అధర్మమేమందురు?

నేను : సోదరుని భార్యను బలాత్కారముగ తీసికొనుటే దోషము. ఆ దోషమునకు మరణ శిక్షయేగాని వేరొకశిక్ష లేదు శిక్షా స్మృతిలో.

మిత్రు : తారను సుగ్రీవుడను భవించెనుగదా? ఈ ధర్మము అక్కడేమైనది?

నేను : సుగ్రీవుని తన్ని వాలి బలాత్కారముగ రుమను తీసుకొనగా తార ఇష్టము పైన వాలి చచ్చిన తరువాత సుగ్రీవుడు గ్రహించినాడు. అట్లు పరిగ్రహించుట జాతిధర్మము.

మిత్రు : రాముడు ముందు వాలిని చంపి నీకు సాయము చేతునని ప్రతిజ్ఞను చేసి తరువాత మీ ఇద్దరి వైర కారణమును చెప్పుమనెను. నీవు చెప్పిన తరువాత మీ ఇద్దరి బలములనుసరించి నీకు సాయము చేసెదననెను. ఇక్కడ రాముని మాటకు సమన్వయము (సందర్భము) కుదిరినదా? బలాబలము లేమిటి?

నేను : కుదిరినది. ఒక న్యాయాధికారి తన కాళ్ళపై బడి ఒకడు రక్షింపుమని కోరగా నీ శత్రువును చంపియైనను నిన్నురక్షింతునులెమ్ము నాకట్టి అధికారమున్న దనును. అట్లే రాముడు శరణాగతుడై నాకష్టమును తీర్చుమని అడిగిన సుగ్రీవునకు మొదట వాలిని చంపి నీభయమును తీర్తునని తరువాత వైర కారణమునడిగెను. ఇక్కడ బలాబలములన వైరము ప్రబలమా? వైర కారణము ప్రబలమా? అనునది ప్రశ్న.

వైరము ప్రబలమగుచో అందొకరిని శిక్షింపక వేరొకరికి న్యాయమును కూర్చుట కుదరదు. వైరకారణము ప్రబలము గాక చిన్నదగుచో వాది ప్రతివాదుల నొక్కచో చేర్చి కారణమును నర్దవచ్చును. ఈ కారణము లచే రాముడు మొదటగ వాలిని చంపెదని తరువాత వైరకారణమును ప్రశ్నించినాడు. ప్రస్తుతమున రాముని దృష్టియందు సుగ్రీవుడు కూడ ఏదియోతప్పు చేయకున్న వాలి ఎందుకు విరోధియగును? అన్న ఊహ లేక పోలేదు. అయ్యను సుగ్రీవునిది స్వల్పదోషము. వాలిది ప్రబల దోష మైనది. ఎంత శత్రుత్వమున్నను భార్యనుపహరించుట ప్రబలదోషము. కావున వాలికి మరణ శిక్షను విధించినాడు.

మిత్రు : ఇద్దరి మధ్య దోషమును విచారించి శిక్షించు నప్పుడు సాక్ష్యాధారము కావలెను. వాది ప్రతివాదుల నిద్దరచేర్చవలెను. రాముడట్లు చేసెనా?

నేను : చేసెను. రామునకు ఇక్కడకు రాకముందే కబంధుడు వీరిద్దరివృత్తాంతమును చెప్పినాడు. అది ప్రబల సాక్ష్యము హనుమంతుడు సుగ్రీవుని పక్షమున నిలిచినాడు. ఇదియొక సాక్ష్యము సుగ్రీవుడు ఒంటరివాడై యుండెను. ఇది ప్రత్యక్షసాక్ష్యము. నిజముగ వాలి ఈతని భార్యనపహరించెనా? అన్న సందేహమునకు తావులేదు.

మిత్రు : పర్యవసానమున రాముడుచేసిన వాలివధ ధర్మమును, నిర్దోషమునందురు.

నేను ; తప్పక. ధర్మముకాకున్నచో లక్ష్మణుడు ఇంద్రజిత్తును చంపునప్పుడు

"ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథిర్యది
పౌరుషే చ అప్రతి ద్వంద్వశ్శరైనం జహి రావణిం"

అని కొట్టగా ఇంద్రజిత్తుచచ్చెను. రాముడు ధర్మాత్ముడనుటకు ఇంతకంటె సాక్ష్యముకావలెనా? ఇదిగాక వాలియే రామా నీవుచేసినది ధర్మము. నేను బాధచే నిందించితిని గాని అంతకంటె వేరులేదని ఒప్పుకొనెను. దెబ్బ తినిన వాలియే ఒప్పుకొనగా మీకెందుకు ఈ న్యాయవాదిత్వము? వాలి చివరికు దోసిలి ఒగ్గినాడు రామునకు.

మిత్రు : కవి వాలిచే అట్లు చెప్పించే నేమో? దోసిలి యెగ్గించెనేమో?

నేను : అప్పుడు కవిది దోషముగాని రామునిదేమి దోషము? వాలిని కొట్టించినవాడు కవి. చెప్పించిన వాడుకవి. ఇక్కడ రాముని ప్రసక్తిఏమున్నది? ఇన్ని మాటలెందుకు? వాలి రాముని ధర్మాత్ముడనెను. వాలి భార్యాహర అనెను. అంగదుడనెను. వాలికి రామునిపై కోపములేదు. అంగదుని వప్పచెప్పినాడు. మనకు రాముని విషయమున సందేహమెందుకు? రాక్షసులే రాముని ధర్మాత్ముడని ప్రశంసించగా వారికంటె క్రూరులము మనమెందుకు కావలెను? రాముని తలచి తరింతము.

మిత్రు : ధన్యుడను. నాసందేహములు చక్కగా తీరినవి.

శ్రోతలారా! మా సంభాషణ అంతతోముగిసినది. ఇదియే వాలి వధయందలి సంశయ నివారణాంశము. తరువాత కథ.

వాలి నేలకూలెనని వానరులంపను భయచకితులై వాలి వృత్తాంతమును తారకు తెలిపినారు. తార పారిపోవు వానరుల నివారించి కిష్కింధనుండి దుఃఖ సంతప్తయై బయలుదేరినది. వాలి పడియుండుట చూచినది. పైబడి ఏడ్వసాగినది. తాను చెప్పిన మాటను కాదని భర్త ఇట్లయ్యెననునది ఆమె దుఃఖాగ్నివి రగులొక్కల్పగా హనుమంతుడు వేదాంతబోధచే ఓదార్చినాడు. తారకు అవి ఓదార్పుమాటలు మాత్రమే అయినవి. ఇక వాలితోడనే నాకు స్వర్గముకావలెనని కోరుకొన్నది. అంతలో వాలి ప్రాణము ఆతని దేహమునుండి వెడలిపోవుకాలము ఆసన్నమైనది.

ఆ సమయమున వాలి సుగ్రీవుని పిలిచి, సుగ్రీవా! వీవే రాజువు. ఇదిగో ఇంద్రదత్తమగు మాల అని ఆతని మెడలో వేసినాడు. అది వాని ప్రాణములు పోవుచో తేజోవిహీనమగును. కావున వాలి ముందుగనే అట్లుచేసినాడు. అంగదుని పిలచి, వదలరాని ప్రేమ వీక్షణముల ఆతనిని వీక్షించి ఆతడు ముందు కాలము వందుండదగు నీతి విధానమును బోధించినాడు. అంతతో వాలి ఆత్మ ఆతని శరీరమును వదలివది. ఇప్పుడు వాలిది మృతకళేబరము. వాలిని చుట్టియుండి వాలికొరకై దుఃఖించువారు ఆతని బంధువులు. కోటి గుంపులన్నియు వాలి చుట్టును చేరి దుఃఖించగా సోదరుడగు సుగ్రీవుని కెట్లు దుఃఖమాగును? ప్రకృతి స్వభావమట్టిది. అన్నతోడనే తానును వెళ్ళదలచి రాముని ఆశ్రయించినాడు. రామునకును దుఃఖమాగలేదు. అతడును కన్నీరు కార్చినాడు. అది కరుణారసమునకు సంబంధించిన కన్నీరు. అప్పుడే రాముడు తారను ఓదార్చదలచి తారదగ్గరకేగినాడు. తార ఇప్పుడు రాముని ఎట్లు దర్శించివ దనునది ప్రశ్న. ఈ సమయమున తార పాత్రలోని ప్రత్యేకతను మనము దర్శించుట చాల అవసరము.

రాముడు తార దగ్గరకు వెళ్ళగనే అక్కడివారు తారను వాలినుండి విడదీసినారు. ఎట్టకేలకు భర్త శరీరమునువదలి తార తన చూపులను రామునివైపునత్రిప్పినది. రాముడు ధనుర్ధారియైయ్యే తార ఎదుట నిలిచినాడు. నిష్కళంక చంద్రుడగు రాముడు స్వప్రకాశమున వెలుగు సూర్యభగవానువి వలె భాసించగా తార రామునిచినది. తారకు రాముడు తన భర్తను చంపిన క్రూరుడై కనబడలేదు. అపూర్వ ఒక మహాతేజము ఇట్లు శరీర ధారియై నిలబడినదనిపించినది ఆమె అంతరాత్మ ందు. ఆక్షణముననే తార నేత్రములు నావరించిన దుఃఖాశ్రువులు వైదొలగగా ఆమె నేత్రముల యందలి సహజ వైశాల్యము నేడు రాముని చూడ ముచ్చట

వడినవి. అప్పుడు కరుణా రసపూరణమున నిండి తొణికిసలాడు ఆరాముని నేత్ర ద్వంద్వముతో తార చూపులను స్నేహము చేసినవి. తార అంతరాత్మ అంతర్యామి రాముని దర్శించగా తార నేత్రద్వంద్వము కళ్యాణరాముని దర్శించి ఆనందించినది.

ఆసమయమున తార అంతర్రాత్మవే ైశరీరము వే ైనది. తార శరీరము తాత్కాలిక దుఃఖ చిహ్నములతో కూడియుండగా ఆమె అంతఃకరణము శుద్ధ సత్వ ప్రధానమై విశుద్ధాదర్శమువలె యైనది. ఆమె విశుద్ధాంతకరణమున రాముని నిజ తత్వము ప్రతిబింబించి వెలువల నిలిచివున్న రాముడను నేనే అని ప్రబోధము నందించినది. ఈనా ఎదుట ధనుర్ధారియై నిలచినది సర్వ భూతాంతర్యామియని ఆమె నిర్ణయించుకొన్నది. ఇట్లు స్తుతించినది.

"త్వమప్రమేయశ్చ దురాసదశ్చ జితేంద్రియోత్తమ ధార్మికశ్చ.
అక్షయ్యకీర్తిశ్చ విచక్షణశ్చ క్షితిక్షమావాన్ క్షతజోవమాక్షః అన్నది.

ఈ శ్లోకము రాముని పరావరతత్వమును తెలుపుశ్లోకము. ఈశ్లోకము వందలి ప్రథమ పాదము ఇంద్రియ వర్గము నంతను ప్రేరేపించు సద్రూపవస్తువును వర్ణించగా, రెండవ పాదమునుండి చివరి వరకును ధర్మ సంస్థాపనకై అవతరించిన అవతారమూర్తిలోని గుణములను వర్ణించివది. పర్యవసానముగ రాముని పరమాత్మనుగా నుతించి, అంతలో మరల దుఃఖమున ప్రవేశించి తనను గూడ ఒకే ఒక బాణమున నా భర్త దగ్గరకు పంపమన్నది. తారలోని ప్రత్యేకత ఏమి? రాముని పరమాత్మనుగ గుర్తించుటే.

రాముడు అట్లు మాట్లాడిన తారను సుఖ దుఃఖముల యొక్క అనిత్యతను చెప్పి ఓదార్చినాడు. నీపుత్రునకు యౌవరాజ్యము కూడ వచ్చునని వాలితోటి సహగమనమును మాన్పినాడు. రామచంద్రులా ఘట్టమున తారనేకాదు సుగ్రీవాంగదులను కూడ ఓదార్చినాడు తత్వ ప్రబోధమున. తరువాత సుగ్రీవుని వాలికి జరుపదగు ప్రేత కార్యముల జరుపుమని ఆజ్ఞాపింపగా వాలికి దహన సంస్కారాదికములు జరిగినవి. తరువాత హనుమంతుడు సుగ్రీవుని పట్టాభిషిక్తుని గావింప కిష్కింధకే తెంచమనగా నేను వదుదాలుగు సంవత్సరముల దనుకమ వగర ప్రవేశమును గావింపననిచెప్పి, అంగదుని యువరాజును గావించుటకు సుగ్రీవుని రాజు గావించుటకును అనుజ్ఞనిచ్చినాడు.

కాను మాత్రము లక్ష్మణునితో గూడ ఆవర్షత గుహయందే వసింతుగని నాడు. దానికి కారణము ప్రస్తుతమున వర్షఋతువు కావున ఇది యుద్ధయాత్రా కాలముకాదు అని సుగ్రీవాది వానరులను కిష్కింధకు పంపినాడు. ఇంతటితో ఈనాటి యువన్యాసము సమాప్తము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

3 వ రోజు

శ్లో॥ అజ్ఞానసంభవ భవాంబుధి బాడబాగ్ని
ర్వ్యక్త తత్వ నికర ప్రణవాధిరూఢః
సీతాసమేత మనుజేన హృదంతరాశే
ప్రాణ ప్రయాణ సమయే మమసన్నిధత్తే॥

ఆర్య మహాశయులారా !

నేడు మన రామాయణమహాకావ్యమున జరుగుచున్న కథాభాగము కిష్కింధ కాండము. అందలి ముఖ్యఘట్టము వాలి వధ. ఈ కథాఘట్టమున రాముడు చెట్టు చాటునుండి వాలిని వధించుట అన్యాయము కాదా? అను ప్రశ్నకు నిన్నటి యువన్యాసమున ధర్మసంరక్షణకై అవతరించిన అవతారమూర్తి చరిత్ర యందది కళంకము కాదనియు అది ఆతనిగావింపదగు ధర్మరక్షణలోని భాగమనియు సమన్వయింప బడినది. నిన్నటి యువన్యాసముననే సుగ్రీవుడు పట్టాభిషిక్తుడు కూడ నయ్యెను. ఆది వర్షాకాలమగుటచే రాముడు రావణునిపై యుద్ధ యాత్రను సాగించక ఆ ముఖ్యకార్యమునే వర్షఋతువు వలన కలుగు ప్రతిబంధకములు కలుగకుండువట్టి ఒకానొక గుహాభ్యంతరమున లక్ష్మణునితో వసించు చుండెననియు విన్న చెప్పినాను.

ఇక నేటి యుపన్యాసము :

సీతను రావణు డెత్తుకొని పోయెనని రామునకు తెలిసినది. కాని రావణు డున్న ప్రదేశమెక్కడ? ఆతడు సీత నెక్కడుంచెను? అనునది రామునకు తీరదగు సమస్య. ఆ సమస్యను తీర్చదగు ఆప్తమిత్రుడే సుగ్రీవుడు. సుగ్రీవు నకు రాముని వలన జరుగదగు లాభము కలిగినది. సుగ్రీవుని వలన కలుగు ప్రత్యుపకారమును రాముడు పొందదగు కాలము ఆసన్నమైనది. వర్షఋతువు గడచినది. శరద్రుతు వేతెంచినది. ఇంతవరకు సుగ్రీవుడు రాముని కంటబడలేదు. రాముని కాల నిరీక్షణము సమాప్తమైనది.

కాముకుల కామము నుద్దీపింపజేయు వర్షాకాలము రాముని విరహాగ్నిని ప్రజ్వలింపచేయగా వినిర్మలాకాశమున వెలుగొందు రాకా సుధాకరుడును రాముని హృదయాకాశమున శీతకిరణుడై వెలుగొందక అగ్నిమండల మయ్యే భాసించినాడు. కావున రాముని అంతఃకరణమున సీతను గురించిన విరహాగ్ని చెలరేగినది. కాని లక్ష్మణుని ఉపశమన వాక్యములచే తాత్కాలికముగ శాంతించినది ఆ అగ్నిమండ లము. రాముని మనసు నుండి తొలగలేదు. డాగినది. సీతా వియోగమను అగ్ని రాముని అంతఃకరణము నుండి వైదొలగుటకిది కాలము కాదు. అగ్నిపర్వతము బ్రద్దలగుటకు ప్రళయకాలము రావలెను. రాముడిప్పుడు అగ్నిపర్వతమువలె నిలిచినాడు. ఇదియే రావణుని దహించు అస్త్రము.

కథకు పోదము.

వాలి వధానంతరము సుగ్రీవుని తాను ఆజ్ఞాపించిన ఆజ్ఞ రాముని స్మృతికి వచ్చినది. సుగ్రీవుడు సీతను గురించి తనకు చేయదగు ప్రత్యుపకారమును మరచి స్వార్థపరుడయ్యెనని రాముడు భావించినాడు.

రాముడు కర్తవ్యపాలనము నందప్రమత్తుడు తన కర్తవ్యములందు, లేక తానాచరించ వలసిన ఆచరణలయందు ఎవ్వడు జాగరూకుడై వర్తించునో ఆతడే తన భక్తుడు. సోమరిపోతు భక్తుల రాము డాదరింపడు. అర్థకామములు ధర్మ బద్ధములు కాకున్న రాముడు సహింపడు. సుగ్రీవుని తలచగా రాముని కన్ను లెర్రబడినవి. సుగ్రీవుడు కూడ వాలి వలెనే శిక్షార్హుడని కూడ అవిపించినది. కాని రాముడు తొందర పడడు. అతడు మహారాజు. శత్రుమిత్ర ఉదాసీనుల నెట్లు చూడవలెనో రాము డెరుగును. సామదానభేద దండోపాయము లాతని సొమ్ము రాముడు లక్ష్మణునిచే సుగ్రీవుని మేల్కొలుప దలచినాడు. లక్ష్మణుని పిలిచినాడు,

లక్ష్మణా ! సుగ్రీవు డింతవరకు మన కార్యమున ప్రవేశించ లేదు. ఆతడు నన్ననాధువిగ తలచియుండ వచ్చును. రాజ్యహీనుడు రాముడు. భార్యా వియోగ మున క్రుంగిన దీనుడు. ఆత డెక్కడనుండియో వచ్చి నన్ను శరణు పొందినాడు గదా ? అని భావించెను కాబోలు. నన్నింతవర కాతడు పలకరింపలేదు. అతడు నావట్ల కృతఘ్నుడయ్యెను.

నా వలన తనకు కావలసిన కార్యమును నెరవేర్చుకొని కృతార్థుడయ్యెను. నన్ను మరచెను. మిత్రత్వమునందిట్టి దుర్మార్గము నాచరించినవారి మృతదేహమును నక్కలుకూడ ముట్టవు. నీవిప్పుడు వేవేగ కిష్కింధకుపోయి నా మాటగ ఇట్లు చెప్పుమని బాధపడుచు చెప్పినాడు. తన మాటలను చెప్పుమనుటే కాదు. కార్య సాధనమును గావింపుమనుచు తన సందేశము నందింపుమనినాడు. ఆ సందేశమిది.

సుగ్రీవా ! నీ అన్నయగు వాలి చచ్చివెళ్ళిన మార్గమింకను మూయబడలేదు. ఆతడట్లు చచ్చుటకు కారణము నీవెరుగనిది కాదు. నీవొక ప్రతిజ్ఞను చేసితినను మాట నొక్కమాటు జ్ఞాపకమునకు తెచ్చుకొని ఆ ప్రతినను కాపాడుకొనుము. వాలిత్రోవ ననుసరింపకుము. ఒకవేళ నిన్నును వాలివలెనే ప్రయాణము చేయించ వలసి వచ్చునో ఆతనిని పంపినట్లే నిన్ను పంపుదునని తలచకుము. వాలి నొక్క నినే స్వర్గమునకు పంపగా సత్యమును అతిక్రమించిన నిన్ను, నీ బంధువర్గముతో హతమార్చెద సుమా ! అని చెప్పమనినాడు. ఇవి దండనార్హములగు మాటలు. కేవలముగ దండము నువయోగించుటే రాముని లక్ష్యము కాదు.

అన్నగారి మనస్తాపము లక్ష్మణుని కలవర పెట్టినది. రాముడు సుగ్రీవున కందించమన్న సందేశము కాలహరణమని లక్ష్మణుడు భావించినాడు. ఎప్పుడో సుగ్రీవునకు దండమును విధించుట కాదు. అన్నా ! నేనిప్పుడే సుగ్రీవుని వాలి దగ్గరకు పంపుదు ననినాడు. అంతతో ఆతడు సుగ్రీవుని వదలలేదు. అన్నగారిని కూడ మందలించినాడు. "న రాజ్యమేవం విగుణస్య దేయం". రాజ్యము నిట్టి నష్టులకు అందించుట అమాయకత్వమనినాడు.

లక్ష్మణుని ఆవేశము రాముడెరుగనిది కాదు. లక్ష్మణుని ఆవేశము అతనిని ముందు వెనుకల ఆలోచింప నివ్వదు. కావున లక్ష్మణుని శాంతుని గావించి తాను చెప్పుమన్న మాటను మాత్రమే చెప్పునట్లు శాసించవలెను. ఆ పనినే చేసినాడు రాముడు.

లక్ష్మణా! నీవంటి వారెవ్వరును ఇట్టి పాపమును చేయకలపెట్టరు. సుగ్రీవుడు మనకు ఆప్తమిత్రుడు. ఆతని పూర్వవృత్తము మనకిక్కడ స్మరణీయము. తనలోని బలపరాక్రమములఁ ఎవ్వరినైన చంపుటకే పనికివచ్చుట పాపహేతువు. తాను చేయదలచిన పాపమునే ఉపసంహరించుట వీరపురుష లక్షణము. సుగ్రీవుడిప్పుడువధార్హుడుకాడు. ఆతనిపై మనమిప్పుడు వాడదగినది సామముగాని దండము కాదుఅనిబోధించి, సామము చేతనే నేను పంపించు కార్యమును సాధించుకొని రమ్మనినాడు. ఇతమనము లక్ష్మణునితో కిష్కింధకు పోదము.

అతడుమహోగ్రమూర్తియయ్యేకిష్కింధకుబయలుదేరినాడు. రాముని బాధను తలచుకొలదిని లక్ష్మణుని క్రోధాగ్నిజ్వాలలు సుగ్రీవునిపైకి నాలుకలు తెరచుచున్నవి. ఆతని గమనమును మహావేగమైనది ఆతని గమన వేగమునకు కిష్కింధను ఆవరించియున్న వృక్షరాజములుగాని, పర్వత దుర్గములుగాని అడ్డుతగులుటలేదు. అవన్నియు ఆతనిధాటికి లోబడియే ఆతనికి దారినొసంగినవి. లక్ష్మణుడు కిష్కింధకు చేరినాడు. ఆనగర రాజమాతని కంటబడినది అపుణ కషాయనేత్రములతో పెదవు లదరగా ఆనగరమును దర్శించినాడు.

అది కిష్కింధకు బాహ్యప్రదేశము. ఆప్రదేశమున రక్షకభటులు లేకపోలేదు. వారును వానరులే. బాణపాణియై క్రోధమూర్తియై వచ్చిన లక్ష్మణుని చూడగనే ఆవానరులందఱు కొందరు పర్వత శిఖరములనెత్తగా మరికొందరు వృక్షముల నెక్కి చేతఁబట్టుకొనినారు. వారిప్రయత్నము లక్ష్మణుని తరిమివేయుటకే. లక్ష్మణుని క్రోధము రెట్టించినది. రెట్టించిన క్రోధముతోనున్న ఆ లక్ష్మణుని వానరులు దర్శించుటకే భయము కలుగగా వారందరును నలుదిక్కులకు పరుగులెత్తినారు. కొందరు సుగ్రీవభవనమునకు వెళ్ళి లక్ష్మణుని రాకను చెప్పినారు. సుగ్రీవుడప్పుడు వారిగోలను వినునట్టి స్థితియందులేడు ఆసమయము సుగ్రీవునకు తారతో సుఖభోగమునఁబనుభవించు సమయము. లక్ష్మణునిచూచి భయపడిన వానరులు సామాన్యులుకారు. వారొక్కొక్కరు వేయి, ఇన్నూరు, మున్నూరు ఏనుగుల బలము కలిగిన వానరభటులు. వారు చెదిరి పారిపోవుటను అంగదుడు గమనించినాడు. రాజ్యమునకేదియో ప్రమాదము వచ్చినదని తలచినాడు. ద్వారదేశము లందున్న వానరుల నందర నొక్కచోకూర్చి, అతడు వచ్చినాడు లక్ష్మణుడున్న ప్రదేశమువకు. లక్ష్మణుని చూచినాడు. ఒక్కమాటుగ అంగదుని గుండె బద్దలైనది. ఇక్కడ నింటిదివవాడు లక్ష్మణుడై కన్పట్టలేదు. అప్పుడు లక్ష్మణుని ఆకృతి వడగ

విప్పివ క్రాచుపాముపలెనున్నది. అది ఒకతల గల క్రాచుకాదు. అయిదుతలలు గల పర్పరాజము విషముక్రక్కుచున్నట్లున్నది. లక్ష్మణుడు క్రోధ వేగమున విడుచు ఉచ్ఛ్వాస నిశ్వాసలు వంచాస్యపన్నగము విడుచు బుసలవలె వినఁడగా ఆతడు ధరించిన శరాసనములోని బాణాగ్రముచు ఫణీంద్రుని నాలుకలవలె కన్పట్టగా ఆతని దివ్యతేజము ముఖములనుండి వెడలివచ్చు విషసంఘాతమై వెలయగా అంగదుడును భయకంపితుడై లక్ష్మణుని ఎదుట నిలిచినాడు. అప్పుడు లక్ష్మణుడు అంగదుని ముఖముననే సుగ్రీవునకు తనరాకను తెలువదలచినాడు. ఎర్రనైయున్న రక్తనేత్ర ములతోడనే అంగదునిచూచి, వత్సా! అని సంబోధించి సుగ్రీవునకు నారాకమ చెప్పుమనినాడు. నారాకకు కారణము నా అన్నగారియొక్క బాధయేనని చెప్పు మనినాడు. చెప్పుటమాత్రమేకాదు, చెప్పి అతిశీఘ్రముగా తిరిగివచ్చి సమాధానమును కూడ ఇవ్వుమని రామాజ్ఞ తాను ఆజ్ఞాపించినాడు. అంగదుడు చాల భయపడినాడు. వేవేగ సుగ్రీవుని యొద్దకేగి లక్ష్మణుని రాకను విన్నవించినాడు. సుగ్రీవుని సమా ధానము తిరిగివచ్చి లక్ష్మణుని కందించునట్లులేదు. పినతండ్రి పాదములకు క్రమొక్కి తారకును, రుమకును గూడ వందన మాచరించి లక్ష్మణుని రాకలోని ఆంతర్య మును వెలిబుచ్చినాడు.

సుగ్రీవుడు ఒడలెరిగిలేడు. కామసుఖానుభవమునందున్మత్తుడై విద్రామద మున తూగుచున్న సమయమది. సరాసరిగ సుగ్రీవుని ఆఘట్టమునుండి మేల్కొలు పుట కెవ్వరికినిగుండెలేదు. కావున వానరులందరొక్కచోటేరి లక్ష్మణుని ప్రవన్నము గావించి సింహనాదమును గావించినారు. సుగ్రీవునకు మెలకువ వచ్చినది. ఆసవ మును వదలినాడు ధైర్యముతోడనే.

రాజుయొక్క ప్రమాదమును సర్ది రాజును రక్షించదగువారు మంత్రులు. సుగ్రీవుని మంత్రులిద్దరు. వారిద్దరును లక్ష్మణునిరాకను, అంగదుని ఆతురతను సుగ్రీవునకు తెలిపి లక్ష్మణుని శాంతింపజేయుట చాల అవసరమని వినయ పూర్వక ముగ సలహానిచ్చినారు.

విజయునకొక విధముగ సుగ్రీవుడు రాముని ఉపకారమును మరువలేదు. రామునకు తానుచేయదగు ఉపకారము రాముడు తనకుచేసిన ఉపకారముకంటె చాల చిన్నదనియే సుగ్రీవుని భావముకూడ. కాని కామోపభోగములలోపడి కాలమును మరచినాడు. రామునిక్రోధమునకు తన కాలనిస్మరణయే కారణమనుమాట ఆతనికి

తోచలేదు. మంత్రులు రామలక్ష్మణుల క్రోధము తెలువగనే ఆతని హృదయమొక విధమగు శంకను, ఒక విధమగు భయమునకును చోటుచేసుకొన్నది. ఆతని శంక ఏమి? రామలక్ష్మణుల కేదియో తనకుగల శత్రువర్గము తనపై నేరములు చెప్పుచే ఆతని క్రోధమునకు కారణమైయుండవచ్చునని శంకించినాడు. ఇక భయమెందు కందుకా? రాముడు తనను చంపునన్న భయముకాదు. రామునితోటి చెలిమి చెడిపోవునే మోయను భయము సుగ్రీవునకు కలిగినది.

"సర్వదాసుకరం మిత్రం దుష్కరం పరిపాలనం".

మిత్రత్వమును సంపాదించుట కష్టముకాదు. ఆమిత్రత్వము చెడకుండ పరిపాలించుకొనుట చాలకష్టము. దీనికే భయపడినాడు సుగ్రీవుడు. ఇట్టి సమయమున అతనికి నిజమగు కారణము తెలియవలెను. ఎవరు చెప్పుదురు? రామ సుగ్రీవ మైత్రికి కారణభూతుడగు హనుమంతుడచ్చటనే యుండెను. అతడు మహాపండితుడు. నేర్పరి. సుగ్రీవునకు సత్యమును చెప్పినాడు. యుద్ధోద్యోగమునకు తగుకాలము వచ్చినదన్నమాటను నీవు మరచుటే రాముని క్రోధమునకు కారణముగాని వేరొక కారణము కాదనినాడు. ప్రస్తుతముగ లక్ష్మణునకు దోసిలియొగ్గి నీఅపరాధమును క్షమింపవేడుటయే కర్తవ్యమని నిర్దేశించినాడు. రామునికి నీపైవచ్చిన క్రోధము నీపైనగల స్నేహభావమున కలిగిన క్రోధమేగాని స్నేహభంగమగు క్రోధము కాదని నిర్దేశించినాడు.

సుగ్రీవుడు కన్ను తెరచినాడు. లక్ష్మణుని తన గుహాభ్యంతరమునకు తోడ్కొని వచ్చుటకు వానరుల నాజ్ఞాపించినాడు. వానరులందరును దోసిళ్ళు నొగ్గి తన కభిముఖులుకాగా సుగ్రీవుని రత్నమయ గుహాభ్యంతరమున కేగినాడు లక్ష్మణుడు.

అది కేవలమగు జాతివానరులు వసించు ప్రదేశము కాదు. దేవకాంక్షలు రావణ సంహారమునకై వానరాకారముల దాల్చి తమ తమ మహాదైశ్వర్యములతో భూఖండమున కేతెంచగా వారందరకు రాజైన సుగ్రీవుని గుహాద్వారమది. ఆ గుహ కలంకారమును చేకూర్చు సుందరోద్యాన వనములతో సుగ్రీవుని గుహాభ్యంతరము చూడముచ్చటయై యుండుటే కాదు, అనేకములగు రత్నమయ స్తంభ వినిర్మితమై కూడ దేవతల ఐశ్వర్యమును ప్రదర్శించు చున్నది. ఆ ప్రదేశము వందనేక

హర్మ్యప్రాసాదములు కూడ కట్టబడి అంగదాది ప్రముఖవానరుల గృహములును అందున్నవి. దేవ గంధర్వ స్త్రీలు తమ తమ కామరూపములతో విహరించుట అందలి ప్రత్యేకత. వారు నేటి పండితమ్మన్యులు భావింపు, వానరాకారముగనున్న మనుష్యులుగావి వానరములుగాని కారు. ముందుకు పోదము. సప్తప్రాకారముల దాటి, లక్ష్మణు డక్కడి సుందర సుకుమార దృశ్యముల చూచుచునే సుగ్రీవుని గుహాద్వారమున కేగినాడు. లక్ష్మణునకుమాత్రమా దృశ్యములు నేత్రోత్సవములై లేవు. పై పెచ్చు ఆతని క్రోధమునకు ఉద్దీపనములై నని కూడ. అంతే కాదు. అచ్చటి వానరస్త్రీల విహారము లాతనిని సిగ్గును గొలిపిన వనినారు వాల్మీకి. ఆ ద్వారదేశమున కేగిన లక్ష్మణుడేమి చేసెను? క్రోధోద్దీప్తమానసుడై జ్యావల్లిని పారించి ధనుష్టంకారమును చేసినాడు. సుగ్రీవుని గుండెలదరినవి. తానప్పుడు లక్ష్మణుని కెదురగుట యుక్తము కాదని తలచినాడు సుగ్రీవుడు. మరేమి చేయ వలెను? క్రోధముపశమించిన లక్ష్మణుని ఆతడు దర్శించవలెను.

తార చాల వ్యవహారదక్షత గల వ్యక్తి. మాటకారి. లక్ష్మణుని క్రోధమును చల్లార్చగలదు. కాక మహనీయుల క్రోధదృష్టులు స్త్రీలపై కారుణ్యరూపమును ధరించవు. ఈ భావమును దృష్టియందుంచుకొని సుగ్రీవుడు లక్ష్మణుని వద్దకు తారను పంపినాడు.

మద్యపానమున మత్తిల్లిన తార సిగ్గునువదలి లక్ష్మణునితో మాట్లాడవచ్చి నది. రాజపుత్రుడైనను లక్ష్మణు డామెనుచూచి తలవంచినాడు. తార ముందుగనే లక్ష్మణుని వలకరించి తన చతురవచనములతో ఆతనిక్రోధమును ఉపశమింపజేయ యత్నించి తన దృష్టియందాతడు ప్రపన్ను డయ్యెనని భావించిన తరువాత సీవంటి మహనీయులు మా అంతఃపురమునకు రావచ్చునని లక్ష్మణుని లోవలకు గొంపోయినది.

లక్ష్మణుడు లోపలి కేగినాడు. సుగ్రీవుని చూడగనే ఆతనికి కోపమాగలేదు. రాముడు చెప్పమన్న మాటను తు, చ, తప్పకుండ చెప్పినాడు.

సుగ్రీవుడును లక్ష్మణుడును మాట్లాడుకొనినప్పుడు హనుమంతుడక్కడనే యుండెను. హనుమంతుడు సుగ్రీవునకు సచివుడు. పెంటనే హనుమంతునకు అనేక పర్వత ప్రాంతములందును, పర్వత గుహలయందును గల వానరవీరులను పిలుపింపుమని సుగ్రీవు డాజ్ఞాపించినాడు. పర్వత ప్రాంతములే కాదు. సముద్ర

తీరములందును కపి ప్రవరులాక్రమించి యుండిరని చెప్పినాడు సుగ్రీవుడు. ఆ కపులలోని తారతామ్యముల కూడ వర్ణించిన వర్ణనలను గమనించుచో వారందరును దేవతాయోని విశేషులనుటకు మనము సందేహింపము.

సుగ్రీవాజ్ఞ యను మాట నేటికిని అంతరించలేదు. ఆతని ఆజ్ఞను శిరసావహించి అనేక దివ్యౌషధ రసాయన ఫలమూలములను ఉపాయనములుగ తీసికొని వానర సమూహమంతయు సుగ్రీవుని చుట్టముట్టినది. ఇక కావలసిన దేమున్నది? వాముని కార్యము సిద్ధించిన దనియే సుగ్రీవుడు తలచినాడు.

అది రాముడు వసించు ఋష్యమూక పర్వత గుహాంతర్భాగము. ఇప్పుడు రాముడు ఒంటరివాడు కాడు. సుగ్రీవుని వద్దకు వంపిన లక్ష్మణుడు ఆప్తమిత్రుడగు సుగ్రీవునితో గూడ మేనాను దిగినాడు. కపి సైన్యమును వారివెంటవచ్చి గుంపులు గుంపులుగ నిలచినది.

వాలి వధానంతరము సుగ్రీవుడిప్పుడే రాముని కలసినాడు. సుగ్రీవునిపై కోపించి లక్ష్మణునిచే సందేశము పంపిన రాముడేనా? ఇతడు? అవును. సుగ్రీవుని భార్యయగు రుమను అనుభవించిన వాలికి మరణశిక్షను విధించిన రాముడు తారను తన దానిని గావించుకొని కామసుఖానుభవమున మత్తుడైన సుగ్రీవు నేమి చేసెను? అనునని ప్రశ్న కాకపోదు. సుగ్రీవుని శిక్షించెనా?

రామునకు పక్షపాతము లేదు. సుగ్రీవుని కూడ శిక్షించినాడు. శిక్షావిధానము కర్త చేయు దోషములపైన ఆధారపడి యుండునను సిద్ధాంతమును వ్యవస్థకులు నిరూపించిరి. వాలి సుగ్రీవునిభార్యను బలాత్కరించి సుగ్రీవుని తరిమివైచి అనుభవించగా సుగ్రీవుడు వానరజాతి ధర్మము ననుసరించి తార ఇష్టముమీద పరిగ్రహించుట ఇచ్చటి ప్రత్యేకత. కావున సుగ్రీవునకు లక్ష్మణుని ముఖముగ వాగ్దండమును విధించి, ఇప్పుడు సుగ్రీవుని కొగలించుకొని ఉపదేశపూర్వకముగ సుగ్రీవుని దోషమును ఉద్ఘాటించి మిత్రుని దండించినాడు. ఇది మిత్రదండనము. అంతే కాదు. తన బాధను కోర్టునకు విన్నవించుకొన్న గాని న్యాయాధికారి శిక్షించడు. రామునకు తన బాధను సుగ్రీవుడు విన్నవించుట అక్కడివిషయము. ఇక్కడ రాజగువాడు ధర్మార్థకామముల సక్రమముగ నెరవేర్చకుండుట ఇక్కడి విషయము. కావున సుగ్రీవునకు రాముడు ఉపదేశపూర్వకముగ ఆతని దోషము చెప్పినాడు.

"ధర్మ మర్థంచ కామంచయస్తు కాలేనిషేవతే.
విభజ్య సతతం వీర సరాజాహరిస త్తమ.
హిత్వాధర్మం తథార్థంచ కామంయస్తునిషేవతే.
సవృక్షాగ్రే యథాసు ప్తః పతితః ప్రతిబుధ్యతే.

సుగ్రీవా! ధర్మార్థ కామములను ప్రాతఃకాల మధ్యాహ్న సాయంకాలముల ననుభవింపుమని శాస్త్రము విధింపగా అట్లుగాక ధర్మమును వదలి అర్థకామముల పేవింపుచో చెట్టుచివ్వర పరుండి నిద్రించుట వంటిదని చెప్పినాడు. అచ్చటి నుండి పడుచో వాడెట్లు బ్రతుకును? పడకుండుటెట్లు? అని బోధించి తరువాత తన కార్యమును గురించి ఆలోచింపుమనినాడు. ఇదియే సుగ్రీవున కిడినశిక్ష. తరువాత కథ.

సుగ్రీవాజ్ఞచే అనేకమంది వానరులు రామునివద్దకే వెంచినారు. సుగ్రీవుడును వారిని రామునకు పప్పచెప్పగా రాముడు వారికోటి కాదగు కార్యమును నీవే చేయుమని సుగ్రీవునకే పదలుట జరిగినది. సుగ్రీవుడు వానరులనందర విభాగించి అందొక్కక్కని నాయకుని గావించి ఆ నాయకునికి సహాయముగమండవను వారల నియమించి నలుదిక్కులకును పంపినాడు. తూర్పుదిక్కునకు పంపువారికి ఆదిక్కున గల ప్రదేశములనన్నిటిని తెలిపి తూర్పు సముద్రము వరకును వెతుకుడనినాడు. ఆతరువాత మీరు వెళ్ళుటకు సాధ్యముకాదని తెలిపినాడు. అట్లే దక్షిణ పశ్చిమోత్తరము లందలి విశేషములు తెలిపి సముద్ర పర్యంత ప్రదేశమును వర్ణించినాడు.

ఇందొక విషయమును మీకు చెప్పవలసియున్నది.

వాల్మీకి చెప్పిన నదీ నద పర్వతములను నగర రాజములను నేటికివి ఆనామములతోడనే ఆమార్గానుసరణములయ్యే ఆయాస్థలములయందే యుండెనా?

అవి మనకిప్పుడు కనుగొనే సాధ్యములేనా? అను ప్రశ్నను చాలమంది యుదురు. ఈప్రశ్నకు సరియగు సమాధానము రావలెనన్న నాకుసాధ్యముకాదు. ఎఱుగవ కెవ్వరికిని సాధ్యముకాదు. అనేకవేల సంవత్సరములుగా పరిణమించిన భూభాగములలోని విషయములను సరాసరిగ సప్రమాణముగ నిరూపించుట ఎట్లు ఎవరికి సాధ్యమగును?

నాడు కవి వర్ణించిన ముఖ్యములగు నదీ నదములును పర్వతాదులును నేటికిని ఆయా పేర్లతో వేరొకనబడియే వ్యవహరింపబడుచున్నవి. రామాయణ

మున వర్ణితములగు ఆయా ప్లేరతో పిలువబడు ప్రదేశము లివ్వియేవని నొక్కి వక్కాణించుట కుదరని పని యనక తప్పదు. మహేంద్ర పర్వతమేదియో ఎవరు నిర్ణయింతురు? లంకలోని విశేషములనుబట్టి లంక ఈనాటి సింహళమనుట ఎట్లు కుదురును? లంకలోని కొన్ని వర్ణనలను ఇవి కని యొక్క ఉత్ప్రేక్షలు మాత్రమే అయి యుండవచ్చునని క్రీస్తుశకము ననుసరించిన చరిత్రలతో అన్వయించుట తగనివని. కావున ఈ రామాయణమున వాల్మీకి వర్ణించిన వర్ణనలను మీముందుంతును. మీకే ఆయా స్థల నిర్ణయముల వదలుదును.

నలుదిక్కులకును పంపబడిన వానరులెవరో వారికి ఆయాదిక్కులలోని విశేషములను సుగ్రీవుడు ఎట్లు తెలిపెనో ఆయా ఘట్టములను కొన్నింటిని తెలిపెదను.

తూర్పుదిక్కునకు వినతుని, దక్షిణమునకు నీలుని, హనుమంతుని, జాంబవంతుని గజ గవయ గవాక్ష గంధ మాధనులను అంగదుని పంపినాడు. పడమటకు సుషేణుని పంపి, ఉత్తరమునకు శతబలిని పంపినాడు. వీరందరును కొన్ని కోట్ల వానరులతో సీతను వెతకుట కేగినారు. ప్రస్తుతమున వీరి కర్తవ్యము రావణుని గృహ మెక్కడుండెను? అందు సీత బ్రతికి యుండెనా? లేదా? అను విషయముల తెలిసికొని వచ్చుట మాత్రమే.

సుగ్రీవుడు తూర్పునగల విశేషముల కొన్నిటి నిట్లు చెప్పినాడు.

సరయూనదీ, గంగ, కౌశికి, సింధువు మొదలగు వదులను చెప్పి, ప్రాక్పశ్చిమముల పారువదులనన్నిటిని వెతుకుమనినాడు. ఆ తరువాత కొన్ని దేశములను చెప్పినాడు. కాలమహి, బ్రహ్మమాల, విదేహము, మాళవము, కౌశికాపురము, మగధదేశ గ్రామాలు వర్ణింపబడినవి. ఆతరువాత సముద్రమునందుండు కొండలను, వత్తనములను, ఆ పర్వతముల వసించు జనులను వర్ణించినాడు. ఒక పర్వతము పైన పెదవులనంటు చెవులు గల వారుండిరట, లోహముఖులుండిరట, ఒంటికాలి వారుండిరట, మహామ్యులను తిను వారుండిరట. వచ్చిచేవలను తిను వారుండిరట, బంగారు వర్ణముగల వారుండిరట. ఇట్లెన్నియో విశేషములను చెప్పినాడు.

ఆషడీదేశములను వదులను కిష్కింధ నాధారముగా గొనెనో భూమధ్య రేఖ నాధారముగా గొనెనో తెలియదు. భూమధ్య రేఖ గూడ ఒక నిశ్చయమై

ఎక్కడున్నది? ఉజ్జయినిని ఆధారముగా గొని మన జ్యోతిశ్శాస్త్ర మొకప్పుడు దైవజ్ఞులచే వర్ణింపబడగా ఈనాడు అనగా క్రీస్తుశకమున గ్రీన్‌విచ్‌ని ఆధారముగా గొని నడచుచున్నది. ఉజ్జయినికి పూర్వము శరావతీ నదిని ఆధారముగా గొని భూభాగము విభక్తమైనట్లు కొన్ని గ్రంథములు వర్ణించినవి. ఈ శరావతీ నది వింధ్యమునకును హిమాలయమునకును నడుమ ఆర్యావర్తమున కలదని అమర కోశమున వర్ణితమైనది. కావున నేను దేశ నిర్ణయమునకు పూనుకొనలేదు. తూర్పు దిశను దాటిపోవుటకు వీలుగాని ప్రదేశము వరకును చెప్పినాడు. నేను దేశ విభాగమును పరిశీలించుటను లక్ష్యముగా గొనలేదు. దక్షిణమున కేగువారికి గూడ ఇట్లే చెప్పినాడు. ఈ దక్షిణ దిక్కున వర్ణించిన వాటినిగూడ కొన్నిటిని తెలిపెదను.

ఉత్కల, దశార్ణ, ఆశ్వవంతి, అవంతి, విదర్భ, మహిష, వంగ, కాశీ, కళింగ, అంగ, ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్య, కేరళ దేశములను వర్ణించెను. మలయ, మహేంద్ర పర్వతములను చెప్పి, ఆయా పర్వతములందు గల విశేషముల చెప్పి లంకాపురి కూడ ఆ దిక్కునే కలదని చెప్పినాడు. ఇంకెన్నియో విశేషముల చెప్పినాడు ఇట్లే పశ్చిమమునకు సుషేణుని పంపుచు, ఆ దిక్కున సురాష్ట్ర, బాహ్లీక, శూరసేన, భీరు దేశములను కొన్ని అడవులను, హరి, వజ్రధరమను పర్వతములను వర్ణించి సముద్రపర్యంత ప్రదేశములను తెలిపినాడు. తరువాతది ఉత్తరదిశ గదా? ఆదిక్కునకు శతబలిని పంపినాడు. ఆదిశ యందున్న హిమాలయ వర్ణనను గావించి శూరసేన, పుళింద, ప్రస్థర, మద్రక, భరత, కాంభోజ, యవన, శక దేశములను వర్ణించినాడు. ఈ దిక్కుననే మ్లేచ్ఛ దేశములు కూడా వర్ణింపబడినవి. మ్లేచ్ఛదేశము లనగానేమి?

ప్రత్యంతో మ్లేచ్ఛ దేశస్యాత్ అని అమరము. భారతవర్షమువకు చివరి యుండు శిష్టాచార రహితమై స్వేచ్ఛాచారములు గల దేశము.

చాతుర్వర్ణ్య వ్యవస్థానం యస్మిన్ దేశే నవిద్యతే మ్లేచ్ఛ దేశ స్సవిజ్ఞేయ ఆర్యావర్త స్తతఃపరం.

ఆర్యావర్తమున కావలది మ్లేచ్ఛదేశము. ఈ మ్లేచ్ఛదేశమును వర్ణించిన బోధయనుని వాక్యమిది.

గోమాంస భక్షకోయస్తు విరుద్ధం బహుభాషతే
సర్వాచార విహీనశ్చ మ్లేచ్ఛ ఇత్యభిధీయతే.

గోమాంస భక్షకులై విరుద్ధ భాషణములు భాషించెడువారు మ్లేచ్ఛులట. క్రౌంచపర్వతము,మానసమను పర్వతము కూడ ఈదిక్కున వర్ణించబడినవి. పర్యవసానముగ ఈ విషయందెన్నియో దివ్యస్థలములు వర్ణింపబడి ఉత్తర కురుభూములు కూడా వర్ణింపబడినవి. మనమిక కథకు పోదము

ఈ సీతాన్వేషణ మహాకార్యమునకు హనుమంతునే ప్రధాన పాత్రముగావించుట జరిగినది. వీరుదరకును ఒక్కమాసమాత్ర కాలమును అవధినొసంగినాడు. అంతియే.

శ్రీరామచంద్రునకు గూడ హనుమంతునే జూపి ఈతడే నీ కార్యమును నెరవేర్చ సమర్థుడని చెప్పగా రాఘవేశ్వరుడును హనుమంతుని పూర్వ కార్యములను తలచి అట్లే నిశ్చయించుకొని, తనచేతి ఉంగరమును హనుమంతునకే యిచ్చినాడు. సీత కనబడుచో దీనిని ఆమెకు గుర్తుగ ఈయవలసినదని. కాని శ్రోతలకిక్కడ ఒక సందేహము కలుగవచ్చును. రాముడరణ్యమునకు వచ్చినపుడు సమస్తమును వదలెనుగదా? ఉంగరమెక్కడిది? అని. ఇది వివాహకాలమందలి ఉంగరము. కావున దీనిని వదలలేదు. కథకురండు.

వానరుల ప్రయాణము సాగినది. సీతను తెచ్చెదము, రావణుని చీల్చెదమను నినాదములతో నాల్గుదిక్కుల నావరించినారు వానరులు. నెలయైనది. తూర్పు,పడమర ఉత్తర దిక్కుల కేగిన వానరులేతెంచినారు. సీత కనబడలేదను వార్త రాము సుగ్రీవులకందినది. దక్షిణదిశకేగిన జాంబవదాదులు మాత్రము రాలేదు.

దక్షిణదిశకేగిన హనుమదాదులకు ప్రధానమగు ప్రదేశము వింధ్యపర్వత మైనది. అవిచాల విస్తారము. ఆ ప్రదేశమునంతను వానరులు కలయదిరుగక పోలేదు.

ఆ పర్వతము నాధారముగా గొనియున్న కీకసారణ్యములన్నియు హనుమదాదులచే వెతుకబడినవి. వారి అన్వేషణము ఫలవంతముకాలేదు. విరాళవారినివరించినది. వారందరును విస్మృహాలయ్యి ఒకచో కూలబడినారు. వారు కూలబడిన ప్రదేశము కూడ వింధ్యపర్వతములోని భాగమే.

మనము చేయు ప్రతి ప్రయత్నమును క్షణక్షణ పరిణామమునొందుటను మనము గమనింపజాలము. ఇక ఈ కార్యమును గురించిన నాప్రయత్నము సమాప్త మైనదని కాళ్లసాచిన మరుక్షణమునసే ఆశాజనకములగు కొన్ని సన్నివేశములు పొడచూపుట సృష్టిలోని వైచిత్ర్యమనక తప్పదు. విరాళానిస్పృహలతో వింధ్యాద్రి యందు చతికిలబడి దప్పికగొనిన వానరులకొక దృశ్యము కంటబడినది. వారు కూర్చున్న ప్రదేశమునందొక మహాబిలమున్నది. (గుహ) ఆగుహకు ప్రవేశ ద్వారము మాత్రము వారికంటబడలేదు. ఆగుహాంతర్భాగమున సరస్సుండునని వారెట్లు నిర్ణయింతురు? అట్టి ఘట్టములయందే అనుమాన ప్రమాణము కావలసి వచ్చును. అనుమాన ప్రమాణమన కొన్ని హేతువులను బట్టి అచ్చటి యదార్థ స్థితిని కనుకొనుటకు సాధనము. పొగను బట్టి ఆపొగనున్న ప్రదేశమున నిప్పు ఉండుటను నిర్ణయించుకొనుటకు అనుమాన ప్రమాణమని పేరు.

ప్రస్తుతమున ఈ వానర సమూహమున హనుమంతుకు బుద్ధి వైశద్యము కలవాడనుటకు ఒప్పుకొనని వారుండరు.

హనుమంతుని దృక్పథమునందొకదృశ్యము ప్రత్యక్షమైనది. ప్రత్యక్షము లేక అనుమానమునకు తావులేదు. పొగప్రత్యక్షముగాకున్న అక్కడ కంటికి కన బడని నిప్పునెట్లు ఊహింతుము?

కొన్ని పక్షులు ఆగుహాంతర్భాగమునుండి బయటకు వచ్చుచున్నవి. అవి హంసలు, బెగ్గురు పక్షులు మొదలైనవగుటచే అందొక సరస్సు ఉండియుండునని ఆతర్కూహించినాడు. అంతేకాదు ఆగుహకు ముందు భాగమున కొన్ని వృక్షరాజము లను గూడ నాధారముగాకొని ఆగుహాంతర్భాగమున ఒక సరస్సు ఉండియుండు నని ఆతర్కూహించినాడు.

ఆ వానరులందరును హనుమంతుని ఊహను ప్రమాణముగాగొని ఆగుహను కూడ వెదుకుట అవసరమని నిశ్చయించుకొనినారు. ఆగుహకు స్వయం ప్రభా బిల మని పేరు. అంగదాదివీరవరులందరును హనుమంతుని ఊహననుసరించి ఆగుహ లోపలకు పోవ ప్రారంభించినారు అది అంధకారబంధురము. ఒక్కొక్కరు ఎవరికి వారెపోవక్క ఒకరిచేతినొకరు ఆధారముగాగొని ఆగుహాంతర్భాగమున ప్రయాణమును సాగించినారు. వారి ప్రయాణము కొంతదూరము సాగినది. అక్కడ గుహాభ్యంతర మున గల గాఢాంధకార మంతయు మటుమాయమైనది. వారక్కడొక కాంతి పుంజ

మును దర్శించినారు. ఆ కాంతి దివ్యమణుల మహాప్రకాశము. అందొకమణిమయ సౌధముకూడ వారికంటబడినది. అక్కడనే వారొక తపస్వినిని కూడ చూచినారు. ఆమె చాల వయోవృద్ధ. ఆమె దర్శనము వారికొక మహాభాగ్యమైనది. అంతలోఆమె వారిదగ్గరకేతెంచినది. వీరెవ్వరో ఆమెకు తెలియదు. వారిని అడిగి తెలుసుకొన్నది ఆతపస్విని. ఆతరువాత వారికి ఆమెవలన ఆతిధ్యము దొరికినది. ఆమె అందించిన ఫలాహారములగొని ఆమె అందించిన మధురశీతోదకములచే దప్పిని తీర్చుకొని, అక్కడ సీతలేదని ఆస్వయంప్రభవల్లనే తెలుసుకొనినారు. అప్పటికి సుగ్రీవుడు వారికొసగిన కాలము గడచిపోయినది. అందుండివారు బయటకు పోవలెను. అది వారికి సాధ్యమగునికాదు. అక్కడికేగిన వారెవ్వరును బతికిబయటకు పోవరని తెలిపినది ఆస్వయంప్రభ. ఆగుహాంతర్భాగమున అట్టి నిర్మాణము గావించినవాడు మయుడు. దానవశిల్పి. మయుని పుత్రికకు స్వయంప్రభ స్నేహితురాలు. ఆమె ఈమెకు వప్పచెప్పగా ఇది ఈమెకు సంక్రమించినది. అప్పుడు వారికి దిక్కెమి? స్వయంప్రభయే వారికి దిక్కును కల్పించవలెను. ఆమెయే వారికి సంగతినితెలిపి, వారందరను కన్నుల మూయించి తన యోగశక్తిచే వారిని విధ్యాద్రియందొక ప్రదేశమునకు చేర్చినది. అది వారు బిలప్రవేశమునకు ముందువసించిన ప్రదేశము కాదు. వారు సాధించదగిన మహాకార్యమును సాధించుటకు దారి తీయదగు ప్రదేశము. అది ఆతపస్విని అనుగ్రహము.

ఇప్పటికి దక్షిణదిశకు బయలుదేరిన వానరుల అన్వేషణకిదియొక తుది ఘట్టము.

అంగదుడు వీరికినాయకుడు. ఇతడు యువరాజుకూడ. ఈసందర్భమున ఆతడొక నిశ్చయమునకు వచ్చినాడు. తన నిశ్చయమును తనతోటి వానరుల కందరకు తెలుప నిశ్చయించినాడు.

అంగదుని నిశ్చయమేమి?

సుగ్రీవుడు చండశాసనుడు. సీతాన్వేషణకై తమకు ఇచ్చిన మాసము గడువును గడచినది. సీతజాడను కనుగొనకయే కాలము గడచినది. ఇక కిష్కింధకు పోయిన వానరులకు శిక్ష తప్పదు. అది మరణశిక్షయే. అందు తానే మొదటి వాడనని ఆతడు నిశ్చయించుకొనినాడు. కావున తావిప్పుడేమి చేయదలచినాడు?

ప్రాయోపవేశమును గావించదలచినాడు. ప్రాయోపవేశమన కూడును, నీళ్ళను ముట్టక మరణింపవలయునని కండుకొనుట, ప్రాయమన ఆహారములేని వ్రతము. మరికొన్ని అర్థములీ పదమువకున్నను ఈ అర్థమిక్కడ వచ్చును. ఈ విషయమునే ఎదుటివారికి జాలి కలిగించు ధ్వనితో సుగ్రీవుని దయమాలిన వానినిగా నిర్వచించి తోటి వానరులను ఒప్పించినాడు. వారు ఒప్పుకొనిరిగాని చావువకు భయపడని వారుందురా? వారొక విధముగ మరణభయ కంపితులగుట మాత్రము వారి ముఖముల కన్పట్టక తప్పలేదు. అంగదుడు చాలమేధావి. ఒక్కమాటుగ తన ప్రాయోపవేశ నిశ్చయమును మార్చుకొని, స్వయంప్రభా బిలమున వసించి సుగ్రీవుని మరణదండమును తప్పించుకొందమని వారిభయమును తీర్చినాడు. వర్యవసానముగ అంగదుని భావము కిష్కింధకు పోకుండ కొందరు వానరులతో తానిక్కడ వసించుటకు నిశ్చయించినాడు.

మన హనుమంతుడు కనుగొనజాలని ఊహాప్రపంచము నెవ్వరును సృష్టింపజాలరు. అంగదుని ఊహాప్రపంచమొక నూతన సృష్టియని హనుమంతుడు గ్రహించినాడు. అంగదుడొక నూతన సామ్రాజ్యమును సృష్టించు యత్నమును గావించుచుండెనని అంగదుని మాటలనుబట్టి హనుమంతునకు నిర్ణయమైనది. "అధమేనేహృతం రాజ్యం హనూమాన్ అంగదేనతత్". నూతన సామ్రాజ్య స్థాపనకు కుందదగు సాధనసామగ్రి అంగదునకు కలదని హనుమంతునకు తెలుసును. అంగదునకున్న అర్హతలను హనుమంతుడిట్లు వర్ణించినాడు.

ఎనిమిది అంగములతోకూడిన బుద్ధికలిగి, నాలుగుబలములతో కూడి పదు నాలుగు గుణములు కలవాడట అంగదుడు.

అష్టాంగము లెవ్వి? నాలుగు బలములును, పదునాల్గుగుణములును ఏవియో మీకు సవిస్తరముగ తెలిపెదను.

చెప్పెడిదానిని చక్కగవినుట దీనికి గ్రహణమనిపేరు. విన్నదానిని తనలో నిలుపుకొను యత్నము. దీనికి ధారణ యనిపేరు. మరల మరల విన్న విషయమును స్మరించుట స్మరణము. దానిని ఇతరులకు ప్రతిపాదించు సామర్థ్యము ప్రతిపాదనము. స్వీయములగు ఊహాపోహలు కలిగి విషయమును అర్థము చేసికొనగలుగుట తత్వమును గ్రహించుశక్తి. ఇవి ఎనిమిది గుణములు.

తరువాతవి నాలుగు బలములు. బాహుబల, మనోబల, ఉపాయబల బంధు బలములు. బంధుబలమన తాను నమ్మదగిన సంఘబలము. ఇక పదునాల్గు గుణములు.

దేశకాలముల గుర్తెరుగుట, శక్తి, కష్టసుఖములను ఓర్చగలుగుట, శిల్పాది శాస్త్రములను గురించిన జ్ఞానము, ఉదారబుద్ధి, ధనసంపద, ఆలోచనను దాచుట, భయజ్ఞానము లేకుండుట, పరాక్రమము, ఎదిరి శక్తిని గ్రహింప గలుగుట, చేసిన మేలును మరువకుండుట, శరణాగతులపై వాత్సల్యము, సమయమును గుర్తెరిగిన క్రోధము, చంచలత్వము లేకుండుట అను గుణములు పదునాలుగు. ఇవన్నియు అంగదుని యందుండుట వలన ఇతడు క్రొత్త సామ్రాజ్యమును స్థాపించగలడని నిశ్చయించినాడు హనుమంతుడు. నిశ్చయించి ఏమిచేసెను? అంగదుడు తనతో కూడ గట్టుకొన్న వానరులను, అంగదుని నుండి భేదింపజేసినాడు. కారణమేమి? అంగదుడు కావించు ఈభేదమువే సుగ్రీవుని రాజ్యము చిలగా రాముని కార్యము చెడిపోవును. ఇదియే హనుమంతుని ముఖ్యమగు అభిప్రాయము. ఎట్లు భేదించెను?

అంగదుని దృష్టియందు స్వయంప్రభా బిలము సుగ్రీవునకు అప్రభేద్యము. కావున మనమిక్కడ స్థానము నేర్పరచుకొన్నచో సుగ్రీవుడు మనల శిక్షింపడని తనవారికిచెప్పి, సుగ్రీవుని వలన భయము తీర్చినాడు అంగదుడు. దానిని చక్కగ ఖండించినాడు హనుమంతుడు. లక్ష్మణుని బాణములకిది భేదింపరానిది కాదుగావున మీరు భయరహితులై ఇందుండ సమర్థులు కారనినాడు. ఈమాటతో అంగదుని బలము నాధారముగొన్న వానరుల ధైర్యము క్రుంగినది. తరువాత అంగదుడు ఈ వానరులనందరును వమ్ములయందలి దోషమును వేఱుచెట్టి చూపినాడు.

అంగదా! నీవెవరిని నమ్మితివో వారు సహజముగ చపలులు. అదిగాక తమ తమ భార్యాబిడ్డలపై గాలిమళ్ళగా వారందరును నీఆజ్ఞయందేల వర్తింతురు? అప్పుడు నీకు బంధుబలము క్రుంగును. స్థిరబుద్ధి గలిగిన జాంబవంతుడును నేనును ఇంక కొందరును నీవారముగాము. మేము వెళ్ళి మీరున్న రహస్య ప్రదేశమును రామ లక్ష్మణుల కెరింగింతుము. అప్పుడై నను నీచావు తప్పదు. కావున ఈ కార్యమును విరమించుము. సుగ్రీవుడు నీవనుకొన్నట్లు దుర్మార్గుడు కాడు అని నిర్ధారణగ చెప్పినాడు.

అంగదుడీ సందర్భమున సుగ్రీవుడు దుర్మార్గుడు కాదనుటను ఒప్పుకొనక సుగ్రీవుని యందలి దోషములనే ఉద్ఘాటించినాడు.

హనుమంతుడు అంగదునకు మరల ఏమియు సమాధానమివ్వక మౌనమును వహించినాడు.

అంగదుడు సుగ్రీవుడు తప్పక తన్ను చంపుననుటనే బలవరచుకొని తాను మాత్రము ప్రాయోపవేశమును చేయుటకే సిద్ధుడయ్యెను. ఆ సమయమున అంగదుని నిశ్చయము మిగిలిన వానరుల హృదయములను కరగించినది. వారును అంగదుని అనుకరించుటకే నిశ్చయించుకొనినారు. వానరుల ప్రాయోపవేశకార్యము స్థిరపడినది. మృత్యుముఖమున ప్రవేశించుటకే వారు నిశ్చయించుకొనినారు.

భగవంతుడు తనను గురించి ఏమని నిశ్చయించెనో వారెరుగరు. ఎవ్వరును ఎరుగరు. కాలముచే పరిపక్వములై కాలచక్రమున పరిభ్రమించు జీవుల కర్మ ఫలములు భగవానుని స్వాధీనము నందుండును.

వానరులు ప్రాయోపవేశము చేయ నిశ్చయించుకొన్న ప్రదేశమునందే ఒక గుహాంతర్భాగమున సంపాతి యను పక్షిరాజు వసించు చుండెను. అది జటాయువు నకు సోదరుడు. వీరిద్దరును చతుర్ముఖుని సృష్టికి మొదటి భాగములోని వారే. మనమొక్కమారు వానరుల యొద్దకు వత్తము.

అంగదుడు దక్షిణాగ్రముగ దర్భలు వరచినాడు. తూర్పు మొగమై ఆ దర్భలయందు కూర్చొనినాడు. తన మరణము నెవ్వరెవ్వరికి తెలుపవలెనో వారందరి పేర్లను తన మిత్రులకు తెలిపినాడు. అది ఆతని మిత్రులకు భయంకర దృశ్యము కాకపోవునెట్లు? మిగిలిన వానరులును అంగదునే అనుసరించి దర్భల వరచుకొని ప్రాయోపవేశమునకు సిద్ధమైరి. అందు కన్నీరు కార్చనివారు లేరు. సుగ్రీవుని నిందించని వారును, వాలిని పొగడని వారును లేరు. వారు సామాన్యముగ కన్నీరు కార్చుట కాదు. ఎలుగెత్తి ఏడ్చినారు. వారి దుఃఖధ్వానము మేఘము లురిమినట్లైనది.

అప్పుడే సంపాతి గుహాంతర్భాగము నుండి బయటకు వచ్చినది. వీరి గరీకములు సంపాతి ఆహారమునకు పనికివచ్చునట్లున్నవి.

ఆ మాటనే సంపాతి నిర్ణయించుకొన్నది. ఆ సంపాతియే వీరి కంటబడినది. సంపాతి భగవంతుడు నాచ్చిన ఆహారమే ఈ మృగశరీరమునని అనుకొన్న మాటయు వీరి చెవిన బడినది.

అంగదుని ఒడలు వణకినవి. బ్రతికియుండగనే ఈ పక్షికి ఆహారమగుట అంగదునికి భయకారణ మైనది. మరణ భయమెవ్వరిని ఒణికించదు? అంగదు డాంజనేయునివై పుకు దిరిగినాడు. ఆతనిని పేరుపెట్టి పిలిచినాడు. రాముడరణ్యము నకు బయలుదేరుటే తమ చావుకు కారణమనిపించినది అంగదునకు. ఆంజ నేయునకు తన ఆవేదనను వ్యక్త పరచినాడు. రాము డరణ్యమునకు బయలుదేరుటతో ప్రారంభించి ఇంతవరకును జరిగిన కథాభాగము నంతను ఏకరువు పెట్టినాడు. అందులోనిదే దండకారణ్యమున జటాయుపక్షి మరణ వృత్తాంతము. ఆ సందర్భముననే అంగదునిచే జటాయువు యొక్క అదృష్టము కూడ కొనియాడబడినది. రామునిచేత మరణ సంస్కారము జరుగుట జటాయువు మహాభాగ్యమని ఏడ్చుచు, తమ దురదృష్టమును తలపోసికొని సీతను కనుగొనలేక పోవుటకు వాపోయినాడు.

ఈ కథాభాగము సంపాతి చెవిని బడినది.

సంపాతిహృదయ మొక్కమారు తారుమారైనది. తన తమ్ముని మరణ వార్త సంపాతిని కదలించినది. తనతమ్ముని మరణవార్త తెలియక ఎంత కాలమై నదో, సంపాతి ఇప్పుడు వానరులకు మృత్యువు కాదు. ప్రాణదాత కానున్నది. ఇదియే కాలచక్ర ప్రభావమున కలుగు చిత్రము.

సంపాతి వానరులను తన్ను కొంచెము దగ్గరకు చేర్పుమన్నది. నా రెక్కల నొకప్పుడు కోల్పోతి నన్నది. తమ్ముని మరణవార్తను విన్న దుఃఖముతోడనే దీనస్వరమున పలికినది. వానరులెట్లు సమ్మరు? ఎట్టకేలకు చావునకే నిశ్చ యించుకొన్న మన కెందుకీ భయమని కొందరు ధైర్యముచేసి సంపాతి వచనముల నమ్మి క్రిందకు దింపినారు.

సంపాతి తనరెక్కలు కాలిపోవుటకు కారణమునుచెప్పినది. నా తమ్ముడగు జటాయువును నేనును మా వేగమును తెలిసికొనుటకు ఆకాశమున ఎగురుచుండగా అది మధ్యాహ్న కాలమగుటచే సూర్యకిరణముల తాకిడికి నాతమ్ముడు జంకు గొని నాడు. వాని బాధను మాలేక నా రెక్కలచే ఆతనిని కప్పగా నా రెక్కలు కాలి నే నిక్కడ పడితినని చెప్పి జటాయువు వృత్తాంతము మీ వలన వింటినన్నది.

అంగదుడు నిజముగ నీవు జటాయువు తమ్ముడవగుచో రావణుని నివాస ప్రదేశ మిక్కడికెంత దూరమున్నదో తెలుపు మనినాడు.

సంపాతికి కూడ తనతమ్మునివలెనె రామకార్యమునకు తోడ్పడి పుణ్యమును సంపాదించుకొను కాలము వచ్చినది. ఈ విషయమునే సంపాతియు తలచి ఆనందించి వక్షులయం దగ్రగణ్యమగు మా జాతికి చాల దూరదృష్టి కలదని సీత రావణుని లంకయందుండెనని వాక్సాహాయ్యమును చేసినది రామ కార్యమున. ఆ లంక ఈ సముద్రమున నూరు యోజనముల దాటుచో దొరకు నన్నది. అంతియేగాక రావణుడొక త్రిలోకసుందరి నెత్తుకొనిపోవుచుండగా చూచితినన్నది. నా జ్ఞానదృష్టిచే చూచి మీరు సీతనుచూచి శుభమును బడయగలరని కూడ చెప్పు చుంటి నన్నది.

శ్రోతలారా! వానరుల సంతోషమునకు మేర ఎక్కడ? వాకందరును లేచి గంతులు వైచినారు. అంతలో తన తమ్మునకు తర్పణ గావించుటకై తన్ను సముద్రము దగ్గరకు గొంపోవుమని సంపాతి వానరుల నర్థించగా వారట్లే చేసినారు. సంపాతిచరిత్ర నింతటితో వదలుదము. ఆ సంపాతికి రెక్కలు వచ్చిన చరిత్ర కలదుగాని అది ప్రక్షిప్తమని వ్యాఖ్యాతలు వ్రాసినారు. ఏది ఏమైనను మన ముఖ్య మగు కథాభాగమున కేగుదము.

వానరులందరును ఆ దక్షిణ సముద్రమునకు ఉత్తరపు ఒడ్డుకు చేరినారు. ఇక వారు సముద్రమును దాటవలెను.

అదిచూచు వారికి ఒడలు పులకరింపదగు జలప్రదేశము. సృష్టి ఖండమున భూమికిదియొక సరిహద్దు. అందొకప్రదేశమున జలము నిద్రించుచున్నట్లు కదల బారక యుండగా ఇంకొంచో మహోత్తుంగ తరంగములు పెల్లుమీరుచు ఆకాశము నందు కొను చుండెను. దానివైశాల్యమును ఆకాశమువకు పోల్చవలెను. దాని అడుగుభాగము రాక్షసాక్రాంతము. అట్టి మహా సముద్రమును తిలకించినారు వానరులు. ఆ వానర భటుల గుండెలొక్కమాటుగ అదరి పోయినవి. ఈ మహా సముద్రమును దాటుటెట్లు? అని. అంగదుడు యువరాజు. దడిసిన వానరుల నందర నొక్కచోచేర్చి ధైర్యవచనములచే వారికి ధైర్యమును పురిగొలిపినాడు. ఆ

తరువాత వారందరి నుద్దేశించి ఎవరెవరు ఎంతెంత దూరము లఘించగలరో చెప్పమనినాడు.

అందుకొందరు వదియోజనములును మరికొందరు ఇరువది ముప్పదియోజనముల చెప్పిరేగాని ఏబక్కరును నూరు యోజనముల సముద్రమును దాటగల మన్నవాడు లేదు. జాంబవంతుడు మాత్రము నేనొకకాలమున త్రివిక్రమావతారమునెత్తిన విష్ణువునకు వేగముగ ప్రదక్షిణము గావించితినని చెప్పి ఆవయసు గడవగా ఇప్పుడు నేను ముదుసలి నైతిననినాడు అయ్యును ఇప్పుడు నేను తొంబది యోజనముల దూరము దాటగలననినాడు. వానరుల కాశ్చర్యము కలిగి జాంబవంతుని ప్రశంసించినారు. వీరిలో అంగదుడు లంకకు పోగలనని చెప్పినాడు. కాని జాంబవంతు డొప్పుకొనలేదు కారణమేమి? నీవుమాకు స్వామివి. స్వామి ఎప్పుడును ప్రజలచే చేయించవలెనుగాని తాను చేయరాదని నివారించినాడు. ఇందొక రహస్యము తేకపోలేదు. యజమాని శత్రుస్థలమున పట్టుబడుచో అసలుకు మోసము వచ్చును. కావున దూతలనే శత్రు క్షేత్రములకు పంపవలెను గాని నాయకుడు పోగూడదు. అంగదునకేమియు తోచలేదు. మరల ప్రాయోపవేశమే గతి యనినాడు. కాని ఆలోచనయందు హనుమంతుడుండెనా? లేదు. అతడొక చోట సుఖాసీనుడై యుండెను.

జాంబవంతుని దృష్టి హనుమంతుని పైకి ప్రసరించినది. ఒకవేళ వీరిలో ఎవ్వరైన సముద్రమును దాటి లంక కేగినను అచ్చట సీతను వెతుకవలెను. రాక్షసులతోటి యుద్ధము వచ్చిచో వారిని జయించవలెను గదా? అందుకు సమర్థుడు హనుమంతు డొక్కడేనని జాంబవంతుడు నిశ్చయించుకొనినాడు. ఎవ్వరైన ప్రోత్సహించిననే గాని ఆతని శక్తిని ఆతడు గ్రహింపజాలడు. జాంబవంతుడు హనుమంతుని సమీపించి ఆ మహనీయుని జనన ప్రకారమును, ఆతని అమోఘ ప్రభావ సంపన్నత్వమును వర్ణించి లంకకేగుటకు ప్రోత్సహించినాడు. జాంబవంతుని ప్రోత్సాహ సమయమున ఆతడెట్లుండెను?

తతస్తు వై జాంబవతా ప్రచోదితః
ప్రతీతవేగః పవనాత్మజః కపిః
ప్రహర్షయం స్తాం హరివీర వాహినీం
చకార రూపం మహదాత్మనస్తదా.

జాంబవంతుని చేత ప్రభోదితుడైన వాయుసూనుడు తనతోటి వానరుల నందర నమితోత్సాహము కలవారిగ కావించుచు మహోన్నతమగు రూపమును ధరించినాడట. అంతేకాదు. హనుమంతుడు తాను వెళ్ళదగిన మార్గమును, వెళ్ళి చేయతగిన కార్యమును కూడ తన మనఃఫలకమున దర్శించి వానరుల నందర నుత్సాహ పరచినాడు. వారును మహోత్సాహము కలిగి నీవు సీతా దర్శనము చేసి వచ్చువరకును ఒంటికాలిపైన నిలబడి ఎదురుచూతుమని ఉత్సాహముగ పలికినారు. హనుమ:తుడు లంకకు వెళ్ళెననియే మనము తలచవలెను. "జగామలంకాం మనసా తరస్వీ". ఇంతతో కిష్కింధ కాండ పూర్తియైనది.

మధురాతి మధురమై రామాయణ మహామాలా రత్న ప్రభల ప్రసరింపజేయు సుందరకాండ యొక్క ప్రారంభము రేపు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.